పలనాటి కవుల చరిత్ర

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు
ఎం.ఏ., పిహెచ్.డి.,
మాచర్ల



భూరి విరాళ దాతలు

రామకృష్ణా హాస్పిటల్స్

మాచర్ల



కూర్చున్నవారు: డాక్టర్ నెల్లూరి పార్వతయ్య పిల్లల వైద్యనిపుణులు, శ్రీమతి నెల్లూరి మంగమ్మ చైర్‌పర్సన్ (2016-2018) మాచర్ల పురపాలక సంఘం, నెల్లూరి కార్తీక్, తండ్రి: డాక్టర్ వెంకయ్య. నిలుచున్నవారు: డాక్టర్ నెల్లూరి నీలిమ, ఎమ్.బి.బి.ఎస్ (డి.జి.ఓ) డాక్టర్ వెంకయ్య, ఎమ్. ఎస్ (జనరల్ సర్జన్), డాక్టర్ కుమారస... (జనరల్), డాక్టర్ శిరీష ఎమ్.బి.బి.ఎస్ (డి.సి.హె...

పల్నాటి కవుల చరిత్ర

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు



పై ఫోటోలు చిత్రీకరణ: ఓడూరి సాయిరామ్, హైదరాబాద్

పల్నాటి సాహిత్యపీఠం

12-2-4, శ్రీనివాసమహల్ వద్ద,

మాచర్ల - 522 426

పల్నాటి కవుల చరిత్ర

కవులు – రచయితలు

(పరిశోధకులకు, రచయితలకు, విద్యార్థులకు ఉపయుక్తము)

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు



పల్నాటి సాహిత్యపీఠం

12-2-4, శ్రీనివాసమహల్ వద్ద,

మాచర్ల - 522 426



పల్నాటి కవుల చరిత్ర

-డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు

ప్రచురణ	: శ్రీశార్వరి నామ సంవత్సర చైత్రం, ఉగాది. 25 మార్చి 2020
సర్వహక్కులు	: రచయితవి
వెల	: రూ.150/-
కాపీలు	: 1000
ప్రతులకు	: **1.డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు,** పల్నాటి సాహిత్యపీఠం, 12-2-4, శ్రీనివాసమహల్ వద్ద, మాచర్ల -522 426 గుంటూరు జిల్లా. సెల్: 9848562726
	2.డాక్టర్ నెల్లూరి పార్వతయ్య రామకృష్ణా నర్సింగ్ హోమ్, ఇంటి నెం. 11-3-140, రామాటాకీస్ లేన్, మాచర్ల. గుంటూరు జిల్లా. సెల్: 98859 16548
డి.టి.పి.	: **భార్గవసాయి గ్రాఫిక్స్, విజయవాడ సెల్: 6301766406**
ముద్రణ	: **కలిమిశ్రీ గ్రాఫిక్స్, విజయవాడ. సెల్: 9246415150**

గమనిక: రచయిత డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు తాజా రచన "తెలుగుబిడ్డ మరియు మాతృశ్రీ అమృతమ్మగారి తత్వాలు" అనే గ్రంథం నుంచి కొన్ని పద్యాలు, తత్వాలు ఈ పుస్తకంలో అక్కడక్కడ ప్రచురించడం జరిగింది.

ఇదీ సరస్వతీపుత్రుల వరుస..!

పల్నాటి సీమలో బాలసాహిత్యకారులు

పల్నాటి సీమలో కవయిత్రులు

పల్నాటి సీమలో పంచాంగ కర్తలు

పల్నాటి సీమలో పూర్వ కవులు

పల్నాటి సీమలో ప్రాచీన కవులు

ఉ॥ దశయు నరక్షణంబు తనదాయల మోహము రెప్పపాటునౌ
నిశియగు బ్రాయమున్ గలిమి నీరదమందు మెఱుంగు రీతి బో
శిశుపశుమిత్రదారలును జెప్పిన భాస్కరు కాంతి భంగి యీ
విశదపు దేహమెన్న క్షణమేషము తాజల బుద్బుదంబు వో
శశిధర నీదు చిత్రము ప్రశస్తమయా శరభాంకలింగమా!

తా॥ భోగభాగ్యాలు రెప్పపాటుకాలంలో నశిస్తాయి. యౌవనము, సంపదలు మేఘాలలో మెరుపులాంటివి. భార్య,పిల్లలు,మిత్రులు,పశువులు,సూర్యోదయ సూర్యాస్తమయం లాగా వచ్చిపోతూ వుంటారు. ఈ దేహము నీటిమీద బుడగటాంటిది. ఎప్పుడు పేలిపోతుందో తెలియదు. ఓ సాంబశివా! నీ లీలలు చిత్రమైనవయ్యా శరభాంక లింగమా!

(శరభాంకలింగ శతకము నుంచి...)



ఓం శ్రీసాయినాథ

విమర్శనాత్మక పరామర్శ

- ఆచార్య టి. గౌరీశంకర్,
ఎం.ఏ.,ఎం.ఫిల్,పిహెచ్.డి, విశ్రాంత ప్రొఫెసర్,
మరియు విశ్రాంత రిజిస్ట్రార్, శ్రీపొట్టి శ్రీరాములు
తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్-20,
సెల్: 9440969130

భారతీయ సాహిత్యం మహోన్నతమైనది. దీనిలో ఆయా ప్రాంతాలలోని భాషా కవులు, రచయితలు తమ ప్రతిభా పాటవాలచేత అపారమైన సాహిత్యాన్ని సృష్టించి, దీనిని సుసంపన్నం చేశారు. ఆ విధంగా తెలుగునేలపై తెలుగు భాషాకవులు, రచయితలు కూడా విశిష్టమైన సాహిత్యాన్ని సృష్టించి తెలుగువెలుగులను సాహితీలోకంలో ప్రసరింపజేశారు.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో ఎన్నో వేలమంది కవులు, రచయితలు మనకున్నారు. అయితే వారంతా చరిత్రకెక్కిన వారు కాకపోవచ్చు. కొద్దిమంది మాత్రమే ప్రసిద్ధులైనారు. మిగతావారు వెలుగులోకి రాలేదు. మౌలికంగా కవిగానీ రచయితగానీ సమాజం కోసం రచన చేస్తాడు. రచనద్వారా గుర్తింపులోకి వస్తాడు. కేవలం గుర్తింపు కోసమే రచనలు చేసేవారు అరుదు. అందువల్ల గుర్తింపులోకి రాని రచయితల ప్రతిభా విశేషాలను చరిత్రకెక్కించవలసిన అవసరం ఎంతయినా ఉంది. ఆ పనిని పరిశోధకులు విమర్శకులు చరిత్రకారులు చేయవలసి ఉంటుంది.

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు గారు సరిగ్గా ఇదే పని చేశారు. పల్నాటి కవుల చరిత్ర పేరిట ఈ గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయం.ఇంతవరకు మనకు తొలి దశలో కందుకూరి వీరేశలింగంపంతులు రాసిన **ఆంధ్రకవుల చరిత్ర** చాగంటి శేషయ్య **ఆంధ్ర కవితరంగిణి,** పింగళి లక్ష్మీకాంతం, జి.నాగయ్య ద్వా.నా.శాస్త్రి వంటి వారి **సాహిత్య చరిత్రలు,** ఆరుద్ర **సమగ్రాంధ్ర సాహిత్యం** వంటి గ్రంథాలు వచ్చాయి. కానీ ప్రాంతాల వారీగా, ఆయా ప్రదేశాల వారీగా కవుల, రచయితల చరిత్రలు రావడం చాలా తక్కువ.

పూర్వం నైజాంరాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని కవుల కవితలతో సురవరం ప్రతాపరెడ్డి **గోలకొండ కవుల సంచిక**ను సంకలనపరిచారు. అయితే అది ఆయా కవుల పద్యాలతో కూడినది. అంతేగానీ ఆ కవుల వివరాలు, జీవిత విశేషాలు అంతగా దానిలో లేవు. ఆ తరువాతి కాలంలో కవుల జీవిత విశేషాలు, రచనల వివరాలతో కొన్ని గ్రంథాలు వెలువడినప్పటికీ ఈ విధంగా ఒక ప్రత్యేక ప్రాంతానికి చెందిన కవులు, రచయితల విశేషాలతో వచ్చిన గ్రంథాలు మృగ్యమే. జిల్లా సర్వస్వాలు వచ్చిన మాట వాస్తవమే.

తెలుగు నేలపైని ప్రతిప్రాంతానికీ చారిత్రకంగా,సామాజికంగా,ఆర్థికంగా, విద్య, వైజ్ఞానికంగా, సాంస్కృతికంగా, సాహిత్యపరంగా రాజకీయంపరంగా ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతలను అక్షరీకరిస్తే చరిత్ర అవుతుంది. అటువంటి చరిత్రను నిర్మించిన వారు డాక్టర్ జగన్నాథాచార్యులు. ఇది పలనాడు సీమలోని కవులు, రచయితలకు సంబంధించిన ఒక డైరెక్టరీ లాంటిది!

బెజ్జంకి వారు స్వతహాగా కవిపండితులు. పరిశోధక విమర్శకులు, వక్త, అధ్యాపకులు అయినందువల్ల దీనిని ఒక పరిశోధనా గ్రంథంగా దిద్దితీర్చారు. కేవలం సాహిత్యరంగానికే పరిమితం చేసుకొన్నారు. వారి మాటల్లో చివర్న ముందు ముందు పల్నాటి **స్వాతంత్ర్య సమర యోధుల చరిత్ర**ను కూడా గ్రంథరూపంలో తీసుకొని వచ్చే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిపారు. సంతోషించదగ్గ విషయం. దీనిలో వీరు చేసిన వింగడింపు వివేచనాత్మకమైనది. సాధారణంగా ప్రాచీనం, ఆధునికం అనే రెండు భాగాలే ప్రధానమైనవి. కానీ వీరు ప్రాచీన కవులను తొలిదశలోని వారుగా, పూర్వకవులను అనంతర దశలోని వారుగా, ఆధునిక కవులను నేటి కాలంలోని వారుగా భావించారు. వీరిలో దివంగతులైనవారు, సజీవంగా ఉన్నవారూ ఉన్నారు. లబ్ధప్రతిష్ఠులైన వారినుంచి వర్థిష్ణువులైన వారివరకు, ఒకటీ అరా రాసినవారినుంచి వదలకొలది రాసినవారివరకు ఉన్నారు. ఇది వారి నిష్పాక్షికదృష్టికి తార్కాణం. వారి దృష్టికి అందినంత వరకు, శక్తిమేరకు దీనిని రూపొందించారు. ఇది సాహిత్య విద్యార్థులకు ఒక వాఙ్మయ సూచిగా ఆకరగ్రంథంగా, పరామర్శ గ్రంథంగా ఎంతో ఉపయోగపడుతుంది. ఇంత కృషిచేసిన వీరికి మరో డాక్టరేటు పట్టా ఇచ్చినా తక్కువే.

ఈ వింగడింపులో బాలసాహిత్యకారులు, కవయిత్రులు, పంచాంగకర్తలు కూడా ఉండడం విశేషం. అయితే ప్రాచీన కవులలోవీరు చేసిన ఒక ప్రతిపాదన కొంత ఆశ్చర్యకరంగానూ ఆసక్తికరంగానూఉంది. డాక్టర్ జగన్నాథాచార్యులుగారు రామరాజభూషణుడు, భట్టుమూర్తి వేరువేరు వ్యక్తులని సాపత్తికంగా పేర్కొన్నారు. కానీ అధిక సంఖ్యాకులు అంగీకరించినది ఇద్దరూ ఒక్కరేనని. భట్టుమూర్తి అళియరామరాజుచేత గౌరవ సత్కారాలందుకొన్నందువల్ల భట్టుమూర్తి రామరాజభూషణుడని పిలువబడ్డాడని అంటారు. అంతేగాక వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానం (ద్వ్యర్థి కావ్యం) రచించినవాడే నరసభూపాలీయము అనే కావ్యాలంకార సంగ్రహము లక్షణగ్రంథాన్నికూడా రచించాడని అంటారు. లోకంలో రూఢిగా ఉన్న అంశాన్ని వీరు పరాస్తంచేస్తూ ఈ ప్రతిపాదన చేయడం, చారిత్రిక అంశాలు పేర్కొనడం ఆసక్తికరంగా ఉంది. అయితే కొంతమంది ఈ వాదాన్ని కూడా వినిపించే వారున్నారు. కానీ ఎక్కువమంది చెప్పేది మాత్రం ఇద్దరూ ఒక్కరేనని!

ఏది ఏమైనా **ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నెత్తికెత్తుకొని ఒంటిచేత్తో ఈది, తీరంచేరి పల్నాటిసీమ సాహిత్యసారాన్ని తెలుగు సాహిత్య రసలోకానికి అందించిన డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు సర్వదా ప్రశంసనీయులు.** వారికి నా శుభాభినందనలు...

ఆత్మీయ వచనం



డాక్టర్ ఎన్. పార్వతయ్య,ఎం.బి.బి.ఎస్.,

రామకృష్ణా నర్సింగ్ హెూమ్
ఇంటినెం.11-3-140, మాచర్ల
సెల్: 9885916548

శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి తన కరుణాకటాక్ష వీక్షణాలతో భక్తులను అనుగ్రహిస్తూ కొలువైన ప్రాంతం మా మాచర్ల. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రపంచ ప్రసిద్ధిగాం చిన చరిత్ర మన పల్నాటి చరిత్ర. బ్రహ్మనాయుడు మాచర్లను కేంద్రంగా చేసుకుని పల్నాటిని పాలించాడు.ప్రజల మన్నన పొందాడు. పల్నాటికి ఒక గుర్తింపు తెచ్చాడు. పల్నాడు అనగానే కారంపూడి, గురజాల, మాచర్ల ప్రధానంగా గుర్తుకు వస్తాయి. పదకొండు,పన్నెండు శతాబ్దాల కాలంనాటి చరిత్ర పల్నాటి చరిత్ర! నేటికి ప్రజల మనస్సులలో చెరగని ముద్ర వేసుకుంది.

194 గ్రామాలతో పల్నాడు విస్తరించి ఉందని గ్రంథస్థ ఆధారాలను బట్టి తెలుస్తోంది. నేడు తొమ్మిది మండలాలకు (వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, కారంపూడి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం) పరిమితమై పల్నాడుగా పిలువబడుతోంది. ఈ తొమ్మిది మండలాలలో 'పల్నాడు' అనే పేరుతో ఒక్క గ్రామం కూడా లేదు. అటువంటి విశిష్టతను సంతరించుకుంది పల్నాడు. పల్నాడు అనగానే నాగమ్మ, బ్రహ్మనాయుడు, కోడి పోరు అనే కథలు-దానికి తగిన చరిత్ర గుర్తుకువస్తుంది.ఈ అంశం అందరికీ తెలిసిందే. కానీ పల్నాడు ఇంకాదేనికి ప్రసిద్ధి అంటే మిర్చి,పత్తి పంటలకని చెపుతారు పిల్లలు, పెద్దలు. ఇంకా ఏమిటంటే ఇదిఅక్షరాస్యతలో వెనుకబడిన ప్రాంతం. కక్షలు, కార్పణ్యాలకు నెలవైనది అని కూడా అంటారు.

అంతేగాని పల్నాటి సీమలో మహనీయులు, కవులు, రచయితలు ఎంతమంది ఉన్నారు..? స్వాతంత్ర్య సమరంలో పోరాడిందెవరు?, బ్రిటిష్ వారిని ఎదిరించి నిలబడిం దెవరు? అనే విషయాలు ఎవరికీ తెలియవు. ఒక్క కన్నెగంటి హనుమంతు తప్ప.

బ్రిటిష్ రాణి ఎలిజబెత్ కిరీటంలో పొదిగిన 'కోహినూర్' వజ్రం మన పల్నాట పుట్టిందనే విషయం ఎంతమందికి తెలుసు అనేది భేతాళుని ప్రశ్నలాంటిది.కోహినూర్ వజ్రం మనది అన్న విషయం మనకు తెలియదు. అలాగే కోహినూర్ వజ్రంలాంటి పల్నాటిలో పుట్టిన కవులు, పండితులు ఎవరో, ఎక్కడున్నారో, ఏఏ గ్రంథాలు రాశారో ప్రజలకు తెలియదు.మన పల్నాటి వాసులకూ తెలియదు..! పరిశోధకులకు కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. ఇది ఎంతో విచారకరం.

పల్నాటిలో ఎక్కడ ఏ సభలు జరిగినా– ఉగాది కవి సమ్మేళనం, తెలుగు భాషాది నోత్సవాలు, స్వాతంత్ర్యదినోత్సవాలు, ఆంధ్రరాష్ట్ర అవతరణదినోత్సవాలు ఏవి జరిగినా ఆ సభలలో గురజాడ అప్పారావు, వీరేశలింగం పంతులు, నన్నయ్య, తిక్కన, పోతన, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జుషువా వంటి ప్రముఖులను గురించి ప్రతి ఒక్కరూ చెబుతారు.

అటువంటి తరుణంలో గత కొన్ని సంవత్సరాల నుంచి నేను ఏ సభకు వెళ్ళినా ఆ సభలో డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులుగారు పదేపదే పల్నాటిలో పుట్టి, ప్రసిద్ధిగాంచిన కవుల గురించి చెప్పటం విన్నాను. పల్నాట కవులమీద వారికున్న శ్రద్ధకు నేను ఆశ్చర్య పోయాను. ఇంతమంది మహనీయులున్నారు..! వీరంతా ఇప్పటికే మరుగునబడిపోయారు. వారి చరిత్రను ముందుతరాల బాలబాలికలకు అందించవలసిన అవసరం ఎంతో ఉంది. వారు కవుల చరిత్రను ముక్తకంఠంతో చెపుతుంటే ఆశ్చర్యంవేసింది. ఎంత శ్రమకోర్చి సేకరిం చారో...! అయా కవులు, వారి రచనల గురించి చెప్పటం కష్టం.

ప్రతి సభలోను పల్నాటి గొప్పదనం, మహనీయులైన కవిపుంగవులను గురించి చెబుతుంటే విని చలించిపోయాను. **"పల్నాటి కవుల చరిత్ర**ను ముందు తరాలకు అందిం చవలసిన బాధ్యత మనమీద ఉంది. చరిత్ర మరుగున పడిపోకూడదు. మన పూర్వికులను మనం మరచిపోకూడదు" అని నిశ్చయించి గ్రంథముద్రణ అవశ్య కర్తవ్యమని డాక్టర్ బెజ్జంకిని ప్రోత్సహించటం జరిగింది. వారు మరింత కృషిచేశారు. మొదట అరవైమంది కవుల వివరాలు సేకరించి ఆ వివరాలు రాసిచూపించారు. ఇపుడు ఇంకనూ పరిశోధించి, శ్రమించి గ్రంథాలు వెతికిపట్టుకుని 165 మందికి పైగా పల్నాటి కవుల వివరాలు సేకరించి వాటిని ప్రచురించ డానికి సిద్ధమయ్యారు. ముద్రణకు తగిన సహాయ సహకారాలను అందించటం, ఈ విధంగా మన పూర్వికులను మనం స్మరించుకోవవటం ఎంతో ఆనందాన్నీ తృప్తినీ ఇస్తుంది.

"పల్నాడు వెలలేని మాగాణిరా" అని పులుపుల శివయ్య అన్నట్లు పల్నాటి కవుల చరిత్రను వెలుగులోనికి తీసుకురావటంలో డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు చేసిన కృషి వెలలేనిది. అందుకు వారి కృషి, ఓపిక, పట్టుదల సామాన్యమైనది కాదు. ఎన్ని సంవత్సరాల నుంచి ఆయా గ్రంథాలు సేకరించడంలో ఎంత వ్యయప్రయాసలకోర్చారో... వారికే తెలి యాలి..!

అంతేకాదు పల్నాటి స్వాతంత్ర్య సమరయోధులు ఎంతమంది ఉన్నారో, వారికి సంబంధించిన వివరాలు సేకరించి పెట్టారు. వారి కలంనుంచి మరో గ్రంథం వెలుగు చూడవలసి ఉంది. ఇంకనూ పల్నాటి విశేషాలను, విశిష్టతలను తెలిపే పల్నాటి గేయకవిత వంద ఖండికలతో ముద్రణకు సిద్ధంగా ఉంది.

డాక్టర్ బెజ్జంకికి **"పల్నాటి చరిత్ర కథాసమ్రాట్"** అనే బిరుదు ప్రదానంచేసి మచిలీపట్నం **సీనియర్ సిటిజన్ వాయిస్** పత్రిక వారు గౌరవించటం ముదావహం. తగిన వ్యక్తికి తగిన బిరుదునిచ్చి సత్కరించారు. ఉద్యోగం నుంచి విశ్రాంతి పొంది సాహిత్య సేవలో కృషిచేస్తున్న డాక్టర్ బెజ్జంకి ప్రశంసనీయులు. భగవంతుడు వారికి ఆయురారోగ్యాలతో పాటు తగిన శక్తియుక్తులు, మేధస్సును కలుగజేయాలని కోరుకుంటున్నాము.



ది కల్చరల్ సెంటరు ఆఫ్
విజయవాడ, అమరావతి,
4వ అంతస్తు, మధుమాలక్ష్మి ఛాంబర్స్,
మొగల్రాజపురం, విజయవాడ-10
మొబైల్: 9848598446

ఈమని శివనాగిరెడ్డి,
సీఈవో

పల్నాటి కవుల తారాతోరణం

పండిత వంశంలో పుట్టటం ఒక ఎత్తు. పాండిత్యాన్ని సంతరించుకుని, పండిత రచనలు చేయటం మరో ఎత్తు. డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు ఈ రెండు రంగాల్లో సుప్రసిద్ధులు. తెలుగు సాహిత్యంలో పరిశోధనలు చేసి, మరుగున పడిన పల్నాటి పౌరుష కవుల్ని గురించి సమాచారాన్ని సేకరించి, వారి పాండితీ ప్రకర్షనలు పేరుపేరునా 167 మంది కవులు చరిత్రలు, రచనలు, ప్రాచీన పల్నాటి కవుల సరసన పెట్టి **పల్నాటి కవుల చరిత్ర**ను పల్నాటి సాహిత్య పీఠం తరపున వెలువరించటం అభినందించదగ్గ విషయం.

పల్నాటి గేయ కవితలో పల్నాటి సీమ సొగసులు, సొబగులు, చారిత్రక పురుషులు, సంఘటనల సమాహారంగా ఎన్నో ఉదాహరణలిచ్చి చదివిన కొద్దీ చదవాలనిపించే అద్వితీయ రచన చేశారు. పల్నాటి కవుల చరిత్రను ఎప్పట్నించో ఎందరో రాయాలనుకొన్నారు. ఆ కల నేటికి డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యుల పూనికతో నెరవేరింది. సాహితీమూర్తులు, పరిశోధకులు, విద్యార్థులకు అపురూప సాహితీ ఆకరాన్నిందించి, చరిత్రలో స్థానాన్ని దక్కించుకొన్నారు. సంవత్సరాల తరబడి చేసిన ఈ సాహితీ వ్యవసాయపు పంటగా ఈ పుస్తకాన్ని అందించి, నాకు ఆర్హత లేకున్నా సౌజన్యం, సౌమనస్కంతో నన్ను అభిప్రాయంరాయమని ఆదేశించిన జగన్నాథాచార్యులును మనసారా అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

విజయవాడ, భవదీయ,

2-3-2020 **సం.//ఈమని శివనాగిరెడ్డి**

K.S.Lakshmana Rao
MLC
Krishna & Guntur
Graduates' Constituency
Member
Progressive Democratic Front
Cell: 94402 62072

Off: Progressive Democratic Front
Flat No.C-34, Lotus Legend
Apartments, Kummara Palem Centre,
Vijayawada-520012, Ph(Fax):0866-2412412
Res: 8th Line, Syamala Nagar
Guntur-522 006
E-mail:lakshmanaraomlc@gmail.com



గొప్ప సాహితీకృషి

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు **"పలనాటి కవుల చరిత్ర"**ను ఎంతోకృషిచేసి శోధించి పరిశోధనాగ్రంథంలా రచించారు. చరిత్రలో పలనాడు ఎంతో ప్రసిద్ధిచెందిన ప్రాంతం. 800 ఏళ్ళక్రితమే బ్రహ్మనాయుడు **'చాపకూడు'** సిద్ధాంతాన్ని అమలుచేసిన ప్రాంతం. చరిత్ర ప్రసిద్ధిచెందిన**"పలనాటి యుద్ధం"** ఇక్కడ జరిగింది. పలనాడు పౌరుషానికి పేరుపొందిన గడ్డ. మాచర్ల, దుర్గి, కారంపూడి, రెంటచింతల, దాచేపల్లి, పిడుగురాళ్ళ, గురజాల మొదలగు ప్రాంతాలు ఎన్నో రకాలుగా గణుతికెక్కినవి..

అక్షరాస్యతలో నాడు, నేడు వెనుకబడి ఉన్నా **"సాహిత్య సేద్యం"** మాత్రం నిరాటంకంగా సాగినట్టు డాక్టర్ బెజ్జంకి సోదాహరణంగా నిరూపించారు. పలనాడు అనగానే బ్రహ్మనాయుడు, నాగమ్మ, కన్నమదాసు గుర్తుకువస్తారు. ఆ తర్వాత కన్నెగంటి హనుమంతుని చెప్పుకుంటాము. ఈ క్రమంలో సాహితీసేద్యంచేసి కవన పారిజాత పుష్పాలను పండించి లబ్ధప్రతిష్టులైన కవులెందరినో తెలియజేశారు. వెలుగులోనికి వచ్చిన వారు, వచ్చి ప్రచారంలేని, రానివారిని పరిచయంచేశారు. భువనవిజయంనాటి కవులను, అర్వాచీనులైన 'పలనాటి పోతన' సుబ్బదాసు, త్ర్యర్థికావ్యం, ముప్పది అర్థముల పద్యం రాసిన కవిసింహం కాశీపత్యవధాని, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చిటిప్రోలు కృష్ణమూర్తి, పలనాటి సోదరకవులు, కవయిత్రులు, బాల సాహిత్యకారులు, ప్రతిభా సంపన్నులైన పంచాంగకర్తలు, అలాగే వచనకవితలో దిట్టలు ఉన్నారని గమనించి వారిని వెతికివెతికి ఒకచోట కూర్చారు. ఎంతో శ్రమకోర్చి పరిశోధనాపూర్వకంగా వారివారి వివరాలు సేకరించి గుదిగుచ్చి ముందు తరాలవారికి అందించటం కోసం గ్రంథస్థం చేశారు. డాక్టరేటు ఇవ్వదగిన పరిశోధనాగ్రంథము వలే ఉంది.

పలనాటి కవుల రచనలు సమకాలీన ఆలోచనలకు ప్రతిబింబాలు. అటువంటి కవులు158 మంది, ప్రాచీన కవులు 9మంది జీవితాలు, రచనలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. డాక్టర్ బెజ్జంకి గతంలో అనేక రచనలు చేశారు. ఈ పుస్తకం కూడా పాఠక ఆదరణ పొంది మరో ముద్రణకు తప్పక నోచుకుంటుందని, ఇటువంటివి మరిన్ని బెజ్జంకి కలంనుండి వెలుగు చూడాలని కోరుకుంటున్నాను.

సం.// కె.యస్ .లక్ష్మణరావు

ముందు మాట



డాక్టర్ జీవీ పూర్ణచందు

కార్యదర్శి: ప్రపంచ తెలుగు రచయితల సంఘం

సత్నం టవర్స్, 1వ అంతస్తు,
బకింగ్‌హామ్‌పేట పోస్టాఫీస్ ఎదురు,
గవర్నరుపేట, విజయవాడ-520 002

e-mail: prapanchatelugu@gmail.com
website: prapanchatelugu.com , Cell: 94401 72642

'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' అంటారు గాని దేశ చరిత్రల్లో మనం గర్వించే అంశాలు చాలా ఉన్నాయి. చరిత్రను వ్యక్తులే నిర్మిస్తారు వ్యక్తులే చరిత్రగా మిగులుతారు. పల్నాటి చరిత్ర పల్నాటి వీరుల చరిత్ర! **'మరో మహాభారతం'** అనే ఘనత పల్నాడుకు ఉంది. తెలుగువారు ఎప్పటికీ ఈ చరిత్రను తర్వాతి తరాలకు చెప్పుకుని ఆనందిస్తారు.

ఒక బ్రహ్మనాయుడు, ఒక కన్నమదాసు, ఒక నాయకురాలు నాగమ్మ దేశ చరిత్ర నిర్మాతలు. వీరందరూ మా వాళ్లని యావత్ తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే చరిత్ర పల్నాటిది. తెలుగు నేలంతా తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదర కవులు ఇలా ప్రముఖులెందరో సాహితీ జైత్రయాత్రలు సాగిస్తుంటే పల్నాడు మౌనంగా చూస్తూ ఊరుకోలేదు. **కన్నెకంటి ప్రభులింగాచార్యులు, చినలింగాచార్యులు, వీరభద్రాచార్యులు** - ఈ ముగ్గురూ పల్నాటి సోదర కవులుగా 1900-1946 మధ్య కాలంలో జీవించి పల్నాటి సాహిత్యాన్ని జీవింపజేశారు. ఇంకా ఎందరో ఈ పుస్తకంలో ప్రముఖ స్థానం పొందిన పల్నాటి సాహితీవేత్తలు దేశ చరిత్ర వైభవాన్ని అక్షరాల నిలబెట్టారు.

వీరందరి సాహిత్య కృషిని ఒక పుస్తక రూపంగా వెలువరించి అటు పల్నాటి యువతరానికీ ఇటు తెలుగు ప్రజలందరికీ స్ఫూర్తిని కలిగించే విధంగా డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు గారు చేసిన కృషి అమోఘం. దేశ చరిత్రలు ఎప్పటికైనా దేశీయులకు గర్వకారణమే అని ఈ పుస్తకం నిరూపిస్తుంది.

ప్రతి ప్రాంతానికీ ఇలా ఖ్యాతిని సమకూర్చిన వివిధ రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలను సంకలినీకరించాలనే ప్రయత్నాలు జరిగితే భవిష్యత్ తరాలకు భాషాసంస్కృతులను అందించగలిగిన వారమవుతామని భావించాలి. ఈ కృషిలో భాగస్వాములవుతున్న డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు గారికి మరోసారి అభినందనలు...



అభినందన

డా॥ రాధశ్రీ, ఎం.ఏ.,ఎం.కాం.,పిహెచ్.డి.,

3-7/2, శివశక్తిసాయి కాలనీ, నాగారం,

హైదరాబాద్- 500 083

కం॥ బెజ్జంకి పేరు వినగా
ముజ్జగములు సంతసించి ముదమొందెడు పూ
సెజ్జను నిర్మించిన ఘను
నొజ్జగ శ్లాఘించుచుంటి నుత్సిక్తముతోన్

కం॥ అలరు జగన్నాథాచా
ర్యుల వారొనరించినంత రోచిర్మయమై
వెలుగొందెను పరిశోధన
పలువురు పండితులు మెచ్చి ప్రస్తుతుల నిడన్

కం॥ పలనాటి కవుల చరితము
నలవొకగ వ్రాసినట్టి ఆత్మీయునకున్
పలు శుభములు, పలు జయములు
వెలయించగ కొలుచుచుంటి వేంకటరమణున్

కం॥ ఆనాటి భట్టుమూర్తిని
రాణించెడి ప్రతిభయున్న ప్రతియొక్క కవిన్
ఈనాటి చిటిప్రోలును
ధీ నిధులని నుడివినట్టి తీరును గొలుతున్॥

కం॥ సరియన్నది లేని సరణి
పరిపరి గతులుగ శ్రమించి పలనాటి ధరన్
కరమున గంటము దాల్చిన
వరకవులను గూర్చినుడివె పండిత నుతుడై ॥

స్ఫూర్తి నొసంగెడి కవితామూర్తుల వివరమునిడిన పుణ్యాత్మునకున్ ఆర్తదముగ నిచ్చును సత్కీర్తిని మాచర్ల చెన్నకేశవుడు ధృతిన్.

మాచర్ల
9-02-2020
శివాజీ జయంతి

డా॥ రాధశ్రీ
9494481210



బీరం సుందరరావు

రిటైర్డ్ తెలుగు లెక్చరర్, కవి
306,డా.సదానందరావు రెసిడెన్సి
306, డా.సదానందరావు రెసిడెన్సి
చీరాల. ప్రకాశం జిల్లా. ఆం.ప్ర.
చరవాణి: 98480 39080

పల్నాటి కవితకు పట్టాభిషేకం

....

" చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు సర్పంబులును తేళ్ళు
పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు"

పల్నాటి సీమలో పర్యటిస్తూ మహాకవి శ్రీనాథుడు చెప్పిన మాటలు కాల ప్రవాహంలో కొత్త అర్థాన్ని వెతుక్కున్నాయి.శ్రీనాథుడు వర్ణించిన నాగులేటిలో కవులు తమ కలాలు ముంచి ఎన్నో కావ్యాలు రాశారు.నాగులేటి ఒడ్డున పోరాడిన వీరులు ఎంతో చరిత్రను మనకందించారు.పల్నాటిసీమ పళ్ళెటూళ్ళ నుండి మహాకవులు పండితులు అవధాన పండితులు సాహితీవేత్తలు,కళాకారులు ప్రభవించి పల్నాటి సాహిత్యజ్యోతిని ప్రకాశవంతం చేశారు.

"పలనాడు వెలలేని మాగాణి రా" అన్న పులుపుల వేంకటశివయ్యగారు పల్నాటి సీమ వైభవాన్ని కీర్తించారు.

తరతరాల చరిత్రను తవ్విపోసిన పల్నాడు, రాజులేలిన రాచగడ్డ. త్యాగధనులు తిరుగాడిన తల్లి నేల.స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ధన్యభూమి.పౌరుష ప్రతా పాలతో భావితరాలకు వీరతిలకం దిద్దిన వీరులకు వారు పోసిన వీరభూమి. ఎందరెందరో మహనీయులు ఓనమాలు దిద్దుకున్న అమ్మ ఒడి.పల్నాడు పేరెత్తగానే మహా మంత్రి బ్రహ్మనాయుడు గుర్తుకొస్తాడు. పల్నాడును తలచగానే వీరనారీమణి నాగమ్మ గుర్తు కొస్తుంది.పల్నాడును స్మరించగానే వీరయోధుడు బాల చంద్రుడు, మహాయోధుడు కన్నమదాసు, ఆదర్శధర్మపత్ని మాంచాల తలపునకు వస్తారు. పల్నాడు అనగానే నాగులేరు హోరెత్తి నోరెత్తి పిలుస్తూ గతకాలపు జ్ఞాపకాల్లో మునకలు

వేయమని మనల్ని ఆహ్వానిస్తుంది. నాటి శ్రీనాథునినుండి నేటి జగన్నాథాచార్యులు వరకు ఎందరో కవులు సాహితీవేత్తలు పల్నాటి సీమ పౌరుషాన్ని, ప్రశస్తిని వర్ణించి నిత్యస్మరణీయులయ్యారు.

పల్నాటి సీమకు చెందిన ప్రముఖ పరిశోధకులు, కవి, సాహితీవేత్త డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు గారు" పలనాటి కవులచరిత్ర"లో నాటి శ్రీనాథమహా కవినుండి తమ వరకు ఉన్న కవులందరికీ అక్షర పట్టాభిషేకం చేశారు. దాదాపు 170 మంది కవిపండితుల్ని, సాహితీవేత్తల్ని ఈ పుస్తకంలో సంక్షిప్తంగా పరిచయం చేశారు. ఏ రొట్టెకు ఎంత పిండి అవసరమో అంతవరకే తీసుకొని ఆయా కవుల సమగ్ర సమాచారాన్ని భావితరాలకోసం రుచిమధురంగా పుస్తక రూపంలో అందిస్తున్నారు.

జగన్నాథాచార్యులు గారు తెలుగు పండితులుగా పనిచేసి వేలాది మంది శిష్యులకు మాతృభాష పట్ల మమకారం పెంచారు. పిల్లల కోసం సరళ సుబోధకంగా రచనలు చేసి బాలసాహితీవేత్తగా గౌరవంపొందారు. **"గుంటూరు జిల్లా కవుల ఆధునిక గేయ కావ్యాలు"** అంశంపై పరిశోధన చేసి డాక్టరేటు పట్టాను అందుకున్నారు. దాదాపు 20 పైగా రచనలు చేశారు. **"రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు"**తో పాటు ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందారు. పలనాటి ప్రాంతంలో సాహితీ వికాసానికి విలువైన సేవలందించారు.

ఆచార్యులుగారి రచనల్లోని మౌలిక లక్షణాలు మూడు: గవేషణ, విచక్షణ, విశ్లేషణ. తాను రాయాలనుకున్న విషయానికి సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తారు. దాన్ని విచక్షణతో, వివేకంతో విశ్లేషించడం ఆచార్యులగారికి పెన్నుతో పెట్టిన విద్య. **"పలనాటి కవుల చరిత్రలో పై మూడు లక్షణాలున్నాయి"** శతావధాని కాశీపతిగారిని, కన్నెగంటి సోదర కవులను, ఉల్లి రామసుబ్బయ్యగారు, డాక్టర్ వి.వి.ఎల్ గారు, చిటిప్రోలు కృష్ణమూర్తి గారు, డాక్టర్ రాజమల్లాచారి గారి వంటి దిగ్గంతులను ఎంత చక్కగా పరిచయం చేశారో ప్రస్తుత తరం కవులు వై.హెచ్.కె.మోహనరావుగారు, క్రోసూరి రవికుమార్ గారు, సరికొండ నరసింహరాజుగారు, డాక్టర్ రాధశ్రీ గార్లకూ అంతే ఔచిత్యవంతంగా స్థానం కల్పించారు. పల్నాటిసీమకు చెందిన ప్రాచీన కవుల్ని, వారి తర్వాత తరం కవుల్ని, కవయిత్రుల్ని, పంచాంగ కర్తలను గూడ సంక్షిప్తంగా, సుందరంగా పరిచయం చేశారు. పల్నాటి వైభవాన్ని వర్ణించిన స్థానికేతర కవుల్నీ ఈ పుస్తకంలో చేర్చడం ఆచార్యలగారి విశాలదృష్టికి, సహృదయతకు నిదర్శనం. అందులో మా గురుదేవులు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు గారూ వుండటం నాకు ఆనందం.

కవిత్వ రచన వేరు. చరిత్ర రచన వేరు. కవిత్వ రచనలో కవికి స్వేచ్ఛ

వుంటుంది. ఇష్టమైన అంశాన్ని తనకిష్టమైన పద్ధతిలో వర్ణించుకోవచ్చు, రాసుకోవచ్చు. చరిత్ర అలాకాదు. కల్పనలకు తావులేదు. అవాస్తవాలు చెప్పరాదు. సత్యప్రకటనం చరిత్రకు ప్రాణవాయువు. పూర్వాపరాల పరిశీలన అవసరం. ఆచార్యులుగారు వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కవిహృదయంతో, ఆయా కవుల చరిత్రను చెప్పినతీరు పఠనయోగ్యంగా వుంది. అయితే గ్రంథవిస్తరణ భీతిచే సమాచారాన్ని సమగ్రంగా ఇవ్వలేకపోతున్నానని తమ అంతరంగాన్ని చెప్పారు. నిజమే. ఈ చిన్ని కారణంతో ఆయా కవుల చరిత్రలో ముఖ్యాంశాలను ఆచార్యులగారు నమోదు చేయకపోతే అవి కాలగర్భంలో కలసిపోయే ప్రమాదం వుంది. **"పల్నాటి కవుల చరిత్ర"** కు పరిపూర్ణత బదులు పాక్షికత ఏర్పడుతుంది. కాబట్టి భీతిని వదిలేసి భవిష్యత్ తరాల కోసం భూతకాలపు చరిత్రను సమగ్రంగా పుస్తకంలో చేర్చాలని నా ఆకాంక్ష. అందుకు దాతల సహకారం తప్పక వుంటుంది. ప్రముఖ వైద్యులు డాక్టర్ నెల్లూరు పార్వతయ్యగారి కుటుంబ సభ్యుల అండ వుండనే ఉంది.

ఆచార్యులుగారు నాకు ఆత్మీయులు. మాది అక్షరానుబంధం! ఆచార్యులుగారు స్నేహప్రియులు. చెలిమి వారికి కలిమి, బలిమి కూడ. మా ఇద్దరి మధ్య ఉన్న ఆత్మీయతతోనే, ఈ నాలుగు మాటలు రాసే చొరవ తీసుకున్నాను. ఆచార్యులుగారు గతంలో రాసిన పుస్త కాల కంటే **"పలనాటి కవుల చరిత్ర"** వారికి మంచి గుర్తింపునూ, కీర్తినీ తెస్తుంది. కవులు కోరుకునేది అదే గదా! **బడి మేష్టారుగా 'బెజ్జంకి' వారు ఏం సంపాదించారో నాకు తెలియదు. పలనాటి కవులకు తమ అక్షరస్పర్శతో అపూర్వగౌరవాన్ని కల్పించి,మంచి పుస్తకం రాశానన్న సంతృప్తిని సంపాదించారని నేను నమ్ముతున్నాను.** పల్నాటి వాసులతోపాటు ప్రతి ఒక్కరూ చదవదగిన ఈ విలువైనరచనను ప్రభుత్వంవారు "లక్షల ప్రతులు" అచ్చు వేయించి పాఠశాలల బాలబాలికలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేసి వారిచేత చదివింపజేస్తే కవుల గౌరవాన్ని పెంచినవారవుతారు– చరిత్రను కాపాడిన వారవుతారు. ఆత్మీయ సోదరులు డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులుగారి కృషిని అభినందించాలని పాఠకలోకాన్ని సవినయంగా కోరుతూ, వారికి నా ఆత్మీయ శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

చీరాల, **సం.// బీరం సుందరరావు.**

01.03.2020. (డాక్టర్ బీరం సుందరరావు)

మన పల్నాడు



డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు
సెల్: 9848562726

"శ్రీలక్ష్మీ చెన్నకేశు
స్వామివారి సన్నిధిలో
బ్రహ్మనాయుడేలినట్టి
పసిడి నేల పల్నాడే"

"సత్రశాల మల్లీశుడు
తేరాలన్ సిద్ధేశుడు
ఎత్తిపోతల దుత్తుదుండి
రక్షింతురు పలనాటిన్" -

పల్నాటి గేయ కవిత - డాక్టర్ బెజ్జంకి.

అట్టి మహిమాన్విత దేవాలయాలతో పల్నాటిసీమ ప్రసిద్ధిగాంచి అలరారుతోంది. ఇంకను దైద అమరలింగేశ్వరుడు, గురజాల పాతపాటేశ్వరి అమ్మవారు, మిరియాల ఆవుదేవర, నీలంపాటి అమ్మవారు, కారంపూడి అంకాళమ్మ,దుర్గి వేణుగోపాలుడు, ప్రతి పల్లెలోనూ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కొలువుతీరి భక్తుల కోర్కెలు తీర్చుతున్నారు. అంతేకాక ఏసునాథుని దేవాలయాలు (చర్చిలు), మహ్మదీయుల ప్రార్థనా మందిరాలు (మసీదులు)తో మతసామరస్యాన్ని చాటుతోంది పల్నాడు.

పల్నాటిలో మోర్జంపాడు బావి ప్రత్యేకతను సంతరించుకున్నది. పెద్దకొండమీద బావి ఒక మహాశిల్పి చెక్కినది. ఆ బావిలోకి నీరు ఎటునుంచి వస్తుందో తెలియదు. వేసవి కాలం, వర్షాకాలం బావిలోనినీరు ఒకే లోతులో ఉంటుంది. చిన్న వస్తువు పడినా నీటి అడుగున స్పష్టంగా కనిపించడం విశేషం..!

ఇంగ్లండ్ ఎలిజబెత్ రాణి కిరీటంలో నిలిచిన కోహినూర్ వజ్రం మన పల్నాటి సీమలో లభించిందేకావడం పల్నాటికి గర్వకారణం.

చరిత్ర పుటలలో తనదైన గొప్పస్థానాన్ని నిలబెట్టుకున్నది **'పల్నాటి చరిత్ర'.** అట్టి పల్నాడు గుంటూరు జిల్లాలో గురజాల, కారంపూడి, రెంటచింతల మండలాల పరిధిలోని భూభాగం **"పల్నాటి యుద్ధం"** జరిగిన ప్రాంతంగా ప్రసిద్ధి. బ్రహ్మనాయుడు, నాగమ్మల రాజకీయ రణరంగం ఇది..!

అట్టి పల్నాటి సీమ భౌగోళిక చిత్రపటంలో ఉత్తర అక్షాంశంలో 16-10 డిగ్రీలు, 16-44 డిగ్రీల మధ్య తూర్పు రేఖాంశంలో 79-14-80 డిగ్రీలు వ్యాపించి ఉన్నట్లు

తెలుస్తోంది. 1041 చదరపు మైళ్లు కలిగి ఉన్నది.

1882 ఉమ్మడి మద్రాసురాష్ట్రం గజిట్ ప్రకారం ముద్రించిన కృష్ణా డిస్ట్రిక్ట్ మాన్యువల్ ప్రకారం 1000చదరపు మైళ్ల విస్తీర్ణం కలిగి పల్నాటికి ఉత్తర పశ్చిమ హద్దుగా కృష్ణానది ప్రవహిస్తున్నది. తూర్పు దక్షిణాలలో దట్టమైన అటవీప్రాంతం కలిగి ఉన్నది. **కృష్ణమ్మకు అవతలి ఒడ్డున నైజాం ప్రాంతం ఉన్నది.**

"నల్లగొండయు నాగరి
కల్లును ధరణీస్థలిం బ్రగల్భస్థలమున్
పల్లేరు నాగులేరును
పల్లె క్ష్మాకాంత యెల్ల ప్రారంభంబుల్

పై పద్యాన్ని బట్టి కారంపూడి నుంచి వినుకొండ రోడ్డులోగల నాగమ్మ కనుమ అదె నల్లంగొండ అని చరిత్ర చెబుతోంది.కారంపూడి, నర్సరావుపేట మార్గంలోని నకిరేకల్లు వరకు, నాగులేరు పరీవాహక ప్రాంతం అని తెలుస్తోంది.ధరణీస్థలి అనగా ధరణికోట వరసీమ. ఒకవైపు పల్లేరు అనగా కృష్ణానది తూర్పు ఉత్తరంగా ప్రవహిస్తుంది పల్నాటి సీమకు.

"పల్లె నాటను నూట తొంబదియు నాల్గు
గ్రామముల నీడు గానక కాకునూరి
వెంగనార్యుడు వేద వేదాంగములను
బ్రస్తుతికి నెక్కె మాఱుటి బ్రహ్మ యగన"

పల్నాటి వాడైన అప్పకవి రచించిన అప్పకవీయమను గ్రంథాన్ని బట్టి పల్నాడు 194 గ్రామాలు కలిగి ఉన్నదని తెలుస్తోంది.

ఈ పల్నాటి సీమను తొలుత క్రీ.శ.280లో పల్లవులు పరిపాలించారని, పల్లవ రాజుల అనంతరం వెలనాటి చోడులు, కులోత్తుంగ చోళుడు, ఆ తరువాత కాకతీయులు, రెడ్డిరాజులు, పరి పాలించారని అవగతమవుతోంది.

క్రీ.శ. 1570 ప్రాంతంలో పల్నాటి సీమలో అంతర్భాగమైన విజయపురి సమీపం లోని పెందోట పట్టణాన్ని రాజధానిగా చేసుకుని ధవళేశ్వరపు మార్కండేయ ప్రభువు పరిపాలించినట్లు తెలుస్తోంది. ఈ పెందోట మహాశిల్పాచార్యులకు నిలయమై శిల్పసం పదకు నెలవై విరాజిల్లింది. ఇక్కడి నుంచే బౌద్ధశిల్పాలు దేశదేశాంతరాలకు తరలి వెళ్లాయి. ఆచార్య నాగార్జునుడు పెందోటవాడే అంటున్నారు. ఇక్కడే బౌద్ధం పుట్టి పరిఢ విల్లినట్లుగా తెలుస్తోంది.పల్నాటి సీమ అంతర్భాగమైన విజయపురి ఆచార్య నాగార్జునుని స్థిరనివాసం.

ఆయన ఇక్కడ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి బౌద్ధాన్ని వ్యాపింపజేశాడు.

చైనా, జపాన్ దేశాల నుంచి బౌద్ధులు వచ్చి ఇక్కడ శిక్షణ పొందినట్లు చారిత్రక ఆధారాలు న్నాయి. రసవాదం పుట్టింది ఇక్కడే. అలాంటి పెందోట నగరం నందికొండకు ఎనిమిది మైళ్ల దూరంలో ఉంది. అది నేటికి చరిత్ర మరుగైపోయింది. క్రీ.శ.1570కి పూర్వం తొలితరం వాడైన **ధవళేశ్వరపు వంశస్థుడు 'బెజవాడ ప్రభువు'** పెందోటను కేంద్రంగా చేసుకొని బెజవాడ వరకు పాలించారు. అందువలననే ఆ నగరానికి **బెజవాడ** అనే పేరు వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

ఈ పెందోట వారు విశ్వబ్రాహ్మణులు- విశ్వకర్మ వంశీయులు. వీరు పల్నాటి వారు కావటం పల్నాటి సీమకే గర్వకారణం. ఇప్పటికి పల్నాటిసీమలో విశ్వకర్మీయులలో పెందోటవారు ధవళేశ్వరపు వారుఉన్నారు. ఆ పెందోట నుంచి వలసివచ్చిన శిల్పాచార్యులు తొలుత దుర్గామాతను ప్రతిష్ఠించుకొని ఆరాధించడంతో ఈ ప్రాంతానికి 'దుర్గి' అనే పేరు వచ్చింది. నాటినుంచి నేటి శిల్పకళాకేంద్రమై విరాజిల్లుతూ **"దుర్గి శిల్పం"** ఖండాంతర ఖ్యాతిని పొందింది.

ప్రసిద్ధి గాంచిన పల్నాటి చరిత్రకు మూలం **పల్నాటి సీమ.** దీనికి పల్నాడు అనే పేరు ఎలా వచ్చిందో చరిత్ర కారులు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చారు.

1. పల్లవులు పాలించడంతో ఈ ప్రాంతం 'పల్నాడు' అయిందని-
2. పల్లంగా ఉండడం చేత పలనాడు అయిందని-
3. పలు నాడులకు నాడు కనుక పల్నాడైందని-
4. పలు రకాల రాతి గనులు ఉండడంతో పలనాడైందని-

శాసనాల వలన 'పల్లిరాష్ట్ర'మని, 'పల్లిదేశ'మని, 'పల్లినాడు' అని తెలుస్తోంది.

పల్లెనాడు,పల్నాటియే, పల్నాటిసీమ, పలనాడు అనే పదాలు శ్రీనాథుని పల్నాటి వీర చరిత్రలోనూ క్రీడాభిరామంలోనూ చాటుపద్య మంజరి పద్యాలలోనూ కనిపిస్తున్నాయి.

పల్నాటి వీరచరిత్రకు కేంద్రబిందువు, పల్నాటి ప్రజల మన్ననలు చూరగొన్న ప్రభువు 'బ్రహ్మనాయుడు'. బ్రహ్మన్నని **ధర్మప్రభువు** అని ప్రజలు కొనియాడారు. సర్వమత సామరస్యం, సమసమాజం, చాపకూటి సిద్ధాంతాలతో చెరగని ముద్ర వేసుకున్నాడు బ్రహ్మనాయుడు.

"ధర్మ ప్రభువు బ్రహ్మన్నని
ప్రజలందరు కొనియాడగ
బ్రహ్మనాయుడేలినట్టి
పుణ్యభూమి పల్నాడే

కులభేదంలేని చాప
కూటి సిద్ధాంతం చాటి
ప్రజల మనసు దోచినట్టి
బ్రహ్మన్నది పల్నాదే" - దాక్టర్ బెజ్జంకి

రాజకీయ ఎత్తులకు పైఎత్తులు వేసి బ్రహ్మనాయుని ఎదిరించి నిలిచిన మహామంత్రిణి నాగమ్మ పల్నాటి చరిత్రలో ప్రజలు ఆరాధించిన ధీరవనిత..!

"ఆదదంటే అబల కాదు
అరివీరుల నదలుగొట్టు
నారీమణిగ పేరుగొన్న
నాగమ్మది పల్నాదే

జిట్టగామాలపాడది
దిట్ట నాగమ్మ ఊరది
రాజకీయ ఎత్తులిటనె
రగిలి రేగె పల్నాటన్" - దాక్టర్ బెజ్జంకి

అని ప్రజలు గేయాలు రాసి పాడుకున్నారు. ప్రజలు మనసారా జానపద గీతాలలో నిత్యం పాడుకుని ఆనందించే పల్నాటిచరిత్రను మహాకవి శ్రీనాథుడు చెవులారా విన్నాడు. పల్నాటి సీమలో సంచరించాడు. ప్రజల మనోభావాలను ఆకళింపు చేసుకున్నాడు. ఇంతగా ప్రజలు స్మరించుకునే పల్నాటి చరిత్రను గ్రంథస్థం చేయాలనుకున్నాడు. గానయోగ్యమైన ద్విపదలో **"పల్నాటి వీరచరిత్ర"** అనే ద్విపద కావ్యం రాశాడు.

పల్నాటి సీమకు ప్రక్కనున్న కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానకవి శ్రీనాథుడు పల్నాటిలో గ్రామాలన్నీ స్వయంగా తిరిగాడు. ప్రజల జీవన విధానాన్నీ చూశాడు. శృంగార పురుషుడు, సౌకుమార్యుడు, అందగాడైన శ్రీనాథునికి పల్నాటి వాతావరణం, ప్రజల జీవన విధానం నచ్చలేదు. పల్నాటి ప్రజలలోనాగరికత కనిపించలేదు. శుచి, శుభ్రత కానరాలేదు. అందుకే గ్రామ పురోహితుడి ఇంటి వర్ణన చూడండి...

ఉ॥ దోసెదు కొంపలోఁ బసుల త్రొక్కిడి మంచము దూడ రేణమున్
బాసిన వంటకంబు, పసిబాలుర శౌచము, విస్తరాకులున్
మాసిన గుడ్డలున్ దలకుమాసిన ముండలు, వంట కుండలున్
రాసెదు కట్టెలున్ దలపరాదు పురోహితునింటి కృత్యముల్

గ్రామ పురోహితుడి ఇల్లే ఇలా ఉంటే ఇక ఆ ఊరు ఎలా ఉందో చూడండి...

ఉ॥"అంగడి యూరలేదు, వరియన్నము లేదు, శుచిత్వమేమిలే
దంగన లింపులేరు ప్రియమైన వనంబులు లేవు, నీటికై
భంగపడంగఁ బాల్పడు, కృపాపరులెవ్వరు లేరు, దాతలె
న్నంగను సున్న గానఁ బలనాటికి మాటికి బోవ నేటికిన్?"

పల్నాటి సీమలో సరైన చిల్లర కొట్టు లేదు, వరి అన్నము లేదు. శుచిగా ఉండటం లేనే లేదు. అతివలు అందంగా లేరు. విహరిద్దామంటే ఉద్యానవనములు లేవు. దాహం తీర్చే నాథుడే లేడు. (అంటే బావులు, చెరువులు లేవు) దానధర్మాలు చేసే దాతలే లేరు. పలనాటికి మాటిమాటికి ఎందుకు పోవాలి? అంటారు.

కం॥"జొన్న కవి జొన్న యంబలి
జొన్నన్నము జొన్న పిసరు జొన్నలు తప్పన్
సన్నన్నము సున్న సుమీ
పన్నుగఁ బలనాటి సీమ ప్రజలందఱకున్"

అని ఆనాడు శ్రీనాథుడు పల్నాటి ప్రజల జీవన విధానాన్ని ఈసడించుకున్నాడు. ఇపుడు నవయుగ కవిచక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువాగారు నేటి పల్నాడును వర్ణించిన తీరు గమనించండి...

"క్రమతన్ విచ్చిన వేయి రేకుల దళత్కంజాత మాంధ్రప్రదే
శమునందిప్పటి పల్లెనాటి ప్రజలైశ్వర్యంబు వీక్షించి ఘం
టము చేపట్టుము, నైషధ ప్రముఖ నానాకావ్య నిర్మాతృ చం
ద్రమ! శ్రీనాథ మహాకవీ! దొరకవన్నా నీకు జొన్నన్నముల్"
-కొత్త లోకం - గుర్రం జాషువా

"కల నాదంబున నందికొండ శిఖరాగ్రంబెక్కి, కృష్ణాపగా
జల ముప్పొంగి తెలుంగు భూముల కభీష్టంబుల్ ప్రసాదించెడిన్
పలుకుల్ నేర్చితి నంచు దిట్టితివి మా పల్నాటి గడ్డన్ భళా
భళినీ నవ్విన నాపచే నిపుడు దాళ్వా పంటలుం బండెడిన్"

"క్రమంగా విచ్చుకున్న సహస్రదళ పద్మంలా ఆంధ్రదేశం దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ఇప్పటి పల్నాటి ప్రజల ఐశ్వర్యం చూచి కలం చేబూని రాయవయ్యా శ్రీనాథ మహాకవీ! అన్నారు. అంతేగాదు నందికొండ శిఖరంమీదకు ఎక్కి చూడు- కృష్ణానది ఉప్పొంగి తెలుగునేలను ప్రవహిస్తూ ప్రజల కోర్కెలు తీరుస్తోంది. ఆనాడేదో తిట్టావు

పల్నాటి ప్రజలను చూచి- తగునటయ్యా నీకు శ్రీనాథా! నవ్విన నాపచేనే పండుతుంది" అని పల్నాటి సీమ ఔన్నత్యాన్ని గుర్రం జాషువావారు వర్ణించిన తీరు అద్భుతంగా ఉంది.

పల్నాటి చరిత్రను ఆధునిక గేయంలో **డాక్టర్ బెజ్జంకి** జగన్నాథాచార్యులు వర్ణించిన తీరు గమనించండి...

'జొన్నకూడు సజ్జకూడు
జుర్రు వారు చూడ సున్న
వరిబువ్వకు కొదవలేని
పల్లెలలరు పల్నాటన్

ఎండుమిర్చి ఘాటుగడ్డ
మండుటెండ ధాటిగడ్డ
పౌరుషాల పౌరులున్న
పురిటిగడ్డ పల్నాడు

వీరకత్తులు కదుగగా
వీరరక్తం పారగా
నాగులేరు చంద్రవంక
నదలు గన్నది పలనాడు

నాటి గుడిసెలిపుడు లేవు
నాటి మిద్దెలిపుడు లేవు
పెద్దపెద్ద మేడలున్న
వీథులొప్పు పల్నాటన్

దేశభక్తిపరుల కొలువు
సంఘసేవ పరుల నెలవు
దానగుణం దాతలున్న
దర్బారును పల్నాదే

మత వైరం మనదిచ్చట
మతత్రయం మనునిచ్చట
పండుగైనా పెళ్ళైనా
భాయిభాయి పల్నాటన్..!

-పల్నాటి గేయ కవిత -డాక్టర్ బెజ్జంకి

ఈ రీతిగా వెలుగొందుతున్న పల్నాటి సీమ ప్రజలు నాడు, నేడు అక్షరాస్యత శాతంలో ఒకింత వెనుకబడి ఉన్నప్పటికీ దేశక్తి భావాలు మెండుగా ఉన్న వారు.

ఎంతో వెనుకబడిన ప్రాంతమైనా దేశస్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని బ్రిటీషు వారిని ఎదిరించి ప్రాణాలొడ్డినారు.

పలనాడు వెలలేని మాగాణిరా అని పులుపుల శివయ్య గారు అన్నట్లు పల్నాడు గొప్పదే. అంతేకాదు పేరెన్నికగన్న కవిపండితులకు, గొప్పగొప్ప శిల్పులకు నిలయం పలనాడు. గర్భకవిత్వం, బంధకవిత్వం, చిత్రకవిత్వం, త్ర్యర్థికవిత్వం రాయడంలో పేరెన్నిక గన్న **"కవిసింహ" పోకూరి కాశీపత్యవధానులు పల్నాటివారే.** అలాగే అవధానంలో ఆరితేరిన పల్నాటి సోదర కవులు కన్నెగంటివారు ముగ్గురు ఒకే తల్లిపిల్లలు కావటం అరుదైనవిషయం. భారతగర్భ రామాయణం రాసిన రావిపాటి లక్ష్మీనారాయణ పల్నాటివారే. గేయకావ్యం రాసిన పల్నాటి ప్రసిద్ధ కవి పెద్దోజు నమశ్శివాయ భాగవతార్, వారి కుమారుడు పెద్దోజు నాగేశ్వరరావు గేయకావ్య రచనలో అందెవేసిన చెయ్యివారిది. అలాగే ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్న చిటిప్రోలు కృష్ణమూర్తి గారు మన పల్నాటివారే.

ఆధ్యాత్మికవేత్తలు, కారణజన్ములు చిరుమామిళ్ల సుబ్బయ్యస్వామి కృష్ణభక్తిలో లీనమై భగవద్దర్శనం చేసుకున్న మహానుభావులు. భక్తిని ప్రబోధించడానికి ఎన్నో రచనలు చేశారు. దరువులు, యేలలు, తత్వాలు రాసి బోధించారు– వారునూ మన పల్నాటి వారే..!

కేశవతీర్థ పిడుగురాళ్లలో ఆ పక్కనే ఉన్న కోటనెమలిపురిలో ముచుకుందాశ్రమమును స్థాపించి భక్తి ప్రబోధంచేస్తూ నేటికి కొనసాగుతున్న వేంకటరెడ్డిగారు వేమన తత్వముపై రచనలుచేసి ప్రచారం చేస్తున్నారు. వారూ పల్నాటి వారే..!

గత 30 సంవత్సరాలుగా మాచర్లలోను, రేపల్లెలోను జ్ఞానాశ్రమాలు స్థాపించిన గీతాగురూజీ ఆధ్యాత్మిక గ్రంథాలను వెలువరిస్తూ గీతాప్రచారంచేస్తున్న పందిరి శ్రీశైలంగారు పల్నాటి వారే..!

అటు వైద్యవృత్తిలో హస్తవాసిగల వైద్యులుగా సేవలందిస్తూ అనేకమార్లు శబరిమల సందర్శించి గురుస్వామిగా పేరుపొందిన మహానుభావులు డాక్టర్ పి.వి. ఆచార్య పల్నాటి వారే. ఆయన పల్నాటి చరిత్రపై మంచి అవగాహనతోపలు రచనలు చేశారు. ఇటువంటి మహనీయులెందరో పల్నాడులో ఉండేవారని, ఉన్నారని ఆయా

వివరాలు భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ రచనకు నేను ఉపక్రమించాను.

గుంటూరు జిల్లాలో 1.వెల్దుర్తి 2.మాచర్ల 3.రెంటచింతల, 3.గురజాల 5.దాచేపల్లి 6. పిడుగురాళ్ళ 7.మాచవరం 8.కారంపూడి 9.దుర్గి ఈ తొమ్మిది మండలాలను నేడు పల్నాడు అంటున్నారు. కనుక ఈ తొమ్మిది మండలాల పరిధిలో క్రీ॥శ॥15వ శతాబ్దము నుంచి నేటి వరకుగల కవులు, రచయితల వివరాలను సేకరించి **పల్నాటి కవుల చరిత్ర** అనే గ్రంథమును భావితరాల వారికి పల్నాటిసీమ ఘనతను భద్రపరచి తెలియజేయగలందులకు ఈ గ్రంథరచనకు సిద్ధమయ్యాను. ఇందులో ఎంతవరకు కృతకృత్యుడనైనానో పాఠకులే నిర్ణయించాలి.

1984లో నేను పల్నాటి సీమలోని జిల్లాపరిషత్ పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేయటం వలన పల్నాటి సాహిత్యాన్ని సేకరించగలిగాను. ఆధుని కులైన కవిపుంగవులతో పరిచయభాగ్యం కలిగినందులకు ధన్యుడనైనాను. నా అన్వేషణలో నేను కొంతమంది కవివరేణ్యుల గురించి తెలుసుకొనలేకపోయిఉండ వచ్చును. అలాంటి కవుల వివరాలు పాఠకులు, విజ్ఞులు తెలియజేసినట్లయితే మలి ముద్రణలో వాటిని పొందుపరచగలనని సవినయముగా మనవి చేసుకొనుచున్నాను.

12వ శతాబ్దం వాడైన యథావాక్కుల అన్నమయ్య నుంచి, **వాక్యం రసాత్మకం కావ్యం** అన్న ఆలంకారికుల సూత్రమును అనుసరించి ఆధునిక ప్రక్రియల్లో రచనలు చేస్తున్న వారి వరకు విశేషాలను సేకరించిన క్రమంలో పల్నాటిసీమలో దాదాపు 165 మందికి పైగా కవులు, రచయితలు ఉన్నట్లు గుర్తించి గ్రంథస్థం చేయటమైంది. **ఇక్కడ అతి ముఖ్యవిషయం ఏమంటే– ఇతర ప్రాంతాలలో పుట్టి, పెరిగి ఆ తర్వాత పల్నాడుకి వచ్చి నివాసం ఏర్పరచుకున్న కొందరు కవులు, రచయితలను కూడా పల్నాటిప్రాంతం వారుగానే గుర్తించి ఈ జాబితాలో చేర్చడం జరిగింది. వారు పల్నాడులో ఎక్కువ కాలం నివసించడం వల్ల ఇలా చేయవలసి వచ్చింది.** పాఠకులు సహకరించి, ఆదరించి, తగిన సూచనలు, సలహాలు, చేర్పులు, మార్పులు తెలియజేసి నట్టయితే వాటిని సహృదయంతో స్వీకరించగలవాడను.

మరో ముఖ్యాంశమేమంటే– **పల్నాటి సీమ స్వాతంత్ర్య సమరయోధులు** అనే మరో పుస్తకం ప్రచురించాలని సంకల్పం. ఇందుకుగాను సమాచార సేకరణలో నిమగ్నమయ్యాను. త్వరలో ఈ గ్రంథం ముద్రణకు వెడుతుంది. దీనిని కూడా పల్నాటి సీమ వాసులు ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నాను. ●

ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు..!

"పౌరుషాల పల్నాడే
పండితులకు పుట్టినిల్లు
కవిశేఖరులెందరినో
కన్నతల్లి పల్నాడే."

....పల్నాటి గేయ కవిత.

పౌరుషాలకూ ప్రతీకారానికీ పట్టుగొమ్మయని పల్నాడు ప్రతీతిగాంచినది. **అందుకు పలనాటి చరిత్ర** నిదర్శనం. పల్నాడనగానే బ్రహ్మనాయుడు,నాగమ్మ, కోడిపోరు, కన్నెగంటి హనుమంతు గుర్తుకు వస్తారు. ఏ సభలోనైనా ఇంతవరకే ప్రస్తావిస్తారు.

2007 డిసెంబర్ 16,17,18.తేదీలలో తొలిసారిగా **"పలనాటి మహోత్సవాలు"** నిర్వహించారు. ఆ తర్వాత పిడుగురాళ్ల, కారంపూడిలో నిర్వహించారు. వీటిలో కూడా వీరాచార, వీరవిద్యావంతుల ఆచారాలు, సంప్రదాయాలకు సంబంధించిన ప్రదర్శనలు కనిపిస్తాయి కాని పల్నాటి చరిత్ర, సంస్కృతిని భావితరాల కోసం పదిలపరచిన శిల్పులను, కవులను గురించి స్మరించుకొనుట నామమాత్రంగానైన కనపడిందా అంటే సందేహమే. కవిసింహాలు, కవి శిరో మణులు,అష్టావధానులు, శతావధానులు,చతుర్విధ కవితారీతులనెరిగినవారు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇతర రాష్ట్రాల్లోనూ పేరు ప్రఖ్యాతలు గన్నవారు పల్నాటి సీమలో అనేకమంది ఉన్నారు. వారిని స్మరించుకొనేవారే లేకపోవడం విచార కరం. ఈ లోటును భర్తీ చేసే క్రమంలో పల్నాటి సాహితీప్రముఖులందరినీ ఒకచోట గుదిగుచ్చి గ్రంథస్థం చేసి ముందుతరాలకు పదిలపరచే నా ప్రయత్నంలో దాదాపు 160 మందికి పైగా కవుల చరిత్రలను సేకరించాను. ఈ విధంగా కొనసాగుతున్న నా బృహత్ పరిశోధనాకార్యక్రమ సరళిని ప్రోత్సహించి గ్రంథముద్రణకు నేనున్నాను అంటూ ముందుకు వచ్చిన **డాక్టర్ నెల్లూరి పార్వతయ్య గారు,వారి సతీమణి మాచర్ల పురపాలక సంఘ మొట్టమొదటి వైస్ చైర్‌పర్సన్ మరియు రెండవ చైర్‌పర్సన్ శ్రీమతి నెల్లూరి మంగమ్మగారికి** తొలుత కృతజ్ఞతలు తెలియ జేయుచున్నాను.

1996 సంవత్సరం నుండి పల్నాటి కవీశ్వరుల గ్రంథసేకరణ పాతపుస్తకాల షాపులనుండి మొదలు.ఆ తరుణంలో కవిమిత్రులు కీ.శే.పెద్దోజు నమశ్శివాయ భాగవతారు, కీ.శే. ఉల్లి రామ సుబ్బయ్యగారు వారివద్దనున్న కొన్ని గ్రంథరాజము

లిచ్చారు.కీ.శే.మంగళాపురపు సదా శివయ్యగారును ఇచ్చారు.గ్రంథముద్రణకు పూనుకున్నది మొదలు రచయిత శ్రీ మణిమేల శివశంకర్ గారు (గుంటూరు) సమాచారం సేకరించి తెలియజశారు- వారికి ధన్యవాదాలు.

అలాగే పంచాయతీ సమితి మాజీ ప్రెసిడెంట్ శ్రీ జూలకంటి పోలిరెడ్డిగారు- **'ఆ గ్రామంలో వారున్నారు,ఈ గ్రామంలో ఫలానా వారున్నా'**రని వివరాలు అందించటంలో ప్రత్యేకశ్రద్ధ చూపించారు.వారికి మరీమరీ కృతజ్ఞతలు.గురజాల మండల విశ్వబ్రాహ్మణ సంఘాధ్యక్షులు పాలకేంద్రం యజమాని శ్రీకృష్ణమాచార్యులుగారు,అటులనే తగిన ప్రోత్సాహమిచ్చిన కార్య సాధకుడు, సంఘశ్రేయోభిలాషి శ్రీ నల్లూరి రామప్రసాదుగారు, తగిన సమాచారం అడిగినంతనే స్పందించి వారి రచనలు పంపించి సహకరించిన పలువురికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. కొందరు ప్రముఖులనుండి వివరాలు సేకరించటం కుదరనందుకు చింతిస్తున్నాను.


ఈ ముద్రణలో నేను తెలుసుకొనలేకపోయిన, ఇంకనూ చేర్చదగిన రచయితలు, కవుల వివరములు సహృదయ పాఠకులు, పెద్దలు తెలియజేసి ద్వితీయ ముద్రణలో **"పల్నాటి కవుల చరిత్రకు"** నిండుదనము చేకూర్చగలరని నా విన్నపము.

ఈ గ్రంథ ముద్రణకు ముచ్చటైన డి.టి.పి చేసిన ప్రముఖ పాత్రికేయులు, మిత్రులు బ్రహ్మశ్రీ తమిరి పుల్లారావు గారికి కృతజ్ఞతలు. అందముగా ముద్రించిన కలిమిశ్రీ గ్రాఫిక్స్, విజయవాడ వారికి ధన్యవాదాలు..



జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి నుంచి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు...

1. చిరుమామిళ్ల సుబ్బయ్యస్వామి - 1802 -1882 ధర్మవరం



సుబ్బయ్యస్వామి భక్తకవిగా ప్రసిద్ధుడు. భక్తి నుండే ఈయన కవిత్వం పుట్టింది. కవిత్వం రాసినా కర్షక జీవనం విడనాడ లేదు. అచ్చమైన తెలుగు పలుకుబడులను బళ్లకెత్తిపోసిన కర్షకకవి! కవిబ్రహ్మ ఏటుకూరి వేంకటనరసయ్యా అంతే! వీరిద్దరూ అలనాటి పోతన్నను జ్ఞప్తికి తెస్తారు. పల్నాడు వీరులకూ కవులకూ భక్తులకూ పుట్టిల్లు. అలాంటి పల్నాడులో పుట్టిన సుబ్బదాసు హరి భక్తుడుగా అనేక మహిమలు చూపి భక్తకవిగా అనేక కృతులు రచించాడు. వాటిలో శతకాలు, ద్విపదలు, యక్షగానాలు, ఏలలు,దరువులు, లాలిపాటలు,జోలపాటలు జనసామాన్యులు పాడుకోవడానికి వీలుగా రాశారు.సుబ్బయ్యస్వామి **"తాను పాడి, పలువురు భక్తులచేత పాడించి ముక్తిపొందా"**రని- **డాక్టర్ వి.వి.ఎల్. నరసింహారావుగారు** అన్నారు.

"అష్టాక్షరి మంత్రపారాయణంతో సాయుజ్యమందిన భక్తయోగి సుబ్బదాసు గారు. అష్ట శతకాలు రచించడం వారి విశిష్ట ప్రవృత్తికి ప్రబల తార్కాణం. గద్యపద్యగేయ కావ్యాలు రచించి ధర్మవరంలో మనుగడ సాగించిన మాన్యచరిత్రుల"ని కొండవీటి వేంకటకవిగారు అన్నారు. వీరిది దుర్గి మండలం, ధర్మవరం గ్రామం.1802లో జన్మించారు. పల్నాటి పోతనగాపేరెన్నిక గన్నారు.చిరుమామిళ్ళ నరసయ్య, తిరుమలమ్మ పుణ్య దంపతులకు జన్మించారు.కులవృత్తి వ్యవసాయం. దుర్గి వేణుగోపాలుని కొలిచి తరించారు. మహిమలు చూపారు.1882 జనవరి 12వ తేదీన కైవల్యం చెందారు.అది పుష్య బహుళ అష్టమి. నాటినుండి నేటి వరకు పుష్యబహుళ అష్టమి రోజున సుబ్బయ్యగారి ఆరాధన భక్తిశ్రద్ధలతో భక్తులు జరుపుకొంటు న్నారు.**1960లో పల్నాటి సోదరకవులలో ఒకరైన కన్నెకంటి వీరభద్రాచార్యులుగారు సుబ్బదాసు జీవితచరిత్రను చంపూకావ్యంగా రచించారు. అడవి సూర్యకుమారి "అగ్నివీణ" అనే శీర్షికతో సుబ్బదాసు జీవితచరిత్రను నవలగా రచించారు.** కర్నాటి భద్రయ్య చౌదరి, కర్నాటి వేంకటేశ్వర చౌదరిగార్లు ఈయనపై శతకాలు రాశారు. **వీరి రచనలు: శ్రీకృష్ణలీలామృతం, ప్రహ్లాదచరిత్ర** అనేవి యక్షగానాలు. **రుక్మాంగద చరిత్ర, అంబరీషోపా ఖ్యానము** అనేవి ద్విపద కావ్యాలు, **నానార్థ స్తవము,** సగుణ, నిర్గుణతత్త్వ కందార్థములు, దరువులు, జోలపాటలు,చూర్ణికలు, స్తవాలు, మంగళహారతులు, కీర్తనలు తదితరాలెన్నో రచించారు. ఈయన వాగ్గేయకారుల కోవలోనివారు.

2. పోకూరి కాశీపత్యవధాన్లు - 1893-1974. బోదిలవీడు

పోకూరి కాశీపత్యవధాన్లు ఆంధ్రదేశము గర్వించదగిన వ్యక్తి. తెలుగుజాతి గౌరవాన్ని దశదిశల వ్యాపింపచేసినారు. తెలుగు సాహిత్యాన్ని కాచివడపోసినారు. అమరకోశం, ఆంధ్రనామ సంగ్రహం, సాంబ నిఘంటువు, శాబ్దార్థచంద్రిక వంటి నిఘంటువులు కంఠో పాఠం ఆయనకు. కవిత్వం రాయటంవెన్నతో పెట్టిన విద్య. కవిత్వంలో సాముగరడీలు చేయ డంలో ఆరితేరిన వాడు. పద్యంలోని ప్రతిపాదం మొదటి నుంచి చివరకు, చివర నుంచి మొదటికి ఎటు చదివినా ఒకేలా ఉండేలా రాయడంలో దిట్ట!



వికటకవి అను ఒక పదం చూస్తేనే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. అది వెనుక నుంచి చదివినా 'వికటకవి' అనే..అదే విధంగా పద్యంలోని పాదం మొత్తం మొదటి నుంచి చివరకు, చివర నుంచి మొదటికి ఒకేలా ఉండేలా, కేవలం పాదమే కాక మొత్తం పద్యం అంతా కూడా మొదటి నుంచి చివరకు, చివర నుంచి మొదటికి ఒకేలా ఉండేలా ఇంకెంత ఆశ్చర్యం కలుగుతుందో కదా..! అలా రాయటం ఆయన ప్రత్యేకత!

ఉదాహరణకు... (పాదం వారీగా)

"సార సురధీర సురసా
→ తారనగా తతసభా సతతగా సరతా←
→ వీర సభా భాసరవీ←
→ మారపరాయమరవారమయరాపరమా" ←

పై పద్యంలో ప్రతిపాదం అటునుండి ఇటు, ఇటు నుండి అటు చదివితే ఒకేలా అక్షరాలు వస్తాయి. అర్థం లేదనుకుంటున్నారా, కాదు! నాలుగు పాదాలూ అర్థవంతమైనవే..అర్థం తెలుసు కోవాలంటే ఆయన రాసిన పుస్తకం చదవాల్సిందే..!

'వికటకవి' అనే పదం లాంటి పదం మరొకటి చెప్పడం మనకు సాధ్యంకాదు. అటువంటిది ఆయన పద్యం పాదం మొత్తం అటూ ఇటూ ఒకే అక్షరాలు వచ్చేలా రాయటం, అదే విధంగా మొత్తం పద్యమంతా రాయటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ

నైపుణ్యం కవి ప్రతిభకు తార్కాణం.

మరో ఉదాహరణ: (పద్యం వారీగా)

→సారస జనుత జయతరల
శూరహరా సాదర వరసు సురాపరమా
మారపరాసు సురవరద
సారాహరశూలరత యజతను జసరసా" ←

ఈ కందపద్యం చివరి అక్షరం నుండి వెనుకకు చదువుకుపోతే మొదటి నుండి చదివినట్లే ఉంటుంది.

ఇటువంటి చిత్రకవిత్వం రాయటంలో ఆయనకు ఆయనే సాటి.

'కవిసింహ' పోకూరి కాశీపతి గద్వాల మాజీ ఆస్థాన కవి. అష్టావధాని, మహాకవిశేఖర, ఆశుకవి సార్వభౌమ, కళాపరిపూర్ణ, కవిశిరోమణి, కవిశిఖామణి, చిత్రకవితాప్రవీణ, శతావధాని.... ఇలాంటి బిరుదులెన్నో ఆయనను వరించాయి.

కాశీపతి పలనాటి సీమలో 'బోదిలవీడు' గ్రామంలో 1893లో పోకూరి రామలక్ష్మమ్మ, సుబ్బయ్యాచారి పుణ్యదంపతులకు నందన నామ సంవత్సరం మాఘశుద్ధ దశమి నాడు అనగా క్రీ.శ. 27-1-1893న జన్మించారు. ఈ దంపతులకు ఆరుగురు బిడ్డలు. అందులో చివరివాడు కాశీపతి. చివరివాడైతేనేమి తెలివితేటల్లో మొదటివాడు. మహామేధావి!

స్వయంకృషితోనే పైకి వచ్చి ఇంతవాడైనారు. ఏ గురువు వద్దా కవిత్వం నేర్చుకోలేదు. బోదిలవీడులోని ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. రెంటచింతలలో ఆరో తరగతి చదువుకున్నారు. అంతలో స్ఫోటకం పోసింది. ఇంటికి వచ్చేశాక తల్లిదండ్రులు ఆవులు కాయమన్నారు. పొలానికి పంపించారు. ఆవులు కాస్తూ నిఘంటువులు బట్టీ పట్టారు. భారత, భాగవత, రామాయణాలు చదువుకున్నారు. బీడులో ఆవులను తోలి తాను చెట్టెక్కి చదువుకునేవారు. ఆవులు పక్క పొలాల్లో మేస్తుండేవి. రైతులు ఆయన తండ్రికి ఫిర్యాదు చేసేవారు. కానీ పిల్లవాడికి చదువు పట్ల ఉన్న మక్కువకు సంతోషించేవారు. పిల్లవాడి తెలివికి ముగ్ధులయ్యేవారు.

స్వయంకృషితో చదువుకొని మహాకవిశేఖరుడైనారు. గద్వాల సంస్థానములో విద్వాంసు లెందరినో మెప్పించి ఆస్థాన పండితుడైనారు కాశీపతి. ఎవరూ రాయలేని కవిత్వం రాశారు. కేవలం **య,ర,ల,వ,శ,ష,స,హ,ళ,ళ** అనే పది అక్షరాలతోనే

శ్రీకృష్ణుని బాల్యక్రీడలను **“శౌరి శైశవలీల”** అనే గ్రంథం రాశారు. కవిత్వంలో ఇటు వంటి ప్రయోగాలు ఎన్నో చేశారు.

“సారంగధరీయం” అనే త్ర్యర్థికావ్యం రాశారు. ఒక్కో పద్యంలో మూడు కథలు చెప్పుకుంటూ గ్రంథం మొత్తం రాశారు. **‘పార్వతీ కళ్యాణం’ ‘తారాశశాంకం’, ‘సారంగధర చరిత్ర’** అనే మూడు కథలు జోడించి**“సారంగధరీయం”** రాశారు. దానికి ప్రతిపదార్థం కూడా ఆయనే రాసి అచ్చు వేయించారు. సారంగధరీయం గ్రంథాన్ని పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం హైదరాబాద్ వారు మే1990న పునర్ముద్రించారు.

కాలికి గండపెండెరం తొడిగి, గజారోహణం (ఏనుగు పైకి ఎక్కించి) చేయించి అశేష జనం వెంటరాగా ఊరేగించారు. నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ కాశీపతిని ఘనంగా సన్మానించారు. అలాగే దామోదరం సంజీవయ్య కూడా ఆయనను సన్మానించారు. ఆంధ్రా, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లోనూ, మదనమోహనమాలవ్య విశ్వవిద్యాలయం (కాశీ) లోనూ కాశీపతిని ఘనంగా సన్మానించారు.

రచనలు: **1. సారంగధరీయం** (మూడు అర్థాల కావ్యం), **2. సిద్ధయోగి చరిత్ర** - ఇది పిల్ల భాగవతం అని పేరు తెచ్చుకున్న చక్కని గ్రంథం. **3. శౌరి శైశవలీల.**

కాశీపతిగారి గ్రంథాల వైశిష్ట్యం కాశీపతిగారి మాటలలోనే తెలుసుకుందాం...

సీ॥ **“శ్రీహరిశ్చంద్ర చరిత్రచే నొరుల గాం**
చగ నోళ్లు దెరిపింతు చదువరుల
పృథుల సారంగధరీయంబుచే మూడు
త్రోవలు బట్టింతు కోవిదులను
సిద్ధయోగి చరిత్రచే గర్వభంగమొ
నర్చి జోగులఁ జేతు నవరసికులు
గల త్రింశదర్థ పద్యమణిచే లోబర్చు
కొందును ముప్పది మంది బుధుల
సరవినీ శౌరి శైశవలీలచే ముక్కు
బట్టి యాడింతును పండితులను

గీ॥ చాటువుల చేత నాల్కను సాచజేతు
నోరు మూయింతుఁ గొన్నిట సూరిజనుల
చేతి కలమిల బెట్టింతు వ్రాత కాంధ్ర
మత్కవిత సారమౌ హనుమంత భూప"

అన విని శౌరిశైశవలీల కృతిపతి అయిన ముద్దనూరి హనుమంతరెడ్డి ఏమన్నారంటే......

"మహాకవిశేఖరా! మీరు ఇట్లు ఆత్మస్తుతి, పరనిందచేయగా ఎవరు కాదంటారు? హరిశ్చంద్రోపాఖ్యానంతో నోళ్లు తెరిపించి అబ్బో అనిపిస్తారా? సారంగధరీయంతో పండితులను మూడు త్రోవలకు పారిపోయేట్లు చేస్తారా? సిద్ధయోగి చరిత్రతో గర్వభంగం కలిగిస్తారా? త్రింశదర్థక పద్యాలతో ముప్పదిమంది పండితులను లోబర్చుకుంటారా? శౌరిశైశవలీలచే ముక్కుపట్టి ఆడిస్తారా? చాటుపద్యాలతో నోరెళ్లబె ట్టేట్లు చేస్తారా? మరో గ్రంథంతో నోరుమూయిస్తారా? వ్రాయసగాంధ్ర కలం కింద పెట్టిస్తారా? ఇంత గర్వంగా చెప్పుకోవడం తగునా?" అని హనుమంత భూపతిగారు అడిగినారు. అప్పుడు కాశీపతిగారు-"**గ్రంథాల గొప్పదనం చెప్పుకున్నను తప్పుగాదుకదా? నిరోష్ఠ్య నిర్గద్యశుద్ధాంధ్ర హరిశ్చంద్రోపాఖ్యానము- ఈ గ్రంథం చదివితే పెదవికి పెదవి తగలదు. ఓష్ఠ్యములు లేవు. అనగా పఫబభమ అను అక్షరములు లేవు. గద్యంలేదు. సంస్కృత పదాలు లేవు. అచ్చమైన ఆంధ్రశబ్దాలతో రాశాను. అవి నోరు తెరిపించి చదివించుటే గదా? ఇందులో అతిశయోక్తి ఏమున్నది?**

2. సారంగధరీయం త్ర్యర్థి కావ్యం. మూడర్థాలతో నడుస్తుంది. శివుడు, చంద్రుడు, సారంగధరుడు ముగ్గురి కథ మూడు తోవలు గదా? ఇందేమి అతిశయోక్తి గలదు?

3. సిద్ధయోగ చరిత్ర ఇది వేదాంత గ్రంథము. ఈ గ్రంథమును చదివిన ఎంతటి రసికులైనా సన్న్యాసులుగా మారవచ్చు. ఇందునూ అతిశయోక్తి లేదు!

4. త్రింశదర్థక పద్యరత్నము ఇది ముప్పది మంది దేవతలను స్తుతించును. ముప్పదర్థములు గలవు. ఇందు బుధులు అనగా దేవతలు. దేవతలను స్మరించుకుని వారిని వశపరచుకున్నాను అని అర్థము.

5. శౌరిశైశవ లీల- ఈ గ్రంథము కేవలము పది రకాల అక్షరములతో రాయటమైంది. ఇందు అనునాసికాక్షరములు లేవు. కాబట్టి ముక్కు మూసుకుని చదువవచ్చును. కనుక ముక్కుబట్టి యాడింతుననగా ముక్కుబట్టి చదివించెదను అని అర్థం. ఇంకనూ నా చాటు పద్యములలో చిత్రకవిత్వమున్నందున నాలుక సాచి కదలనీయక చదువ వచ్చును.

ఇందులో అబద్ధము లేదు. వ్రాయసకాండ్ర కలము క్రింద పెట్టింతునని అశ్చర్యము లేదు నేను గంటకు ఆశువుగా వందల పద్యములు చెప్పెదను. కాన ఎవరూ వ్రాయలేక కలము క్రింద పెట్టవలసినదే అనుటలో అతిశయోక్తి లేదు– అని సగర్వంగా తన కవిత్వం గురించి కాశీపతి గారు పీఠికలోని పద్యంలో చెప్పుకున్నారు.

శుద్ధ నిరోష్ఠ్యం = పెదవి పెదవి తగలకుండా చదువుతారు మీరు చదివ చూడండి పెదవులు తగలవు–

కం॥ **" అలకాంచితాశ్రయాశా**
ఖలదైత్యానీక నాశ కవితాంత్యాశా
లలితాంత రిక్షకేశా
సలిల జనయనేశయాశ శశినీకాశా"

ఔను కదా పెదాలు తగలవు చదువుతుంటే...

కాశీపతిగారి చిత్రకవిత్వానికి కొన్ని ఉదాహరణలు....

పద్యంలోని అన్ని అక్షరాలూ గుడులు కలిగి ఉంటాయి...

కం॥**"కినిసి సిరిఁ దీసి నీలిగి**
తిని సిగ్గిడి కింకిరి కిని దిగి తీరితిఁ గి
త్తినిజీరి నించి చిక్కిడి
తిని జియ్యా యింతి కీరితిని నిల్చిరిసీ"

పద్యంలోని అక్షరాలన్నీ ఏత్వాలు కలిగి ఉంటాయి.....

కం॥**"కేలేదే తేతేవే**
వేలేవే మెట్లదే జేవే యేల్చేడె
న్నేలేనే వేరే యె
గ్గేలేనే లేతే యేద్చేదేవే మేలే"

ఏకాక్షర పద్యం...(న)

కం॥**"నేనెన్నెనను నీన**
న్నానా నేనాన నూన నా నన్న ననౌ
నా నిన్ను నెన్న నన్నా
నానే నున్నాన నానినా నన్నన్నా

–హరిశ్చంద్రోపాఖ్యానం– ద్వితీయాశ్వాసం (76వ పద్యం)

విస్తరణ భీతిచే టీకాతాత్పర్యములు ఇవ్వడంలేదు.

త్రింశదర్థక పద్యం:-

ఆ॥వె॥ భూరి జఠర గురుడు నీర జాంబక భూతి
మహిత కరుడు హీనమణి కలాపు
దలఘు సద్గుణేశు దశ్రగోపుడు మహా
మర్త్య సింహుఁడేలు మనల నెపుడు

ఈ పద్యానికి ముప్ఫై భావములు ఉన్నాయి. ఆ భావముకు అనుగుణంగా ముప్పది మంది దేవతలను పై ఒకే పద్యంలో ప్రార్థన చేశారు. వాటికి టీకాతాత్పర్యాలకు కూడా రాశారు కాశీపతిగారు!

ఖడ్గబంధం, నాగబంధం, శైలబంధం, గర్భకవిత్వం రాయటంలో ఆయనకు ఆయనే సాటి. **"సాహితీ సమరాంగణ సార్వభౌముడు"** అనదగిన వారు. అక్షరాలను సాముగరిడీలు ఆడించినవారు కవిసింహం!

మద్రాసు ఆంధ్ర మహాసభలో కవిసమ్మేళనం ఏర్పాటు చేశారు. దానికి కాశీపతి గారు హాజరు కాగా నిర్వాహకులు కాఫీ ఇచ్చారు. అరకప్పు కాఫీ తాగినారు. ఇంతలో సభాసదులందరూ వచ్చారు.వేదికమీదకు ఆహ్వానించారు."కాషా యాంబరధారి కర్ణకుండల సువర్ణ ఘంటాకరకంకణ కేయూరధారి, గండపెండెర భూషితపాదుడు, ఆరడుగుల అందగాడు, ఆజానుబాహుడు, అభినవ మన్మథుడు" అన్నట్లుగా సభావేదికపైకి వస్తుంటే హర్షాధ్వానాలు... చప్పట్లు...ఆ రూపాన్ని చూచి మారుమ్రోగినాయి. సభ ప్రారంభమైంది. వేదిక మీద ఉన్న ఆంధ్ర విశారద **తాపీ ధర్మారావు గారు** "కాఫీ సేవించారుగా కాశీపతిగారూ... కాఫీ మీద దండకం చెప్పండి" అన్నారు. అన్నదే తడవుగా ఆయన అందుకున్నారు...

కాఫీ దండకం:

శ్రీమన్మహాదేవి, లోకేశ్వరీ, కాళికా సన్నిభాకాణి!లోక సంచారిణీ ! అంబకాఫీ జగన్మోహినీ! తొల్లి శ్రీకృష్ణుడా స్వర్గమున్ జేరి, పూతంబునౌ పారిజాతంబున్ దెచ్చియున్, నాతికిన్ బ్రీతిగా ని చ్చు కాలంబు నందా సుమంబందునంగల్గు బీజంబులు ర్వీస్థలిన్ రాలియున్, లోకభేదంబుచే, గాఫి భూజంబుగాఁబుట్టియున్, గొమ్మలన్, రెమ్మలన్, బూవులన్, దావులన్, జక్కనౌ పిందెలన్, జిక్కనౌ గాయలన్, జొక్కమౌ పండ్ల భాసిల్లఁ దద్బీజ జాలంబు నైర్లండు, నింగ్లాండు, హాలెండు, పోలెండు, రష్యా, జపాన్, జర్మనీ,

గ్రీకు దేశంబులన్ నాటి, పెన్ ప్రూకులై ఇండియాన్ దోటలై విత్తనాలిచ్చు చున్నావటంచున్ మదిన్ దోచెడిన్, బాపురే తీపిలో, నీరమున్, క్షీరమున్, జక్కెరన్ మించుటంగాదె, నీ బీజచూర్ణంబు నా మూటిలో జేర్చి సేవించుటన్, నీదు బీజంబులన్ బెంచులో మాడ్చి చూర్ణంబు గావించినన్ దీపి పోదాయె, నీ మాధురీశక్తి, నీ యింపు, నీ సొంపు, నీ పెంపు వర్ణింప నేనెంత వాడన్, ధనాకర్షిణీ, ప్రాణసంరక్షిణీ, ధాత్రి నెవ్వారలేనిన్, వేకువన్, లేచియున్, నిత్యకృత్యంబులన్దీర్చిమున్ముందుగా నినుఁబానం బుఁగావింపకున్నన్, ద్విజుల్ వేదమంత్రంబులన్ బల్కగాలేరు, ప్రాంచత్కవుల్ పద్యముల్ హృద్యమౌ రీతి నిర్మింపఁగా లేరు, శ్రావ్యంబుగా శౌరిదాసుల్ గళం బెత్తియున్ బాడి, నృత్యంబులన్ సేయఁగా లేరు, శిల్పుల్ మనస్ఫూర్తిగా సుత్తి జేపట్టగా లేరు,, వైశ్యోత్తముల్ కొట్ల తాళంబులన్ దీయగా లేరు, డ్రైవర్లు మోటార్లు స్టీరింగులన్ బట్టగా లేరు, టీచర్లు పాఠంబులన్ జెప్పగాలేరు, డాక్టర్లు నింజక్షనుల్ జేయఁగాలేరు, ప్లీడర్లు నోరెత్తి వాదింపగా లేరు,జడ్జీలు నేస్వల్పమౌ తీర్పులన్వ్రాయగా లేరు, దిట్టంబుగా బాలసుల్ కూటసాక్ష్యంబులన్ జెప్పగా లేరు, వారాంగనల్ కోడెగాంద్రన్ వెసన్ గేళిలో నోలలాడింపఁగా లేరు, ముప్పూటలన్ నిన్నొగిన్ గ్రోలకున్నన్ శిరోభారమై నాల్క యెందున్, మనంబెంతొ చాంచల్యమున్ బొందుచున్ గుండియల్ తల్లడం బందుచున్, మేను కంపించుగాదె, కటాక్షంబుతో నిత్యమున్ వేకువన్, దర్శనంబిచ్చి నిన్ బాగుగాఁ ద్రాగు సౌభాగ్యమున్ గూర్చి రక్షింపవే, సారెకున్ గొల్చెదన్, విశ్వకర్మాన్వయంబందునన్, సత్కవీంద్రుండనన్ జెల్లు పోకూరి కాశీపతి స్వాత రాజీవ సంవాసినీ, నీకికన్ మంగళంబౌ మహాకాఫీ దేవి, నమస్తే నమస్తే నమస్తే నమః ॥

ఇలా చెప్పగానే చెన్నపట్నం సభావేదిక కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది.

17వ ఏటనే కాశీపతి గారు తొలి అవధానం నర్సరావుపేటలో చేశారు. 17వ ఏటనే ధూర్జటి శతకంలో వేదాంత తత్త్వాలను బోధించారు. పుంభావసరస్వతి అనుట అక్షర సత్యం.

అవధానాల్లో ఇచ్చిన సమస్యలను ఎన్నింటిలో చమత్కారంగా పూరించారు.

కాశీపతిగారి రచనలు, వాటిలోని విశేషాలను వివరిస్తూ ఒక గ్రంథం అచ్చువేసి పాఠకులకు అందించాల్సిన అవసరం ఉంది. నిజానికి అదొక బృహద్గ్రంథమే అవుతుంది..!

కాశీపతి గారు రాసిన 1.ధూర్జటి శతకం 2.నరసింహ నిరసన స్తుతి రెండు

శతకములకు తాత్పర్యం కూర్చి పునర్ముద్రణ భాగ్యం నాకు (డాక్టర్ బెజ్జంకి జగన్నాథా చార్యులు) కలగటం అదృష్టంగా భావిస్తున్నాను.

ఇతర రచనలు:1.సత్రశాల మల్లీశ్వర శతకం, 2. మన్నెంకొండ హనుమత్ప్రభు శతకం 3. శౌరిశైశవలీల 4. సారంగధరీయం 5. శ్రీశైల మల్లేశ్వర శతకం 6.శ్రీ కేశవేంద్ర శతకం 7.సునీతి శతకం 8.నారసింహప్రభు శతకం 9. సిద్ధయోగి చరిత్ర 10. హరిశ్చంద్రోపాఖ్యానం11.సమస్యావళి 12. త్రింశదర్థక పద్యరత్నం 13. వీరతిమ్మమాంబ శతకం 14. సత్యనారాయణ వ్రత చరిత్ర 15. సుజ్ఞాన ప్రబో ధిని 16. కాశీపతి చమత్కృతి 17. సీసార్థములు 18. కాఫీ దండకం 19. శ్రీ నర సింహాష్టకం 20. నవరత్నములు 21. శ్రీ నరసింహ నిరసన స్తుతి.

'కవిసింహ కాశీపతి జీవితం-సాహిత్యం' అని విమర్శకరత్న త్రిపురనేని సుబ్బారావు గారు రాసి 1979లో ప్రచురించారు.

డాక్టర్ కల్లూరి వేంకటేశ్వరరావు గారు **'పోకూరి కాశీపతి, జీవితము - రచనలు'** అను సిద్ధాంత వ్యాసమును సమర్పించి ఉస్మానియా వర్సిటీ నుంచి పిహెచ్.డి పట్టం పొందారు.

1970-1974వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం **'సిద్ధయోగి చరిత్ర'** లో కొంతభాగం పాఠ్యాంశంగా చేర్చారు.

1962లో పల్నాటి సీమలో కాశీపత్యవధానులుగారు **'నాగార్జున సాహితీ సమాఖ్య'** స్థాపించి కవిసమ్మేళనాలు, సాహిత్య సభలు నిర్వహించారు. ఆ మహానుభావుడు స్థాపించిన సమాఖ్యకు కార్యదర్శిగా నాకు (డాక్టర్ బెజ్జంకి) కొంత కాలం పనిచేసే భాగ్యందక్కింది.అటువంటి మహానుభావుడు **'న భూతో న భవిష్యతి' లోగడ లేరు- ఇక పుట్టరు** అనుట అక్షర సత్యం.

ఇటువంటి ఘనచరిత్ర కలిగిన మహనీయుడు కవిసింహ పోకూరు కాశీ పత్యవధాన్లు పల్నాటి సాహితీప్రియులకు తీరని లోటు మిగిల్చి ది. 27-12-1974 న మాచర్లలోనే శివైక్యం చెందారు.

ఆనాటి ఎస్‌కెబిఆర్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్, 'సాహిత్యబ్రహ్మ' డాక్టర్ వీవీఎల్ నరసింహారావుగారు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, చిత్రకారులు అయిన గుర్రం మల్లయ్యగారు శోభాయాత్రలో పాల్గొని ఘననివాళులర్పించారు.

3. ఎర్రోజు సీతయ్య- 1874-1949, అడిగొప్పుల

దుర్గి మండలం, అడిగొప్పుల వాస్తవ్యులు. బహుముఖ ప్రజ్ఞాశాలి. విశ్వకర్మ /విశ్వబ్రాహ్మణ వంశజులు. శిలాశిల్పులు, దారుశిల్పులు, స్వర్ణశిల్పులు, తామ్ర శిల్పులు. పైపెచ్చు ప్రముఖ రచయిత. **ఆర్యకవి కుతంత్రం** అనే విమర్శనాత్మక గ్రంథం రచించినట్లు తెలుస్తోంది. ఇది అలభ్యం.

ఈయన ఎర్రోజు శ్రీరామమూర్తి, వేంకటనర్సమ్మ పుణ్యదంపతుల కుమారుడు. 1874లో జన్మించినట్లు తెలుస్తోంది. కాగా శిల్పాచార్యులు, పురోహితులు, ప్రతిష్ఠా చార్యులు, సుప్రసిద్ధులు, దుర్గి గ్రామ వాస్తవ్యులైన సీతయ్య గారి మనవడు ఎర్రోజు నరసింహాచార్యులు గారు తెలిపిన సమాచారం, పూర్వ గ్రంథాల ఆధారంగా ఎర్రోజు సీతయ్య గారి వివరాలు తెలుస్తున్నాయి.

4. నాళం మట్టపల్లి- 1890-1961 రెంటచింతల



వైశ్యకులోత్తములు నాళం కోటిలింగం, వెంకట్రావమ్మ దంపతుల మూడవ కుమారుడు నాళం మట్టపల్లిగారు. 1890 అక్టోబర్ 16వ తేదీన జన్మించారు. వీరు రెంటచింతల మండలం రెంటచింతల వాస్తవ్యులు. మట్టపల్లి గారి సతీమణి నాళం కనకమ్మగారు. భర్తకు తగిన సతీమణి. భర్త ఆదర్శభావాలకు చేదోడువాదోడుగా సహకరించేవారు. కులమతాలకు అతీతంగా ఆదర్శభావాలు కలిగి సమాజసేవ చేసేవారు. బడుగుబలహీన వర్గాలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించేవారు. దేశభక్తి భావాలు మెండుగానుండి స్వరాజ్య ఉద్యమంలో పాల్గొన్న గాంధేయ వాదులు. ఎన్నోమార్లు జైలుకు వెళ్ళివచ్చారు. వీరివి ఎంతటి ఆదర్శ భావాలంటే మాలదాసరుల నేతవస్త్రాలను తడపకుండా కట్టుకునేవారు. వితంతు వివాహాలను ప్రోత్సహించడమే గాక స్వయంగా కన్నకూతురుకు వితంతు వివాహం చేశారు. ఖద్దరు ఉద్యమం పలనాడులో బాగా ప్రచారం చేశారు. నాళం మట్టపల్లి దంపతులు రెంటచింతలలో రాజకీయ పాఠశాల నడిపినారు. వీరు చేస్తున్న స్వరాజ్య ఉద్యమం గురించి తెలుసుకొని గాంధీగారు 1929లో రెంటచింతల వచ్చి రోజంతా ఉన్నారు.

నాళం మట్టపల్లిగారికి జాతీయోద్యమ నాయకులందరితో సన్నిహిత సంబంధం గలదు.

వీరు **"పలనాటి స్వాతంత్ర్య సమరయోధులు"** అను పుస్తకము రాసి అచ్చువేయకనే 24-01-1961లో పరమపదించారు.

వారి అడుగుజాడలలో నడచిన వారి పెద్దకుమార్తె వెంకటనాగలక్ష్మి పూనుకొని **"బ్రహ్మశ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు"**గారి సహకారముతో, వారి పీఠికతో 1977లో అచ్చువేయించారు.

వావిలాల గోపాలకృష్ణయ్యగారు, అన్నాప్రగడ కామేశ్వరరావుగారు, మాదాల వీరభద్రరావుగారు అభిప్రాయాలు రాసి ఇచ్చారు.

5. వెన్నపూసల రామకవి-1899-1963, పేటసన్నెగండ్ల

కారంపూడి మండలం, పేటసన్నెగండ్ల వాస్తవ్యులు. వెన్నపూసల యల్లమంద, వేంకటలక్ష్మాంబల మూడవ కుమారుడు."పేటసన్నెగండ్ల వీరవిజయము" అను బుర్రకథ 1955లో ముద్రణ చేయించారు.

ఆ రోజులలో దోపిడీదొంగల పోరు ఎక్కువగా ఉండేది. పేటసన్నెగండ్లలో ఒక రోజు రాత్రి ఓ దొంగను పట్టుకొని ఎదిరించిన ధైర్యసంఘటన-యథార్థ గాథను రామకవిగారు బుర్రకథగా రచించారు. చదివి ఆనందించవలసినదే. ఇతర రచనలు- **"పలనాటి బాలచంద్ర యుద్ధము", "శ్రీరాధాకృష్ణ శతకము"**

6. అష్టావధాని కన్నెకంటి ప్రభులింగాచార్యులు -1900-1946, తక్కెళ్లపాడు

పల్నాడులోని దాచేపల్లి మండలంలో తక్కెళ్లపాడు ఒక చిన్న గ్రామం. ఆ ఊరిలో సనాతన సదాచార సంపన్నులు కన్నెకంటి కోటమాంబ, రాజలింగాచార్యులు దంపతులు. విశ్వకర్మ వంశోద్భవులు, విశ్వబ్రాహ్మణ కులజులు. కోటమాంబ గారిది పిడుగురాళ్ళ మండలం వేమవరం గ్రామం. కొండావారి ఆడపడుచు. కొండావారు అందరూ కవులే!



కొండా రాజమల్లాచారి వీరి పూర్వికులు. వీరు **సూర్య వంశం** అను యక్షగానము రాశారు. కొండా భవానీ శంకరాచార్యులు, కొండా పార్వతీశ్వరాచార్యులు, కొండా భువనేశ్వరాచార్యులు వీరందరూ కవిపుంగవులే. కొండా వారింట పుట్టిన కోటమాంబ కీర్తనలు రాయటం, కమ్మని కంఠంతో పాడటం చేస్తుంది. కవిపుంగవుల ఇంట పుట్టిన కోటమాంబకు కన్నెకంటి ప్రభులింగాచార్యులు, చినలింగాచార్యులు,

వీరభద్రాచార్యులు, సుందరమ్మ, కమలాక్ష్యమ్మలు జన్మించారు. వీరందరూ రచనలు చేయగలవారే. ఒకే తల్లిపిల్లలు జంటకవులు కావటం విచిత్రం, విశేషం, అపూర్వం- ఇది అతిశయోక్తి కాదు.

కన్నెకంటి రాజలింగాచారి, కోటమాంబలకు 1900 నవంబరు 5వ తేదీన కన్నెకంటి ప్రభులింగాచార్యులు జన్మించారు. మేనమామలు కొండావారి వద్ద ఛందో, అలంకార శాస్త్రాలను క్షుణ్ణంగా నేర్చుకున్నారు.

1927లో ఆంధ్రభాషోపాధ్యాయులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. శిరిగిరిపాడు, జూలకల్లు గ్రామాలలో పనిచేశారు. 23 ఏళ్ల వయస్సులో కవిత్వం రాయటంలో ప్రావీణ్యం సాధించారు. **'సత్యనారాయణ వ్రతము'**ను రాశారు. 1924లో కోట కేశవరెడ్డిగారికి అంకిత మిచ్చారు.

1923లో పండిత ఉమాకాంత విద్యాశేఖరుల వారితో కలసి పలనాడు అన్ని గ్రామాలు సంచరించారు. కారంపూడి వీరోత్సవములు, బ్రహ్మనాయుని పవిత్రత, నాయకురాలి శూరత్వము తెలుసుకున్నారు.

స్వయంగా గ్రామగ్రామాలు తిరిగి ప్రజలలో ప్రచారంలో ఉన్న కథలను గ్రహించి **"పల్నాటి వీరుల చరిత్రము"** అను అయిదు అంకముల స్టేజి నాటకము రాశారు. **16-11-1928లో బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు 'పల్నాటి వీర చరిత్ర'** నాటకమునకు అవతారిక రాశారు. కవిగారి కృషిని మెచ్చుకున్నారు.

కన్నెకంటి ప్రభులింగాచార్యులు, వీరి సోదరులు కన్నెకంటి చినలింగా చార్యులు, కన్నెకంటి వీరభద్రాచార్యులు- ఈ ముగ్గురూ అవధానాలు చేయటంలో దిట్టలు. వీరు ముప్పురూ **"పల్నాటి సోదర కవులు"**గా లబ్ధప్రతిష్ఠులు.

కన్నెకంటి ప్రభులింగాచార్యులు ప్రభుత్వం వారిచే మద్యపాన నిషేధ ప్రచారా నికి కవిగా నియమితులయ్యారు.


రచనలు: 1.సత్యనారాయణ వ్రతచరిత్ర 2 పలనాటి వీరచరిత్ర 3. నీలకంఠేశ్వర చరిత్ర 4.పురూరవ నాటకం 5.పోతన. ఈ గ్రంథాలే కాక అముద్రిత రచనలు ముప్పైవరకు ఉన్నవి. వీరు 1946లో కీర్తిశేషులయ్యారు.

"అవధానంబులు సల్పగా జనిత లేఖాదీశ లోకంబునన్
కవితన్ చెప్పంగ నిన్ను రమ్మనియెనో గౌరీకళత్రుండు? ఈ

భువి నా కుద్దియె వారు లేరని సుధాభోక్తేన దేవేంద్రుపై
సవికాసంబుగ దాడి సల్పితివౌ నీ సామర్థ్యమున్ చూపగా
నివునౌనంతియ యంచు నెంతు ప్రభులింగాచార్య సూర్యగ్రణీ"

అని ప్రభులింగాచార్యులు గారి సంతాపసభలో "కాశీ రాజశేఖరాచార్యులు" గారు ఆవేదన వ్యక్తం చేశారు.

7. పెద్దోజు వీరబ్రహ్మం 1900- గామాలపాడు



పెద్దోజు వీరబ్రహ్మకవి జిట్టగామాలపాడు నివాసి. సదాచార సంపన్నులు అయిన గురవయ్యాచారి కంచమ్మ దంపతుల పెద్ద కుమారుడు ఈ వీరబ్రహ్మ కవి.

గీ॥ మధుర వాగ్దార కవనంబు మరియు వైద్య
విద్య వేదాంత శిల్పాది విద్యలందు
సిద్ధ హస్తుండటంచు ప్రసిద్ధి గాంచె
పల్లెనాటను గామాలపాటి యందు

మధురమైన కవిత్వం చెప్పగలవాడు, వైద్యుడు, వేద వేదాంతములు నేర్చినవాడు. శిల్పాలు చేయటంలో నైపుణ్యం గలవాడు వీరబ్రహ్మకవి.

సంస్కృతాంధ్రములలో ప్రతిభకలవాడు. దేవరంపాటి వేంకటేశ్వర స్తోత్రాలను రచించాడు. ఇంకను కొన్ని రచనలు, వీరభద్రగీతాలు రాశాడు. వీరు రచించిన **భగవన్నుతి** అను గ్రంథము మాత్రం ముద్రణకు నోచుకుంది. మిగిలిన రచనలు లభించుటలేదు.

గంగవరం వాస్తవ్యులు, కళాకోవిదుడు గోపరాజు మల్లపరాజు కృతిభర్త అయి భగవన్నుతిని స్వీకరించారు. మల్లపరాజు ఉదార స్వభావులు, సాహిత్యాభిమాని. వీరబ్రహ్మకవి కృతిని ఆలకించి పరవశులైపోయారు. సాహితీప్రియులు కనుక ముద్రణా వ్యయమును భరించినారు.

శివపూజాపరాయణమైన విశ్వకర్మాన్వయంలో పుట్టినా వీరబ్రహ్మం శివకేశవుల పట్ల భేదభావం పాటించని విజ్ఞులు. కనుకనే ఆయన లేఖిని నుంచి వేణుగోపాల, వేంకటేశ్వర శతకాలు రూపొందినవి.

చెరువులో జలమున్న, ఇంటిలో ధనమున్న కప్పలుగ బంధువులు, వస్తారు మనసా!	సంపదలు పోయినా, చెరువు నీరెండినా చేరరూ దరికెవరు, మనసా!– బెజ్జంకి

8. లింగాల ఫణిభూషణాచారి-1900. ఎర్రగొండపాలెం

లింగాల సుబ్బయ్యాచారి, పాలంకమ్మ దంపతులకు ఫణిభూషణాచారి జన్మించారు. వీరిది ఎర్రగొండపాలెం. 1967లో **భవానీశంకర విజయము** అను గ్రంథమును రచించారు. ఇంకనూ భక్తి గేయములు, ఏలలు, అష్టకములు, లాలిపాటలు ఆధ్యాత్మిక కీర్తనలు రచించారు.

విమర్శనాచార్య' 'శిల్పకళాకోవిద'

9.స్వర్ణ సుబ్రహ్మణ్యకవి 1901-1981 దాచేపల్లి



'విమర్శకరత్న' బిరుదాంకితులు దాచేపల్లి వాస్తవ్యులు, బహు గ్రంథకర్త, స్వర్ణవాచస్పతిగారి తండ్రి గారు **'విమర్శనాచార్య' 'శిల్ప కళాకోవిద'** బిరుదాంకితులు **స్వర్ణ సుబ్రహ్మణ్య కవిగారు**- వీరు **భారతీయ మహాశిల్పం** అను మహాగ్రంథము రచించారు. శిల్పశాస్త్రమునకు సంబంధించిన ఈ గ్రంథంలో భారతీయశిల్పములకు ఉండవలసిన తీరుతెన్నులను శాస్త్రీకరించారు. సర్వదేవతా మూర్తుల నిర్మాణ క్రమమును చెప్పారు.సర్వదేవతా ప్రతిష్ఠ యజ్ఞకల్పములను వివరించారు.భారతీయ మహాశిల్పము15సంపుటములుగా రచించిన **"శిల్పశాస్త్రము"**ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవదాయ, ధర్మదాయశాఖ వారు ప్రచురించి వెలుగులోనికి తెచ్చారు.

స్వర్ణ సుబ్రహ్మణ్యకవిగారు 1901లో చిలకలూరిపేటలో విశ్వకర్మ కులజులు, అహభూనసబుషి గోత్రులు కోటేశ్వరరావు, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. చిల కలూరిపేటకు సమీపంలోని కోళ్ళపూడి వీరి స్వగ్రామం. అటు నుండి పొన్నూరు దగ్గర పెదపాలెంలో స్థిరపడ్డారు. బాల్యంలోనే తండ్రి కోటేశ్వరరావు మరణించారు. పేదవారు అగుట వలన కుటుంబభారం సుబ్రహ్మణ్యకవిపై పడింది. కుటుంబపోషణకు కులవృత్తి బంగారంపని ప్రారంభించడమే గాక వడ్రంగంలో కూడా శ్రమిస్తూ విరామ సమయంలో అమరకోశం, కావ్యాలు, ప్రబంధాలు చదివేవారు.ఆయుర్వేద గ్రంథాలు చదివారు. ఔషధాలు స్వయంగా తయారు చేస్తూ వైద్యం చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత జోతిష్యంలో కూడా ప్రావీణ్యం సాధించి సిద్ధాంతిగా పేరు తెచ్చుకున్నారు.

కులవృత్తులను వదిలివేసి, వాస్తు, జ్యోతిష్యంలో సేవలందిస్తూనే శిల్పశాస్త్రాన్ని కూడా అధ్యయనం చేశారు. అంతటితో ఆగిపోలేదు- నాటక కళలోనూ ప్రవేశించారు.

నాటకాలు వేశారు. ఆ రోజులలో ఉన్న **'పంచానన', 'అరుణోదయ'** పత్రికలకు వ్యాసాలు రాసేవారు. వ్యాకరణాంశాలలోని దోషాలను ఎత్తి చూపేవారు. ఈ విధంగా ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు పొందారు. ఇదంతా ఆయన స్వయం కృషే.

ఓలేటి పుల్లయ్య, శ్యామలాంబల కుమార్తె రాజ్యలక్ష్మిని 1925లో వివాహం చేసుకున్నారు. వీరికి విశ్వనాథాచారి, వాచస్పతి, కోటేశ్వరరావు అను ముగ్గురు కుమారులు. విశ్వనాథాచారి ఉపాధ్యాయ వృత్తిలో రాణించారు. **వాచస్పతి వెటర్నరీ డాక్టరుగా విధులు నిర్వహిస్తూ దాచేపల్లి మండల అభివృద్ధి అధికారిగా కొనసాగి 1992 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేశారు. దాచేపల్లిలో స్థిరనివాసం ఏర్పరచు కున్నారు.** మూడవ కుమారుడు కోటేశ్వరరావు స్వగ్రామంలో వ్యవసాయం, వడ్రంగం చేస్తూ ప్రజల మన్ననలు పొందారు.

సుబ్రహ్మణ్యకవి **'పార్వతీపరిణయము'** అను బుర్రకథ రాసి 1929లో ముద్రించారు. ఆ తర్వాత 1934లో **'ఆధ్యాత్మ వీరబ్రహ్మంగారి చరిత్ర'** గేయరూపంలో చక్కగా తీర్చిదిద్దారు. ఈ గ్రంథము గురించి పలువురు ప్రచురణకర్తలు ముద్రణ హక్కులు కోరగా దీనిని తాను ధనాపేక్షతో వ్రాయలేదని, వలసినవారు ముద్రించు కొనుడని సలహా ఇచ్చారు. దీనినిబట్టి భగవద్భక్తి ప్రచారానికి వారు ఎంతటి ఉదార తను చూపినారో తెలియుచున్నది.

1951లో కందుకూరి రుద్రకవి రచించిన **'నిరంకుశోపాఖ్యానము'** అను గ్రంథమునకు **'సుధాతరంగిణి'** పేర వ్యాఖ్య రాశారు. దీనిని పలువురు ప్రశంసించారు. వారిలో ఘట్టి లక్ష్మీనరసింహశాస్త్రి 1952 భారతి సెప్టెంబరు సంచికలో సుదీర్ఘంగా 'సుధాతరంగిణి' వ్యాఖ్యను కొనియాడుతూ సుబ్రహ్మణ్యకవి అపార పాండిత్యాన్ని మెచ్చుకున్నారు.

'అమరుకావ్యము' అను అలంకార శాస్త్రమునకు తాత్పర్యములు వ్రాశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఈ గ్రంథమునకు ఆర్థిక సాయం చేయగా 1976లో ముద్రించారు.

'విశ్వకర్మ వ్రతకల్పము' అను గ్రంథము 1980లో ముద్రించారు. అలాగే **యలవర్తి ఆంజనేయశాస్త్రిగారి జీవిత చరిత్ర** రాశారు.

'భారతీయ మహాశిల్పము: సుబ్రహ్మణ్యకవి గారు శిల్పశాస్త్రములో అపారమైన పాండిత్యము గలవారు. శిల్పులకు వీరి గ్రంథము మహావరప్రసాదం. దేవాలయ ప్రతిష్ఠలకు, యజ్ఞములకు, దేవాలయ వాస్తుకు సప్రమాణికము. ఈ గ్రంథానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ వారు కొన్ని భాగాలు ముద్రించారు.

వీరు 1950లో ఆంధ్ర శిల్పకళాపరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. 1975లో ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖలో ప్రాచీన నాగర లిపి గ్రంథములను ఆంధ్రీకరించే ఉద్యోగము చేశారు. ఆ శాఖ ప్రచురించిన **'రూపధ్యాన రత్నావళి'**, **'కాశ్యప శిల్పము'** మొదలగు గ్రంథముల ప్రచురణకు వీరి కృషి ప్రధానమైనది. వీరు ఎన్నో సన్మానములు, సత్కారములు పొందారు. వీరికి 1978లో ఆళ్ళగడ్డలో **కనకాభిషేకం** చేశారు.

తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) వారి ప్రశంస: "నిరంకుశోపాఖ్యానము, సుధాతరంగణీ వ్యాఖ్యను 1951లో ముద్రించారు. ఈ వ్యాఖ్యలో వీరు 220 గ్రంథాల నుండి ఉదాహరణలు తీసుకున్నారు. నిఘంటువులు, వ్యాకరణ, అలంకార శాస్త్రాలు, సకలకళల లక్షణ గ్రంథాలను ఉపయోగించుకున్న వైనం గొప్పది. తెలుగు గ్రంథాలే కాకుండా సంస్కృత గ్రంథాలను కూడా సమయోచితంగా ఉపయోగించి తమ పండిత్యాన్ని చాటుకోవడమే కాక ఎంతో రసవత్తరంగా వ్యాఖ్యానాన్ని తీర్చిదిద్దారు. ఈ కారణాలుగా ఆయనను తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రశంసించారు"

"స్వర్ణ సుబ్రహ్మణ్యకవిగారు తమ ఉపోద్ఘాతంలో కందుకూరి రుద్రకవి గురించిన వివరాలు విపులంగా చర్చించారు. ఎన్నో చారిత్రక విషయాలను ఆధారం చేసుకొని రుద్రకవి జీవితాన్ని, రచనలను పాఠకుల ముందుంచారు. కవి రచనలు, కాలనిర్ణయం, రాయలవారి సందర్శనం వివరాలు, కావ్యోత్కర్ష ఇత్యాది విషయాలు విడిచిపెట్టకుండా విద్వజ్జనామోదంగా వ్యాఖ్యానం రచించడం హర్షదాయకం" అని నాటి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షురాలు, కవయిత్రి **నాయని కృష్ణకుమారి** అన్నారు. నిరంకుశోపాఖ్యానం - సుధాతరంగిణీ వ్యాఖ్యతో విశ్వ విద్యాలయంవారు 1999 లో ముద్రించారు.

ఏ గురువునూ ఆశ్రయించకుండా స్వయంకృషితో సంస్కృత, ఆంధ్ర భాషలలో వాస్తు, జ్యోతిష్య, వ్యాకరణ, సాహిత్య, కళారంగాల్లో పాండిత్యం, అభినివేశం సంపాదించుకున్న స్వర్ణ సుబ్రహ్మణ్యకవి ధన్యజీవి, మహామేధావి, పుంభావసరస్వతి అనటం అతిశయోక్తి కాదు. వారు యావదాంధ్రదేశానికీ గర్వకారణం.

స్వర్ణ సుబ్రహ్మణ్యకవి 1981లో దివికేగారు. వారి ఆత్మశాంతికి మనందరం శ్రద్ధాంజలి ఘటిద్దాం.

1950లో 'కవిసింహ' పోకూరి కాశీపత్యవధానులు గారికి గండపెండెరం, గజారోహణం సన్మానాలు ప్రొద్దుటూరులో జరిగాయి.

10. దేశినేని వేంకట్రామయ్య - 1902-1982 పిడుగురాళ్ల



'అభినవ పోతన', 'అభినవ బాణభట్టు', 'సూక్తి ముక్తరత్నా కర' బిరుదాంకితులు దేశినేని వేంకట్రామయ్య. ఈయన వెంకమ్మ, రామానుజయ్యలకు 1902 ఫిబ్రవరి ఒకటో తేదీన జన్మించారు. రాజుపాలెం మండలం, దేవరంపాడు గ్రామం. పిడుగురాళ్ల ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. 1982లో పరమపదం పొందారు.

రచనలు:మేఘసందేశం (1927), ఋతుసంహారం (1927), అహిభేకోపాఖ్యానము(1935), శ్రీమద్దేశినేని భగవద్గీత(1942) అను కావ్యాలు రాశారు.సులభ వ్యాకరణం (1952), హంపీ చరిత్ర (1975), శ్రీమద్దేశినేని రామాయణం- బాలకాండము 77 సర్గలు. వాల్మీకి రామాయణం అనువాదం (1977)

ముద్రిత రచనలు: 1. యర్రంశెట్టి -దేశినేని వారల వంశావళి -1966, 2. దేశినేని వేంకట్రామయ్య స్వీయచరిత్ర, 3.మనశ్శాంతి (సూక్తిముక్తక రత్నాకరము) (1962-1977), 4. మనశ్శాంతి రెండో భాగం, 5. ఖండకావ్యం

అముద్రిత రచనలు: 1.కుమార సంభవం (1922), 2. మిత్రలాభం (1932),3. మిత్రభేదము (1932), 4. పుట్టపర్తి సందర్శనం (1977), 5. దేశినేని అవబోధామృతం సప్తశతి (1978), 6. దేశినేని కందాల మందారము (1979),7. దేశినేని శతకము (990), 8. శ్రీకృష్ణ లీలలు (1981), 9. బుద్ధ చరిత్ర (1981), 10. రాయవెల్లూరు వైద్యశాల చరిత్ర (1981), 11. రాజుపాలెం అమ్మవారి చరిత్ర (1991), 12. తత్వ దర్శిని- వచన కావ్యం (1981)...వీరు దాదాపు 26 గ్రంథాలు రాశారు.

11. అష్టావధాని కన్నెకంటి చినలింగాచార్యులు 1903-1968, తక్కెళ్లపాడు



కన్నెకంటి రాజలింగాచార్యులు కోటమాంబ దంపతులకు 1903లో తక్కెళ్లపాడు గ్రామంలో జన్మించారు. మేనమామ కొండా రాజమల్లాచార్యులు గారి పెంపకంలో కవిత్వంలోని మెలకువలు నేర్చుకు న్నారు. **వీరు 11వ ఏటనే గంటకు వంద పద్యాలు చెప్పారని** చిటిప్రోలు సుబ్బారావు గారు తన పరిశోధన గ్రంథంలో రాశారు.

చినలింగాచార్యులుగారు తెలుగు పండితులుగా పెదగార్లపాడు, తంగెడ, వేమవరం, ఆత్మకూరు, కారంపూడి, జూలకల్లు మొదలగు గ్రామాలలో పనిచేశారు.

ఆ తరువాత కొంతకాలం గురజాలలోనూ మాచర్లలోనూ నివాసమున్నారు. అటనుంచి నర్సరావుపేట చేరుకున్నారు. వీరి కుమారులే కన్నెకంటి రాజమల్లాచారి గారు. వీరు దాచేపల్లిలో స్థిరపడ్డారు.రాజమల్లాచారి గురించి తరువాత చెప్పుకుందాం...

చినలింగాచార్యులుగారు **"కవికోకిల", "కవిచంద్ర", "కవిపౌరాణిక" "కావ్య గానవాణి", "పౌరాణిక శిరోమణి"** అను బిరుదులు పొందారు. ఎన్నో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు పొందారు.

వీరి రచనలు: 1.వేంకటరంగ శతకము 2. సూర్యనారాయణ స్తవము 3. కయిమొఱ 4.సువ్రత 5. వేంకటరమణ శతకము 6. దీర్ఘిక 7. నీలలోహిత శతకము 8. రారాజు. మొదలగు రచనలు చేశారు.

వీరి రచనలో నుడికారములు, సూక్తులు, సామెతలు విరివిగా ఉంటాయి.

"దీపంబులు యింటింటన్
దీపించెన్ వీథులందు నెలకొనె విద్యు
ద్దీపముల క్కవి యింటన్
దీపమె కరవాయె నిట్టి దృశ్యము గలదే"

ప్రతి ఇంట్లో విద్యుద్దీపాలున్నాయి, వీథులలో ఉన్నాయి, కానీ కవిగారి ఇంట్లో కిరోసిన్ దీపము కూడ వెలగటం లేదు. అంటూ ఆనాటి కవుల ఆర్థిక పరిస్థితిని **"కయి మొఱ"** అనే గ్రంథంలో వివరించారు.

"ఓ జగజ్జననీ విను మొక్కమాట
కనబడుచునుండు నే వస్తువునకునైన
తరుగుట స్వభావమైయుండు ధాత్రిపైన
తరుగునే యెప్పటికినైన తల్లిప్రేమ"

ఈ భూమి మీద అన్నీ తరిగిపోతూ ఉంటాయి. తల్లిప్రేమ తరగదు అని తల్లిప్రేమ గొప్పతనాన్ని వర్ణించారు. ఇంతటి మహోన్నతమైన భావాలెన్నెన్నో వారి రచనలలో కనిపిస్తుంటాయి.

పలనాటి కీర్తి ప్రతిష్టలు చాటిన కన్నెకంటి చినలింగాచార్యులు గారు జనవరి 26 వ తేదీ గణతంత్ర దినోత్సవం నాడు– 1968లో శివైక్యము చెందారు.

12. కర్నాటి భద్రయ్య చౌదరి - 1906 బోదిలవీడు



బోదిలవీడు వెల్దుర్తిమండలంలో ఒక చిన్న గ్రామం. గ్రామం చిన్నదే కాని పుంభావ సరస్వతులను కన్న నేల. ఆ నేల సాహితీవటవృక్షాలు పెరిగిన నేల. 'కవిసింహ' కాశీపతి పుట్టి పెరిగినది ఇచ్చటనే. ఇచ్చటనే కర్నాటి భద్రయ్యగారు పుట్టి పెరిగినారు. వీరి కుమారులు వేంకటేశ్వరచౌదరి పుట్టినదీ ఇచ్చటనే. బోదిలవీడులో మల్లయ్యకు అచ్చమ్మ, సుందరమ్మ అను ఇరువురు భార్యలు ఉన్నారు. వీరి దత్తు కుమారుడే కర్నాటి భద్రయ్యచౌదరి.

కర్నాటి భద్రయ్య 1906 ఏప్రిల్ 5 వ తేదీన జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబము. బోదిలవీడులోని ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. చిన్ననాటి నుంచి కాశీపతి గారితో తిరుగుతూ ఉండేవారు. కాశీపతిగారే భద్రయ్య గురువు. ఆయనకు ప్రియశిష్యుడై మసలుకున్నాడు. కాశీపతిగారి రచనలు అన్నీ వీరికి కంఠోపాఠం!

పోకూరి కాశీపతిగారి వద్ద శిష్యరికం చేయటం వలన వారి కవిత్వ ధోరణి భద్రయ్యకు అబ్బింది. భద్రయ్య కవి అయినాడు. **ఇంగువ కట్టిన గుడ్డకు వాసన అబ్బినట్లు** కాశీపతిగారి శిష్యరికంతో భద్రయ్యకు కవిత్వం అబ్బింది!

పలనాటి కవులలో ఒకరైనారు భద్రయ్య. **'ఉమామహేశ్వర శతకం', 'శ్రీ రఘురామ శతకం', 'వేంకటేశ్వర శతకం', 'మహిషాసుర వధ', 'సుబ్బదాసు శతకం'** రాశారు. **బ్రహ్మంగారి జీవిత చరిత్ర**ను గేయకావ్యం, మహిషాసుర వధ, సుబ్బదాసు శతకం, శ్రీ రఘురామ శతకం అచ్చువేయించారు. ఎన్నో భక్తి గీతాలు రాశారు.

పోకూరి కాశీపతిగారు తాను రచించిన సుజ్ఞానప్రబోధిని అను వేదాంత శతకమును భద్రయ్యకు 1950లో అంకితం చేశారు.

సుబ్బదాసు శతకమును **రకారప్రాసతో** రాశారు. వీరి కవిత్వం మృదుమధురంగా ఉం టుంది. కాశీపతిగారి శిష్యులు కనుక కవిత్వం పట్టుగా ఉ ంటుంది.

త్రిపురనేని రామస్వామిచౌదరి మాదిరిగా స్వయంగా పౌరోహిత్యం చేసేవారు. బోదిలవీడులో 1964లో. ఆ తరువాత వేంకటేశ్వరస్వామి, పేరంటాళ్లమ్మ గుడులలో

భద్రయ్య పౌరోహిత్యంనిర్వహించి స్వయంగా ప్రతిష్ఠ చేయించారు. 1947లోనే శ్రీరాం పురంలో బొడ్డురాయి ప్రతిష్ఠచేశారు. కమ్మబ్రాహ్మణులుగా వ్యవహరించారు. భద్రయ్య కొంతకాలం మాచర్లలో నివాసం ఉన్నారు. సర్వవైద్యంలో ప్రసిద్ధులు. భూతవైద్యంలో సిద్ధహస్తులు. త్రిపురనేని సుబ్బారావు హైదరాబాదులో భద్రయ్యను ఘనంగా సన్మానించారు. భద్రయ్య తండ్రి మల్లయ్య మరణిస్తే మఠం కట్టించి ప్రతి ఏటా ఆరాధన జరిపేవారు. మఠంపై కాశీపతి శివలింగాన్ని ప్రతిష్ఠచేశారు. దాదాపు నలభై సంవత్సరాలు తండ్రి ఆరాధనచేసి తండ్రిఋణం తీర్చుకున్నారు అని భద్రయ్య కుమారులు వేంకటేశ్వరచౌదరి తెలియజేశారు. ఈ వివరాలన్నీ వేంకటేశ్వరచౌదరి గారిని 2007, జనవరి 19న స్వయంగా కలుసుకున్నపుడు వ్యాసకర్తకు తెలిపారు.

బ్రహ్మంగారి జీవిత చరిత్ర గేయకావ్యం పరిశీలిద్దాం....

ఈ గేయ కావ్యంలో బ్రహ్మంగారి జననం మొదలుకొని సమాధి ప్రవేశం వరకు, అటు తరువాత పూలకు వెళ్ళిన సిద్ధయ్య రాగా బ్రహ్మంగారు దర్శనమిచ్చుట వరకు సాగింది.

ఇందు కథ సంపూర్ణంగా సాగింది. గానం చేసుకోడానికి వీలుగా నున్నది.


'కస్తూరి రంగరంగా....కావేటి రంగరంగ' మాదిరిగానే అదే రాగం, తాళం, లయలతో కావ్యం మొత్తం నడిచింది.

"శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రుని చరిత వినుడీ
భావమందున భక్తులు దలచి ననుభవములను దొలగు గనుడీ
భూదేవి యొక దినమున దిగులుతో పొయి శ్రీ విష్ణుకడకు
బోరుబోరున నేడ్వగా విష్ణుండు పొలతి యేమని నడిగెను"

ఈ రీతిన సాగింది గేయకావ్య రచన. పాడుకునే వారందరికీ సులభంగా అర్థం అవుతుంది. అలతి అలతి పదాలతో రచన సాగింది.

'విద్యా విశారద' 'సాహిత్య సరస్వతి'

13. బాదం అయ్యపురెడ్డి - (1907-1980) మాచర్ల



బాదం అయ్యపురెడ్డి మాచర్ల నివాసి. జన్మస్థలం ప్రకాశంజిల్లా, దర్శితాలూకా, రామచంద్రపురమని చెప్పుకున్నారు. బహుకాలం నుంచి మాచర్లలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. తల్లి శేషమ్మ, తండ్రి గురవారెడ్డి.

పాత మాచర్లలో ఉండేవారు. బాదం అయ్యపురెడ్డి ఉపాధ్యాయులుగా పని చేశారు. కవిత్వం రాస్తూ ఉంటారు. 1974లో **కృష్ణ శతకము** రాశారు. 1977లో **మహేశ శతకము** ను అచ్చువేయించారు.మహేశ్వర శతకము అచ్చువేయించడానికి మాచర్ల వాస్తవ్యులు ఆర్థిక సహాయం చేశారు. జమ్మలమడక గ్రామాధికారి దుర్గంపూడి వెంకటరెడ్డిగారు, కంభంపాటి విష్ణుమూర్తిగారు, డాక్టర్ సింగం శివయ్యగారు ధనసహాయం చేశారు. డాక్టర్ వివిఎల్ నరసింహారావు, సరికొండ బుచ్చిరాజు గార్లు గుణదోషములు సవరించారు.

సాహిత్యబ్రహ్మ **డాక్టర్ వివిఎల్ నరసింహారావు** పీఠిక రాశారు. శతకంలోని సొగసులను వర్ణించారు. కవిగారి భక్తి పారవశ్యాన్ని మెచ్చుకున్నారు. అందున్న శబ్దాలంకారాలను వివరించారు. కథాకథన కుశలతను వివరించారు. శతక లక్షణాలు నూటికి నూరుపాళ్లూ కలవని వివరించారు.

'విద్వాన్' సరికొండ బుచ్చిరాజు తెలుగు పండితులు. ఇందు అభిప్రాయము రాశారు.

ఇందలి కందములు సహృదయుల డెందముల కానందము కలిగించును అని అన్నారు.

శతకం మొత్తం కంద పద్యాలలో నడిపించారు అయ్యపురెడ్డి.

14.'కవిబ్రహ్మ' ఏటుకూరి వెంకటనరసయ్య, 1911-1949



ఏటుకూరి వెంకటనరసయ్య పూర్వ పలనాడు నివాసి. సత్తెనపల్లి తాలూకా పెదకూరపాడు గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు శేషమ్మ, భూషయ్యలు. వీరిది రైతు కుటుంబం. వెంకటనరసయ్య 1911 ఏప్రిల్ 1వ తేదీన జన్మించారు. విద్యాభ్యాసం సిరిపురపులక్ష్మయ్య పంతులువద్ద జరిగింది. ఆ రోజులలో పల్లెటూరిలో ఉండే పాఠశాలల్లో బడిపంతుళ్లు శిక్షలు కఠినంగా వేసేవారు. బడి పిల్లలను దండించడంలో వెనుకాడేవారు కాదు. గుంజీలు తీయించేవారు. గోడకుర్చీ వేయించేవారు. బెంచీల మీద నిలబెట్టేవారు. పిల్లలకు చదువురాకపోతే ఊరుకునే వారు కాదు. ఆ శిక్షలు వెంకటనరసయ్యకు నచ్చేది కాదు. అదో యమచరలాగా ఉండేది.

వెంకటనరసయ్య బడి మానేసి పొలాల వెంట తిరిగేవాడు. తండ్రి భూషయ్య బాధపడ్డాడు. పిల్లవాడు వెంకటనరసయ్య బడికిపోవటం లేదు. ఏంచెయ్యాలో అర్థంకాలేదు. పిల్లవాడిని బలవంతంగా బడికి పంపటం ఇష్టంలేదు. చివరికి భారతం, భాగవతం తెప్పించి ఇంటివద్దనే వెంకటనరసయ్యకు వినిపించసాగాడు. వాటిని వినగా వినగా వెంకటనరసయ్యకు చదువు పట్ల ఆసక్తి కలిగింది. ఏనమండ్ల మంగయ్యశాస్త్రి వద్ద అమరకోశం వల్లె వేశారు. ఆ తరువాత పంచకావ్యాలు చదివారు. దామెర్ల వీర రాఘవయ్య వద్ద ఛందోవ్యాకరణాలు నేర్చుకున్నారు.

ఆ తరువాత కవితలు రాయటం పట్ల అభిలాష కలిగింది. అసలే రైతు బిడ్డ. తిరిగేది పంటపొలాల్లో. వినేది జానపద గీతాలు. వ్యవసాయ కూలీలు పొలం పనులు చేస్తూ పాటలు పాడుకునేవారు. ఆ పాటలు వినడం వల్ల వెంకటనరస య్యలో రచనాసక్తి పెరిగింది. ముందుగా గీతాలు రాయటం మొదలు పెట్టారు. ఆ తరువాత పద్యాలు అల్లటం నేర్చుకున్నారు. త్రిపురనేని రామస్వామిచౌదరి సూతా శ్రమంలో చేరాడు. అక్కడ రచనావ్యాసంగం పెరిగింది.

ఈ దశలో వెంకటనరసయ్య పట్టుదలతో 'ఉభయ భాషాప్రవీణ' చదివి పట్టా పొందారు.

ఆ తరువాత 1933 సంవత్సరం నుండి గుంటూరుజిల్లా బోర్డు పాఠశాలలో తెలుగు పండితులుగా ఉద్యోగ జీవితంలో ప్రవేశించి గురజాలలో తెలుగు ఉపా ధ్యాయులుగా చాలా కాలం పనిచేశారు. **'నేను పలనాటి అభిమానిని, పలనాటి వాడిని'** అని చెప్పుకున్నారు. **'కృషితో నాస్తి దుర్భిక్షం'** అన్న నానుడి అక్షర సత్యమైనది ఏటుకూరి వారి విషయంలో.

రచనావ్యాసంగం: పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు నరసయ్య చిన్నతనంలో చదువుకోకపోయినా జానపద గీతాలాపన, గీత రచనల పట్ల ఆసిక్తి పెరిగింది. ఛందోవ్యాకరణాలు చదివి పద్యరచన చేయటం మొదలు పెట్టారు. ఉభయ భాషాప్రవీణ చదివే రోజుల్లో నీతి పద్యాలు అప్పుడప్పుడు రాస్తుండేవారు. వాటిని **'నీతి మంజరి'** పేరుతో అచ్చువేయించారు. అది మొదటి గ్రంథం.

రచనలు: 1. నీతిమంజరి, 2. క్షేత్రలక్ష్మి 3. త్రివేణి 4.ప్రేమాలోకం 5.సిద్ధాశ్రమము 6. రైతు–హరికథ 7.మగువ మాంచాల 8. గాథావళి 9. నాయకురాలు 10.రుద్రమ దేవి 11. వీరభారతము 12.అలరాజు రాయబారము 13. అలుగురాజు 14.

బాలచంద్రుడు 15. అంగద రాయబారము 16. ప్రతాపసింహ 17.నిరుద్ధ సైరికము 18. బుద్ధజీవులు (నవల) 19.జిబిలిక (గేయ కావ్యము) 20. చందమామ (గేయ కథలు)

వెంకటనరసయ్య పలనాటి సీమపై అభిమానం కలవాడు. అభిమానం కలవాడు కనుకనే ఏడెనిమిది దాకా పల్నాటిచరిత్రకు సంబంధించిన గ్రంథాలే రాశారు. తను అలాఎందుకు రాయవలసి వచ్చిందో తానే చెప్పుకున్నారు. అలుగురాజు గ్రంథంలో...

"నే నిటువంటి వీరధరణిన్ జనియించినవాడగాన మ
న్మానస రాజహంస మనమాన తదీయ కథాసుధానదిన్
స్నానములాడు నే సుకృత జన్మఫలమ్మున కగ్గమైతినో
గాని, తదీయ దృశ్యములు కన్నులగట్టు యథార్థమ్ముగన్"

నేను పలనాటి వీరభూమిలో పుట్టినాను. అందుకే రాశాను అంటారు.దీనిని బట్టి ఏటుకూరి వారు పల్నాటి వారు అని తెలియుచున్నది.

పెదకూరపాడు పల్నాటి సీమలోనిది అని తెలియుచున్నది. ఏటుకూరి వెంకటనరసయ్య గారు నిరాడంబరజీవి. ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, పైన ఖద్దరు పైపంచె (కండువా)తో ఎప్పుడూ కనబడుతూ ఉంటారు. చెయ్యి తిరిగిన రచయిత. వీరి రచనలలో తెలుగుదనము తొణికిసలాడు తుంది. తెలుగు నుడికారాలు, సామెతలు కోకొల్లలుగా ఉంటాయి.

'కవిబ్రహ్మ' బిరుదును సార్థకం చేసుకున్నారు. బ్రహ్మనాయుని ఈసడించిన తీరు చూడండి.

"సీ॥ **చాపకూడటె వాని జన్మమారడివోవ**
అంకచండాలమైనది మతమ్ము
మంత్రిత్వమటె వాని మంత్ర మూడ్చుకుపోవ
కులకక్ష పాలయ్యె దెలుగు జాతి
వీరపూజటె వాని నోరటె పడిపోవ
మూకలై చెలరేగె లేకి గుంపు
శాసనమ్మటె వాని చాతుర్య మణగార
వల్లకాడై పోయె బల్లినాడు

పౌరుషపు జీవమటె వాని పణత పగుల
ఇట్టు లేనాళ్లు చెలగి చేయింపగలదు
పాలుబట్టెద నాతని బ్రతుకు గితుకు
తుడచిపెట్టెద నాతని మతము గితము"

మచ్చునకు ఒక పద్యము చూపించినాను. ఏటుకూరి వారి ప్రతి పద్యం, ప్రతి పద్యంలోని ప్రతి పాదం, ప్రతి పాదంలోని ప్రతి పదం రసగుళిక!

ఏటుకూరివారి రచనలను పరిశీలించుకుంటూ, చెప్పుకుంటూ పోతే చెరకు గడను నమిలినట్లు ఉంటుంది. చెరకుగడలో ప్రతి కణుపు తియ్యగా ఉంటూ, తిన్నకొద్దీ తినాలనిపిస్తుంది. ఏటుకూరి వారి పద్యాలూ అంతే.. చదివిన కొద్దీ చదవాలనిపిస్తుంది!

కవిబ్రహ్మ నరసయ్య 1949 నవంబర్ 10న పలనాటి సీమ విశేషాలు, పలనాటి నాయకురాళ్ల పౌరుషాలు, పలనాటి గొప్పదనం వివరించడానికి బ్రహ్మదేవుని సన్నిధికి చేరుకున్నారు.

15. అష్టావధాని కన్నెకంటి వీరభద్రాచార్యులు- 1912-1974. తక్కెళ్లపాడు



తక్కెళ్ళపాడు వాస్తవ్యులైన కన్నెకంటి రాజలింగాచార్యులు, కోటమాంబ అను పుణ్య దంపతులకు మూడవ కుమారుడు కన్నెకంటి వీరభద్రాచార్యులు. వీరభద్రాచార్యులు 1912లో జన్మించారు. వీరి మేనమామలు కొండావారు కవిపుంగవులు. ఇద్దరు సోదరులూ అవధానులు, కవులు. వీరు కూడా అష్టావధాని!

వీరభద్రాచార్యులు అన్నలు ఇద్దరికంటె తనదైన ప్రత్యేకతను సంపాదిం చుకున్నారు. కేవలం కవిత్వం, అవధాన విద్యలందేకాక జ్యోతిష్యం, వాస్తుశాస్త్రములలో ప్రావీణ్యం గడించారు. చక్కని కంఠస్వరము, చక్కని వేషధారణ, నొసట విభూతి ధారణ, మెడన జంధ్యము, జంధ్యమునకు లింగకాయ. నిత్య శివపూజాదురంధరులు. మోర్జంపాడులో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.

నూనూగు మీసాల నూత్నయౌవనంలో కవిత్వం రాయటంలో సిద్ధహస్తులయ్యారు. **'వీధి నాటకాలు'** రాశారు. **సారంగధర, నరకాసుర వధ** నాటకములు రాసినట్లు

వీరి సోదరి సుందరమ్మ చెప్పారని చిటిప్రోలు సుబ్బారావు గారు తన **"పలనాటి సోదర కవుల జీవితము– సాహిత్యము"** అను పరిశోధన గ్రంథంలో తెలిపియున్నారు. ఆ నాటకములు అముద్రితములు, అలభ్యములు.

స్వాతంత్ర్యోద్యమ ప్రభావం తన కవితలలో చూపించేవారు. ప్రజలకు స్వాతం త్ర్యోద్యమంపై ఆసక్తిగొలిపే విధంగా రచనలు చేసేవారు. అందువలననే తుమ్మలవారు, ఆచార్య రంగాగారు అమితంగా ఇష్టపడేవారు.**"జాతి హితమైన కావ్య నిర్మాణమున గుణ విశిష్టతనేకాక రాశి యందును ఆధిక్యము సాధించిన తెలుగు కవులలో తుమ్మలవారు పిమ్మట చెప్పదగిన ముఖ్యులు శ్రీ కన్నెకంటి వారొకర"**ని చిటిప్రోలు కృష్ణమూర్తిగారు శ్రీశైల ఖండము పీఠికలో అన్నారు. బాపట్లలో జరిగిన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. **వీరభద్రాచార్యులు చిన్ననాటి నుండి రచించిన గ్రంథాలు: 1. ఆంజనేయ శతకము 2. శ్రీకుమార విజయం 3. వీరబ్రహ్మేంద్ర స్తుతి 4.అచ్చమాంబ ప్రశంస 5 పేదరాలు 6 భువనజ్యోతి 7. ఆపన్న 8. సువర్ణాంజలి 9. విశ్వవిపంచి 10. చిరుమామిళ్ల సుబ్బ దాసు జీవిత చరిత్ర 11. నందికొండ చిలుక 12. బాటసారి 13. లోకబాంధవులు 14. పొట్టి శ్రీరాములు 15. పార్వతి 16. కోదండరామ శతకం 17 నవభారతం 18. అటుకుల మూట 19. తెలుగుపాప 20. పేదకాపు 21. కృష్ణవర్ధన చరిత్ర 22. శ్రీశైల ఖండము.** ఇంకను అముద్రితకృతులు దాదాపు రెండు డజన్లు ఉన్నాయి.

'పేద రైతు'లో రైతుల దయనీయ పరిస్థితులను వర్ణించారు. 'బాటసారి'లో అంటరానితనాన్ని నిరసించారు. విశ్వవిపంచిలో భారతభూమి మత దురహంకారంతో ఎలా కునారిల్లుతున్నదో చక్కగా వివరించారు. కులమతాల భేదము వలదని చాటి చెప్పారు.

తే॥గీ॥ "కవి సహోదర! యొకమాఱు కన్నువిప్పి
పాఱజూడుము నిన్నుగన్న భరతమాత
మత దురాగ్రహ దావాగ్ని గ్రమ్ముచుండె
నిపుదు కర్తవ్యమేమొ? యూహించుకొనుము"

సీ॥ మఱచిపోకన్న యీ మత మహామారియే
భరతఖండము నట్టె పగుల గొట్టె
మఱచిపోకన్న యీ మత పైత్యభూతమే
మన మహాత్మునకిచ్చె మరణశయ్య

మఱచిపోకన్న యీ మత మహోన్మాదియే
నైజాములో శ్మశానముల బెంచె
మఱచిపోకన్న యీ మత కుచ్ఛితాత్మయే
బీహారులో పీన్గుపెంట నిలిపె

తే॥గీ॥ మఱచిపోకన్న యీ మారి మరల నొరుల
రమ్ము రమ్మని సింహాసనమ్ము జూపు
నడుమును బిగించి కైతాధనస్సుపూని
దునుము మద్దాని దగు సమర్థుడవు నీవు

కవిత్వంలోనే కాక వాస్తవంగా కూడా ప్రాంతీయ అభిమానం, సామాజిక స్పృహ కలిగిన కవి ఈయన. పలనాటి సీమలో కరవుసంభవించినపుడు ప్రగడ కోటయ్య, గుర్రంమల్లయ్యలతో కలసి వంద బస్తాలు జొన్నలు, విరాళములు సేకరించి మాచర్ల పక్కనున్న కొత్తూరు గ్రామంలో గంజి కేంద్రం ఏర్పాటు చేశారు. కాగా ఆయన 1974లో తుదిశ్వాస విడిచారు.

సజ్జలు, జొన్నలు తెచ్చి వాటితో సంకటి జావ తయారు చేసి బడుగు, బల హీన వర్గాలలకు ఈ గంజికేంద్రంలో ఉచితంగా పోసేవారు. తిండిలేక అల్లాడుతున్న పేద ప్రజలు ఆ గంజి తాగి వారి ఆకలిబాధను తీర్చుకునేవారట. ఇటువంటి సామాజిక కార్యక్రమాలు వీరభద్రాచార్యులు నిర్వహించడం ప్రశంసార్హం.

16. దీవి రంగనాథాచార్యులు 1914-2004 వెల్దుర్తి

దీవి పెరుమాళ్ళాచార్యులు, శేషాయమ్మ దంపతులకు ది.21-12-1914న రంగ నాథాచార్యులు జన్మించారు. మద్రాస్ వారి ఎల్.ఐ.ఎమ్. చేసి వైద్యసేవలు అందిస్తూ హస్తవాసిగల వైద్యులు. వెల్దుర్తి డాక్టర్‌గా పేరుగాంచారు. వైద్యంతోపాటు పలు సేవా కార్యక్రమాలు చేసేవారు. ఆంగ్లంలో రచనలు చేశారు-



1.My DREAM **2**. The land of glories **3**.Sai Speaks
4.Faith **5**.The Devil desire **6**.The lotus feet
7.Famine **8**.My Dear boy **9**.India

తెలుగులో – **విశ్వజనని ఈశ్వరమ్మ** (తెలుగు అనువాదం). ఇది సత్యసాయిబాబా వారి ప్రియ శిష్యులు డాక్టర్ ఎన్.కస్తూరీరంగన్ ఆంగ్ల రచనకు అనువాదం. వీరు సాయిభక్తులు. వైద్యసేవలో పలనాటి ప్రజల మన్ననలు పొందిన రంగనాథాచార్యులుగారు ది.26-07.2004లో పల్నాటి ప్రజలను శోకసముద్రములో ముంచి దివి కేగినారు.

17. తోట కాశయ్య- ధర్మవరం -1915



దుర్గి వేణుగోపాలస్వామిని సేవించి తరించిన వ్యక్తి చిరు మామిళ్ళ సుబ్బదాసు. అంతేకాదు భక్తిద్వారా ముక్తిని పొందిన వ్యక్తి సుబ్బదాసు.సుబ్బదాసు దైవసాక్షాత్కారం పొందిన వ్యక్తి. ప్రజలకు భక్తిమార్గమును బోధించిన తపోశాలి. భక్తితత్త్వ రచయిత, జ్ఞాని! సుబ్బదాసుగారు కొలువున్న ఊరే ధర్మవరం. ధర్మవరం గ్రామంలో సోమమ్మ, లక్ష్మీనరసయ్య దంపతులకు 1915 అక్టోబర్ 20వ తేదీన తోట కాశయ్య జన్మించారు. నిరాడంబరుడు, ఆధ్యాత్మిక చింతనా పరుడు, వినయవిధేయతలు కలవాడు తోట కాశయ్య. ఎస్ఎస్ ఎల్సి చదివి సెకండరీగ్రేడ్ ట్రైనింగ్ పూర్తిచేసి ఉపాధ్యాయులుగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మహనీయమూర్తి. పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ కేశవతీర్థస్వామి వారిశిష్యులు. ఉద్యోగ విరమణ తరువాత తీరికగా మనసును రచనావ్యాసంగంపై మళ్లిం చారు. తలచినదే తడవుగా మొదలు పెట్టారు.శబరిపుస్తకం రాశారు.రామాయణంలో భక్తిప్రపత్తులు తెలిపే పాత్ర భక్త శబరి. ఆమె జీవిత విశేషాలను ఐదు అధ్యాయాలలో సంభాషణాయుతంగా రచిం చారు. వీరితో నాకు (డాక్టర్ బెజ్జంకి) మంచి పరిచయం కలదు.

అద్వైతసారాన్ని, వేదాంత సారాన్ని చెప్పదలచుకున్నదంతా చక్కగా చెప్పారు కాశయ్య. ఆధ్యాత్మికపరులను, భక్తులను ఈ గ్రంథం విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ గ్రంథ ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంచేసింది.

జాతీయ స్వాతంత్ర్య సమరయోధులు పల్నాడు -ఎత్తిపోతలలో తలదాచుకోగా వారికి నాళం మట్టపల్లి రెంటచింతల నుంచి భోజనం సమకూర్చారు.

18. పోకూరి సుబ్బయాచార్యులు-1916-1998
మాచర్ల



కవిసింహ కాశీపత్యవధాని జన్మించిన ఊరు బోదిలవీడు. పలనాటి ప్రాంతంలో ఒక చిన్న ఊరు అది. స్వయంగా కాశీపతిగారి అన్న కోటయాచార్యులుగారి కుమారుడు సుబ్బయా చార్యులు. కోటయాచార్యులు, కోటమాంబ పుణ్యదంపతులకు 1916లో నలనామ సంవత్సరం శ్రావణశుద్ధ దశమినాడు సుబ్బయాచార్యులు జన్మించారు.

సుబ్బయాచార్యులు స్వర్ణశిల్పి. చిన్నతనం నుంచి స్వర్ణవృత్తిలో నైపుణ్యం సాధించారు. నిత్య పూజాదురంధరులు, ఈశ్వరభక్తులు, సాహిత్యాభిమానులు, సాహిత్య గోష్ఠులలోనూ అవధాన కార్యక్రమాలలోనూ సుబ్బయాచార్యులు పాల్గొంటారు.

సుబ్బయాచార్యులు సరసులు. చమత్కారి. ఏది మాట్లాడినా చమత్కారంగా ఉంటుంది. అందరినీ నవ్విస్తారు. పట్టుదలగల వ్యక్తి. ఆ పట్టుదల ఎంతటిదంటే, 1974 డిసెంబర్ 27వ తేదీన కవిసింహ కాశీపతి పూర్వాంధ్ర కవులతో పోటీపడదలచి దివికేగినారు. ఈ నేపథ్యంలో ఇక ఒక్కరూ **పద్యం** చెప్పేవారు లేరా అని మిగిలిన కవులు అన్నారు. అది విన్నారు సుబ్బయాచార్యులు బాధపడ్డారు. కవిత్వం రాయాలి అనుకున్నారు. పూజాగదిలోకి వెళ్ళారు. ఇష్టదైవమైన పరమశివుణ్ని వేడుకున్నారు. మదిలో దైవప్రేరణ మొదలైంది. కలం కదిలింది. రచన చేయటం ఆరంభమైంది.

సరసుడు, చమత్కారి సుబ్బయాచార్యులుకు కాశీపతి వలెనే ఏదో ప్రత్యేకతను చూపాలనే తపనతో చేసిన కృషికి వాగ్దేవి కరుణించింది. ఛందోవ్యాకరణాది గ్రంథాలు చదవకపోయినా రాయటం మొదలుపెట్టారు.

తనదైన ప్రత్యేకతను ప్రతి పద్యంలోనూ చూపాలి అని అనుకున్నారు. అందుకనే ఆది శంకరాచార్యులు తల్లిని ఉద్దేశించి పూజిస్తూ **'మాతృస్తవం'** రాశారు. వీరు అదే దృష్టితో **'పితృస్తవం'** కూడా రాశారు. ఇందులో జన్మనిచ్చిన తండ్రిగారి జననం నుండి మరణం వరకు జరిగిన విశేషాలను కన్నులకు కట్టినట్లుగా వర్ణించారు. అందరూ మెచ్చుకున్నారు.

అష్టావధానాల్లోనూ కవిసమ్మేళనాల్లోనూ పాల్గొంటూ శ్రోతలను నవ్విస్తూ ఉంటారు. ఉదాహరణకు...

పాడె, వలికి, దినము, బొంద, గోరి– ఈ మాటలతో ప్రేమకలాపముగా పద్యం రాయమన్నారు. సుబ్బయాచార్యులు చమత్కారంగా పూరించిన విధం చూడండి...

"నీవు **పాడె**డు పాటలో భావమేమొ
యీ **వలికి** వచ్చి పాడవే యిందువదన
అను**దినము** నిన్ను గూడుటెట్లనను మదిని
మురియు చుంటిని సుఖముల **బొందగోరి**"

సుబ్బయాచార్యులు కవితల గురించి నేను చెప్పుటకంటె తోటి కవులు ఏమన్నారో చూడండి..

1985 ఫిబ్రవరి 8వ తేదీన సుబ్బయాచార్యులు, అనసూయమ్మ గార్ల షష్టిపూర్తి మహో త్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన కవిపండితుల మాటలలో ఆయన ప్రత్యేకత ఏమిటో చూద్దాం..

పెట్టెడు నవ్వుల పుట్టలు
పుట్టెడు కవితా విచిత్ర పోకడలకు మేల్
పట్టగు రచనావైభవ
ముట్టిపడున్ సుబ్బయార్యుడుండిన సభలన్
–అష్టావధాని ముటుకుల పద్మనాభరావు

ఆర్యుడు సత్కవీశ్వరుల కాప్తుడు హాస్య కవిత్వ దర్శనా
చార్యుడు సత్క్రియాచణుడు సత్యదయారస వర్తనైకస
తార్యుడు శాంతికాముకుడు కావ్యరసజ్ఞుడునైన సుబ్బయా
చార్యుని షష్టిపూర్తికి రసజ్ఞత ఆశిష మేనొసంగితిన్
-సరికొండ బుచ్చిరాజు

సుబ్బయాచార్యులు **'శివస్తవము'** రాసిన తీరు చూడండి.

సీ॥ సర్వపూజ్యపదాయ సర్వ దేవమయాయ
సర్వలోకేశ సర్వదాయ
సర్వ విఖ్యాతాయ సర్వశాస్త్ర విధాయ
సర్వభావ మయాయ సర్వ గాయ

సర్వ పార్శ్వముఖాయ సర్వాంగ రూపాయ
సర్వ కామాప్తాయ సర్వదాయ
సర్వలోక కరాయ సర్వ భూతహరాయ
సర్వధాత్రి భరాయ సర్వరాయ
గీ॥ సర్వకాల ప్రసాదాయ సర్వసాయ
సర్వసుర పూజనీయ సర్వణాయ
సర్వ మంగళాధిపతమే సర్వజాయ
సర్వరూపాయతే సర్వమేయ

ఇది పద్యంలాగా ఉందా? అష్టోత్తర నామాలు చదివినట్లుందా? కానీ ఇది పద్యమే. సీస పద్యం. సుబ్బయాచార్యులు ఇట్లాంటివి ఎన్నో చెప్పారు.

"కాశీపతి కవిసింహము
వాసిని నిలబెట్టి కొరకు వ్రాసిన పద్యా
దీసు కవులందరు విని సె
భాసని ముదమందిరెంత భాగ్యంబొ కదా"

అని తానే 'పితృస్తవం'లో చెప్పుకున్నారు. పితృస్తవం అట్ట తీయగానే లోపల పుస్తకం ఖదీదు ఎంతో చూస్తారు ముందు కొనాలంటే, ప్రతి పుస్తకంలో అది ఎన్ని రూపాయలో రాస్తారు. కానీ సరసకవి గదా వీరు **వెల 1000 పైసలు** అన్నారు. పది రూపాయలు అనకుండా పైసల్లో రాశారు.

వారితో ముచ్చటిస్తే ఎన్నో చమత్కారమైన సమస్యలు చెప్పి పూరిస్తారు.అవి సరసులు విని ఆనందించవలసినవి, చెప్పనలవిగానివి. మా **నాగార్జున సాహితీ సమాఖ్య** సభ్యులు కావడంతో వారిని సమాఖ్య కార్యదర్శిగా నేను (డాక్టర్ బెజ్జంకి) సమాఖ్య తరపున సన్మానించడం జరిగింది. వీరు 26-5-1998న శివైక్యం చెందారు.

19. కేశవ తీర్థస్వామి - 1917-1980. జానపాడు

సద్గురు శ్రీ కేశవతీర్థస్వామి 1917 నవంబర్ 1వ తేదీన జన్మించారు. 1980 అక్టోబర్ 2వ తేదీన కీర్తిశేషులయ్యారు. 1944లో శంకర జయంతి నాడు సన్న్యాసం స్వీకరించారు. వీరి గురువులు శ్రీ రామతీర్థస్వామి. కేశవతీర్థ పూర్వనామం కేశవరాజు.

శ్రీ రామతీర్థ సేవాశ్రమాన్ని 1941లో పిడుగురాళ్ళలో స్థాపించారు. ఆధ్యాత్మిక

జీవనం గడుపుతూ సన్యాసం స్వీకరించి ఆశ్రమం ఏర్పాటు చేశారు.

రచనలు: 1.భగవాన్ రామతీర్థ జీవిత చరిత్ర (1950) **2. రామతీర్థ సంపూర్ణ వేదాంత సారస్వతము** అను సంపుటాలలో ఆంగ్లం నుండి తెలుగు అనువాదం. 1946లో చేశారు. **3. శ్రీ రామ చరిత మానస్‌**ను హిందీ నుండి 1947లో అనువదించారు. **4. భక్తియోగము** మొదలగుగా గల పుస్తకములు రచించారు.

20. మహేశ్వరపు వీరబ్రహ్మాచార్యులు- 1920, బ్రాహ్మణపల్లి



వీరు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు. **'ఆయుర్వేద విద్వాన్'** పట్టా, **'కవిరాజ్'** అనే బిరుదు పొందిన వారు. మంచి హస్తవాసి ఉన్న వైద్యులుగా ఖ్యాతి పొందారు. సదాచార సంపన్నులు. ఆధ్యాత్మిక చింతనాపరులు. దైవభక్తి మిక్కుటంగా కల వారు. బ్రాహ్మణపల్లిలో సాయిబాబా దేవాలయ నిర్మాణమునకు **'సాయిబాబా విగ్రహమును'** దానంచేశారు. ఆ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవంలో వారి ఆహ్వానం మేరకు నాకు (డాక్టర్ బెజ్జంకికి) పాల్గొను భాగ్యం కలిగింది. వీరు మహేశ్వరపు పాపయ్యాచార్యులు, శంభమ్మ |ŴÐ«<Š| ŴÕã ÅŁ1920ýË<Š$ Žè T+&ÿ + eTP³ TÅ£sÁç>±eT+ýËÈ“ ˆ+# sÁ ÔáŠ$]Ÿ çu²V¾D| Ÿýç ËdÆ¾ÁX&H sÁ »¿$d¾¼V²¥ubþÅ£] ¿±o| ŴÕe<ŏqT\ T >±Ü dŸT¿±©qT\ T.€H{ ìd¥| Ÿ³ q\ TÔáÁã#î TÔá–+{ ²sÁ M| sÁq\ T 1.ç¿±Þv²¥dÕÇsÁXÔá€TT2. ¿ãwŸ\ \ T¿±>±M| ÔÃH ÅŁdŸ•V²ÔádŸ¥‹ +<ŏ T, eT+° |]Ÿ#ä Ö\ T–H •sTT. ¢ ŴŸÔá €j ãq VŸÕŠu²<ýË ÅÆeÖsÁ e<Š –+³ TH•sÁ

21. కంభాళమఠం బసవలింగ దేవర- 1920-1996 మాచర్ల



బసవలింగయ్య 1920లో నీకంఠయ్య, పిచ్చమ్మ దంపతులకు జన్మించారు. పలనాడు తాలూకా మాచర్ల వీరి స్వగ్రామం. బసవలింగయ్య తిరునగరి రామానుజ సూరివద్ద సంస్కృతాంధ్రములను నేర్చుకున్నారు. తండ్రి నీలకంఠయ్య గురు మంత్రోపదేశం చేశారు. ఆయుర్వేద

వైద్యం నేర్చారు.

బసవలింగయ్య ఆయుర్వేద వైద్యం, భూతవైద్యంతోను మాచర్లలో రాణించారు. ఇంటి ఆవరణములోనే శ్రీ సిద్ధలింగేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి దేవాల యములు కలవు. నిత్యం ధూప, దీప, నైవేద్యాలతో అర్చిస్తూ, పర్వదినాలలో ప్రత్యేక ఉత్సవాలు, పూజలు చేస్తూ ఉంటారు.ప్రవృత్తి రీత్యా నాటక రచయిత. నాగార్జున సాహితీ సమాఖ్యను 1967లో స్థాపించారు అధ్యక్షులు పోకూరి కాశీపతి. నెలానెలా అవధానములు, సాహిత్యగోష్ఠులు పలనాట నిర్వహిం చేవారు. ఈ కార్యక్రమాలలో బసవలింగ దేవర పాల్గొనేవారు.

రచనలు: 1. **వీరభూమి** బుర్రకథ (పలనాటి చరిత్ర) (1953) 2. **పలనాటి యుద్ధం** (నాటకం) (1960) ఇది 1969లో ద్వితీయ ముద్రణ అయినది. 3. **సమ్రాట్ రామా, బ్రహ్మనాయుడు, నాయకురాలు, నరసింగరాజు** అను ఏకపాత్రలు రాశారు.

వీరి ఏకపాత్రలు ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యాయి. నాటక కళను బాగా అభి మానించారు, పోషించారు. పలనాటిలో పోకూరి కాశీపతి అధ్యక్షతన స్థాపించిన నాగార్జున సాహితీ సమాఖ్యలో పాల్గొని సాహిత్య కార్యక్రమాలు చేసేవారు. నాగార్జున సాహితీ సమాఖ్య 2000 సంవత్సరం వరకు కొనసాగుతూ వచ్చింది.

బసవలింగయ్య అయిన వీరు బసవలింగదేవరగా పిలువబడ్డారు. 1994 లో 75 వసంతాలు దర్శించిన మహోత్సవమును ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి నాగార్జున సాహితీ సమాఖ్య సభ్యులు హాజరై వారి సాహిత్య సేవలను కొనియాడినారు. పద్యరత్నాలతో సభాసదులను అలరింపజేసినారు. అట్టివారిలో పాలపర్తి వేణుగోపాల్, చిటిప్రోలు కృష్ణమూర్తి, దిడుగు చక్రపాణి (నాగార్జున సాహితీ సమాఖ్య కార్యదర్శి), ముటుకుల పద్మనాభరావు అష్టావధాని, విద్యాధరణి గోపరాజు, ఉల్లి రామసుబ్బయ్య, ప్రత్తిగడుపు సత్యనారాయణరాజు, బెజ్జంకి జగన్నాథాచార్యులు, పోకూరి సుబ్బయ్యాచారి, చింతలపాటి బుచ్చిబాబు, శాంతంరాజు మురహరిరావు, గుర్రం చెన్నారెడ్డి ఇంకనూ ఆధ్యాత్మికవేత్తలు పోలిశెట్టి వెంకట నారాయణ, కర్పూరపు కోటయ్య, తిరునగరి రామాంజనేయులు, వేమా గురువులు తదితర పురప్రముఖులు పాల్గొన్నారు.

వీరు గుంటూరు జిల్లా ఆయుర్వేద మహాసభలను కూడా నిర్వహించారు. వీరి **పలనాటి యుద్ధం** నాటకం ప్రసిద్ధిగాంచింది. ఆనాడు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ,

కృష్ణాపత్రిక పలనాటి యుద్ధ నాటకాన్ని మెచ్చుకున్నాయి.

బసవలింగదేవర 1996 జనవరి11న శివైక్యము చెందినారు. నాగార్జున సాహితీ సమాఖ్య కార్యదర్శిగా నేను (డాక్టర్ బెజ్జంకి) 1996 జనవరి 21వ తేదీన సంతాప సభను ఏర్పాటు చేసి పలువురు కవిపండితుల సమక్షంలో ఘననివాళు లర్పించడం జరిగింది.

22. రెంటాల గోపాలకృష్ణ - 1920 1995 - రెంటాల

పల్నాటి సీమలో మాచర్లకు 20 కి.మీ.దూరంలోనూ గురజాలకు సుమారు 8 కి.మీ. దూరంలోనూ రెంటచింతల గ్రామం కలదు. ఈ రెంటచింతలకు దక్షిణ దిక్కుగా సుమారు ఐదారు కి.మీ. దూరంలో రెంటాల గ్రామం ఉంది.

రెంటాల గ్రామంలో రెంటాల గోపాలకృష్ణ 1920లో జన్మించారు. ప్రాథమిక విద్య పలనాటనే సాగింది. నరసరావుపేట మున్సిపల్ హైస్కూలులో ఎస్ఎస్ఎల్సి పూర్తి చేశారు. కళాశాల చదువు కూడా నరసరావుపేటలో ప్రారంభించి, గుంటూరులో తెలుగు బి.ఎ. ఉత్తీర్ణులైనారు.

1943 సంవత్సరంలో గోపాలకృష్ణ కుటుంబం విజయవాడచేరింది. అక్కడే స్థిరపడినారు. గోపాలకృష్ణలో చిన్ననాటి నుండే అభ్యుదయ భావాలు పాదుకున్నాయి.

అది 1936వ సంవత్సరం. గోపాలకృష్ణ ఎస్ఎస్ఎల్సి చదువుతున్నాడు. నూనూగు మీసాల నూత్నయౌవనదశ. అప్పుడే 'రాజశ్రీ' అనే చారిత్రక నవల రాశారు. ఆ నవలకు చరిత్రశాస్త్ర అధ్యాపకులు శ్రీమారేమండ రామారావు అభిప్రాయం రాశారు. కొందరు మిత్రుల సహాయసహకారాలతో రాజశ్రీ నవలను 1939 సంవత్స రంలో ముద్రించి పాఠకులకు అందించారు. అటు తరువాత 1942 సంవత్సరంలో పార్వతీశతకమును, 1943 సంవత్సరంలో కిరాతార్జునీయం పౌరాణిక నాటకమును వెలువరించారు.

నరసరావుపేటలో చదువుకునే రోజుల్లోనే **"నవ్య కళాపరిషత్"** అనే కవిత్వసాహిత్య చర్చావేదికను ప్రారంభించారు.

విద్యార్థి దశలోనే నయాగరా కవులు కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం గార్లతో సాహచర్యం చేశారు. అంతేకాక ప్రధానో పాధ్యాయ వృత్తిలో ఉన్న నాయని సుబ్బారావుగారి శిష్యరికం చేశారు. ఇంకేముంది బంగారానికి పరిమళం వచ్చినట్లు అయింది.

అటు నుండి 1943 సంవత్సరంలో మకాం విజయవాడకు మారింది. శ్రీశ్రీతో పరిచయం పెరిగింది రచనలో నూతన దృక్పథం అలవడింది. తొలితరం అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యులైనారు.

ఆధునిక భావాలు, కమ్యూనిజం భావాలు పెనవేసుకొని రెంటాలను మన స్సులో అల్లుకు పోయినాయి. అందువలన రెంటాల ప్రభుత్వ ఉద్యోగాలలో ఇమడ లేకపోయినారు. అయినా భుక్తి కోసం ఏదో ఒకటి చెయ్యాలి గదా – పాత్రికేయుడుగా మారారు. నవభారతి పత్రికలో కొంతకాలం పనిచేశారు.ఆ తరువాత 1960 సంవత్సరం నుండి ఆంధ్రప్రభ దినపత్రికలో ఉపసంపాదకుడిగా పనిచేశారు. ఆంధ్రప్రభ అనుబంధ పత్రిక చిత్రప్రభ సినిమాల వార్తలు, విశేషాలు తెలిపే పత్రికలో సంపాదకత్వం చేస్తూ చిత్ర పరిశ్రమవైపు దృష్టి సారించి చలనచిత్రాలకు మాటలు, కథలు రాశారు.

పాత్రికేయులుగా ఉంటూ ఎనలేని సాహిత్యసేవ చేశారు. సాంస్కృతిక, కళారంగాలపై వ్యాసాలు సమీక్షలు రాశారు. ఆనాడు వెలువడుతున్న అన్ని పత్రికలకు వ్యాసాలు పంపేవారు. ఆఖరికి బాలజ్యోతి పత్రికకు పిల్లల రచనలు రాసేవారు.అంటే అప్పుడప్పుడు రాయడం కాదు. ధారావాహికగా రాశారు.

రెంటాల స్వీయ రచనలేగాక అనువాదాలు చేసేవారు. నాటకాలు, నాటికలు రాశారు. ఒకటేమిటి అన్ని రకములైన రచనా ప్రక్రియలను చేపట్టారు. అన్నిటా తనదైన 'కలం' చూపించేవారు.

టాల్‌స్టాయ్ నవలలను తెలుగులో అనువాదం చేశారు. **'యమకూపం' 'భయస్తుడు' 'ఆకలి'** మొదలైనవి అనువాద నవలలు. రష్యన్, ఫ్రెంచ్, భాషల నుండి అనువాదం చేసి గ్రంథా లను అచ్చువేయించి పాఠక దేవుళ్లకు అందించారు.

కేవలం ఆంగ్ల సాహిత్యం, రష్యన్, ఫ్రెంచ్ భాషలే కాకుండా వ్యాస, వాల్మీకాది మహాకవుల సంస్కృత భారత, రామాయణాలను సులభశైలిలో తెలుగులోకి అనువాదం చేశారు. అంతటితో ఆగక ఆఖరికి వాత్సాయన కామసూత్రాలకు (మూల శ్లోకాలు సహా) వ్యాఖ్యానాన్ని రాసి సామాన్య మానవుడికి బోధపడే రీతిలో ప్రచురించారు. కామసూత్రాలు దాదాపు పది ముద్రణలు అయి బాగా అమ్ముడుబోయాయి.

1) 1.సంఘర్షణ 2. కల్పన 3. సర్పయాగం ఇవి కవితల సంకలనాలు.

2) శిక్ష– నాటికల సంపుటి

3) 1. బలిదానం, 2.ఎర్రగన్నేరు మొదలైనవి నాటకాల సంపుటులు

4) 1.గజదొంగ 2. విజయధ్వజం 3. థాయిస్ 4. వచ్చాయి మంచిరోజులు (అనువాద నవలలు)

5) టాల్‌స్టాయ్ నాటక కథలు, పిల్లల కథలు

6) మానవ హృదయాలు, సుఖసంసారం (టాల్‌స్టాయ్ అనువాదం) సంస్కృతంలోని పంచకావ్యాలు, రామాయణ, భారత, భాగవతాలు, మొల్ల రామాయణం, పల్నాటి వీరచరిత్ర, భగవద్గీత మొదలగు హిందూ గ్రంథాలను తేట తెలుగులోకి అనువాదం చేశారు.

శృంగార నైషధం, సుభాషిత రాత్నావళి,జైమినీభారతం, దశకుమార చరిత్ర, ఋషుల కథలు తెలుగులో రాశారు.

ఒకటేమిటి బాలబొమ్మల రామాయణం, అలీబాబా కథలు, మర్యాద రామన్న కథలు, అల్లావుద్దీన్ అద్భుత దీపం,వీరపాండ్య కట్టబ్రహ్మన– ఆఖరికి చిన్నారి పిల్లల అందాల పేర్లు కూడా రాసి అచ్చువేయించారు.

రెంటాల గోపాలకృష్ణ నిత్య సాహిత్యతపస్వి. ఆయన కలం ఆగింది లేదు. 16వ ఏట నవయౌవనంలో రాయటం మొదలుపెట్టిన కలం ఆయనకు వృద్ధాప్యం–71 సంవత్సరాలు వచ్చేవరకు రాస్తూనే ఉంది. వందల కొద్దీ రచనలు ఆయన కలం నుండి వెలువడటమే కాదు ముద్రణ అయి తెలుగు పాఠకుల కరకమలాలకు చేరుకుని హృదయకుహరాలలోకి చొచ్చుకుపోయినవి.

పలనాట పుట్టి ప్రసిద్ధిగాంచిన ప్రతి కవీ నవయౌవనంలోనే కవిత్వం రాశారు. పల్నాటి సోదర కవులు, కాశీపతిగారు, ఆధ్యాత్మికవేత్తలు అందరి కలాలు చిన్ననాట నుండే సాహిత్య వీధులలో విహరించాయి. పలనాట పుట్టిన ఇంతటి మేధాసంపన్నుడు తన రచనల ద్వారా జనాన్ని జాగృతం చేయటానికి విజయవాడలో మకాంపెట్టి ఉన్ననూ పుట్టిందీ పెరిగిందీ పల్నాటి గడ్డపైనే కనుక ఆ ఖ్యాతి పలనాటికే దక్కింది.

అన్ని కవితారంగాలలో తనదైన ముద్రవేసి రెంటాల 1995 సెప్టెంబర్ 19న పలనాటి వాసులను కన్నీట ముంచి తాను సురగంగలో ఓలలాడ సురనాథుని చెంతకు చేరినాడు.

విద్య తెలివినిచ్చు విత్తంబునిచ్చును,మిత్రతతి నొసంగి మేలుచేయు
శత్రువుల మనసును శాంతింపజేయును, తిరుగులేని విద్య తెలుగుబిడ్డ
–బెజ్జంకి జగన్నాథాచార్యులు

23. విద్వాన్ సరికొండ బుచ్చిరాజు-1920-1994. మాచర్ల

సరికొండ బుచ్చిరాజుగారు నర్సరావుపేట, రొంపిచర్ల గ్రామంలో సరికొండ ఉన్నమ్మ, సీతంరాజు పుణ్యదంపతులకు1920 జూన్ 21న జన్మించారు. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1944-46లో విద్వాన్ పట్టా పొందారు. 1947నుంచి పిడుగురాళ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా ఉద్యోగజీవితం ప్రారంభించారు. పల్నాటిలో పలు పాఠశాలలో పనిచేసి 1976 జూన్ 15న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పెదకొండమగుండ్లలో ప్రథమశ్రేణి తెలుగు పండితులుగా ఉద్యోగ విరమణ చేశారు. 1994 జనవరి 14వ తేదీన స్వర్గస్తులయ్యారు. స్థిర నివాసం మాచర్ల. **రచనలు: 1. పుత్రప్రేమ 2.రత్నపేటిక 3. వీరపల్నాడు.** వీరు **పల్నాటి పోతన**గా ప్రసిద్ధి పొందారు.

24. తిరునగరి రామాంజనేయులు -1922- 2008. పిన్నెల్లి



ప్రజాకవి తిరునగరి రామాంజనేయులు గారు. 1922లో పల్నాటిలోని పిన్నెల్లి గ్రామంలో జన్మించారు. తిరునగరి రామతులశమ్మ, సమ్మయ్య పుణ్యదంపతులకు జన్మించారు. తండ్రి హరిదాసు. మేనమామలు సంగీత విద్వాంసులు. అందువలన తిరునగరి కథకులు, గాయకులు కూడా. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. అత్తవారిల్లు తెలంగాణ కావటంవలన తెలంగాణ పోరాట యోధుడయ్యాడు. కమ్యూనిస్టు ఉద్యమనాయకుడు. ఆయన రచనలన్నీ ఉద్యమ స్ఫూర్తితో రాసినవే.

రచనలు: 1. తెలంగాణ పోరాట గేయాలు (1973), **2.జ్వలితజ్వాల** - గేయ సంపుటి (1976), **3. వెట్టిచాకిరి** (నాటిక), **4. వీరకుంకుమ** (నాటిక), **5. వీర తెలంగాణ** (నాటకం),6. **తెలంగాణ, 7. రాష్ట్ర వాంఛ, కొత్తబాట, 8.అల్లూరి సీతారామరాజు** - ఇవి గొల్ల సుద్దులు. 9. **తెలంగాణ వీరయోధులు** (ఆనాటి బూర్గుల ప్రభుత్వం నిషేధించింది) **10.వీరబందగీ, 11.కన్నెగంటి హనుమంతు** (ప్రజా నాట్యమండలి రచనల పోటీల్లో ప్రథమ బహుమతి పొందినవి), **12.అనాథ, 13.పేద రైతు**-(బుర్రకథలు), 14. **వల్లభాయి, 15. నెహ్రూ** (వీధి హరికథలు), **16.సంగం** (పోరాట నవల), **17.పలనాటి వీర హనుమంతు** (సంగ్రహ చరిత్ర), **18.విప్లవ**

పథంలో నేను, నా కలం (వ్యాసాలు)...

1983లో **'పులుపుల శివయ్య అవార్డు'** అందుకున్నారు.

కన్నెగంటి హనుమంతు చరిత్రను తెలుసుకున్న సోవియట్ యూనియన్ – కన్నెగంటి హనుమంతు ఎవరు?అని విచారించింది భారత సోవియట్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ సోవియట్ యూనియన్‌లు కూడా విచారించాయి. అప్పుడు స్వయంగా కోళ్ళగుట్ట వెళ్ళి హనుమంతు చరిత్రను అడిగి తెలుసుకుని కన్నెగంటి హనుమంతు చరిత్ర రాశారు. ఆయన ఫోటో అడిగారు– వారి వంశీయుల ఇళ్లలో హనుమంతు ఫోటో లేదు. మరి ఎలా ఉంటారు అని అడిగితే హనుమంతు గారి మనవడు ముసబుగారి ఫోటో ఇచ్చి ఇలా ఉంటారు అన్నారు. ఆ ఫోటోను తిరునగరి మాచర్లకు తీసుకువచ్చారు. మాచర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనోపాధ్యాయులుగా పనిచేస్తున్న జాతీయ కాంగ్రెస్ అభిమాని, స్వాతంత్ర్య సమరయోధులు, దేశభక్తులు, విశ్వబ్రాహ్మణ కులతిలకం, శిల్పి అయిన **గురజాల వెంకయ్యాచార్యులు గారికి** ఆ ఫోటో ఇచ్చి **తైలవర్ణ ఊహాచిత్రం** వేయమన్నారు. ఆయన ఆ విధంగా చిత్రం గీసి ఇచ్చారు. అదే నాటి నుంచి నేటికీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న చిత్రం..! ఇదీ గురజాల వెంకయ్యాచార్యులు గారి ప్రతిభ..!! **(తిరునగరి రామాంజనేయులుగారు స్వయం ముఖాముఖిగా చెప్పిన విషయమిది..)** కాగా ఆ ఫోటోను తిరునగరి సోవియట్ యూనియన్‌కు పంపించారు.

తిరునగరి రామాంజనేయులుగారు మాచర్లలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. 2008 మార్చి 13వ తేదీన మాచర్ల స్వగృహంలో స్వర్గస్థులయ్యారు. వీరి రచనలపై **వి. సింగారావు** గారు **"ప్రజాకవి తిరునగరి రామాంజనేయులు-జీవితము-సాహిత్యము"** అనే అంశంతో పరిశోధన వ్యాసం సమర్పించి 1997లో నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టా పొందారు.

25. చిన్నము హనుమయ్య చౌదరి 1923-1985, కొత్తపాలెం

చిన్నము హనుమయ్యగారు మాచవరం మండలం కొత్తపాలెంలో 1923లో జన్మించారు. తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేశారు. 1985లో కీర్తిశేషులయ్యారు. **రచనలు: రత్నపేటిక, సాంధ్యశ్రీ, శుభోదయము** –ఖండకావ్యం, **విజయసుందరి** అను కథాకావ్యం, తెలుగు **పాపశతకం.** **స్త్రీరత్నం** నాటిక, **వీరపల్నాడు, నవోదయం** ఇతర రచనలు. **'కవికోకిల', 'కవితావిశారద', 'మధురకవి శేఖర'** అను బిరుదులు పొందారు.

26. అక్కిరాజు వేంకటేశ్వరశర్మ

వీరు 1925లో జన్మించారు. వల్నాడు తాలూకా గుత్తికొండవాసి. **1. శృంగారతరంగిణి 2. రఘువంశం, 3. భావవిపంచి** మొదలగు గ్రంథములు రచించారు.

27. ఉమ్మా నారాయణరెడ్డి - 1926, గొట్టిముక్కల

ఉమ్మారెడ్డి పల్లమ్మ, రామిరెడ్డి పుణ్య దంపతులకు 1926 సెప్టెంబర్ 12వ తేదీన గురజాల మండలం గొట్టిముక్కలలో జన్మించారు. **'జనకవి'** బిరుదాంకితులు. ఉమ్మా నారాయణరెడ్డి ఉపాధ్యాయులుగా, విద్యాశాఖాధికారిగా ఉద్యోగించారు. వీరు 1. పొడుపు పద్యాలు 2. జానపద గేయాలు రచించారు. స్వయంగా ఉపాధ్యాయులు కావటం వలన బాలల మనోవికాసానికి దోహదపడే రచనలు చేశారు. వీరి పొడుపుపద్యాలు బహుళ ప్రచారం పొందినవి. 1982లో ప్రథమ ముద్రణ చేయగా 2008లో ఎనిమిదవ ముద్రణకు నోచుకుంది. ఇలా ఎనిమిది ముద్రణలు పొందిన ఆ గ్రంథం ఘనత, ప్రత్యేకత వేరే చెప్పనవసరం లేదు...మచ్చుకో పద్యం-

"మూడు కండ్లవాడు ముక్కంటి మరికాదు
తలకు పిలక యుండు తాత కాదు
తాత గుడికి పోవ తలకాయ పగిలెరా
ఊహ కాదు నిజము ఉమ్మారెడ్డి"


ఎంత చక్కగా ఉన్నాయో చూడండి వారి పొడుపు పద్యాలు..! డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి మాటల్లో ఏమన్నారో చూద్దాం...

"సమకాలీన సమాజంలోని దురాచారాలను తూర్పారబట్టి మానవ కోటి మస్తిష్కాలను నెత్తురు చిందనీయకుండా మెత్తని శస్త్రచికిత్స చేసి తెలుగు కవితలో అచ్చమైన దేశ వెలుగులు ప్రసరించిన **'ప్రజాకవి'** వేమన. లోకంలో వాడుకలో నున్న పొడుపు కథలను తీసుకుని వాటిని తేటతెనుగు మాండలికాలు వ్యావహారికాలు మెండుగా ఉన్న సూటి తెలుగులో ఆటవెలదుల ద్వారా అందిస్తున్న కవి ఇతడు. చెప్పదలచుకున్నది తెరలు, అరలులేని సరళిలో చెప్పిన **'జనకవి'** ఉమ్మా నారాయణరెడ్డి!" అని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు అన్నారు.

సంతానం లేని **ఐతాంబ** చెన్నకేశవస్వామి ఆలయంలోని దిగుడుబావి నీటితో గజనిమ్మ వ్రతం చేసింది. ఆ బావే నేడు గిలకల బావిగా మారింది.

28. కర్పూరపు కోటయ్య-1927. మాచర్ల

కర్పూరపు చినరంగయ్య, ఉశమ్మ దంపతులకు 1927 సం.శివరాత్రి నాడు కర్పూరపు కోటయ్యగారు జన్మించారు.వీరు మాచర్ల వాస్తవ్యులు. దేశభక్తిపరులు.మొట్టమొదటి మేజర్ పంచాయతీ బోర్డు ప్రసిడెంట్‌గా 1956లో ఎన్నికైనారు.మొదటి నుండి స్వతంత్ర పార్టీలో ఆచార్య రంగాగారితో పనిచేశారు. నందికొండ ప్రాజెక్టు సాధన సమితిలో పనిచేశారు. నాగార్జునసాగర్‌లో మ్యూజియం సాధనకోసం గుర్రం మల్లయ్యగారితో పోరాటం చేశారు. ఆ రోజులలో నంది కొండ త్రవ్వకాల్లో బయటపడిన విగ్రహాలను బ్రిటిష్‌వారు తరలిస్తుంటే అడ్డుకొని ఉద్యమంచేసి నిలిపారు.ఆ విగ్ర



హాలను చూడటానికి దలైలామా, పంచల్‌నామా వచ్చినప్పుడు వారికి స్వాగతం పలికే భాగ్యం **"కావూరి వెంకయ్యగారి"** దయవలన కలిగిందని ఆనందంతో చెప్పారు. మొదట వీరు నాస్తికులు. తర్వాత ఆస్తికులై ఆంజనేయస్వామి దేవాలయ ధర్మకర్తయై స్వామివారి సేవలో తరిస్తూ దేవాలయమును అభివృద్ధి చేశారు.

"శ్రీ గుర్రం మల్లయ్య గారి జీవిత విశేషాలు" అను పుస్తకమును1984లో ప్రచురించారు. ఇందులో గుర్రం మల్లయ్యగారి జీవిత విశేషాలు,పలనాటిలో రాజకీయం, వారి దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖులతో వారికున్న అనుబంధం, వారితో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలు యధాతథంగా ప్రచురించారు. ఈ పుస్తకంలో పలనాటివాసులు తెలుసుకొనవలసిన అంశాలెన్నో ఉన్నాయి.

29 ప్రత్తిగొడుపు సత్యనారాయణరాజు (1927-2007)- మాచర్ల

'పలనాడు రామరాజభూషణుడు' అను బిరుదు పొందినవారు ప్రత్తిగొడుపు సత్యనారాయణరాజుగారు. పుట్టింది నకరేకల్లు మండలం ఇనుమెట్లలో. తల్లి వెంకమ్మ, తండ్రి వెంకటనరసరాజు. అక్షరాభ్యాసం బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో. చదువు తొండపి అలుగు మల్లెపాడు, అంబాపురములలో. తెనాలి సంస్కృత కళాశాలలో భాషాప్రవీణ చదివారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా ఉద్యోగం



చేశారు. ఉద్యోగ విరమణ చేసి మాచర్లలో స్థిరనివాసము ఏర్పరచుకున్నారు.

సాహిత్యంలో పట్టున్న వ్యక్తి సత్యనారాయణరాజు. కవిత్వం రాయటంలో దిట్ట. భాషా జ్ఞానం, వ్యాకరణం వీరిలో మెండు. పలనాడులో అవధానం జరిగిందంటే సత్యనారాయణరాజు 'నిషిద్ధాక్షరి' పృచ్ఛకునిగా వ్యవహరిస్తారు. నిషిద్ధాక్షరిలో సత్యనారాయణరాజు కూర్చుంటే అవధానికి అడుగు ముందుకు కదలదు. అంతటి ప్రతిభావ్యుత్పత్తులున్న వ్యక్తి ఆయన! ఎన్నో అవధానాలలో పాల్గొన్నారు.

పోకూరి కాశీపత్యవధాని నెలకొల్పిన నాగార్జున సాహితీ సమాఖ్య సభ్యులుగా కొనసాగినారు. రావిపాటి లక్ష్మీనారాయణ, పోకూరి కాశీపత్యవధాన్లు సమకాలీనులు అని వీరి పల్నాటి చరిత్ర ద్వారా తెలియుచున్నది. సమాఖ్య నిర్వహించే సాహిత్యకార్యక్రమాలలో పాల్గొనేవారు. సాహిత్య సభలలో తనదైన బాణిలో ఉపన్యాసం ఏకధాటిగా కొనసాగించేవారు. అదీ ఆయన ప్రత్యేకత!

సాహితీరంగంలో తిరుగులేని వ్యక్తి. ప్రౌఢకవి. దాదాపు తొమ్మిది శతకాలు రాశారు. **'భక్త కుచేల'** నాటకం రాశారు. **'అంబరీష చరిత్ర'** పద్యకావ్యం రాశారు.

సీతారామ శతకం, చెన్నరాయప్రభు శతకం, జగన్నాథ శతకం ఏకప్రాస నియమంతో రాశారు. ఏకప్రాసంతో వంద పద్యాలు రాయటం చాలా కష్టం.

మాచర్ల చెన్నరాయ శతకంలో నీతి సూత్రాలు బంధించారు. హరిహరకథ శతకము మొత్తం శ్లేషతో రాశారు. ఇందులో శ్లేషార్థాలు వస్తాయి.

'భక్త కుచేల' 5 అంకాల నాటకం. **1964 సంవత్సరంలో చంద్రవంక నది పొంగి మాచర్ల ముంపునకు గురైంది.** సత్యనారాయణకి హృదయం కలత చెందింది. ఆ కలత చెందిన హృదయంలో కవిత్వం వరదలై పొంగింది.కనులారా చూచిన దృశ్యాలను కళ్లకు కట్టినట్లు వర్ణించారు. **చంద్రవంక జలప్రళయం** అనే శతకం అక్షర రూపం దాల్చింది. రాబోయే తరానికి చారిత్రక చిహ్నంగా నిలిచింది.

సత్యనారాయణ ఎనభై ఏండ్ల ప్రాయంలో కూడా ప్రౌఢరచన చేశారు. రకార ప్రాసతో శతకం రాశారు. అదే **"శ్రీరామశ్రీకృష్ణ స్తవ శ్రీరామకృష్ణ"** శతకం. పలనాటి సీమలోని రచ్చ మల్లెపాడులో అతి చిన్న వయస్సులో తపస్సంపన్నులై పలనాటి వాసులకు ఆధ్యాత్మిక మార్గదర్శకులు అయ్యారు. శ్రీ రామకృష్ణ స్మరణలో సత్యనారాయణ శతకం రాశారు.

"నూరేండ్లైన యెన్నదేండ్లు గడచెన్ నూటొక్కటై మెప్పునన్
బేరున్ జెందిన రామభూషణునకున్ బేరందె విశ్వంబునన్"

అంటూ తన వయస్సును, పాండితీ ప్రకర్షను తెలియజేసుకున్నారు. స్వయంగా ఈ శతకంలో.

పలనాటిలో ప్రత్తిగొడుపువారే అవధానంలో నిషిద్ధాక్షరికి పెట్టనికోట. వారు నిషేధం చేస్తే అవధాని అడుగు ముందుకు కదలదు. అంతటి ప్రతిభాసంపన్నులు!

30. షేక్ బుడేసాహెబ్ -1927 - 2007 జానపాడు

షేక్ బుడేసాహెబ్ 1927జులై 1వ తేదీన పిడుగురాళ్ళ మండలం, జానపాడులో జన్మించారు. షేక్ సైదాసాహెబ్, మొహద్దీన్‌బీ కుమారుడు. **'హృదయఘోష'** అను కవితా సంపుటిని వెలువరించారు. **'మహమ్మద్ ప్రవక్త'** అను హరికథ రాశారు. 2007 ఆగస్టు 31న మరణించారు.

31.'గేయకావ్యకర్త' పెద్దోజు నమశ్శివయ్య భాగవతార్ - 1929-2015. దుర్గి

పలనాటి పౌరుషానికి ప్రతీక నాగమ్మ. బ్రహ్మనాయుడికి ఎదురు నిలిచిన



వీరవనిత నాగమ్మ. రాజకీయ చతురత, రాజనీతిజ్ఞత కలిగిన ధీరురాలు నాగమ్మ. **'నాయకురాలు నాగమ్మ'**గా గుర్తింపు పొందిన స్త్రీ నాగమ్మ. నాగమ్మ కొలువుదీరిన నేల గామాలపాడు. గామాలపాడును జిట్టగామాల పాడుగా కూడా వ్యవహరిస్తారు.

పౌరుషానికి పురిటిగడ్డయిన గామాలపాడులో పుట్టారు నమశ్శివయ్య భాగవతార్. ప్రస్తుతం దుర్గి గ్రామంలో స్థిరపడినారు. దుర్గి గ్రామంలో నమశ్శివయ్య అంటే ఎవరూ చెప్పరు. నమశ్శివయ్య భాగవతార్ అంటే వెంటనే చెబుతారు ఫలానా అని!

భాగవతార్‌గా ప్రసిద్ధిగాంచినారు నమశ్శివయ్య. ఆధునిక గేయ కవిత్వ రచనలో అందెవేసిన చెయ్యి వీరిది. ***బ్రహ్మంగారి చరిత్ర, వేంకటేశ్వర చరిత్ర, శ్రీశైలేశుడు*** *అను మూడు గేయ కావ్యములను రచించినారు.* గేయములు రాసిన వారున్నారుగాని గేయ కావ్యములు రాసిన వారు అరుదు. అందులో ఆధునిక భాషలో నమశ్శివయ్య ఆద్యులు అని చెప్పవచ్చు.

వీరబ్రహ్మకవి, నాగమ్మ దంపతులకు 1929 సంవత్సరంలో జన్మించారు నమశ్శివయ్య గారు. దాచేపల్లిలో ఉన్నతవిద్య అభ్యసించారు. తెల్లాకుల వేంకటేశ్వరగుప్తా

వద్ద హరికథా గానం నేర్చుకున్నారు. అందువలన భాగవతార్‌గా ప్రసిద్ధి పొందినారు. గాయకుడు, మధురమైన కంఠస్వరం, సంగీత పరిజ్ఞానం, గొంతెత్తి గానం చేశారంటే శ్రోతలు చేతలుడిగి స్థాణువులై నిలిచి ఆనంద లోకాలలో విహరిస్తారు అనటం అక్షర సత్యం.

అసలే భాగవతార్ కనుక సంగీత పరిజ్ఞానం ఉంటుంది. రాగతాళ యుక్తంగా పాడుతారు. అందునా కవి, అందులో గేయకవి! ఇంకేముంది– కవిత్వం లయాత్మకంగా కలం నుంచి జాలువారుతుంది. అందుకే గేయకావ్య రూపకల్పనకు సిద్ధమై బ్రహ్మంగారి చరిత్ర రచించి 1986 సంవత్సరంలో ముద్రించారు. 2015 జనవరి 11 వ తేదీన శివైక్యం చెందారు. వారి శోభాయాత్రలో డాక్టర్ బెజ్జంకి, పలువురు పురప్రముఖులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి చరిత్రను ఎందరో మహాపండితులు మెచ్చుకున్నారు. మహా మహోపాధ్యాయ డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు, సాహిత్యబ్రహ్మ డాక్టర్ వివిఎల్ నరసింహారావు, కళాప్రపూర్ణ డాక్టర్ దివాకర్ల వేంకటావధాని, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి, కవిరాజు కొండవీటి వేంకటకవి, డాక్టర్ దాశరథి తదితరులు వారివారి అమూల్యమైన అభిప్రాయములతో ఈ గేయకావ్యమును గూర్చి ప్రశంసించారు.

'ఆంధ్రదేశములో వీరబ్రహ్మమే పెద్ద గేయకవి. వారి జీవితము గేయకావ్యముగా వెలువ రించుటయే మహాకార్యము. దానిని నెరవేర్చి ఆ మహాగేయకవిపై గేయకావ్యములు లేని లోటును దీర్చిన శ్రీ కవిగారిని అభినందించుచున్నాను– అని పెదపాటి నాగేశ్వరరావు రాశారు.

'బ్రహ్మంగారి చరిత్ర తెనుగుపాట...! ఇప్పటికే వచన రూపమున, పద్య రూపమున, నాటక రూపమున పలువురు ప్రాజ్ఞులు రచించియున్నారు. కానీ ప్రత్యేకముగా గేయ రూపమున రచించిన వారు లేరు. ఈ కారణముచే నమశ్శివయ్య గారి రచన అపూర్వము' అన్నారు సాహిత్య బ్రహ్మ డాక్టర్ వివిఎల్ నరసింహారావు.

'నమశ్శివయ్య గారు కథను రమణీయముగా వివరించుట యందును, తత్త్వవిషయములను తెల్పుటయందును చూపిన నేర్పు ప్రశంసాపాత్రముగా ఉన్నది. వారి గేయములు పదేసి మాత్రలతో గూడిన పాదములతో నొప్పుచు ధారాశుద్ధి శోభితములై యలరారుచున్నవి. కవిగారు హరికథా కథన నిపుణులగుటచే గేయములను,

లయ, తాళబద్ధములుగా నొనరించి పాడుట కనువుగా రచించి యుండిరి. వారి భాష సర్వసుబోధమై సామాన్యులు కూడా చదువుకొనుటకు వీలుగానున్నది. మహామహిమ సంపన్నులైన శ్రీ బ్రహ్మంగారి చరిత్రనింత మనోహరముగా రచించి ప్రజలకు జ్ఞానమును, సంస్కారమును కలిగించుటకై యత్నించిన శ్రీ కవిగారిని అభినందించుచున్నాను. వారే నుడివినట్లు ఈ గ్రంథమును పఠించినచో–

'అజ్ఞానమది తొలగి
సుజ్ఞాన మది గలుగు
బ్రహ్మవిద్యను దెలియ
భావమ్ము మది గలుగు'

అని దివాకర్ల వేంకటావధాని వ్రాశారు.

'ఆధునికాంధ్ర సాహిత్యంలో చారిత్రక గేయకావ్యాలు' అను సిద్ధాంత వ్యాసంలో డాక్టర్ మడకా సత్యనారాయణ చక్కగా పరిశీలనము చేశారు. దాదాపు 20 పేజీలలో విపులీకరించారు.

నమశ్శివయ్య తండ్రిగారు కవి, తమ్ముడు కవి, కుమారులు కవులు. వీరిది కవికులం!

32. ఉల్లి రామసుబ్బయ్య – 1929–2014 మాచర్ల

పలనాటి చరిత్రకు ప్రధాన కేంద్రమైన గురజాలకు మూడు కి.మీ. సమీప



గ్రామం గంగవరం. గంగవరానికి ఒక ప్రత్యేకత ఉంది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లినవారు గంగవరంలో జన్మించారు. బ్రిటిష్ ప్రభుత్వ పోలీసుల బారి నుండి తప్పించుకుని కాంగ్రెస్ వాదులలో ప్రముఖ నాయకులు గంగవరంలోనే తలదాచుకునేవారు.

పలనాటి సీమనుంచి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న యోధులలో ప్రముఖులు తిరునగరి నరససూరి, ఉల్లి వెంకట్రామయ్యలు గంగవరం గ్రామస్తులు.

ఉల్లి వెంకట్రామయ్య, సరస్వతమ్మల కుమారుడు రామసుబ్బయ్య. వీరికి తండ్రి గుణగణాలు పూర్తిగా అబ్బినవి. తండ్రితో కలసి రామసుబ్బయ్య పోరాట కార్యక్రమాల్లో పాల్గొనేవారు. తండ్రిగారికి చేదోడు వాదోడుగా ఉండేవారు.

1929 మే 6వ తేదీన రామసుబ్బయ్య గంగవరంలో జన్మించారు. తిరునగరి నరససూరి వద్ద విద్యాభ్యాసం చేశారు. గురజాలలో ఎస్ఎస్ఎల్సి చదువుకున్నారు.

1947 మే నెలలో చిత్తూరు జిల్లా దిగువ మాఖంలో జరిగిన రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందారు. కర్పూరపు కోటయ్య, కర్నాటి రామనాథం, పాలువాయి హనిమిరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డితో కలసి రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందిన దేశాభిమాని ఉల్లి రామసుబ్బయ్య!

దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ పిలుపునకు స్పందించి వాడవాడ ప్రజలు తండోపతండాలుగా వెల్లువెత్తి పాల్గొన్నారు. ఆ సమయంలో పి. తిమ్మారెడ్డి, పి. రాజగోపాలనాయుడు, బెరోల్‌రాయుడు ఆధ్వర్యంలో రాజకీయ పాఠశాలలు జరుగుతూ ఉండేవి. ఈ రాజకీయ పాఠశాలలో యువకులకు శిక్షణ ఇచ్చి స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొనేటట్లు చేసేవారు.

ఆయన పిడబ్ల్యూడిలో పనిచేశారు. మాచర్లలో స్థిరనివాసము ఏర్పరచుకు న్నారు. కన్నెగంటి వీరభద్రాచార్యులు గారు వీరి కవితాగురువులు. పద్యవిద్యకు రామసుబ్బయ్య చేత ఓనమాలు దిద్దించినవారు శతావధాని కన్నెగంటి వీరభద్రా చార్యులు! ***రామసుబ్బయ్య పలుకులో తెలుగు తేట ఉంది. కవితలో తేట తేనె ఉంది. భావగతి స్వచ్ఛత ఉంది. సర్వసుమనోభిరామంగా పుష్పించి ఫలించిన ఈ కవితారామం అభిజ్ఞాత జనకం కాగలదు*** అన్నారు చిటిప్రోలు కృష్ణమూర్తి.

పల్నాటి సోదర కవులతోను, పోకూరి కాశీపతిగారితోను సన్నిహిత సంబంధం ఏర్పరచుకున్నారు. తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి గారితో అత్యంత సన్నిహిత త్వం పెంచుకున్నారు. కవి పుంగవులన్న ఎనలేని అభిమానం, గౌరవం రామసుబ్బ య్యకు. తుమ్మల వారన్నా, వారి సాహిత్యమన్నా గొప్పగా ఆరాధిస్తారు. తుమ్మల సీతారామమూర్తి మాచర్ల వస్తే సుబ్బయ్య ఇంటిలోనే బసచేసేవారు.

అష్టావధానాలు, కవితాగోష్ఠులలో పాల్గొంటారు. పలనాటిలో జరిగే అన్ని సాహిత్య కార్య క్రమాలలోనూ పాల్గొంటారు. వీరు లేకుండా సాహిత్యసభలు జరగవు అంటే అతిశయోక్తి కాదు. రామసుబ్బయ్య ముఖ్యంగా మాస్టర్ సి.ఆర్.ఆర్. శిష్యులు. ఆ ధ్యానాన్ని ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం చేస్తుంటారు. పదుగురినీ చేరదీసి ధ్యానం నేర్పుతారు. అలాగే ఆయన హోమియో వైద్యం చేస్తారు. పోకూరి కాశీపతి గారు నెలకొల్పిన మా నాగార్జున సాహితీ సమాఖ్యలో సభ్యులు.

మంచి చెయ్యి తిరిగిన కవి రామసుబ్బయ్య. తేటతెలుగు పదాలతో కవిత్వం చెబుతారు. రచనచేస్తారు. దేశభక్తితో పాటు ఇన్ని ఉత్తమగుణాలున్న వ్యక్తి రామసుబ్బయ్య. ఆయన పలనాటికి గర్వకారణం. ఆయన **'రాఘవ శతకం', 'సుమనస్సులు'** అను రెండు గ్రంథాలు అచ్చువేయించారు. మూడవది **కవితారామం** ముద్రణ అయింది. వీరి రచనలలో సామాజిక స్పృహ కనబడుతుంది. మచ్చుకు ఈ క్రింది పద్యం చూడండి....

" కుంచియ చేతబట్టి యటగూడిన కల్మషమెల్ల నూడ్చు మై
వంచి సహించు నా పడతిపై నదియంటిన గాని నొవ్వదే
కొంచెము గూడ విశ్రమము గోరని చల్లనితల్లి యాయమన్
మించినవారు లేరు గద! మేదినియందెటునైన రాఘవా!"

ఇందు బజార్లు ఊడ్చు స్త్రీ గొప్పదనాన్ని చెపుతున్నాడు కవి. ఆమె విశ్రాంతి లేకుండా చేస్తోంది. రోడ్డుమీద వ్యర్థం తనకంటినా చీదరించుకోదు. ఆమెను మించినవారు లేరు కదా అంటారు కవి. ఒక సామాన్య స్త్రీ- బజార్లు శుభ్రపరుచు స్త్రీ పట్ల జాలి, దయ కనపరిచారు.

ఉల్లి రామసుబ్బయ్య గారితో నాకు (డాక్టర్ బెజ్జంకి) మంచి మిత్రులు, అత్యంత సన్నిహితులు. నాగార్జున సాహితీసమాఖ్య కార్యదర్శిగా వారిని సన్మానించుకోవడం జరిగింది. వారి కవితారామం పుస్తకావిష్కరణ సభలో స్వయంగా పాల్గొనడం జరిగింది. అటువంటి ఆప్తులు 24-12-2014 తేదీన పలనాటి సాహితీ ప్రియులను విషాదంలో ముంచివేసి దివికేగారు.

33. 'అష్టావధాని' ముటుకుల పద్మనాభరావు -1929-2019 - మాచర్ల



ముటుకుల నరసయ్య, శేషమ్మ దంపతులకు 1929 శుక్ల నామ సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ నవమినాడు పద్మనాభరావు జన్మించారు. మాచర్ల సమీపంలో ఆత్మకూరు వాస్తవ్యులు. ప్రస్తుతం మాచర్లలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు

1953 నుంచి 1988 సంవత్సరం వరకు ఉపాధ్యాయ వృత్తిలో 35 ఏళ్లపాటు ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. భారత, భాగవత, రామాయణాలను నిత్యం పారాయణం చేస్తారు. ఆ కథలు కంఠోపాఠం. సాయంత్రం దేవాలయా

లలో పురాణ ప్రవచనం చేస్తూ శ్రోతలను ఆనంద పరుస్తారు.

ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ముటుకూరు, మండాది, శిరిగిరిపాడు, ఏకోనంపేట, మాచర్లలో సేవలు కొనసాగించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులైనా ప్రవృత్తిరీత్యా ప్రజలకు ఆయుర్వేద వైద్యం చేస్తూ మన్ననలు పొందినారు.

త్రిపురాంబికేశ్వర శతకము రచించారు. వాల్మీకి రామాయణాన్ని యథాతథ అనువాదం చేశారు. **'పద్మనాభ రామాయణము'** అన్నపేరుతో ముద్రించారు. ఆ రచన ప్రముఖుల ప్రశంసలు పొందింది.

ఉత్తర రామాయణం కూడా రచించారు. ముద్రణకు సిద్ధంగాఉంది. పలనాటి అవధానిగా, పౌరాణికులుగా పలువురిచే అభినందనలు అందుకున్నారు. సన్మానాలూ పొందారు. విశ్వధర్మ పరిషత్, నాగార్జున సాహితీ సమాఖ్య, పల్నాడు చైతన్య కళాస్రవంతి వంటి సంస్థలలో పాల్గొంటూ నిరంతరం వారికి అమూల్యమైన సేవలు అందిస్తూం టారు. ఆయన 2019 ఫిబ్రవరి 16వ తేదీన దివంగతులయ్యారు.

పద్మనాభ రామాయణాన్ని ప్రముఖ కవిపండితులు ప్రశంసించారు. **మైలవరపు శ్రీనివాసరావు,ప్రిన్సిపల్, కెవిఎల్ఎన్ సంస్కృత కళాశాల, తెనాలి – *"పద్యానికి ధారాశు ద్ధి అద్భుతంగా ఉంది. పద్యం అల్పాక్షరముల ననల్పార్థ రచనమన్నట్లు సంతృప్తిగా ఉ ంది. విషయంలో పద్యాలలో అవసరం అనుకున్నచోట వచనం విసుగు కలిగించకుండా బాగుంది"*** అని అన్నారు.

"తానేమో చదువుకోలేదని అంటున్నారు గానీ అది కేవలం వినయోక్తి అని నా అనుమానం–ఎందుకంటే సంస్కృత సమాస ఘటనలో వీరు చాలా మెలకువలు చూపించారు. మూల విధేయమైన మరొక పద్య రామాయణాన్ని తెలుగు సాహిత్యానికి అందించినందుకు శ్రీ పద్మనాభరావు గారికి కృతజ్ఞతాభివందనములు" అని అన్నారు బేతవోలు రామబ్రహ్మంగారు.

"***ఈ రామాయణం స్వతంత్రతను కోల్పోకుండా వాల్మీకి గీచిన గీటు దాటకుండా సాగింది. అందుకనే ఇది శిరోధార్యం. వాల్మీకి రేఖను దాటకుండా ఆ మహర్షిని గౌరవించిన ముటుకుల వారి రామాయణం మన్ననలు అందుకోగలదని ఆశిస్తున్నాను"***
–సూరం శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, ఓరియంట్ కాలేజీ, తిమ్మసముద్రం.

ఆకలైన వారికన్నము పెట్టుట, పెద్ద పుణ్యమనిరి పెద్దలెల్ల
అన్నపూర్ణ మెచ్చి యైశ్వర్యమిచ్చును, తిరుగులేదు నీకు తెలుగుబిడ్డ –బెజ్జంకి

34. గుర్రం చెన్నారెడ్డి-1930-1996- రెంటచింతల



రచయిత, నటుడు, దర్శకుడు, పరిశోధకుడు గుర్రం చెన్నారెడ్డి-స్వగ్రామం ప్రకాశంజిల్లా రంగాపురం. విద్యాభ్యాసం కంభం, మాచర్లలో పూర్తిచేసి రెంటచింతలలో స్థిరనివాసం. ఆయన 1930 ఏప్రిల్ 28న జన్మించారు. నవోదయం నాటకం 1957లో రెంటచింతలలో మొదటి ప్రదర్శన జరిగింది. ఇతర రచనలు: **1. కవికొక మాట, 2. జేసు బరబ్బాస్,3. మగ్దాల మరియ (నాటకం), 4. రక్తాభిషేకం, 5. ఆర్య చాణక్య.**

ఇంకనూ నాటకాలు, నాటికలు, మూడు రేడియో నాటికలు. ఒక ఖండ కావ్యం. ఒక పద్యం ముప్పది ఏకపాత్రాభినయ కదంబం.అప్పగింత-జానపద సంగీత నృత్య రూపకం. మరెన్నో గేయాలు, వ్యాసాలు.

సాంఘిక, పౌరాణిక, జానపద నాటకాలలో పలువిధములైన పాత్రలు పోషించిన శతాధిక నాటక పాత్ర పరిపోషణాదురంధరులు. ప్రముఖంగా **"పలనాటి చరిత"** అను గ్రంథమును 1992లో ప్రచురించారు. పలనాటి చరిత్రలోని వెలుగులోకి రాని విభిన్న కోణములను నిశితంగా పరిశీలించారు. శాసనాల పరిశీలనతో సమర్థించారు. నాయకురాలు నాగమ్మ ఘనతను సరికొత్త కోణంలో చూపించారు. **"చైతన్య స్రవంతి"** అను సంస్థను స్థాపించి కళారంగానికి సేవలు అందించారు.

కవిసింహ కాశీపత్యావధానులు గారు స్థాపించిన**"నాగార్జున సాహితీ సమాఖ్య"** సంస్థలో సభ్యులు. ప్రతి సాహిత్యసభలో పాల్గొంటారు. చెన్నారెడ్డి గారితో సాహితీ సమాఖ్య కార్యదర్శిగా నాకు (రచయిత-బెజ్జంకి) సన్నిహిత పరిచయం ఉంది. ఆయన 1996 నవంబరు 1వ తేదీన స్వర్గస్థులయ్యారు.నాగార్జున సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించాము.

బ్రహ్మాండ మందున్న పిండాండ మిదియను సద్గురుబోధ వినవే మనసా!	గురుబోధ ఒక్కటే సంసార సాగరమును దరిచేర్చు నావని తలచవే మనసా! -	దేవుని మదినిల్పి ప్రకృతిని ప్రేమించు జీవుడే దేవుడా మనసా!

-మాతృశ్రీ అమృతమ్మగారి తత్వాలు- బెజ్జంకి

35. డాక్టర్ వీవీఎల్ నరసింహారావు-1930-2013, మాచర్ల



సాహిత్యబ్రహ్మ డాక్టర్ వాసిలి వేంకట లక్ష్మీ నరసింహారావు వీరి పూర్తి పేరు. కానీ వీవీఎల్ నరసింహారావుగా సుప్రసిద్ధులు. శ్రీమతి వాసిలి వేంకటసుబ్బమ్మ శ్రీ కోటిలింగం పుణ్యదంపతులకు 1930 జూలై 10వ తేదీన గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. బీఏ ఆనర్స్ తరువాత, ఎమ్.ఏ.చేసి శ్రీవేంకటేశ్వరవిశ్వ విద్యాలయం నుంచి **“నన్నయ అక్షరరమ్యత”** అనే సిద్ధాంత వ్యాసం సమర్పించి పిహెచ్.డి పట్టా పొందారు.

1949 నుంచి 1951 వరకు రెవిన్యూ డిపార్టుమెంట్‌లో పనిచేశారు. **1954లో ఏసీ కళాశాలలో తాను చదువుకున్న కళాశాలలోనే తెలుగు ఉపన్యాసకులుగా** ప్రవేశించారు. **అటనుంచి రాయచోటిలో తరువాత మాచర్ల ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాలలో** ప్రిన్సిపల్‌గా **బహుకాలం** పని **చేశారు. 1981** వరకు **మాచర్లలో ఉన్నారు. ఎందరో వారి శిష్యులు పలనాటిలో సుప్రసిద్ధులు. నిబద్ధతగల వ్యక్తి. సమయపాలన, అంకిత భావం వారి సొత్తు.**

వీవీఎల్‌గారి తెలుగు పాఠం వినటానికే కాలేజీకి వెళ్లేవాళ్లం అని వారి శిష్యులు ఎందరో నాతో (రచయిత డాక్టర్ బెజ్జంకి)అన్నారు. 1981వరకు మాచర్లలో ఉన్నారు. ఆ తరువాత అదే సంవత్సరం మాచర్ల ఎస్‌కెబిఆర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేశారు.

వీవీఎల్ నరసింహారావు గారిని వరించిన పదవులు:

ఉద్యోగ విరమణ అనంతరం ఆ ఏడాదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం-పరిశోధనాలయానికి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1988 డిసెంబర్‌లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల అధికారిగా పదవీబాధ్యతలు స్వీకరించారు. అదే విశ్వవిద్యాలయంలో 1993-94 వరకు ఆంధ్రాంగ్ల విజ్ఞాన సర్వస్వ సంపుటాలకు సంకలనకర్తగా సాహిత్యసేవ చేశారు. 1994 జనవరి నుంచి 1999 వరకు భారత ప్రభుత్వ విద్యాశాఖ నేషనల్ ఓపెన్ స్కూలు దక్షిణ భారత ప్రాంతీయ సమన్వయ అధికారి (డైరెక్టర్) గా పనిచేశారు. 1992 నుంచి 2013 వరకు కందిమల్లయపల్లెలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం

ఆస్థాన పండితులుగా తగిన మన్ననలు పొందారు.

2013 అక్టోబర్ 7 తేదీన తెలుగు సాహితీప్రియులను దుఃఖసాగరమున ముంచి దివికేగినారు.

ముఖ్యమైన కొన్ని అవార్డులు: 1. నన్నయ పురస్కారం 2. నవరత్న స్థగిత కంకణం 3. ఎన్‌టిఆర్ ఉగాది పురస్కారం 4. ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావు జన్మదిన పురస్కారం 5.కృష్ణశాస్త్రి అవార్డు 6. జాషువా మెమోరియల్ అవార్డు 7. ఎఱ్ఱోజు మాధవాచార్యులు అవార్డు 8. అభినవ భోజుడు గొన్నాబత్తుల పెదతాత అవార్డు 9. సాహిత్య బ్రహ్మ బిరుదు 10. అమెరికా ఆటా సభలో పురస్కారం- మొదలైన వెన్నో...

రచనలు: పద్యరచనలు: 1. ఆనంద బిక్షువు 2. అంతర్వాణి 3. ఖండకృతులు 4. సాహిత్యపరిశోధనలు 5.నన్నయ కవిత్వం-అక్షర రమ్యత 6. వసుచరిత్ర తత్వము 7. వినరా సుమతీ 8. కాళియ మకుట కందములు

చారిత్రక రచనలు: (నాటకాదులు): 1. నిషాపురాణం 2. నాగబసివి 3. ధర్మఖడ్గం 4. విద్యారణ్య గేయాలు 5. సమ్రాట్ శాతవాహన(టీవీ సీరియల్) 6. శుక్రశాపం (టీవీ నాటకం) 7. పులిముగ్గా (టీవీ అనుసరణ) 8. వీరబ్రహ్మ యోగి (టీవీ సీరియల్) 9. వీరగురుడు (చలనచిత్ర రచన) 10. హరిజనులు(చలనచిత్ర రచన) 11. కుతూబ్‌షా దర్బార్ 12. సాహిత్యరూపకాలు 13. గంగాలహరి 14. పైశాచిక కవితాగానం

ఆంగ్ల రచనలు కొన్ని, ఎన్నో గ్రంథాలకు సమీక్షలు, పీఠికలు రాశారు. పిల్లల కథలు, రేడియో నాటికలు, రేడియో ప్రసంగాలు చేశారు. పల్నాటి భక్తకవి శుభదాసు అనే వ్యాసాలు 1978లో ఆంధ్రప్రభ దినపత్రికలో రాశారు. పల్నాటి కవులు రచించిన గ్రంథాలకు ముందు మాటలు, పీఠికలు రాశారు.

డాక్టర్ వీవీఎల్ నరసింహారావు నిజంగా **'సాహిత్య బ్రహ్మ'** బిరుదును సార్థకం చేసుకున్నారు.

బహుకాలం పల్నాటి సీమలో మాచర్ల ప్రభుత్వ కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు.

1967లో కవిసింహ కశీపత్యవధానులు అధ్యక్షులుగా బసవలింగదేవరలతో నాగార్జున సాహితీ సమాఖ్యను స్థాపించారు. పాలపర్తి వేణుగోపాల్, మొదలైన కవి పండితులూ ఆ కాశీపతిగారి నాగార్జున సాహితీ సమాఖ్య కవిసమ్మేళనాలలో పాల్గొని పల్నాటి సీమలో సాహితీప్రియులను అలరించారు. **కాశీపతిగారి అంతిమ యాత్రలో**

గుర్రం మల్లయ్యగారితో పాల్గొన్నారు.

వీరి రచనలపై ఎందరో పరిశోధనలు చేసి ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలను పొందారు. **డాక్టర్ వీవీఎల్ సాహిత్య ప్రస్థానం** అనే సిద్ధాంత వ్యాసమును డాక్టర్ టీవీ భాస్కరాచార్య సమర్పించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు

36. తిరుపతి వేంకట లక్ష్మీనరసింహారావు 1932, మాచర్ల



తిరుపతి వేంకట లక్ష్మీనరసింహారావు మాచర్ల వాస్తవ్యులు. తిరుపతి వేంకట నరసమ్మ, గురవయ్యలకు 1932 లో జన్మించారు. మాచర్లలో ప్రాథమిక విద్య, గుంటూరు హిందూ కాలేజీలో బి.ఎ.పూర్తిచేసి బి.ఇడి. చేశారు. మండల విద్యాశాఖాధికారిగా నల్లగొండలో పనిచేసి విశ్రాంతి పొందారు.

రచనలు: 1. మాచర్ల చెన్నకేశవ శతకము, 2. పలనాటి వీరగాథ (చారిత్రక పరిశోధన గ్రంథము) 1998లో ప్రచురించారు.

37. డాక్టర్ స్వర్ణవాచస్పతి- 1933. దాచేపల్లి



డాక్టర్ స్వర్ణ వాచస్పతి దాచేపల్లి వాస్తవ్యులు. వీరు 11-9-1933లో జన్మించారు. తల్లి రాజ్యలక్ష్మి. తండ్రి స్వర్ణ సుబ్రహ్మణ్యకవి. బి.వి.ఎస్సి చదివారు.వృత్తిరీత్యా పశువైద్యాధికారి.1992లో పదవీవిరమణ చేశారు. **'విమర్శకాచార్య', 'శిల్పకళాకోవిద'** బిరుదాంకితులు. వీరు పల్నాటిలో స్థిరని వాసం ఏర్పరచుకున్నారు. ప్రవృత్తిరీత్యా వీరు ప్రముఖ రచయిత. పలు పరిశోధనాత్మక గ్రంథాలు రాశారు.

1.వాల్మీకి రామాయణ సౌరభాలు 2. మహాభారత స్వస్వరూపము 3. రావణబ్రహ్మ చరిత్ర 4.అథర్వణాచార్యుడు 5. కందుకూరి రుద్రకవి చరిత్ర 6. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి చరిత్ర 7. అఖిలదేవతా స్తోత్రమంజరి 8. వాల్మీకి రామాయణ స్వస్వరూపం 9.గాయత్రి మంత్ర విశేషములు 10. బ్రహ్మవంశ చరిత్ర 11. ఈశ్వరీదేవి చరిత్ర 12. శ్రీకృష్ణ స్వస్వరూపం 13. దేవదానవుల చరిత్ర ....

14. పల్నాటి చరిత్ర 15. రావణబ్రహ్మ

ప్రస్తుతం రుద్రకవి సాహిత్యపీఠం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

38. పులుసు గోపిరెడ్డి -1933- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం, వెల్దుర్తి వాస్తవ్యులు. పులుసు గురవారెడ్డి కుమారుడు. 1933లో జన్మించారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలో. ఆ తరువాత విజయవాడలో ఉన్నత విద్యలు పూర్తి చేశారు. ఆంధ్రావిశ్వవిద్యాలయం నుంచి బి.కాం.(ఆనర్స్), వరంగల్లులో బి.ఇడి. పూర్తిచేశారు. విజయవాడలో వివిధ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. సయ్యద్ అప్పలస్వామి డిగ్రీ కళాశాల (విజయవాడ)లో ప్రిన్సిపల్‌గా పని చేశారు. నాగార్జున యూనివర్సిటీలో సెనెట్ మెంబర్‌గా సేవలందించారు.

గోపిరెడ్డి గారు ప్రముఖ రచయిత. రేడియో ప్రసంగాలు చేసేవారు. నాటికలు, రూపకాలు రచించారు. ప్రముఖుల జీవితచరిత్రలు రాశారు.

రచనలు: 1. నేతాజీ సుభాస్‌చంద్రబోస్ జీవితచరిత్ర, 2. దీనదయాళ్ ఉపాధ్యాయ, 3. బాలాసాహెబ్‌దేశ్ పాండే, 4. యుగద్రష్ట డాక్టర్ హెడ్గేవార్, 5.బాల్‌రావ్ దేవరస్, 6. యాదవరావ్ జోషి,7. తొలివెలుగులు (1947కు ముందు ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేసిన ప్రముఖులు), 8. సంఘ వికసిత కుసుమం –సోమేపల్లి సోమయ్య, 9. దారి చూపిన దీపకళిక (గురూజీ గోల్వాల్కర్ సంగ్రహ జీవితచరిత్ర), 10. తరం మారింది– కథల సంపుటి, 11. ఎదిగిన మనిషి – నవల, 12. మనలో మాట – వ్యంగ్య రచనల సంకలనం, 13. బాలా సాహెబ్‌దేశ్ పాండే (ఆంగ్లంలో జీవితచరిత్ర)

జాగృతి వారపత్రికలో **'మరవరాని మహామహులు'** అంటూ ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేసిన ప్రముఖుల గురించి ధారావాహికను, వ్యంగ్య రచనల కాలమ్‌ను నిర్వహించారు. **"స్వర్గీయ ముళ్లపూడి స్మారక జాతీయ పురస్కారం"** అందుకున్నారు.



39. చిటిప్రోలు కృష్ణమూర్తి- 1933 జిట్టగామాలపాడు

పలనాటి సీమలో చారిత్రక నేపథ్యంగల ఊరు జిట్టగామాలపాడు. నాయకురాలు నాగమ్మ ఏలిన గడ్డ జిట్టగామాలపాడు. జిట్టగామాలపాడులో నాగమ్మ రాజకీయ దిట్ట. చిటిప్రోలువారు పాండిత్యంలో దిట్ట. ఆ ఊరి జనులు పౌరుషానికి దిట్టలు. పలనాటి పౌరుషానికి కీర్తి

తెచ్చిపెట్టిన ఊరు. దిట్టలైన కవులకు పుట్టినిల్లు గామాలపాడు!

జిట్టగామలపాడులో 1933 డిసెంబర్ 26న జన్మించారు చిటి[ప్రోలు కృష్ణమూర్తి. పాణినీయ వ్యాకరణాన్ని ఔపోసన పట్టారు. వ్యాకరణ గ్రంథాలన్నీ వారికి కరతలామలకములు.

కృష్ణమూర్తి ప్రౌఢకవి. పలనాటిలో కవులుగా ప్రచారం పొందిన వారి గ్రంథాలను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేసిన వ్యక్తి కృష్ణమూర్తి గారొక్కరే.

'కేకేయి' వీరి తొలి గ్రంథం. కైకేయి 1959లో తొలి ముద్రణ పొందింది. అనంతరం 1966లో ద్వితీయ ముద్రణకు నోచుకుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ వారు కైకేయిని 1964 నుంచి 1966 వరకు బి.ఏ. స్పెషల్ తెలుగు పాఠ్యగ్రంథంగా పెట్టారు. అంటే వీరి గ్రంథం గొప్పతనం చెప్పనవసరం లేదు.

"తరంగిణి" అను ఖండకావ్య సంపుటిని 1966లో ముద్రించారు.

2003లో "మాఘమేఘాలు" అను పద్యకావ్యమును, 2006లో "పురుషోత్తముడు" అను పద్య కావ్యమును 8 ఖండాలుగా రచించి సాహితీప్రియులకు అందించారు. దీనికి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ పురస్కారం పొందిన పల్నాటి సీమలో ఏకైక వ్యక్తి ఆయనే.

ఆంధ్రదేశంలోని ప్రఖ్యాత పండితులు పై రెండు గ్రంథాలకు అభిప్రాయాలు రాశారు. గ్రంథంలోని విశేషాంశములను క్షుణ్ణంగా పరిశీలించారు.

మాఘమేఘాలు– అదో అపురూప కావ్యం. మాఘుడు రాసిన **శిశుపాల వధ**, కాళిదాసు మహాకవి రాసిన **మేఘసందేశం** సంస్కృత కావ్యాలను తేట తెలుగులోకి అనువదించారు. యథాతథ అనువాదం చేశారు.

మాఘ, మేఘ కావ్యాలకు వ్యాఖ్యానం రాసిన పండిత మల్లినాథసూరి– **"మాఘే, మేఘే గతం వయః"** అన్నారు. అంటే మాఘకావ్యానికి, మేఘ సందేశానికి వ్యాఖ్యానం రాయటంలోనే ఆయన వయస్సు అంతా అయిపోయింది అని..!

మాఘ,మేఘాలకు సాహిత్యబ్రహ్మ డాక్టర్ వీవీఎల్ నరసింహారావు, డాక్టర్ ఆకురాతి పున్నారావు, డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం పీఠికలు రాశారు.

నేటి రోజులలో కృష్ణమూర్తి వంటి పాండిత్యం ఉన్న వ్యక్తులు లేరు అనుట అతిశయోక్తి కాదు. కృష్ణమూర్తి పలనాటి సోదర కవులు– ప్రభులింగాచార్యులు,

చినలింగాచార్యులు, వీరభద్రాచార్యులుకు అత్యంత సన్నిహితులు.

పలనాటి సీమ ప్రజలు గర్వపడు వ్యక్తి చిటిప్రోలు కృష్ణమూర్తి! సాధారణ వ్యక్తి. నిగర్వి, సౌమ్యులు, సావధాన చిత్తులు. పలనాటి రచయితలకు చక్కగా, నింపాదిగా సూచనలు ఇస్తూ రచనా వ్యాసంగాన్ని పెంపొందించటానికి తగిన సూచనలు ఇస్తూ ఉంటారు.

మాచర్లలో 1960 ప్రాంతంలో **కవిసింహ పోకూరి కాశీపత్యవధానులు** ఏర్పాటు చేసిన **'నాగార్జున సాహితీ సమాఖ్య'**లో పాల్గొని సాహిత్య సభలను జయప్రదం చేస్తూ ఉంటారు.

చిటిప్రోలువారు పలనాటి సీమలో ఆర్యవైశ్య కులంలో పుట్టి కులానికే వన్నె తెచ్చినారు. వీరి కలం నుండి మరిన్ని మహాద్భుత కావ్యాలు వెలువడాలని ఆశిస్తున్నాము.

కాగా వీరు కూడా నాగార్జున సాహితీ సమాఖ్య సభ్యుడే గనుక వారిని సముచిత రీతిన సమాఖ్య తరపున సత్కరించుకోవడం జరిగింది.

40. గోలి వెంకటరామశర్మ- 1933, పట్లవీడు

వీరు దుర్గి మండలం పట్లవీడు వాస్తవ్యులు. శేషయ్య, భ్రమరాంబ దంపతులకు 20.01.1933లో జన్మించారు. భాషాప్రవీణ చదువుకున్నారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తూ ఏప్రిల్ 1991లో దుర్గి ఉన్నత పాఠశాలలో రిటైర్ అయ్యారు.

వీరి**రచనలు** : 1. ఆత్మకథ. 2. వాల్మీకి రామాయణంలోని కొన్ని రత్నాలు. 3. మన ఆచారాలు వాటి అంతరార్థాలు. 4. మన మహర్షులలో చాలామంది శాస్త్రజ్ఞులే 5. మేము చేసిన తీర్థయాత్రలు. 6. ఉపనయనము ఒక ఉత్తమ సంస్కారము. 7. వివాహము ఒక పవిత్ర సంస్కారం. 8. ధన్యజీవి మా తమ్ముడు గోలి సీతారామయ్య. (అముద్రితము).

అర్హత గలవాని కందించు చేయూత దానధర్మ ఫలము దక్కు నీకు
పాడిగాదు నీ కపాత్రదానమొసగ, తెలిసి దానమివ్వు తెలుగుబిడ్డ - బెజ్జంకి

ఆధునికత యనిన కాదు వేషాలురా, మూఢ భావములను వీడుటేను
అంటరాని తత్వమంతరించవలెను, తెలిసి నడచుకొనుము తెలుగుబిడ్డ -బెజ్జంకి

41. డాక్టర్ అన్నపురెడ్డి శ్రీరామరెడ్డి- 1935. అనుపాలెం


పిడుగురాళ్ళ మండలం అనుపాలెం వీరి స్వగ్రామం. 1935లో జన్మించారు. ఎం.ఎ., పిహెచ్.డి చేశారు. పి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడలో హిందీ శాఖాధ్యక్షులుగా పనిచేశారు.



రచనలు: 1. **పంత్ కావ్య మే సౌందర్యభావనా** (పరిశోధన గ్రంథం), 2. **కలియోం కే ద్వార్‌పర్ అలియోం కా గుంజన్** (హిందీ వ్యాసవాహిని) ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం బి.ఎ. ద్వితీయ సంవత్సరం (1976–78) పాఠ్యపుస్తకం 3. **సుమన్ మన్** (హిందీ కవితా సంపుటి)

4. **ఆగ్ ఔర్ రాగ్,** 5. **శ్రీ** – తెలుగు నుంచి హిందీ అనువాదం , 6. **అక్షర తుణీరము** – తెలుగు వ్యాసవాహిని, 7. **గోదావరి బిందువులు** – తెలుగు కవితాసంపుటి, 8. **గంగా తీరపు కాకి రెక్కలు** – హిందీ నుంచి తెలుగు అనువాదం, 9. 6వ తరగతికి **హిందీ పాఠ్యపుస్తకం** 10. 6వ తరగతికి **హిందీ ఉపవాచకం,** 11. **శ్రీకాంత్ శిఖర్** తెలుగు నుంచి హిందీలో గేయకావ్యం, 12. **హిందీ సాహిత్యావలోకనం** – ఆకాశవాణి విజయవాడ, 13. **గుక్కెడు నీళ్ల కోసం** – కవితా సంపుటి (1991)

42. కన్నెగంటి ప్రభాకరశాస్త్రి – 1936 తక్కెళ్ళపాడు



కన్నెగంటి వారిది తక్కెళ్ళపాడు గ్రామం. దాచేపల్లి సమీప గ్రామం. పలనాటి సోదర కవులలో మొదటివారు ప్రభులింగాచార్యులు. వీరి కుమారులు ప్రభాకరశాస్త్రి. ఈయన 1936 సంవత్సరంలో జన్మించారు. విద్యాభ్యాసం పలనాటి సీమలో. పుట్టింది కన్నెగంటివారి వంశంలో. కనుక కవిత్వం అబ్బటంలో విశేషం లేదు. అబ్బకపోతేనే విశేషం!

ప్రభాకరశాస్త్రి వృత్తిరీత్యా రెవిన్యూశాఖలో పని చేశారు. ప్రవృత్తి కవితా వ్యాసంగం. ఆధ్యాత్మిక వ్యాసాలు రాయటం అలవాటు. అవి భారతి మాసపత్రికలో ప్రచురితమయ్యేవి. భారతి మాస పత్రికలో వ్యాసం ప్రచురితమైంది అంటే ఆ రచయిత సత్తాగలవాడు అని భావం. ఇది పాఠకలోకానికి తెలుసు. భారతి సంపాదకులు చచ్చు,పుచ్చు రచనలను ప్రచురించరు.

వీరి రచనలు, ప్రసంగాలు ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ప్రసారమైనాయి. ప్రభాకరశాస్త్రి ఉత్తమ అభిరుచులు, స్నేహలాలస కలవారు. శరత్ సాహిత్యం అంటే మక్కువతో వ్యాసాలు ధారావాహికలుగా వెలువరించారు. కథానికలు, నాటికలు, వ్యాసాలు రాస్తూ ఉంటారు.

ఆంధ్రప్రభ, భారతి, స్రవంతి వంటి పత్రికలలో ప్రచురించేవారు.

రచనలు: 1.పరాజిత (నాటికల సంపుటి) 2. నన్ను విడుదల చేయండి – నాటిక 3. అంతిమ లేఖ (కథాసంపుటి), 4.ఆనందస్థపతి –నవల 5. వెలుగు రేఖలు 6. జీవన గమ్యం (ఆధ్యాత్మిక వ్యాస సంపుటి) 7.గోపికా సాంత్వము (పద్య కావ్యము) 8. సోమలింగ శతకం. మొదలైన రచనలు ప్రభాకరశాస్త్రి కలం నుంచి వెలువడినవి.

వెలుగు రేఖలు పీఠికలో మచ్చుకు కొన్ని మాటలు–

వెలుగు రేఖలు శ్రీ శాస్త్రి మణిపూసల హారం. ఆంధ్ర సాహితీసరస్వతి కంఠాన్ని అలరింపజేసిన 36 రంగుల మణిపూసల కంఠాభరణం..!

వెలుగు రేఖలు వ్యాసాలు కావు. భావతరంగాలు. కొన్ని హాయిని గొల్పేవి, కొన్ని ఆలోచనను రేకెత్తింపజేసేవి. కొన్ని ఉపదేశాత్మకమైనవి, కొన్ని సలహాలనిచ్చేవి.

–డాక్టర్ బి.లక్ష్మయ్యశెట్టి, ప్రిన్సిపల్, ఎస్వీఆర్పి డిగ్రీ కాలేజి, పొదిలి.

"జీవన గమ్యం" అనే దానిలో కవి పండితులైన శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి సంప్రదాయక సిద్ధాంతాలను చర్చించారు. ఆయన దార్శకుడుగా, దార్శనికుడుగా ప్రత్యక్షమైనారు. –డాక్టర్ సంజీవదేవ్

ఆనంద స్థపతి శిల్పాచార్యుని పవిత్ర జీవితము. ఇది పలువురు నవలా రచయితల మెప్పు గాంచినది. తండ్రి, తాతల ఆశీఃప్రభావమున చిరుప్రాయముననే వీరిని కవితాకన్య వలచి వచ్చినది.

–విద్వాన్ కె. రామానుజాచార్యులు, ఉలవపాడు

గోపికా సాంత్వము– పీఠికలో...

"శాస్త్రి వృత్తిచే సారస్వతజీవి కాకున్ననూ, ఎడతెగక రచనలుచేయు ప్రవృత్తి అలవరచుకున్నారు. నేనో నిత్యసారస్వత జీవినయ్యాను. గుబులు పుట్టినప్పుడెప్పుడో ఒకసారి కాని రచన కుపక్రమించను. ఈ పరిచయవాక్యముల మిషతోనైన ఒక సారస్వత రచనను చదువుట,పరిశీలించుట,తోచిన భావములను, పొందిన యానం దమును ఒక క్రమములో అక్షరబద్ధము చేయుట అను రచనావ్యాసంగము జరుగును కదా యనెడి ప్రలోభమే నన్ను ఈ ముందుమాట వ్రాయుటకు ప్రేరేపించినది. తీరా గ్రంథము పుటలు విప్పి చదువ దొరకొందునుగదా రచన మందలి మాధుర్య సౌకుమార్యాది గుణ గౌరవముచే కావ్యమునెడ మిగుల ఆకర్షించబడితిని" – అని సాహిత్యబ్రహ్మ

డాక్టర్ వీవీఎల్ నరసింహారావు రాస్తూ గ్రంథములోని మధుర ఘట్టాలను, అందలి మాధుర్యమును విశదీకరించారు.

"వృత్త మనోజ్ఞము రుచిరో
దాత్త కవిత్వమ్ము రససమగ్రము విద్వ
చ్ఛిత్తములకెక్కు నీ కృతి
మెత్తదనము తియ్యదనము మెయికొను కతనన్"

- కళాప్రపూర్ణ, దర్శనాచార్య కొందూరు వీరరాఘవాచార్యులు

" సార్థకతగన్న గోపికా సాంత్వమింత
క్రమముగ నెట్లు వెలయింప గంటివోయి!
కృష్ణు విభునెంచుకొని పుల్కరించు నీవు
సుకవిశేఖర! నాటి గోపికవోయేమొ"

- చిటిప్రోలు కృష్ణమూర్తి, గామాలపాడు

ఈ విధంగా మరికొందరు వారివారి అభిప్రాయములలో ప్రభాకరశాస్త్రి రచనలను, వాటిలోని ప్రత్యేకతలను మెచ్చుకున్నారు.

43.ప్రత్తిపాటి రామకోటయ్య (1936 - 2012), పిడుగురాళ్ల



ప్రత్తిపాటి రామకోటయ్యగారు పిడుగురాళ్ల వాస్తవ్యులు. ప్రత్తిపాటి నరసమ్మ, రోశయ్య దంపతులకు 1936 జనవరి 7వ తేదీన జన్మించారు. కో-ఆపరేటివ్ రిజిస్ట్రారుగా ఉద్యోగ విరమణ చేశారు.


1.స్పిరుచువల్ కమ్యూనిజం (ఆధ్యాత్మిక భౌతికవాదాల సమన్వయం)

2.స్పిరుచువల్ కమ్యూనిజం-2 (దళిత బహుజన రాజ్యాధికార తత్త్వశాస్త్రం) అను పుస్తకమును 2008లో ప్రచురించారు. 2012 ఆగస్టు 16వ తేదీన దివంగతులయ్యారు.

కలత చెందవలదు కష్టాలు కలిగిన, కష్టమిట్టె బోయి కలుగు సుఖము
కష్టపడెడివాడు నష్టపోడెన్నడు, తెలిసి నడచుకొనుము తెలుగుబిడ్డ- బెజ్జంకి

సంఘసేవ కొరకు చందాలు దండుచూ, దొరికినంత బుక్కు దొరలు కలరు
సంఘసేవ ముసుగు సభ్యత కాదురా, తెలిసి నడచుకొనుము తెలుగుబిడ్డ -బెజ్జంకి

44. చేపూరు సుబ్బారావు- 1937 ఆత్మకూరు



దుర్గి మండలం ఆత్మకూరులో 1937 ఆగస్టు 23న సరస్వతమ్మ,నాగభూషణం పుణ్యదంపతులకు జన్మించారు. సమీపంలోఉన్న దుర్గిలో విద్యాభ్యాసం చేశారు. నర్సరావు పేట, విశాఖపట్టణం, హైదరాబాద్‌లలో ఉన్నత విద్యా భ్యాసం చేశారు. ఆంధ్రావిశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల భాషా సాహిత్యాల్లో ఎం.ఎ. పట్టా పొందారు. ఉస్మానియా నుంచి ఎల్.ఎల్.బి. పట్టాపొందారు. గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా 'నగరం'లోని ఎస్.వి.ఆర్.ఎం.కాలేజీలో 28 ఏళ్లపాటు ఆంగ్లశాఖాధ్యక్షులుగా పనిచేసి 1997 ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు.

వీరి రచనలు:

1. THE MARVEL OF SANKARABHARANAM 1981లో ప్రచురించారు.

శంకరాభరణం సినిమా సచిత్రంగా ఆంగ్లంలో విశ్లేషించారు. ఆనాటి గవర్నర్ కె.సి. అబ్రహం గారు, నాగార్జున యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ బి.స్వామిగారు పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

2. TALKS AND ARTICLES అనే గ్రంథంలో 21 సాహిత్య వ్యాసాలను సంకలనం చేసి 2010లో ప్రచురించారు. షేక్స్‌పియర్ సానెల్లు తెలుగులోకి అనువదించారు.

3. THE NIGHT NECTAR RAINED ఇది ఆంగ్ల కవితల సంకలనం 2014లో ప్రచురించారు.

4. సాహితీ వ్యాసాలు-సమీక్షలు – 2014లో ప్రచురించారు.

5. దక్షిణాఫ్రికాలో భారతీయ దేశభక్తుడు (ఎం.కె.గాంధీ) జోసఫ్ జె. డోక్ ఆంగ్లంలో రాసిన గాంధీ జీవితచరిత్ర తెలుగులోకి అనువదించారు.

ఇంకను వీరు విశ్వనాథ సత్యనారాయణ గారి **వేయిపడగలు నవల 29 – 34 అధ్యాయాలు** ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

సప్తగిరుల పైన సప్తసాగరములో, దాచిన ధనమున్న దోచువాడు
విద్య నేర్చినట్టి విజ్ఞానవేత్తయే, వలదు పాడుపనులు తెలుగుబిడ్డ -బెజ్జంకి

నీతి లేదు పాపభీతి లేనే లేదు, పరుల సొమ్ము దోచు నరులకసలు
అట్టి నరుల చెలిమిపట్టిన చేటురా, తెలిసి నడచుకొనుము తెలుగుబిడ్డ - బెజ్జంకి

45. ఉస్తేపల్లి సదాశివయ్య- 1938-2019 గుండ్లపాడు

వీరు వెల్దుర్తి మండలం, గుండ్లపాడు వాస్తవ్యులు. ప్రస్తుత నివాసం మాచర్ల పట్టణం. 1938లో ఉస్తేపల్లి మల్లయ్య, మహలక్ష్మిలకు È“ ˆ+# sTMsT**ఆంధ్ర జీవామృతము'**అను గ్రంథమును రచించారు. భగద్గీత18అధ్యాయాలు తేటగీతి పద్యాలలో అనువదించారు.సంస్కృత శ్లోకాలకు పద విభజన చేసి లఘువ్యాఖ్య పద్యములతోరచించి 2008 సంవత్సరం లో ప్రచురించారు.



1958లో వెల్దుర్తి ప్రభుత్వ పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి చదివారు.ఆధ్యాత్మిక చింతనాపరులు. 2019 లో దివంగతులయ్యారు.

46. షేక్ అబ్దుల్ సలాం- 1938-2008.తుమ్మలచెరువు



పిడుగురాళ్ళ మండలం తుమ్మలచెరువు గ్రామంలో షేక్ మస్తాన్ సాహెబ్, సిలార్‌బీ పుణ్య దంపతులకు 1938లో అబ్దుల్ సలాం జన్మించారు. ఎం.ఎ.,ఎం.ఇడి.,ఎల్.ఎల్.బి. చేశారు. 1972లో ఉద్యోగ విరమణ చేశారు. ఆంధ్రాంగ్ల భాషలలో పాండిత్యమున్నవారు. శ్రీశ్రీ అభిమాని. 1.**"చలం గారి శ్రీశ్రీ"** అనే పుస్తకం రాశారు. **2.** పల్నాడులో సహాయ నిరాకరణోద్యమం లేక కన్నెగంటి హనుమంతు జీవిత చరిత్ర రాసి 1998లో అచ్చు వేయించారు. మాచర్లలో కొంతకాలం నివసిం చారు. తర్వాత అవసానదశలో పిడుగురాళ్ళలో స్థిరపడ్డారు. 2008 అక్టోబర్ 10వ తేదీన పిడురాళ్ళలో కన్నుమాశారు.

47. పెద్దోజు పరబ్రహ్మాచార్యులు -1940 మాచర్ల

పెద్దోజు పరబ్రహ్మాచార్యులు పుట్టింది పలనాటిలో జిట్టగామాలపాడు గ్రామం. జిట్టగామాలపాడులో కవులు దిట్టలు. పరబ్రహ్మకవిగారి తండ్రి వీరబ్రహ్మ కవి. తల్లి నాగమ్మ. ప్రస్తుతం పరబ్రహ్మకవి మాచర్లలో ఉంటున్నారు. పరబ్రహ్మకవిగారు నటులు, గాయకులు, చక్కని కంఠ స్వరం, సంగీత పరిజ్ఞానం కలవారు. పలనాటిలో


పెద్దోజు
పరబ్రహ్మాచార్యులు

జరిగే సాహిత్య సభలు వీరి ప్రార్థనాగీతంలో ప్రారంభమవుతాయి. స్వీయ కవితలు పఠించేవారు. వయస్సులో ఉండగా స్టేజి నాటకాలు ఆడినారు. చక్కని ముఖవర్చస్సు!
పరబ్రహ్మకవి వేంకటేశ్వర శతకం రాశారు. భక్తిగీతాలు రాశారు. పాడతారు. ఖండకావ్య రచన సాగుతోంది. వేంకటేశ్వర శతక రచన అమోఘం. కవి పండితుల మన్ననలు పొందింది. పరబ్రహ్మకవి
భక్తిభావంతో మనోబాధలు, వ్యథలు స్వామికి చెప్పుకున్నారు. మనోభావాలను ఉత్పలమాల, చంపకమాలతో కూర్చి స్వామివారి మెడను అలంకరింపజేశారు.

ఈ శతకంలో ఆత్మకథావిశేషాలు అనేకం. సంస్కారపరమై కనిపిస్తాయి. ***పెద్దోజు అంటే 'పెద్ద ఓజు' గొప్ప గురువు అనే దీని అర్థం. దానిని సార్థకం చేసుకున్నాడీ కవి అని*** సాహిత్య బ్రహ్మ వీవీఎల్ నరసింహారావు అన్నారు.

'అన్నమాచార్య కీర్తనలోని 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అన్నభావమే –శబ్దమొక్కటే ఇక్కడ పరబ్రహ్మకవిగా అవతరించిందని అనుకుంటున్నారు' అని 'విద్యావిశారద' డాక్టర్ కన్నెకంటి రాజమల్లాచారిగారు అన్నారు.

భావ ప్రకటనలో ఎంతో సున్నితమైన చమత్కారముంది. మాటకూర్పు మిక్కిలి సముచితం గానూ పొందికగానూ ఉంది.

"నా సతి నను ప్రేమగ జూచు మనసారగ నాదు భాగ్యమెట్టిదో... పుణ్యంకొద్దీ పురుషుడు అన్న మాటేగాని 'భాగ్యంకొద్దీ భార్య'అన్నమాట వినబడని పురుషాధిక్య ప్రపంచంలో, భార్య అనురాగాన్ని అపురూప భాగ్యంగా భావిస్తున్న కవి, స్త్రీని ఉచిత రీతిని గౌరవించే మహనీయుడు ఈ కవి" అని అన్నమాచార్య కీర్తనలు పాడే ప్రఖ్యాత గాయని శోభరాజు అన్నారు.

"కోరను భక్ష్యభోజ్యము, కోరను కోరను పట్టు పుట్టముల్
కోరను హంసతూలికలు, కోరను హాటకరత్నహారముల్
కోరను మళ్ళు మాన్యములు, కోరను నా మది ద్రవ్యరాశులన్
కోరెద నొక్క కోర్కె తుదకున్ నిను జేరగ వేంకటేశ్వరా!"

ఏ కోరికా కోరని కవిగారిలో **దృఢమైన భక్తిభావం** ఈ పద్యభావంలో కన బడుతోంది.

"కష్టము లెన్ని గల్గినను కల్గిన దానన తృప్తి జెందుచున్
భ్రష్టుల జేరబోక కవిపండితగాయక శిల్పవర్యులం
దిష్టుడనై చరించుటకు నింపగు యోగ్యతనిమ్ము చాలునో
శిష్ట జనావనా ప్రణుతి చేసెద నిచ్చెలు వేంకటేశ్వరా!"

కవిగారి సంస్కారం పైపద్యంలో కనిపిస్తుంది. ఇటువంటివి ఇందులో ఎన్నో ఉన్నాయి

48. బిజ్జం బ్రహ్మారెడ్డి -1941, మాచర్ల



వీరు 1941లో మాచర్లలో జన్మించారు. రచయిత, నాటకకర్త, సాంఘిక, పౌరాణిక నాటకాలు రాశారు. 1990లో అగ్నిప్రవేశం అను చారిత్రాత్మక నాటకం (శ్రీ కన్యకా పరమేశ్వరి చరిత్ర) రాశారు. 1969లో అనురాగ బంధాలు అను సాంఘిక నాటకం రాశారు. దర్శకత్వం వహించి, నటించారు కూడా. 1960లో పుస్తకంగా అచ్చు వేయించారు.

49. మొవ్వ వృషాద్రిపతి- 1941, మాచర్ల

మొవ్వ బాలమాంబ, మొవ్వ శ్రీనివాసపెరుమాళ్లు పుణ్యదంపతులకు వృషాద్రిపతి 1941లో రేపల్లెతాలూకా పూడివాడలో జన్మించారు. 1990-91 ప్రాంతంలో మాచర్ల-ఎస్‌కెబిఆర్ డిగ్రీ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. కవిసింహ పోకూరికాశీపతి సాహిత్యపీఠం వారు స్వర్ణసింహతలాట బహూకరణతో మాచర్లలో ఘనంగా సన్మానించారు.



రచనలు: విజయాంజనేయం, సమగ్ర ఆంజనేయస్వామి చరిత్ర, శ్రీకృష్ణదేవరాయ విజయప్రబంధం ప్రథమభాగం (దీనికి 8 పురస్కారాలు లభించాయి), శ్రీకృష్ణదేవరాయ విజయ ప్రబంధం ద్వితీయ భాగం, శ్రీబాలకృష్ణ లీలా విలాసం,శ్రీకృష్ణదేవరాయల ప్రకృతి వర్ణణావైదుష్యం, శ్రీ పద్మావతీ శ్రీనివాసీయం (పద్యప్రబంధం) తపస్సిద్ధి (**కవిసింహ పోకూరి కాశీపతి**

సెంటినరీ అవార్డు పొందిన గ్రంథం) సోమనాద్రి, విశ్వగాయత్రి, కన్నెవాగు తదితర అనేక రచనలు చేసి పేరొందిన కవివరేణ్యులు. మరియు భద్రాచలం, శ్రీశైలం పుణ్యక్షేత్రాలలో ఉత్సవాల సందర్భంగా ప్రత్యక్ష వ్యాఖ్యానంచేసినవారు. ఆయన దేశవిదేశాల్లో ఎన్నో పురస్కారాలు, సన్మానాలు పొందారు.

50. అత్తలూరి నాగభూషణాచారి - 1942, కంభంపాడు



వీరు **సహజకవి** బిరుదాంకితులు. భక్తిపాటలు రాయటంలో అందెవేసిన చెయ్యి. అత్తలూరిశివరామ య్యాచారి, ఈశ్వరమ్మ దంపతులకు1942 మే 9వ తేదీన జన్మించారు. **రచనలు: 1. హరిహరుల భక్తిభజన పాటలు 2. శ్రీశ్రీ శివసత్య బాలయోగీంద్రస్వాముల వారి భక్తి పాటలు 3. శివభక్తి గీతాలు** –శైలబంధం, నాగబంధంలో రచనలు చేస్తారు.

51. తమ్మినేని అక్కిరాజు, 1948 దాచేపల్లి,

సూరమ్మ, అప్పారావు దంపతులకు తూర్పుగోదావరి జిల్లా తణుకులో 1948 జులై 8 వ తేదీన జన్మించారు. ఎమ్.ఏ. (తెలుగు) చదువుకుని బతుకుతెరువు కోసం 1980లో దాచేపల్లికి వచ్చి స్థిరపడ్డారు. అక్షరదీప్తి, వయోజన విద్య ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వాటిల్లో ఆయన చేసిన సేవలకుగాను పల్నాటి గడ్డమీద అనేక ప్రశంసలు, సత్కారాలు పొందారు. అక్షరదీప్తి కార్యక్రమానికి ఆయన ఊపిరి పోశారనవచ్చు.అక్షరాస్యత పెంపొందింపజేయడంలో ఆయన తనదైన శైలిలో కృషిచేశారు.అక్షరాస్యత తదితర కార్యక్రమాలలో ఆయన సహధర్మచారిణి చేదోడు వాదోడుగా ఉంటూ ఎంతగానో సహకరించేవారు.

రచనలు: 1. అక్కిరాజు కథలు (మూడు సంపుటాలు) 2. అక్కిరాజు కవితలు (మూడు సంపుటాలు) 3. దాచేపల్లి దర్శని 4. అక్షర జ్ఞాపకాలు మొత్తం 8 పుస్తకాలు ప్రచురించారు.

బాధ గురువులు గలరు బోధ గురువులు లేరు మాయ బోధల పడకు మనసా!	ఊపిరి ఉన్నపుడే ఉపకారమొనరించి సద్గతులు పొందవే మనసా!	అందరిలో నీవు నీలోన అందరూ కలరని తెలుకో మనసా!	-మాతృశ్రీ అమృతమ్మగారి తత్వాలు- బెజ్జంకి

52. కోసూరి నాగబ్రహ్మానందం-1952-2017 దుర్గి



కోసూరి మాణిక్యమ్మ, వెంకటసుబ్బారావు పుణ్య దంపతులకు1952 ఆగస్టు 8వ తేదీన తెనాలిలో కోసూరి నాగబ్రహ్మానందం జన్మించారు. ఎస్ఎస్ఎల్సి, భాషాప్రవీణ చదువుకున్నారు.ఎలవర్తి ఆంజనేయ శాస్త్రిగారి పాఠశాల లో స్మార్తం నేర్చుకున్నారు. 1986లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుపండితులుగా ఉద్యోగజీవితం ఆరం భించారు. పలుచోట్ల పనిచేసి 1991లో దుర్గి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు తెలుగు పండితులుగా బదిలీపై వచ్చారు. పలనాటిలో దాదాపు పదేళ్లకు పైగా తెలుగుపండితులుగా పనిచేసి విద్యార్థులందరినీ తీర్చిదిద్దారు.కేవలం ఉపాధ్యాయవృత్తికే అంకితం కాకుండా ప్రవృత్తిదిశగా ఉదయం, సాయం సమయాల్లో స్మార్తంలో వివాహం,ఉపనయనాలకు సంబంధించిన మంత్ర భాగాన్ని బోధిస్తూ ఎందరికో శిక్షణఇచ్చారు. వారందరూ నేడు ప్రజ్ఞగల పురోహితులై వివాహాలు, ఉపనయనాలు సహా దేవాలయ ప్రతిష్ఠలు వగైరాలు చేస్తూ జీవనం గడుపుతున్నారు. నాగబ్రహ్మానందం కవిసమ్మేళనాలలో పాల్గొంటూ ఉండేవారు. వృత్తి, ప్రవృత్తుల్లో వీరి కృషికి గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, జీవనసాఫల్య పురస్కారం లభించాయి.

రచనలు: 1.శోడష కర్మలు వాటి ప్రాముఖ్యత (2016) 2. లఘు సంధ్యావందనం (వివరణతో 2017) 3.ఆబ్దికారాధన (క్రియావివరణ సహితంగా)ఈ మూడుగ్రంథాలు బాణాల మల్లికార్జునరావుగారి సారథ్యంలో సనాతన సాహిత్య పరిషత్-హైదరాబాద్ వారు ప్రచురించారు. త్యాగరాయ గానసభలో ఈ పుస్తకాలు ఆవిష్కరణకు నోచు కున్నాయి. కాగా 2010 ఆగస్టులో ఆయన ఉద్యోగ విరమణచేశారు. విశ్రాంత జీవితం గడుపుతూ కూడా ప్రవృత్తిధర్మంగా ఆయన అవిశ్రాంతంగా స్మార్తానికి సంబం ధించిన అంశాలు బోధిస్తూ పలువురికి శిక్షణనివ్వడం ప్రశంసనీయం. కోసూరి నాగ బ్రహ్మానందం 2017 మే 28వ తేదీన శివైక్యం చెందారు.

మాయ మనుజులు నిన్ను నీతిగా మననీరు నీతిపరులకు నీడ లేదాయె మనసా!	గుడిచుట్టు మోసాలు గుడిలోన మోసాలు డబ్బున్న వాడికే తొలి దర్శనము మనసా!	వారు నీవారను వీరు నావారను భేదము నీకేల మనసా!

-మాతృశ్రీ అమృతమ్మగారి తత్వాలు- బిజ్జంకి

53. డాక్టర్ కన్నెకంటి రాజమల్లాచారి - 1944-2005 దాచేపల్లి



పలనాటి సోదరకవులు– కన్నెకంటి ప్రభులింగాచార్యులు, చినలింగాచార్యులు, వీరభద్రాచార్యులు. వీరు ముగ్గురు సహోదరులు. వీరు యావదాంధ్ర దేశములో అవధానాలు చేశారు. ఖ్యాతిగడించారు. పలు గ్రంథాలు రచించారు.

పలనాటి సోదర కవులలో రెండవ వారు చినలింగాచార్యులు. సుబ్బమ్మ, చినలింగాచార్యులు దంపతులకు 1944 జులై 1వ తేదీన రాజమల్లాచారి జన్మించారు. పలనాడులోని తక్కెళ్ళపాడు వీరి స్వగ్రామము. అక్కడి నుండి గురజాలకు చేరుకున్నారు. పాఠశాల చదువు వీధిబడిలో సాగింది. ఆరో తరగతికి కావూరి వెంకయ్యగారి పాఠశాలలో చేరారు. 8వ తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. నరసరావుపేటలో పి.యు.సి. మరియు బి.ఎ. పూర్తి చేశారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డిగారు హైదరాబాదులో ఎం.ఎ. సీటు ఇప్పించారు. ఆ విధంగా హైదరాబాద్‌లో ఎం.ఎ. ఉత్తీర్ణులయ్యారు.

1967 సంవత్సరం మార్కాపురంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరారు. తరువాత అంచెలంచెలుగా ఎదిగారు. అదే కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి రీడర్‌గా 2002, జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. నిరంతరాయంగా 35 సంవత్సరాలు ఉద్యోగ జీవనం సాగించారు.

ఉద్యోగ జీవితాన్ని కొనసాగిస్తూనే పరిశోధనకు ఉపక్రమించారు. 1986 సంవత్సరంలో నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా **"పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితం– రచనల పరిశీలన"** అనే అంశంపై శ్రమించి వ్యయప్రయాసల కోర్చి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. పిహెచ్.డి పట్టా పొందారు.

తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహాయంతో ఆ సిద్ధాంత గ్రంథమును 1988 సంవత్సరంలో ముద్రించారు.

బాల్యం నుండి అష్టకష్టాలు అనుభవిస్తూ బ్రతుకు పోరాటంలో ఎదురీది, జరుగుబాటు లేక వారాలు తింటూ తిండికి ప్రధాన్యం ఇవ్వక చదువుకు అంకితమై సాహిత్యలోకంలో తలెత్తుకొని నిలిచిన మహనీయులు కన్నెకంటి రాజమల్లాచారి!

చదువుకునే రోజుల్లోనే కవితలు రాయటం మొదలుపెట్టారు. డాక్టర్ సి.

నారాయణరెడ్డి గారి బాణీలో కవిత్వం రాయటంలో దిట్ట. నటుడు, దర్శకుడు, రచయితగా ప్రశంసలు పొందారు. లెక్కలేనన్ని సన్మానాలు పొందారు. పెద్దపెద్ద సాహితీ వేత్తలతో సమావేశాల్లో పాల్గొన్నారు. సన్మానాలు పొందారు. 1967 నుండి రచనా వ్యాసంగాన్ని సాగించారు. గేయ కవితలు, నాటికలు, నాటకాలు రచించారు. వాటిలో కొన్ని ...

జయదేవుని **'గీత గోవిందం'**ను యమునాతీరం అనే శీర్షికతో గేయకృతిని వెలువరించారు. 1.మల్లెపువ్వు, 2.పృథ్వీరాజు, 3.అలలు కలలు, 4. హరివిల్లు 5.కవితా కల్లోలిని, 6.పూలదోసిళు 7.ముక్తక దీపాలు, 8. ధన్యజీవి, 9.వీరబ్రహ్మేంద్రస్వామి, 10.శ్రీకురు మారియమ్మ గీతాలు, 11.సమన్వయం నా అన్వయం, 12, అర్పణ, 13.మరపురాని మనిషి, 14.వీరబ్రహ్మ సుప్రభాతం, 15.శ్రీ నరసింహస్వామి (తెలుగు, ఇంగ్లిషు, హిందీ) 16.సంభవామి యుగేయుగే నాటకం, 17.రతనాల జాబిల్లి.

ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో సాహిత్యాన్ని రచించి పలనాటి వెలలేని సాహితీ మాగాణి సుమాలను పూయించి, చదువులతల్లి కొప్పున అలంకరించిన పలనాటి సాహిత్యరత్నం రాజమాల్లాచారి!

తన చిన్ననాటి జ్ఞాపకాలను సైతం మరువకుండా, జీవితంలోను సుఖ దు:ఖాలను సైతం విడవకుండా తన జీవన ఝరీప్రవాహంలోని విశేషాలను, వింతలను క్రోడీకరించి గ్రంథస్థంచేసి **"మద్రామాయణం"**గా ఆవిష్కరించి పాఠక లోకానికి అందించిన మహాఘనుడు కన్నెకంటి రాజమల్లాచారి! స్ఫురద్రూపి, అందగాడు, నటుడు, రచయిత, దర్శకుడు, సాహితీపుత్రుడు, ఆంధ్ర, ఆంగ్ల భాషల రచనల్లో దిట్ట. కవిపండితుల ఆదరాభిమానములు పొందిన కన్నెకంటి రాజమల్లాచారి 2005 డిసెంబర్ 29న **పలనాటి సీమ ధ్రువతార**గా గగనాన నిలిచారు.

"రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొక తార గగనమెక్కె"

అని గుర్రం జాషువా అన్నట్లు కన్నెకంటి రాజమల్లాచారి పలనాటి సీమ సాహిత్య ధ్రువతారయై వెలుగొందుచున్నారు. వీరు **పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితము- పరిశీలన** అను సిద్ధాంత గ్రంథమును సనాతన సాహిత్య పరిషత్ హైదరాబాద్ వారు- పులుకూరు చంద్రప్రకాశరావు, గార్లపాటి గురుబ్రహ్మాచార్యులు గార్ల సంపాదకత్వంలో 2018లో పునర్ముద్రణకు నోచుకుని ప్రాధాన్యాన్ని చాటుకుంది.

54. శ్రీ వేంకట కోటియోగీంద్రులు- 1944. కోటనెమలిపురి



వీరు కోటనెమలిపురి గ్రామంలో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, సుబ్బమ్మ పుణ్యదంపతులకు ప్రథమ సంతానం. 1944 అక్టోబర్ 26న జన్మించారు. అగ్రికల్చర్ ఎం.ఎస్‌సి చేశారు. చిన్ననాటి నుండి భక్తిమార్గంలో ఉన్నారు. గుత్తికొండ బిలంలో కొంతకాలం ధ్యానంచేశారు. శ్రీ ముచికుంద మహర్షి ఆదేశానుసారం 1980లో పిడుగురాళ్ళ దగ్గర కొండమోరు గ్రామంలో ఆశ్రమం నిర్మించారు. దానికి **శ్రీ ముచికుంద ఆశ్రమము** అని పేరుపెట్టారు. భక్తులకు ఆధ్యాత్మికబోధ చేస్తున్నారు. ఎంతోమంది శిష్యులున్నారు. ప్రకృతి రమణీయంగా ఆశ్రమమును తీర్చిదిద్దుతున్నారు. భక్తులు, పిడుగురాళ్ళ గ్రామస్తులు కార్తీక వనభోజనాలు ఆశ్రమంలో జరుపుకుంటారు. వీరు బోధనలేకాక ఎన్నో రచనలు చేశారు. **1. వేమన తత్త్వామృతం**- వేమన పద్యాలకు వ్యాఖ్యానం **2. శ్రీ ముచికుంద వరద 3. అమృత సూక్తులు** అను గ్రంథాలు రచించారు.

అంతేకాక విశ్వప్రేమావతారులు **శ్రీ శిరిడీ సాయిబాబా, సిద్ధిశ్రీ శిరిడీ సాయి సద్గురుభవ, శ్రీసాయి సత్యపథం, శ్రీసాయి ధర్మపథం, శ్రీ భగవద్గీత తత్త్వామృతం** మొదలైన ఆధ్యాత్మిక గ్రంథములు ఎన్నో వెలువరించారు.

వీటితో పాటు **1. శ్రీదుర్గి పురీశ శతకము 2. త్రిలోక వందిత శతకము 3. కేశవ శతకము 4. చిత్తశతకము 5. గోపాలశతకము 6. విచిత్ర శతకము 7. శ్రీ గోపాల శతకము 8. భక్త వశవర్తి శతకము** అను ఎనిమిది శతకాలు రచించారు. వారితో స్వయంగా పరిచయమే గాక ఒకే వేదికపై (రచయిత డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు) ఉపన్యసించటం జరిగింది.



55. ఎం.పి జానుకవి- 1945- ముటుకూరు

మాచర్ల పెదజాను. దుర్గి మండలం, ముటుకూరు గ్రామ వాస్తవ్యులు. మాచర్ల వీరయ్య, ఎలిశమ్మ దంపతులకు 1945 జూలై ఒకటో తేదీన జన్మించారు. పోస్టల్‌శాఖ ఆర్.ఎం.ఎస్.లో సూపర్ వైజరుగా పనిచేసి పదవీవిరమణ చేశారు. ఎం.పి.జానుకవిగా ప్రసిద్ధులు. పద్యవిద్యలో చేయి తిరిగిన కవి. తెలుగు భాషాభిమాని.

రచనలు: 1.కన్నీటిగాథ 2.వీరభారతము 3.బుద్ధ చరిత్ర 4. జాతిపిత 5. హృదయ స్పందన 6.బుద్ధగీతి 7.సప్తస్వరాలు అను ప్రసంగవ్యాసాలు. 8.మానవత 9. క్షమాపణ 10. స్వేచ్ఛాగీతి 11. క్రీస్తు చరిత్ర 12. మహోదయం పద్యనాటకం 13. భావగీతి 14. జ్వలితతార 15. కావ్యకన్య

బిరుదులు: కవితాభూషణ 2. పద్య విద్యాధర 3. కవిసింహ 4. ప్రజాకవి

పురస్కారాలు: 1.పుట్టపర్తి నారాయణాచార్యులు సాహితీపురస్కారం, 2. మహాకవి గుర్రం జాషువా సాహితీపురస్కారం, 3. గిడుగు రామమూర్తి తెలుగు భాషాపురస్కారం, 4.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి కళారత్న (హంస) 2018లో అందుకున్నారు.

56. పందిరి శ్రీశైలం -1945, గుండ్లపాడు



ఆధాత్మిక చింతన, బోధన ధ్యేయంగా జీవనం సాగించుచున్న వారు పందిరి శ్రీశైలం గారు. వృత్తిరీత్యా దేవదాయ ధర్మదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తూ గీతాజ్ఞానాశ్రమాన్ని స్థాపించి గీతాబోధ చేస్తూ శ్రీశైలంగారు **"గీతాగురూజీ"** గా పల్నాడులో పేరెన్నికగన్నారు. 1950లో గీతాప్రచార మండలి జ్ఞానాశ్రమముగా ఏర్పడినది.వారే పీఠాధి పతులుగా ఉంటూ గీతాప్రచారం గావిస్తున్నారు.

శ్రీశైలం గారు పందిరి వీరనారాయణ, సీతమ్మ దంపతులకు 1945 జులై 20న జన్మించారు. గుండ్లపాడు, వెల్దుర్తిలో ప్రాథమిక విద్యను అభ్యసించారు.1990లో **గీతాగురూజీ** బిరుదును పొందారు. **రచనలు: 1. జన్మ రాహిత్య ప్రబోధిని. 1976లో ప్రచురించారు. 2. అనుదిన ఆత్మదర్శనం** అను ఆధ్యాత్మిక భక్తిమార్గం అను పుస్తకములు సంకలం చేశారు.

పలు సాహిత్య, సేవాకార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజలకు, ఆధ్యాత్మిక చింతనాపరులకు చేరువగా ఉంటారు.పలు స్వచ్ఛంద సేవాసంస్థల సేవాకార్యక్రమాలలో కవిసమ్మేళనాలలో, వివిధ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. వీరితో పాటు నేను (డాక్టర్ బెజ్జంకి) కూడా సన్మానింపబడినాను. నాకు ఆయన మంచి మిత్రులు కూడా.

57. డాక్టర్ పి.వి.ఆచార్య - 1946-2007, కారంపూడి



డాక్టర్ పాలపర్తి వేంకటాచార్యులు గారు హస్తవాసి ఉన్న ప్రముఖ వైద్యులు. కారంపూడి నివాసులు.పాలపర్తి వీరయ్య,ఈశ్వరమ్మ పుణ్యదంపతులకు 1946 అక్టోబర్ 2వ తేదీన జన్మించారు. మంచి వైద్యులేకాక రచయిత, నటుడు, దర్శకుడు, స్ఫురద్రూపి. ఎన్నో నాటకాలలో విభిన్నపాత్రలు పోషించారు.మంచి అందగాడు. అయ్యప్ప భక్తుడు. ఎన్నోమార్లు శబరిమల వెళ్ళివచ్చారు. గురుస్వామి అయినారు- స్వానుభవాలతో...

'శ్రీ అయ్యప్పస్వామి కథామృతం' (నిత్యపారాయణ గ్రంథం) రాశారు. 1998 నవంబర్ 13వ తేదీన గ్రంథావిష్కరణ చేశారు. ఆ సభలో నాగార్జున సహితీ సమాఖ్య కార్యదర్శిగా నేను (రచయిత బెజ్జంకి) పాల్గొనడం జరిగింది. ఇతర రచనలు: **శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మ చరిత్ర**- 2006, **పలనాటి వీరుల చరిత్ర**-2002 సం॥, **పల్నాటి వీర్ల అంకమ్మ చరిత్ర**- 2005 సం॥

వీరికి **"కవిరాజ్"**, **"వైద్యవిశారద"** **"ఆయుర్వేద రత్న"** అను బిరుదులు కలవు. తొలుత వీరు డాక్టర్ పివి ఆచార్యులుగా ఖ్యాతిగాంచారు. ఆ తరువాత **"డాక్టర్ స్వామి"**గా ప్రజల చేత పిలుపు అందుకున్నారు. పల్నాడులో మంచి పేరున్న వైద్యులు. వీరి అసలు పేరు పాలపర్తి వేంకటాచార్యులు. వీరు విశ్వబ్రాహ్మణ వంశీయులు. 2007, జనవరి 15న పల్నాటి ప్రజలను శోకసముద్రంలో ముంచి శివైక్యం చెందారు. అశేషప్రజానీకం వారి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

58. మేకల సుబ్బారాయుడు-1946, తేరాల



దుర్గి మండలం తేరాల గ్రామ వాస్తవ్యులు. రైతు కుటుంబం. మేకల మంగమ్మ, పెదవెంకయ్యగార్లకు 1946లో జన్మించారు.సాహిత్యాభిమాని. సిద్ధేశ్వర స్వామి భక్తులు. **శ్రీ భ్రమరాంబ సమేత సర్వేశ్వరస్వామివారి చరిత్ర**ను రచించారు. ఆనాటి జూనియర్ సివిల్ జడ్జి నలగట్ల శ్రీనివాసాచార్యులు, ముటుకుల పద్మనాభరావు, డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు గార్లు పుస్తకావిష్కరణ చేశారు.

అముద్రిత రచనలు: 1.గో సాముద్రికము 2.కర్ణరహ్యం 3. తేరాల సిద్ధేశ్వరస్వామి శతకం 4. భజనపాటలు.

59. షేక్ సాయిబాబా - 1949 తుమ్మకోట

షేక్ సాయిబాబా పలనాటిలో రెంటచింతల మండలం తుమ్మకోట వాస్తవ్యులు. పూర్వం పలనాడును ఐదు ఫిర్కాలుగా చేసి బ్రిటిష్ వారు పరిపాలించారు. అందులో తుమ్మకోట ఒక ఫిర్కా.అంతేకాదు పలనాడును 'హైహయ' రాజులు పాలించారు. అప్పుడు ఊరకోటలో కోటను కట్టుకొని పరిపాలించారు. ఆ ఊరకోటే నేడు తుమ్మకోటగా వ్యవహరింపడుతోందని చరిత్రకారులు అంటున్నారు.



తుమ్మకోటలో షేక్ ఖాదర్‌సాహెబ్, షేక్ సయ్యద్‌బీబీ దంపతులకు1949లో సాయిబాబా జన్మించారు. పలనాటిలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. బి.ఏ. (లిట్) బి.ఇడి. చదివారు. ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. తుమ్మకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

సాయిబాబా సాధుస్వభావులు. అణకువ, నమ్రత కలిగి ఉంటారు. సమాజ సేవాతత్పరులు. మహ్మదీయులైనా హైందవ భావాలను అభిమానించే వ్యక్తి. కనుకనే శ్రీసాయి శతకమును రచించారు. 2000 సంవత్సరంలో **శ్రీ సాయి శతకము** ప్రథమ ముద్రణ పొందింది. పందిరి వారి సారస్వత కాళాపీఠం తుమ్మకోటవారు శ్రీసాయి శతకము ముద్రణ వ్యయం భరించి సుందరంగా తీర్చిదిద్ది వెలువరించారు. సాయిబాబా వృత్తిరీత్యా తెలుగు పండితులు. ప్రవృత్తి కూడా అందుకు తగినదే- రచనావ్యాసంగము! తెలుగు పండితులకు రచనావ్యాసంగం తోడు అయిందంటే బంగారానికి పరిమళము అబ్బినట్లే!

శ్రీ సాయి శతకమే గాక, షిరిడీ సాయి ప్రవచనాలు, బాలల జీవితాలకు బంగారు బాటలు గేయాలు-సూక్తులు, భక్తిగీతాలు- వాటికి రాగతాళాలు మేళవించటం, సినిమా పాటలకు పేరడీ భక్తిగీతాలు రాయటం, బాలగేయాలు రాయటం తదితరాలలో కూడా అభిరుచి కలవారు సాయి పదాలు అముద్రితం. అలతిఅలతి పదాలతో

తేటతెలుగు మాటలతో పద్యాలు చెప్పటం సాయిబాబా నైజం. శ్రీ సాయి శతకమునకు అమూల్యమై అభిప్రాయములు వెలిబుచ్చుతూ– అష్టావధాని ముటుకుల పద్మనాభరావు, తెలుగు పండితులు బెజ్జంకి జగన్నాథాచార్యులు, చింతపాటి బుచ్చిబాబు, చామర్తి శంకరశాస్త్రి (పండిత భారతి మాసపత్రిక మేనేజర్) గుంటూరు వారు శ్రీ సాయి శతకంలో సాయిబాబా చెప్పిన చక్కనినీతులు, సూక్తులు సమైక్యభావాన్ని పలు విధాలుగా మెచ్చుకున్నారు

60. మొవ్వ సుబ్బారావు–1949, గురజాల

వీరి తల్లిదండ్రులు శేషారత్నమ్మ, రామచంద్రయ్య. కొల్లపర మండలం



హనుమాన్‌పాలెంలో 1949 జులై 1వ తేదీన జన్మించారు. గురజాల, రెంటచింతల, దాచేపల్లిలో ఉన్న గ్రంథాలయా లలో అధికారిగా పనిచేశారు. **'ఉత్తమగ్రంథపాలకుడు'** అవార్డు పొందారు. 2007లో **గురజాల పాత పాటేశ్వరి అమ్మవారి– చరిత్ర–పాటలు** అనే పుస్తకము వెలువరించారు. ఇంకనూ **గ్రంథాలయం**–నాటిక, **మొవ్వమాట, భావగీతాలు**, పిల్లలకథలు, బాలప్రియ కవితలు, **'మరి ఇంతే'** (నాటిక), **'బాలచంద్రుడు', 'నరసింగరాయలు'** ఏకపాత్రలు రాశారు.

61. నాగార్జుకొండ పిచ్చయ్య – 1950. దుర్గి



లక్ష్మీనరసమ్మ వీరబ్రహ్మంగార్లకు 1950 జనవరి 15న పిచ్చయ్య జన్మించారు. పరిశోధకులు. **'గుంటూరు జిల్లా దేవాలయాలు–చరిత్ర'** 2016లో ప్రచురించారు. **అముద్రితములు: 1.ప్రాచీనాంధ్ర శిల్పులు 2. రామశతకము.**

ఏడు ముడులూ వేసి మూడు ముడులూ విప్పి నాలుగు ముడులందు నడవవే మనసా!	చలిలోన స్నానాలు గుడిలోన దీపాలు ముక్తిని నొసగవు మనసా!	అందరూ పుడతారు అందరూ పోతారు శాశ్వతము కాదెవరు మానసా!

–మాతృశ్రీ అమృతమ్మగారి తత్వాలు– బెజ్జంకి


62. డాక్టర్ బిట్టు వేంకటేశ్వర్లు - 1950. కోలగుట్ల

దుర్గి మండలం,కోలగుట్ల వాస్తవ్యులు. వీరి తల్లిదండ్రులు సోమమ్మ, పుల్లయ్య పుణ్యదంపతులు. 1950 జులై1వ తేదీన జన్మించారు. ఎం.ఎ.,పిహెచ్.డి చేశారు. **ఆచార్య తూమాటి దొణప్ప బంగారు పతకం** 1981లో పొందారు. తెలుగు విశ్వ విద్యాలయంలో ఉద్యోగిగా రిటైరయ్యారు. **రచనలు:** 1.పల్నాటి సీమలో కోలాటం. 2.పులిజూదం, 3.అచ్చన గళ్ళు,4.జానపద గేయాలు-ఒక పరిశీలన 5.చాపకూడు సిద్ధాంతకర్త బ్రహ్మనాయుడు. 6.తోలుబొమ్మలాట ప్రదర్శన.



63. లంకా వేంకటసుబ్రహ్మణ్యం- 1950, గురజాల

లంకా వేంకటనాగలక్ష్మి, వేంకటసుబ్బయ్య పుణ్య దంపతులకు 1950 మే 1వ తేదీన గురజాలలో జన్మించారు. విద్యా భ్యాసం గురజాల ప్రభుత్వపాఠశాలలో కొనసాగిం చారు.టైపు,షార్ట్ హ్యాండు నేర్చుకున్నారు.ఏ.పి.ఎస్. ఆర్.టి.సి.వైద్యశాల హైదరాబాద్‌లో ఉద్యోగించి విశ్రాంతి నొందినారు. ఓలేటి పార్వతీశం గారితో కలిసి పనిచేశారు.



"శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య"ను స్థాపించి సాహిత్యసేవ చేస్తున్నారు. ఎందరో కవులకు చక్కని వేదికనిచ్చి సత్కరిస్తున్నారు.జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి గారికి అత్యంత ఆప్తులు. **"స్నేహ మధురిమ"** కవితా సంపుటిని సి.నా.రె గారికి అంకితమిచ్చారు.**"స్నేహాభిషేకం"** అనే కవితాసంపుటిని డాక్టర్ ఓలేటి పార్వతీశంగారికి అంకితమిచ్చారు.

సుస్వరశ్రీ, కవిశ్రీ, కళామిత్ర, కవిభూషణ్, కవిరత్న వంటి బిరుదులు పొందారు.

వీరి రచనలు: 1.అనురాగమాలికలు 2. నీ స్నేహం 3. ఆత్మబంధువు 4. స్నేహాభిషేకం. 5. ఓ మనిషీ! 6. స్నేహమధురిమ అను కవితా సంపుటాలు ప్రచురించారు. ప్రతి

పుస్తకం పైన జన్మస్థలం, మరవకుండా ముఖపత్రంపై ఇష్టదైవం- **"పాతపాటేశ్వరి అమ్మ"** చిత్రం ముద్రించి పలనాటి అభిమానాన్ని చాటుకున్నారు.

64. డాక్టర్ మడకా సత్యనారాయణ -1951, జూలకల్లు



కారంపూడి సమీపమున ఉన్న జూలకల్లు గ్రామం వీరిది. సుబ్బమ్మ, ఓబయ్య దంపతులకు 1951 ఫిబ్రవరి 19న జన్మించారు. ఎం.ఎ., పిహెచ్.డి చేశారు. నర్సరావుపేట ఎస్.కె.ఆర్. బి.ఆర్ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్ ఉద్యోగం చేశారు. **ఆధునికాంధ్ర సాహిత్యంలో చారిత్రక గేయ కావ్యాలు** అను పరిశోధన గ్రంథమును 1989లో ప్రచురించారు. నాటికలు, గేయ కవితలు రచించారు..

సహజకవి

65. చిటిప్రోలు సుబ్బారావు 1952- 2016, గామాలపాడు

నాయకురాలు నాగమ్మ నివాసస్థలం గామాలపాడు. దానిని జిట్ట గామాలపాడు అని అంటున్నారు. ధీరురాలు నాగమ్మ. వీరవనిత నాగమ్మ. పరాక్రమ



వంతురాలు నాగమ్మ. పరిపాలనదక్షురాలు నాగమ్మ. పలనాటి చరిత్రలో మణిపూస నాగమ్మ. అట్టి జిట్ట గామాలపాడులో చిటిప్రోలు వారు, పెద్దోజువారు పండి తులు, కవులు. గామాలపాడులో చదువుకున్నారు. నరసరావుపేట, గుంటూరులలో కళాశాలలో ఉన్నతవిద్య పూర్తిచేశారు. 1972-75 సంవత్సరాలలో ఆంధ్రవిశ్వ విద్యాలయం వారి ఎం.ఎ.పట్టా పొందారు. 1975 సంవత్సరం నుంచి పలు సంవత్సరాలు శ్రీ సుబ్బరాయ మరియు నారాయణ కళాశాలలో తెలుగు ఉపన్యాస కులుగా ఉద్యోగ విధులు నిర్వహించారు.

"పలనాటి సోదర కవుల జీవితము సాహిత్యము" అను అంశంపై పరిశోధన చేసి, సిద్ధాంత గ్రంథమును సమర్పించి, నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టా పొందారు. పలనాటి సీమలో ప్రౌఢకవి వ్యాకరణశాస్త్రవేత్త, ఎందరో కవులు రచించిన కావ్యాలను పరిశీలించి దొసగులను తొలగించి శుద్ధప్రతులను చేసిన

పరిష్కర్త చిటిప్రోలు కృష్ణమూర్తి! –సుబ్బారావు గారు వీరికి బాబాయి.

రచనలు: 1. మధురకవి నాళంకృష్ణారావు సంక్షిప్త జీవితచరిత్రను రచించారు.1983లో అచ్చు వేయించారు. 2. చిటిప్రోలు వ్యాకరణం 3. చారిత్రక విశ్లేషణ– పల్నాటి వీర చరిత్ర పద్యకావ్యం 4. సుబ్బరాయ సూక్తి పద్యాలు.

కళాశాలలో చదివే రోజుల్లో పద్యాలు రాసి పెద్దలకుచూపించేవారట. ఆ విధంగా చూపినవారిలో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు ఒకరు. చదివింది బి.ఎస్సీ. ఆ తర్వాత ఎం.ఎస్సీ చదవకుండా తెలుగుభాషపై ఉన్న మక్కువతో తెలుగు ఎం.ఎ చేశారు. తెలుగు ఉపన్యాసకులుగా చేసి రీడరుగా 2010లో రిటైర్ అయ్యారు. అనేక స్వచ్ఛందసంస్థలను నరసరావుపేటలో నిర్వహించారు.ఉద్యోగం నరసరావుపేటలో కనుక అక్కడే ఉంటున్నారు.1989 సంవత్సరం **"ఆధునికాంధ్ర సాహిత్యంలో చారిత్రక గేయ కావ్యాలు"** అనే సిద్ధాంత గ్రంథం మడకా సత్యనారాయణ రచించి వీరికి అంకితమిచ్చారు. సుబ్బారావు కృతికర్తగా రచనలు చేశారు. కృతిభర్తగా గ్రంథస్వీకారం చేశారు. కాగా వీరు 2016 అక్టోబర్ ఒకటో తేదీన దివంగతులయ్యారు.

66. కొణతం నాగేశ్వరరావు, 1952. కారెంపూడి



డాక్టర్ కొణతం ఇర్మియా, మార్తమ్మ దంపతులకు 1952 ఆగస్టు ఐదున జన్మించారు.పుట్టింది గుంటూరు. ఉద్యోగ రీత్యా 1989 నుంచి 2010 వరకు పల్నాటిసీమ కారంపూడిలో ఉన్నారు. బి.ఎస్సీ, బి.టెక్ పూర్తి చేసి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేశారు. సైన్సు ఉపాధ్యాయులైనా తెలుగుమీద మక్కువ ఎక్కువ. పద్యరచనలో పట్టున్నవారు.

కారంపూడిలో **'శతక సుధాస్రవంతి'** సాహితీ సాంస్కృతిక సంస్థను స్థాపించి కవిసమ్మేళనాలు నిర్వహించారు. విద్యార్థులలో పద్య పఠనాసక్తిని పెంపొందించేందుకు పోటీలు పెట్టేవారు. **'తెలుగు పలుకులల్లుదాం'** అంటూ పిల్లలకు కవితాశిక్షణ ఇప్పించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

తెలుగు పాఠ్యాంశాల బోధనావిధానం, పద్య, గద్య గేయాలను విశదపరచే ఆడియో సీడీలు, స్వీయగానంతో తయారు చేసి అధికారుల మన్ననలు పొందారు. రంగస్థల నటులు, గాయకులు, మంచి బోధనాపటిమ గలవారు.

బాల సాహిత్య రచయితలు డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు, దార్ల బుచ్చిబాబుగార్లను రప్పించి పిల్లలకు కథారచనలో శిక్షణ తరగతులు నిర్వహించిన తెలుగు భాషాభిమాని.

తెలుగు పద్య సుధానిధి, తొలకరి చినుకులు, ప్రసిద్ధ పద్య రత్నాకరం అను శీర్షికలలో ఆడియో సీడీలు విడుదల చేసి విద్యాశాఖాధికారుల ప్రశంసలు పొందారు.

67. దేవరపల్లి ప్రభుదాస్-1953, పలనాడు



దేవరపల్లి అనసూయమ్మ,జోసెఫ్ పుణ్యదంపతులకు 1953 జూన్ 5వ తేదీన పెదకాకానిలో జన్మించారు. ఎం.ఏ.,ఎం.ఇడి,పిహెచ్.డి,ఎల్.ఎల్.బి.చేశారు. "తెలుగు పద్యనాటకములు అనుశీలన" అను అంశంపై పరిశోధనచేసి పిహెచ్.డి పట్టము పొందినారు. వీరు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితులుగా పలనాటి ప్రాంతములోనూ గురజాలలోనూ పనిచేశారు. ఇంకనూ వినుకొండ నాగార్జునసాగరుపాఠశాలలో కూడా పనిచేశారు.వీరు పద్యవిద్య నెరిగినవారు.వీరి రచనలు అన్నీ పద్యాలలో సాగించారు. అవధానిగా తన ప్రతిభను నిరూపించుకున్న సాహితీవేత్త. అంతేకాదు రంగస్థల నటులుగా పలుప్రదర్శనలు చేశారు.'సాహితీ కళారత్న', 'నటగానకళానిధి' వంటి బిరుదులు పొందారు.

వీరి రచనలు: 1.ప్రభుశతకం 2.పైడిమాట.3.కావ్యలహరి 4.చైతన్యలహరి 5.భావలహరి 6.పద్యనాటకప్రభ.7.పద్యనాటక నటరత్నాలు.8. తెలుగు పద్య నాటకములు- అనుశీలన.



68. మంగళాపురపు సదాశివయ్య 1953-2017 తుమ్మలచెరువు

బ్రహ్మశ్రీ మంగళాపురపు సదాశివయ్య గారు తెలుగు పండితులు. 1989లో పిడుగురాళ్ల మండలం, తుమ్మలచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయు

లైనా ప్రవృత్తిరీత్యా వాస్తుజ్యోతిష్యులు. వృత్తి, ప్రవృత్తులలో ఆయనది అందెవేసిన చేయి. పల్నాటిలో మంచిపేరు తెచ్చుకున్నారు. ఉచితంగా ఎందరికో వాస్తు జ్యోతి ష్యాలలో శిక్షణ ఇచ్చారు.వీరు ఫిబ్రవరి1953లో విశ్వబ్రాహ్మణ వంశస్థులైన మంగళా పురపు కోటయ్యాచార్యులు, వీరమ్మ పుణ్యదంపతులకువట్టిచెరుకూరు మండలం, గారపాడులో జన్మించారు. వృత్తిరీత్యా పల్నాడులో తుమ్మలచెరువు, బ్రాహ్మణపల్లిలలో పనిచేశారు. గ్రేడ్1 తెలుగు పండితులుగా 2011 ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేశారు.

వీరి రచనలు: 1.విశ్వబ్రాహ్మణ వివేకవర్ధని 1996లో ముద్రించారు. 2. విశ్వబ్రాహ్మణ గోత్ర దీపిక 3.1996-97లో తేజశ్రీ అను పంచాంగమును తొలిప్రతిని విడుదల చేశారు. గార్గేయ యాగమునకు తెలుగు తాత్పర్యం రాశారు. వాస్తుపూజా విధానం (ఈ రెండూ అముద్రితాలు)

వాస్తుజ్యోతిష్యాలలో ఉచిత శిక్షణ అందిస్తూ, పల్నాటి ప్రజల మన్ననలు పొందుతూ అతి చిన్న వయస్సులోనే 2017 జూన్ 25న శివైక్యం చెందారు. పల్నాటి ప్రజలు మంచి గురువును కోల్పోయినందుకు ఆవేదనకు గురయ్యారు.

69. దుబ్బల దాసు - 1954, రచ్చమల్లెపాడు



'సహజ కవి' దుబ్బల దాసు వెల్దుర్తి మండలం రచ్చమల్లెపాడు గ్రామం. దుబ్బల చెన్నయ్య, కోటమాంబ పుణ్యదంపతులకు 17-11-1954 లో జన్మించారు. ప్రాథమిక విద్య ఒకటో తరగతి నుంచి ఎస్.ఎస్. ఎల్.సి.వరకు మాచర్లలో చదువుకున్నారు. కాలేజీ విద్య నందిగామలో పూర్తిచేశారు. నాగార్జున యూనివర్సిటీలో ఎం.ఎ.తెలుగుపట్టం పొందారు. 1974 నుంచి పోలీస్ ఉద్యోగం చేసి సబ్ఇన్ స్పెక్టర్గా 2012లో ఉద్యోగ విరమణ చేశారు. ప్రవృత్తి మాత్రం పద్యాలు రాయటం. పద్యసాహిత్యమన్న మక్కువ. ఎన్నో కవిసమ్మేళనాలలో పాల్గొని తమ గళం విని పించారు.ఉభయ రాష్ట్రా లలోను తమిళనాటా కవిసమ్మేళనాలలో పాల్గొని ప్రశంసలు పొందారు.

రచనలు: అక్షర శిల్పాలు, భావశిల్పాలు అను రెండు ఖండకావ్యాలు, అక్షరాలయం

అను నాటిక, వీర కన్నమదాసు ఏకపాత్ర మొదలైన రచనలు చేశారు.

'బాల జాషువా', సహజకవి, కవిభూషణ, పద్యకవితాసుధానిధి, సాహితీ సమ్రాట్, సరసకవి మొదలైన ఎన్నో బిరుదులు, మరెన్నో సత్కారాలు, పురస్కారాలు పొందారు. పల్నాటి గళమును వినిపించి శభాష్ అనిపించుకున్నారు కవి దుబ్బల దాసు.

కవిరత్న

70. నూతలపాటి వెంకటరత్నశర్మ- 1955- దాచేపల్లి



నూతలపాటి వెంకటరత్నశర్మ గుంటూరుజిల్లా, కొల్లిపర మండలం అన్నవరం గ్రామంలో జన్మించారు. తల్లి దండ్రులు నాగేశ్వరమ్మ, సుబ్బారావు. యలవర్తి ఆంజనే యశాస్త్రి వేదసంస్కృత పాఠశాలలో చదువుకున్నారు. పామర్తి నాగభూషణశర్మ వేదవాఙ్మయమును, సంస్కృత పాండిత్యమును నేర్పిన తొలి గురువు. వీరు ఆంధ్రవిశ్వ విద్యాలయంవారి **'భాషాప్రవీణ'** పట్టా పొందినారు (సంస్కృత ఆంధ్రాలలో), అనంతరం ఎం.ఎ. పట్టా పొందారు.

రత్నశర్మ 1983 సంవత్సరంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రభాషోపాధ్యాయులుగా పలనాటి సీమలో అడుగుపెట్టారు. గుమ్మనంపాడు, తెంగెడ, జూలకల్లు, దాచేపల్లి మొదలగు గ్రామాలలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేశారు. 2001 సంవత్సరం నుంచి దాచేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్-1 తెలుగు పండితులుగా పనిచేసి, ప్రధానోపాధ్యాయులుగా కారంపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేశారు. వారి ఉద్యోగ జీవితం మొత్తం పలనాటికే అంకితం. రత్నశర్మ 2000 సంవత్సరంలో **శ్రీ వేంకటేశ్వర శతకం** రచించారు. ఉత్పలమాల వృత్తంలో శతకాన్ని పూర్తిచేశారు. రాసింది వేంకటేశ్వర శతకం. అంకితమిచ్చింది వేంకటేశ్వరుడికే! వేంకటేశ్వరుడు మెచ్చుకున్నాడు. ఆయనే అచ్చువేయించుకున్నాడు. వేంకటేశ్వరశతక ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయం చేసింది. అది గొప్ప విషయం. ఈ శతకానికి **'మహామహోపాధ్యాయ'** బిరుదాంకితులు పెదపాటి నాగేశ్వరరావు, **'విద్యావిశారద', 'సాహిత్య సరస్వతి'** కన్నెకంటి రాజమాల్లాచారి గార్లు రాసిన అభిప్రాయములలో రత్నశర్మ కవిత్వాన్ని మెచ్చుకున్నారు.

ఉ॥ కొండల మీద నిల్చి తగ కొల్చెడి భక్తజనాలి కంతకున్
మెండుగ దర్శనం బొసగి మేలగు సంపదలిచ్చి యేలుచున్
నిండు మనంబునన్ జగతి నిల్పుచు సాకుచు రక్షసేయు నీ
దండి తనంబు రమ్యము కదా!ప్రియదైవమ! వేంకటేశ్వరా!

ఈ రీతిగా వారి రచన సాగింది.

రత్నశర్మ **'పౌరద్విశతి'** చదివి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావుగారు 'పేటి కాంతర్గత రత్నం' అని ప్రశంసించారు. ***'సరళములు సుందరములు అయిన భావములతో సూటిగా కవిత్వము రాసినారు. సూక్తుల సమాహారమా అన్నట్లు కూర్పబడిన ద్విశతిలో కవి యొక్క భావసారళ్యము, అతని మానసిక స్థితి అద్దములో బింబమువలె స్పష్టముగా కనిపించుచున్నది"*** అన్నారు పెదపాటి నాగేశ్వరరావు. డాక్టర్ బీరం సుందరరావు, డాక్టర్ వీవీఎల్ నరసింహారావు, కన్నెకంటి రాజమల్లాచారి మొదలగువారు వారి అమూల్యమైన అభిప్రాయములనిచ్చి కవి రచన వైశిష్ట్యమును మెచ్చుకున్నారు. వీరి రచనలు చూచి మురిసిన రాజమాల్లాచారి వీరిని **"కవిరత్న"** అని ప్రశంసించారు.

"శిశిర సంకేతం" అనే వచన కవితాసంపుటి త్వరలో ముద్రణకు సిద్ధ మగుచున్నది.

వీరి ఇతర రచనలు: 1. శిశిర సంకేతం- వచన కవిత 2. అంతస్సూత్రం- వచన కవిత. 3. తెలుగు లోగిలి - ఖండకావ్యం 4. పారేయ్యాల్సిందే - వచన కవిత 5. వ్యాస తరంగిణి 6. శ్రీకాళహస్తి శతకం- పూర్వకవి ప్రణీతం- తాత్పర్యం కూర్పు. 7. వీరబ్రహ్మేంద్ర సహస్రనామ స్తోత్రం- అర్థ వివరణ. 8. విశ్వబ్రాహ్మణ కరదీపిక 9. సారంగధర చరిత్ర- (శంభుదాసుని ద్విపద)- పరిష్కరణ.

71. కర్నాటి వేంకటేశ్వర చౌదరి 1955 -2016
బోదిలవీడు



కర్నాటి భద్రయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు బోదిలవీడులో నివసిస్తున్నారు. వ్యవసాయ కుటుంబము. భద్రయ్య, అన్నపూర్ణమ్మలకు 1955 ఆగస్టు 1వ తేదీన వేంకటేశ్వర్లు జన్మించాడు. వేంకటేశ్వర్లు పుట్టిందీ పెరిగిందీ వెల్దుర్తి మండలం బోదిలవీడులో. భద్రయ్యగారు కాశీపతి శిష్యులు గనుక పిల్లవానికి అక్షరాభ్యాసం కవిసింహ

పోకూరి కాశీపతి సువర్ణహస్త ఆశీస్సులతో చేయించారు.

కాశీపతిగారు చేసిన అక్షరాభ్యాస పుణ్యఫలంతో వేంకటేశ్వర్లు వెల్దుర్తిలో చదివింది 6వ తరగతి మాత్రమే. గురువుగారు చదివిందీ ఆరు, ఏడు తరగతులే. గురువుగారు కాశీపతి మాదిరిగా కవిత్వం చెప్పడంలో తనదైన బాణి ఏర్పరచుకున్నారు.

పోకూరి కాశీపతిగారికి శిష్యరికం చేశారు. కాశీపతిగారి సారంగధరీయం, హరిశ్చంద్రోపాఖ్యానం కంఠోపాఠంగా చెబుతారు. కాశీపతిగారి జీవిత విశేషాలు, వారి రచనలపై అనర్గళంగా ఉపన్యాసంచెబుతారు. పట్టణాలలో, పండితసభలలోఉ పన్యాసాలెన్నో చేసి 'శభాష్!' అనిపించుకున్నారు. అవధానాలు చెయ్యటం మొదలు పెట్టారు.1991లో మాచర్ల సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో సంపూర్ణ శతావధానం నిర్వ హించారు. కవిపండితులు మెచ్చుకున్నారు.**"శతావధాని సమ్రాట్"** అను బిరుదునిచ్చారు. 1979 నుంచి మాచర్ల సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో మాత్రమే ప్రవేశించారు. ప్రవృత్తి రీత్యా పద్యాలు రాయటం, అటునుంచి శతకాలు రాయటం నుంచి అవధానాలు చేయటం వరకు ఎదిగారు.

హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆయనకు సన్మానం చేశారు. తూమాటి దొణప్ప, కొండవీటి వేంకటకవి, డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారి, త్రిపురనేని సుబ్బా రావు, సినీహీరో సుమన్, డాక్టర్ దాశరథి మొదలుగా గల ప్రముఖులు సన్మానించారు. గురువుగారు పోకూరి కాశీపత్యవధాన్లు కీర్తిశేషులు అయిననాటి నుంచి అంటే 1974 నుంచి మాచర్లలో వర్ధంతి సభలను 2000 వరకు నిర్వహించారు. ప్రతిసంవత్సరం ఒక ప్రముఖ అష్టావధానిని ఆహ్వానించి అవధానం నిర్వహించేవారు. ఈ క్రమంలో– 1986లో మాడుగుల నాగఫణిశర్మ, 1987లో మేడసాని మోహన్ అవధానం చేసి పలనాటి సాహితీప్రియులను ఆనందపరచారు. ఈ విధంగా మరెందరో అవధానులు ఇక్కడికి విచ్చేసి అవధానాలు చేసి సాహితీప్రియులందరినీ అలరించారు. ఈ అవధా నాలలో నేను (డాక్టర్ బెజ్జంకి) పృచ్ఛకులుగా పాల్గొనడం జరిగింది.

కాశీపతి వర్ధంతి సభలకు దివాకర్ల వేంకటావధాని, రావూరి భరద్వాజ, త్రిపురనేని, కొండవీటి వేంకటకవి, తూమాటి దొణప్ప, ఎం.గురవప్పచౌదరి తదితర ప్రముఖులువచ్చి ఉపన్యసించారు.

1991లో జరిగిన వర్ధంతి సభలో డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారిగారికి సువర్ణ ఉష్ప్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నేను (డాక్టర్ బెజ్జంకి) స్వయంగా పాల్గొనడం జరిగింది.

వేంకటేశ్వర చౌదరి 125 శతకాల దాకా రచించి పల్నాటి సాహితీప్రియుల మన్ననలు పొంది 11-11-2016లో దివంగతులయ్యారు.

వేంకటేశ్వర చౌదరి కవిత్వాన్ని మెచ్చినవారు వారివారి మాటల్లో ఏమన్నారో చూద్దాం....

"ధారాధురీణుగా ,వస్తువరేణ్యంగా పద్యం నడపడం మీ ప్రతిభకు ప్రతీక. మీరు అప్పుడప్పుడు నిర్వహించిన శతావధానాల్లోని పద్యాలు మీ రచనా పరిణతిని పట్టి చూపుతున్నాయి" **- డాక్టర్ సి. నారాయణరెడ్డి**

"శ్రీ కర్నాటి వేంకటేశ్వరచౌదరి చేసిన శతావధానం తాలూకు పద్యాలను చదివాను. మంచి ధారాశుద్ధి, నైపుణ్యం గోచరించినవి... అవధానములేకాక సరస కావ్య నిర్మాణం కూడా చేయాలని, స్థిరమైన యశస్సు సాధించాలని ఆశిస్తున్నాను"

- ప్రసాదరాయ కులపతి

72. పున్నా కృష్ణమూర్తి, 1956



వీరు ముప్పది సంవత్సరముల అనుభవం కలిగిన పత్రికా విలేఖరి. ఉదయం, ఆంధ్రభూమి, దక్కన్ క్రానికల్ మొదలగు పత్రికలలో పనిచేసి సీనియర్ జర్న లిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు. అంతేకాక **"పర్యావరణం పరిసరములు"** పత్రిక రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి ప్రచురణకు వర్కింగ్ ఎడిటర్.

వీరు మాచర్ల వాస్తవ్యులు. నాగలక్ష్మమ్మ, శేషయ్య పుణ్యదంపతులకు 1956 ఏప్రిల్ 8వ తేదీన జన్మించారు. మాచర్ల, హిల్ కాలనీలలో విద్యనభ్యసించారు.

"తిరుమల కొండ పదచిత్రాలు" అను స్వామివారి చరిత్రను కలర్‌ఫుల్ చిత్రాలతో పుస్తకం ప్రచురించారు. ఇది బహుప్రాచుర్యం పొందింది. ఖరీదైనది! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పత్రిక **"ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక"**లో వ్యాసాలు రాస్తూ వుంటారు. అమరావతి ఆర్ట్సులో **"పలనాటి విద్యావస్తువులు"** అను ధారావాహికను నిర్వహిస్తున్నారు.

The goddess of flink samajika saralamma charitra gadha అను ఆంగ్ల పుస్తకమునకు తెలుగు అనువాదంచేశారు. కాకతీయ ట్రస్టు వారు ప్రచురించారు. వీరు అమరావతి శిల్పులు, పలనాటి మౌఖిక గాథపై ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించారు.

73. ఆచార్య భవనారి సత్యనారాయణ- 1957 మాదుగుల



వీరు గురజాల మండలం మాదుగుల వాస్తవ్యులు. భవనారి అనసూయమ్మ, రామకోటయ్య పుణ్యదంపతులకు 12-11-1957 తేదీనజన్మించారు. వీరు బిఎస్సీ, ఎమ్మెస్సీ, పిహెచ్.డి., ఎమ్.టెక్., బీఈడీ చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఎన్నోపొందారు. గణిత శాస్త్ర గ్రంథాలు ఎన్నోరాశారు. వివిధ దేశాలలోని ప్రచురణకర్తలు వీరి గణిత గ్రంథాలను ప్రచురించారు.

అవార్డులు: వీరు **'గ్లోరి ఆఫ్ ఇండియా'** మరియు **ఇంటర్నేషనల్ అచీవ్స్ అవార్డు** థాయ్‌లాండ్ ప్రభుత్వం నుంచి 2011లో అందుకున్నారు. 2.గ్లోబల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ అవార్డు, గ్లోబల్ టీచర్ రోల్ మోడల్ అవార్డు మొదలగు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఎన్నో పొందారు.

నియర్ రింగ్స్- నియర్ ఫీల్డ్స్ **1.** Near rings-Near fields and Related Topics, **2**. Discrete Mathematics and graph Theory, **3.** Nearrings Fuzzy graph Theory, 4. Finite Dimension in N-graphs and Fuzzy Ideals of gamma Nearrings మొదలైన ఎన్నో అంతర్జాతీయ ప్రచురణలు వెలువరించారు.

74. దేవులపల్లి విశ్వనాథం- 1951 ఎర్రగొండపాలెం

వీరు 01-05-1951లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, వేంకయ్యశర్మ. వీరు కాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా 2006 నుండి



2009 వరకు పనిచేశారు. అంతకుముందు టెలిఫోన్ ఆపరేటర్‌గా మాచర్లలో 1975లో కొంతకాలం పనిచేశారు. **రచనలు:** (శతకములు)1.శ్రీ విశ్వనాథ. 2. శ్రీనివాస 3.శ్రీ త్రిపురాంతకేశ్వర 4.శ్రీ రఘు రామచంద్ర, 5. శిషిరిడీసాయి. 6 శ్రీసత్యసాయి 7.శ్రీ త్రిపుర సుందరి, 8. విశ్వేశ్వర. 9. శ్రీచెన్నకేశవ, 10. వేణుగోపాల శతకములు రచించారు. **ఖండకావ్యములు:** 1. కవితామంజరి 2. విశ్వసందేశం, 3. తరంగిణి, 4. హరివిల్లు.ఇంకనూ 1విశ్వనాథ పదాలు, 2. విశ్వనాథ వ్యాసావళి 3. భజగోవింద పరమార్థం, 4. గీతోపన్యాసములు. మొదలైన రచనలుచేశారు. వీరు కవిశేఖర బిరుదాంకితులు.

75. చిటిప్రోలు వేంకటరత్నం-1958 గామాలపాడు



దాచేపల్లి మండలం గామాలపాడు వాస్తవ్యులు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. చిటిప్రోలు కృష్ణమూర్తిగారి కుమారులు. చిటిప్రోలు సరస్వతమ్మ, కృష్ణమూర్తి పుణ్యదంపతులకు 1958 మే 20వ తేదిన గామాలపాడులో జన్మించారు.

ఉగాది పురస్కారం, అద్దేపల్లి రామమోహనరావు ¿$Ô d'Ëq | ØÁÍØÁ, **'కవిరత్న'** బిరుదు పొందారు. **రచనలు: 1.కవిత్వతత్త్వ విచారము**-భావనాశక్తి వివేచనము **2. చతురంగము 3. దిదృక్ష 4. వెలుతురు గొంతులు** కవితాసంపుటి. **5.అశోకపథం** చారిత్రాత్మక పద్య నాటకం.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా తెలుగుశాఖ కె.ఎస్.ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడలో పనిచేస్తూ 2016 మే 31న ఉద్యోగ విరమణ చేశారు.

76. డాక్టర్ రాధశ్రీ - 1958. పిడుగురాళ్ళ



దిడుగు అనంత వేంకటరాధాకృష్ణప్రసాద్ వీరి అసలు పేరు.కానీ రాధశ్రీగా ప్రఖ్యాతి గాంచారు. 1958 అక్టోబర్ 19న జన్మించిన వీరు పిడుగురాళ్ళ వాస్తవ్యులు. ఎం.ఎ.,ఎం.కాం.,పిహెచ్.డి చేశారు. వృత్తి సిండికేట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తు న్నారు.వీరి ప్రవృత్తి పద్య రచన. అలవోకగా, ఆశువుగా కందపద్యాలు చెపుతారు.**'ధారణావాచస్పతి', 'సాహితీ యువ రత్నం' పద్యమౌళి, పద్యభాషి, పద్య సుగంధ వాహక** వంటి బిరుదులెన్నో పొందారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. **రచనలు:1. తారామతి-ప్రేమావతి** (కథాత్మక గేయకావ్యం), **2. ఆర్య చాణక్య ఏక పాత్రాభినయం 3. కవితా కృష్ణవేణి** -కవితాసంకలనం **4. విజ్ఞాన గీత** -గేయంలో విజ్ఞానం **5. రాధశ్రీ రసరుక్కులు**- మినీకవితలు **6. బాల భక్తులు. పద్య రచనలు: 1. చెన్నప్ప శతకం 2. వర్గకవాణీ శతకం 3. రాధశ్రీ రత్నశతకం 4. చౌడేశ్వరీదేవి శతకం 5. లక్ష్మీనరసింహ శతకం 6. శశిమౌళి శతకం 7.** నాగలింగ **శతకం 8.** పెరుమాళ్ **శతకం 9.** చెన్నప్ప **ద్విశతి.**

77. కొండసాని ఆంజనేయరెడ్డి (సుమశ్రీ)- 1958, పోలేపల్లి

పోలేపల్లి గ్రామ మాజీసర్పంచ్ కొండసాని కోటిరెడ్డి, పాపులమ్మగార్ల కుమారుడు ఆంజనేయరెడ్డి.సుమశ్రీ బిరుదాంకితులు. 1958 మార్చి 12న జన్మించారు.



ఎం.ఎ.,ఎం.కామ్., ఎం.బి.ఏ.,ఎం.సి.జె.చేసి బి.ఎస్.ఎన్.ఎల్‌లో ఉద్యోగం చేశారు. వీరు- **1.హనుమద్విశతి 2.తిరుమలేశ శతకం 3.ప్రగతి పథంలో భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ ద్విశతి** 4. నేటి పద్యాలు (త్రిశతి) మూడు శతకాలు రాశారు. సుమశ్రీ బిరుదాంకితులైన ఆంజనేయ రెడ్డిగారు చదువులమ్మ ముద్దుబిడ్డ. చదివిన చదువు, ఉద్యోగము వేరువేరు. ప్రవృత్తి శతకాలు రాయడం. ఆట వెలది నాట్యంలా ఆటవెలది పద్యాలను నడిపిస్తారు. వేలకొద్దీ పద్యాలు రాశారు. శతకము వంద పద్యాలు నియమంతో నూట ఒకటి నూట పదహారు పద్యాలతో ముగిస్తారు. కానీ సుమశ్రీగారు మూడువందల పద్యాలతో త్రిశతి రాసి నేటి పద్యాలు అని పేరుపెట్టారు. నిజానికి అవి నేటి సామాజిక స్పృహను కలిగి ఉన్నాయి. వారి రచన గురించి నా మాటల్లో కంటే డాక్టర్ మేడసాని మోహన్ గారి మాటల్లో విందాము-

" జీవన ప్రమాణ పావన ధార్మిక
సూత్రములను, వాక్పవిత్రములను
ఆర్ద్ర చిత్తుడగుచునందించె, సామాజి
క స్పృహావలంబ కవన ఫణితి"

"కొండసాని సుకవి కూర్మిపరిమళింప
మేడసాని కవికి మేను పొంగు
కవితల దొరసాని కరుణ మా యిర్వురి
జీవనముల పలుకు సిరుల నింపె"

"అపూర్వ పంచసహస్రావధాన సార్వభౌములు"

డాక్టర్ మేడసాని మోహన్‌గారు విశ్వవిద్యాలయ యోగ్యతాపత్ర మునకు మించిన సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రశంసలిచ్చినారు. అంతకన్నా ఆంజనేయరెడ్డిగారి కవితకు గుర్తింపు మరొకటి అవసరం లేదు.

"పద్యమౌళి, పద్యభాషి, పద్యసుగంధవాహక బిరుదాంకితులు డాక్టర్ రాధాశ్రీగారి మాటల్లో చూస్తే...

"మెత్తని భావములను సుతి
మెత్తగ చదువరులకిడుచు మేరుసముండై
చిత్తములను సుమశ్రీ
మొత్తమ్ముగ దోచినాడు పూనిక తోడన్"

ఈ విధంగా పలువురు ఈయన కవిత్వాన్ని మెచ్చుకున్నారు.

78. పెద్దోజు నాగేశ్వరరావు - 1961 దుర్గి

నాయకురాలు నాగమ్మ ఏలిన జిట్టగామాలపాడు గ్రామం. తల్లిదండ్రులైన పెద్దోజు నమశ్శివయ్య భాగవతార్, నాగరత్నమ్మ పుణ్య దంపతులు ఆధ్యాత్మిక చింతనాపరులు. అతిథి, అభ్యాగతులను ఆదరిస్తూంటారు. కవులు, సాహిత్యప్రియులు. అధునాతన, సనాతన కవిత్వంలో అందెవేసిన చేయి నమశ్శివయ్య గారిది. వీరి రెండవ కుమారులే నాగేశ్వరరావు. వీరు 1961 జులై 9వ తేదీన జన్మించారు.



శిల్పకళా నిలయమైన దుర్గిలో పెరిగి పెద్దవాడై విద్యాభ్యాసం చేశాడు. ఈశ్వర భిక్షమాచారి వద్ద శిల్పం నేర్చుకున్నాడు. వృత్తి శిల్పమే అయినా ఉపాధి పౌరోహిత్యం. పౌరోహిత్యంలో పేరు గడించాడు. చిన్నవాడైనా పెద్ద పేరుంది హైదరాబాద్‌లో. పెద్దల సాహచర్యం నిత్యం.

తాతల నుండి కవిత్వం వారి ఇంట కొలువై ఉన్నది. తాతగారు కవి, తండ్రిగారు కవి, బాబాయి కవి, తమ్ముడు కవి, ఇక కవిత్వం కాగితం మీద కదం తొక్కమంటే తొక్కదూ... తొక్కక ఏం చేస్తుంది మరి! ఆధునిక కవిత్వం అలవోకగా వస్తుంది. అభ్యాసం కూసువిద్యగా అయింది వీరికి. బాపు గీత గీస్తే బొమ్మ అయినట్లు నాగేశ్వరుడు కూతకూస్తే కవిత అయింది, అవుతుంది.

నాగేశ్వరరావు కూతలే చిలక పలుకులు.**'చిలక పలుకులు'** అనే గేయ కవితా సంపుటిని 2001 జూన్ నెలలో ఆవిష్కరించారు.

చిలక పలుకులు ముద్దుముద్దుగా ఉంటాయి. అందరికీ ఇష్టం. చిలక పలుకులకు పరవశించని హృదయం ఉండదు. ఆ మార్గాన్ని ఎంచుకున్నారు నాగేశ్వరరావు.

వేమన, సుమతి లాంటి శతకాల వలే సమాజానికి ఎన్నో నీతులు చెప్పారు.

సమాజంలోని మంచి చెడులను బోధించారు. అందుకు ఆటవెలది, తేటగీతి, కందం లాంటి ఛందస్సులను ఉపయోగించుకున్నారు.ఎన్నో శతకాలు లోకంలో కోకొల్లలుగా వచ్చాయి. సమాజహితాన్ని కోరాయి. లోటుపాట్లను దుయ్యబట్టాయి. ఆ రోజుల్లో వేమన పద్యాలు, సుమతీశతక పద్యాలు రానివారు లేరు. ఈనాటికీ ఆ పద్యాలు వచ్చినవారున్నారు.

కాలం మారింది, కవిత్వం మారింది, భావం మారింది, భాష మారింది, ఛందస్సూ మారింది. మారుతున్న కాలంతోపాటు ముందుకు సాగుతున్నాడు మానవుడు. లేకపోతే మనుగడ లేదు మరి! మనుగడ కోసం మారాలి. ఈ పరిణామంలో కవిత్వం తన ఉనికిని నిలుపుకోటానికి మారుతూ పోతోంది. మరో తరానికి ఇది ఏ రూపంగా మారుతుందో వేచి చూడవలసి ఉంది.

నేటి కవిత్వాన్ని ఎంచుకున్నారు నాగేశ్వరుడు. అలతి అలతి పదాలలో పెద్ద భావాలను చిలక పలుకుల్లా పలికారు. ఆ పలుకులు ఆలకించిన పెద్దలు ఏమన్నారో చూద్దాం....

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు –

"సమకాలీన సమాజంలోని వివిధ సాంఘిక, ధార్మిక, రాజకీయాంశాలను సందేశాత్మకంగా, యథార్థ రీతిలో చిత్రించారు నాగేశ్వరరావు.

"కులవైర మొక ప్రక్క
మతభేద మొక ప్రక్క
ఐకమత్యము ముక్క
లయిపోయే చిలుకా"

ఇలాంటి పరమ వాస్తవిక సత్యాలను ఈ సంపుటి ద్వారా అందిస్తున్న పెద్దోజు నాగేశ్వరరావు గారికి అభినందన" అన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ నాయని కృష్ణకుమారి ఆశీస్సు లందిస్తూ–

"చిలుకను సంబోధిస్తూ కవి తాను చెప్పదలచుకుంది గేయ మాధ్యమం ద్వారా చాలా సూటిగా, సరళ మనోజ్ఞంగా చెప్పడం ఈ సంపుటి గొప్పదనం. ఎన్నుకున్న వస్తువు లోకప్రసిద్ధం. దాన్ని గేయరీతిలో నిర్వహించినతీరు బాగుంది. భాష విషయంలోను,

భావం విషయంలోను స్పష్టత ప్రశంసయోగ్యత సంతరించుకుంది. అన్నిటికి మించి అన్నిటిపైనా చురకలంటించే విధంగా వ్యంగ్య వైభవం ఈ గేయాలకు ఇంకొక ఆభరణంలా నిలిచింది" అని అన్నారు.

సాహిత్యబ్రహ్మ డాక్టర్ వీవీఎల్ నరసింహారావు ఏమన్నారంటే –

సామాజికమైన గొప్ప సందేశాన్ని అందించే గేయాలివి. తాళగతి తప్పకుండా తన్మయత్వంతో పాడుకోదగిన గేయాలివి. ఇంత మంచి గేయ రచన చేసికూడా కవి తనవి "చిలక పలుకులు" అని వినమ్రభావంతో చెప్పటం కద్దు.

మహామహోపాధ్యాయ డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావుగారు–

చిలక పలుకులు పలికిన చి॥నాగేశ్వరరావు వర్ధిష్ణు కవి.కవిపండితుల వంశములో జన్మించిన నిత్య కార్మికుడుగా శిల్పాలు మలుస్తూ జీవనశిల్పాన్ని తీర్చుకొంటున్న జిజ్ఞాసువు. వేదాల నాదాలు వల్లెవేస్తూ, కవిచంద్రుల గానాలు ఆలకిస్తూ, నిత్యజీవితంలో ఎన్నో ఒడుదొడుకుల్ని ఎదుర్కొంటూ అనువంశికంగా వచ్చిన కవితా లతను ఇలా చిలక పలుకులతో అనలెత్తిస్తూ హైదరాబాద్ మహానగరంలో జీవనం గడుపుతూ తాను చూచిన జగత్తును కవితాదర్పణంలో చూపించాడీ కవి.

కళాప్రపూర్ణ రావూరి భరద్వాజ గారు–

"ఏ విషయాన్ని గురించైనా అందంగా రావచ్చు అనడానికి చిలక పలుకులు లోంచి చాలా పంక్తుల్ని ఉదహరించవలసి ఉంటుంది. అంతకన్నా మీకు నచ్చిన పంక్తులేవో, బాగా నచ్చిన పంక్తులేవో, ఎందుకు నచ్చాయో మీరే ఈ యువకవికి రాయాల"ని అన్నారు.

ఇంకేముంది– మీరు వెంటనే చిలుక పలుకులు తెప్పించుకొని చదవండి, చిలుక పలుకులు ఎవరికి ఇష్టం ఉండదు?!

రచనలు: 1చిలక పలుకులు 2. పరుశవేధి 3. వాస్తు సూత్రాలు (చిలక పలుకులు) 4. సౌందర్య లహరి –గేయకావ్యం (ఆది శంకరాచార్యుల వారి సౌందర్యలహరికి గేయానువాదం)

పురస్కారాలు: వసంత కోకిల పురస్కారం, సహజకవి పురస్కారం, అక్షరశిల్పి బిరుదు, పురోహిత కార్యశిల్పి బిరుదు, మార్గసహాయాచార్య పురస్కారం మరెన్నో పురస్కారాలు పొంది, పొందుతున్న కవి పెద్దోజు నాగేశ్వరరావు కవి.

79. చిరతనగండ్ల సోమేశ్వరరెడ్డి-1962 మాచర్ల



చిరతనగండ్ల సోమేశ్వరరెడ్డి గారు గుంటూరు వాస్తవ్యులు. ఉద్యోగరీత్యా మాచర్ల పట్టణ వాసి. పలనాటి మీద ఉన్న అభిమానంతో పలనాటి చరిత్రకు సంబంధించిన రచనలు చేశారు.

శ్రీమతి చిరతనగండ్ల కృష్ణావతి, లక్ష్మీనారాయణ గార్లకు 1962 ఏప్రిల్ 1వ తేదీన జన్మించారు. వీరు ఎం.ఎ.(చరిత్ర), ఎం.ఎ. (టూరిజమ్) చేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పలనాటి ప్రాంతాలలో ఉద్యోగం చేస్తున్నారు. వీరి రచనలు ప్రూఫ్‌రీడింగ్ చేసి ప్రోత్సాహపరచి, నేను (డాక్టర్ బెజ్జంకి) ముందుమాట రాయడం జరిగింది.

వీరి రచనలు: 1.ఎత్తిపోతల క్షేత్ర వైభవము 2.శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి దేవస్థానము- మాచర్ల క్షేత్రమాహాత్మ్యము – సంక్షిప్త చరిత్ర 2014 **3.శ్రీదత్త సాయి సచ్చరిత్రం 4. శ్రీ పల్నాటి వీర్ల అంకమ్మ చరిత్ర మరియు కారంపూడి క్షేత్ర వైశిష్ట్యం** 2016 సం॥ **5. కాలభైరవ చరిత్ర** – అముద్రితం.

80. శ్రీరామదాసు అమరనాథ్ -1963, దాచేపల్లి

శ్రీరామదాసు అమరనాథ్ దాచేపల్లి వాస్తవ్యులు. ఆయన పిచ్చయ్య, సరోజినీదేవి పుణ్యదంపతుల కుమారుడు. 1963 సెప్టెంబర్ 22న జన్మించారు. ఉపాధ్యాయవృత్తి. ప్రముఖ రచయిత. కార్టూనిస్టు.



రచనలు: సారంగం – బాలల నాటికల సంపుటి. **సమీరం**– నానీల సంపుటి, **రేపటి మార్పు**– నాటిక, అమరనాథ్ గజల్స్, అమరనాథ్ కార్టూన్స్ ముద్రణలో ఉన్నవి. **భారత సోవియెట్ సాంస్కృతిక సంఘం వారిచే చిత్రకళా పురస్కారం అందుకున్నారు.** వీరు తెలుగు, కన్నడం, తమిళం, హిందీ, సంస్కృతం, ఉర్దూ, ఆంగ్ల భాషలలో దిట్ట. వీరు తన రచనలను కన్నడం, తమిళం, ఇంగ్లిషులలో కూడా ప్రచురించారు

81. పెద్దోజు భవానీప్రసాద్ - 1964 దుర్గి
(బాలకవి)



చిరంజీవి పెద్దోజు భవానీప్రసాద్ 'బాలకవి' బిరుదాంకితుడు. పలనాటి నాయకురాలు నాగమ్మ కొలువుదీరిన గడ్డ జిట్టగామాలపాడు. ఆ గ్రామంలో పుట్టిన వారందరూ దిట్టలే. ఆ ఊరే చిరంజీవి బాలకవి భవానీప్రసాద్ జన్మస్థలం.

విశ్వకర్మ వంశజులు, వీరబ్రహ్మకవి పౌత్రులు. శ్రీమతి నాగరత్నమ్మ, నమశ్శివయ్య భాగవతార్ కవివరేణ్యుల పుత్రులు. శిల్పి, ఆధునిక కవి. శిలాశిల్పములోనే గాక రచనాశిల్పములోనూ మంచి బావుకత కలిగిన కవి. రచనలు ఒందు రెండైనా రత్నాలు!

వృత్తిరీత్యా శిల్పి. నిత్యం శిలాశిల్పంలో నిమగ్నమై ఉంటాడు. విరామ సమయంలో పుస్తక పఠనం, హెూమియో వైద్యం, రచనావ్యాసంగం.

భవానీప్రసాదు
కలం కదిపితే
పదం పలుకుతుంది
పాఠకుడి మనస్సు
ఆలోచనా పథం
లో పడుతుంది.

అదే ఈ 'బాలకవి'లో ప్రత్యేకత. బాలకవి భావాలకు రూపం **'సృష్టి వైచిత్ర్యం'**, **'స్పందన'** వచన గేయ కవితా సంపుటి.

"సృష్టి వైచిత్ర్యం" గేయ కావ్యం, దేవదాయ ధర్మదాయశాఖ, హైదరాబాద్ నుండి వెలువడే "ఆరాధన" మాసపత్రికలో జూలై 1997లో పూర్తిగా ప్రచురింపబడి పాఠక లోకమునకు చేరింది.

గ్రామస్తుల సహకారంతో 2005సంవత్సరంలో **"సృష్టివైచిత్ర్యం"** ముద్రించబడి 25-4-2005 వ తేదీన దుర్గి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి సన్నిధిలో

పలనాడు చైతన్య కళాస్రవంతి, దుర్గి వారి ఆధ్వర్యములో ఆవిష్కరింపబడినది.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి అభినందనలు ఇలా రాశారు–

"శ్రీ భవానీప్రసాద్ సృష్టికి సంబంధించిన మూలసూత్రాన్ని దృష్టిలోపెట్టుకొని ప్రకృతిలో మానవుడు వహిస్తున్న గణనీయ పాత్రను విశ్లేషిస్తూ దానికి సంబంధించిన వివిధ కోణాలను ఈ కావ్యంలో సమర్థంగా చిత్రిస్తున్నాడు.

మనిషి అన్నప్పుడు పంచేంద్రియాల సంపుటి మాత్రమే కాదు వాటిని నడిపించే మనసు ముఖ్యం. అందుకే భవానీప్రసాద్ అంటారు–

" మనిషి మనుగడకు
మూలం మనస్సు" అని

ఈ కావ్యంలో సృష్టికి, మానవుని మనోదృష్టికి సంబంధించిన ఎన్నెన్నో అంశాలను లోతుగా పరిశీలించి అక్షరబద్ధం చేసిన భవానీప్రసాద్‌కు నా హార్దికాభినందన.

'విద్యావిశారద', 'సాహిత్య సరస్వతి' డాక్టర్ కన్నెకంటి రాజమల్లాచారి సృష్టివైచిత్ర్యం గురించి రాస్తూ, ***కావ్యరహస్యం** అని శీర్షిక పెట్టి ఈ కావ్యం చదువుతూంటే ఈ తరం మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి 'విశ్వంభర' కావ్యం గుర్తుకు వచ్చింది. అది మహాసింధువు. ఈ కావ్యం బిందువు, ఈ బిందువులో ఆ సింధువు లక్షణాలు కనిపించాయి.*

'వాక్యం రసాత్మకం కావ్యం' అదే లాక్షణికోక్తి సార్థకమైంది ఈ కావ్యంలో. కదిలేది, కదిలించేది, పెనునిద్దుర వదిలించేది కవిత్వమని మహాకవి శ్రీశ్రీ అన్నారు. అలా ఈ కావ్యం పాఠకులను ఆలోచింపచేస్తుంది. ప్రతివారికీ మత్తు వదిలిస్తుంది.

ప్రబోధాత్మక సత్కార్యం అంటూ 'సాహిత్యబ్రహ్మ' డాక్టర్ వీవీఎల్ నరసింహారావు గారి మాటలు చూద్దాం ఒక్కముక్కలో....

కవి తనను బాలకవిగా పేర్కొన్నాడు.ఇది ముద్దు పేరేగాని, కావ్య రచనాపద్ధతిని బట్టి చూస్తే ప్రౌఢకవి లక్షణాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కొట్టవచ్చినట్లు కాకుండా సుప్రసన్నంగా ఈ కవి కలం నుండి మరెన్ని ప్రౌఢకావ్యాలు రానున్నవో ! తథాస్తు!

లో చూపున్నిశితమ్ముగ
జూచి భవానీ ప్రసాదు చొక్కుచు జింతా

ప్రాచుర్యమ్మున నుడివెన్
వాచారుచి మీఱ సృష్టి వైచిత్ర్యమ్మున్

అని చిటిప్రోలు కృష్ణమూర్తి చిట్టిమిరియమంత అభిప్రాయాన్ని చెప్పారు. మహామహోపాధ్యాయ డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు గారు–

'భావ చిత్రం	కవితా దిగంబరం
సంభావనా చిత్రం	సాహితీ నవాంబరం'
భవానీ ప్రసాదు	ఇది విచిత్రం
గీసిన ఈ చిత్రం	భవభావబంధురం
ఇది విచిత్రం	కవితా దిగంబరం
భవభావబంధురం	సాహితీ నవాంబరం'

అంటూ ఇంకా చెప్పారు– ముప్పై పేజీల ఈ గేయకావ్యం పఠితలను తలలు పంకింప చేస్తుంది. ఉబుసుపోకకు చదివినా ఊహింపజేస్తుంది. అంతటి మహత్తరమైన రచన భవానీప్రసాదుది. ఈ సృష్టి వైచిత్ర్య కావ్యాన్ని తనను ఈ సృష్టికి పరిచయం చేసిన పూజ్యపాదులు తల్లిదండ్రులు శ్రీమతి నాగరత్నమ్మ, శ్రీ నమశ్శివయ్య భాగవతార్‌గార్లకు అంకితమిచ్చాడు.

"అనుభవైకవేద్యం ఆలోచనామృతం ఈ సృష్టి వైచిత్ర్యం" –డాక్టర్ బెజ్జంకి. ఈ కావ్యాన్ని 25–4–2005 దుర్గి గ్రామంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చిటిప్రోలు కృష్ణమూర్తి గారిచే ఆవిష్కరింపబడింది. ఆనాటి సభలో డాక్టర్ పి.వి.ఆచార్య, డాక్టర్ కమలాసనరావు, డాక్టర్ స్వర్ణవాచస్పతి, డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు పాల్గొని ఉపన్యసించారు.

82. వై.హెచ్.కె.మోహనరావు–1965, పిడుగురాళ్ళ



పిడుగురాళ్ళ వాస్తవ్యులు. ఎక్కల అనసూయమ్మ, విశ్వనాథం దంపతులకు 1965 జులై 1వ తేదీన జన్మించారు. వీరి పూర్తిపేరు యెక్కల హరికృష్ణ మోహన రావు. వై.హెచ్.కె. మోహనరావుగా ప్రసిద్ధులు. ఈయన రచనలన్నీ అవార్డుస్థాయికి తగ్గట్టుగా ఉంటాయి.

వైవిధ్యభరితమైన అంశాలను తీసుకొని రచనలు సాగిస్తుంటారు. ఈ రచనలను పలువురు పెద్దలు అభినందించారు. పలు సంస్థలు ప్రశంసలు అందించాయి.

రచనలు: 1. **కరువు కురిసిన మేఘం** - వచన కవితల సంకలనం (2008)
2. **తొలి మహామంత్రిణి** - **నాయకురాలు నాగమ్మ** (2011)
3. **అక్షర స్వరాలు** - గేయ సంపుటి (2012)
4. **శాంతిదూత** - **నాయకురాలు** (2015)
5. **నాయకురాలు** - **ఆత్మకథ** (2016)
6. **విచ్చుకోవాలి** - వచన కవితా సంకలనం (2018)

వీరు **'ఎక్స్‌రే'** రాష్ట్రస్థాయి ఉత్తమ కవితాఅవార్డు, 'ఆటా' ఉత్తమ కవితా అవార్డు, 'రజనీ కుందుర్తి' అవార్డు వంటి ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందారు.

83. దేవిశెట్టి శ్రీనివాస్ -1968, కారంపూడి

దేవిశెట్టి శ్రీనివాసరావు, బి.ఎ.,బి.ఇడి. పత్రికా విలేకరి. దేవిశెట్టి సీతమ్మ, జగన్నాథం గార్ల కుమారుడు. 1968 మే 15వ తేదీన జన్మించారు. **రచన: పల్నాటి భారతం** సంక్షిప్త వార్తా కథనం- 2000లో దేవదాయశాఖ వారు ప్రచురించారు.

84. కోసూరి రవికుమార్- 1969, దాచేపల్లి



కోసూరి రవికుమార్ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. 1969 జూన్ 12న పార్థసారథి, సుగుణ పుణ్యదంపతులకు దాచేపల్లిలో జన్మించారు. రచయితగా ప్రసిద్ధులు.

రచనలు: బొడ్డుపేగు - వచన కవితా సంకలనం



85 సరికొండ నరసింహరాజు -1969, భట్టువారిపల్లె

కారంపూడి మండలం భట్టువారిపల్లె గ్రామం. వెంకటప్పమ్మ, శంకరరాజులు కుమారుడు. 1969లో జన్మించారు. వచనకవిత్వంలో దిట్ట. పలు సంస్థల నుంచి ఎన్నెన్నో అవార్డులు పొందారు. వివిధాంశాలపై సంకలనాలు

తీసుకువచ్చారు.

రచనలు: 1. ఒక విధ్వంసక ముఖచిత్రం (2007)

2. ఒకే ఒక్క సిరాసుక్క - నానీలు (2010)

3. భస్మసింహాసనం - ఏకాంకిక (2011)

4. చూపుడి వేలిపై సూర్యోదయం- కవిత్వం (2015)

5. శాంతిసాగరం -గేయకవిత్వం (2016)

ఎక్స్‌రే అవార్డు, పెనుగొండ అవార్డు, నందిని కుందుర్తి అవార్డు, మానస హైదరాబాద్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ అవార్డు పొందారు.

86. నాగిశెట్టి తాతయ్య నాయుడు-1970. దాచేపల్లి

నాగిశెట్టి పిచ్చయ్య, ధనలక్ష్మి దంపతులకు 1970 ఆగస్టు 19న జన్మించిన తాతయ్య ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. నానీలు రాయడంలో అందెవేసిన చేయి. దాచేపల్లి పరిసర ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారు. 1998 నుంచి రచనలు చేస్తున్నారు.



రచనలు: గడ్డి చేమంతులు - నానీలు (2006)

మనిషి కోసం - నానీలు (2008)

మట్టి బంగారం - వచన కవితలు (2010)

నాగిశెట్టి నానీలు - నానీలు (2013)

87. పావులూరి సతీశ్ - 1976. మాచర్ల



పావులూరి రేణకాదేవి, ఆంజనేయులుగార్ల కుమారులు. 1976 ఆగస్టు 18న జన్మించారు. పత్రికావిలేకరులుగా చరిత్ర పరిశోధన చేయడంలో ఆసక్తి మిన్న.**శ్రీ భ్రమరాంబ సమేత సిద్ధేశ్వరస్వామి క్షేత్ర, తేరాల చరిత్ర** అను పుస్తకమును రచించారు. పలనాటి చారిత్రకాంశములను వెలుగులోకి తెస్తున్నారు.

88. వేముల శ్రీనివాసరావు-1976, మాచర్ల



వేముల శ్రీనివాసరావు మాచర్ల వాస్తవ్యులు.వేముల నాగేశ్వరరావు, వెంకటరమణమ్మ పుణ్యదంపతులకు 1976 డిసెంబర్ 25న జన్మించారు.ఎమ్.కామ్,బి.ఇడిచేశారు. ప్రముఖ సంఘసేవకులు, దివ్యాంగులకు సహాయ సహకారాలు, ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. దాదాపు | ¥Ðø T+º **ది అమరావతి వాయిస్** అనే పత్రికకు జర్నలిస్టుగా పనిచేస్తున్నారు.

వీరి రచన: 'మన పల్నాడు' పల్నాడు, పల్నాడు ప్రాంత పర్యాటక ప్రాంతాలు ప్రముఖ వ్యక్తుల వివరాలతో పుస్తకమునకు సంపాదకత్వం వహించి ఇటీవల వెలువరించారు. ఈ పుస్తకం బహుళ ప్రజాదరణ పొందింది.



89. మంగళగిరి అనిల్‌శాస్త్రి- 1986, దుర్గి

మంగళగిరి అనిల్‌శాస్త్రి దుర్గి గ్రామవాసి. ఎం.సి.ఏ చేసి కులవృత్తి పౌరోహిత్యంచేస్తూ సాహిత్యంవైపు దృష్టి మళ్ళించారు. దుర్గిలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామివారి దేవస్థానంలో అర్చకత్వం. విశ్వబ్రాహ్మణ కులమువారు,విశ్వకర్మవంశీయులు. మంగళగిరి సత్యనారాయణశాస్త్రి వేంకటరావమ్మ గార్ల కుమారుడు. **రచనలు:** 1.**'నా గురుదైవమా!'** అను మకుటంతో ఆధునిక గేయములను రచించారు (2016), ఈ గ్రంథ ఆవిష్కరణ సభలో పాల్గొని డాక్టర్ బెజ్జంకి ప్రసంగించారు. 2. **పూజావిధులు- రహస్యాలు** (2018).

> **చ॥ గిరులకు మేటి మేరు భుజగేంద్రుడు పాములకెల్ల మేటి యా**
> **సురులకు మేటుపేంద్రునకు సోదరుడున్ మృగమేటి కేసరీ**
> **తరువుల మేటి కల్పతరు తారల మేటి హిమాంశు మీదు ము**
> **గ్గురికిని మేటి వీవు యన గొల్చితి బోదిలివీటి ధూర్జటీ!**
>
> **తాత్పర్యం: బోదిలివీటిలో వేంచేసియున్న ఓధూర్జటీ! పర్వతములన్నిటికన్నా మేరుపర్వతంగొప్పది.పాములన్నింటిలో నాగరాజు గొప్ప.దేవతలలో దేవేంద్రునిసోదరుడైన ఉపేంద్రుడు గొప్ప. మృగములలో సింహముగొప్ప.పైముగ్గురి (నాగరాజు,ఉపేంద్రుడు, చంద్రుడు) కంటె నీవే గొప్ప అని సేవించినానయ్యా!**
>
> **(పద్యం: కవిసింహ పోకూరి కాశీపత్యవధాని, తాత్పర్యం: డాక్టర్ బెజ్జంకి)**

పల్నాటి సీమలో బాలసాహిత్య కవులు

(90, 91, 92, 93)

90. డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు- 1952, మాచర్ల

బెజ్జంకి జగన్నాథాచార్యులు అమృతమ్మ, కుమారస్వామి పుణ్యదంపతులకు తృతీయ పుత్రుడు. గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం వేమవరం గ్రామంలో 1952 డిసెంబర్12వ తేదీన జన్మిం చారు. పాఠశాలవిద్య వేమవరం, సూరేపల్లి గ్రామాలలో పూర్తిచేశారు. కళాశాలవిద్య రేపల్లె పట్టణంలోనూ భాషాప్రవీణ శ్రీశంకర సంస్కృత కళాశాలలోనూ పూర్తి చేశారు. అనంతరం ఆంధ్రావిశ్వవిద్యాలయంవారి పి.ఓ.ఎల్ (ప్రొఫిషియన్సీ ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్) పట్టా పొందారు. ఆ తరువాత ఎం.ఏ. చేశారు. అనంతరం మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఫిల్ పట్టా, అలాగే శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి **'గుంటూరు జిల్లా కవుల ఆధునిక గేయ కావ్యాలు'** అనే అంశంపై సిద్ధాంత వ్యాసం సమర్పించి పిహెచ్.డి పట్టా పొందారు.



తిరుమల తిరుపతి దేవస్థానంవారి హిందూధర్మ ప్రబోధ కళాశాలలో శిక్షణ పొంది ప్రథమశ్రేణిలో కృతార్థులయ్యారు. అనంతరం తి.తి.దే.వారి హిందూధర్మ రక్షణ సంస్థలో ప్రోగ్రాం అసిస్టెంట్‌గా, జిల్లా ఆర్గనైజర్‌గా బాధ్యతలు స్వీకరించి హిందూధర్మ ప్రచారం చేశారు. గుంటూరు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలలో పనిచేశారు.

1984 జనవరిలో పల్నాటి గడ్డపై తొలుత అడుగుపెట్టారు. ప్రభుత్వ పాఠ శాలలో తెలుగు పండితులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించి ప్రథమశ్రేణి తెలుగు పండితులుగా 2010లో ఉద్యోగ విరమణచేశారు. పల్నాటిలోనే స్థిరనివాసం ఏర్పర చుకుని పల్నాటి వాసి అయ్యారు. 27సంవత్సరాలు ఉద్యోగ జీవితంలో **పల్నాటి చరిత్ర-సంస్కృతి**పై అవగాహన పెంచుకున్నారు. పల్నాటిలో ఉన్న ప్రముఖ కవులతో సన్నిహిత స్నేహాన్ని కలిగిఉన్నారు. **కవిసింహ పోకూరి కాశీపత్యవధాని** గారు 1962లో స్థాపించిన

నాగార్జున సాహితీ సంస్థకు కార్యదర్శిగా పలు సాహిత్య సభలు, కవిసమ్మేళనాలు నిర్వహించారు. రాజీవ్ విద్యామిషన్' సర్వశిక్షాఅభియాన్ కార్యక్రమంలో, బాల సాహిత్యంలో సంపాదకులుగా బాలల మాసపత్రికను నిర్వహించారు. ప్రభుత్వ గ్రంథాల మార్గ్జుల్స్ రూపకల్పనలో ప్రముఖ బాలసాహిత్యవేత్తలతో కలిసి పనిచేశారు. పల్నాటి ప్రముఖ కవిపండితులు పలువురిని సత్కరించారు. పల్నాటి కవులు, రచయితలతో ముఖాముఖీ పరిచయాలు కలిగి ఉన్నారు. వారి గ్రంథాలను, వారి పూర్తి వివరాలను సేకరించారు. ఆ క్రమంలోనే **పల్నాటి కవుల చరిత్ర** అనే గ్రంథరచన పూర్తిచేసి కృత కృత్యులయ్యారు. ఈ గ్రంథ ప్రచురణకు ముందుగా **"తెలుగుబిడ్డ- మాతృశ్రీ అమృతమ్మగారి తత్త్వాలు"** రచించి ప్రచురించారు.

వృత్తి రీత్యా తెలుగు పండితులుకావటంచేత సాహిత్యమన్న మక్కువ. గ్రంథ సేకరణ, గ్రంథ పఠనం,వ్యాసాలు, కథలు, గేయాలు రాయడంలో అధిక సమయం గడుపుతూ ఉంటారు. బాలసాహిత్యంలో ఎక్కువ కృషిచేస్తున్నారు. అంతేకాదు ప్రాచీన సాహిత్యంలోనూ కృషి సాగిస్తున్నారు. పూర్వకవులు రాసిన అలభ్యములైన శతకాలకు తాత్పర్యాలు కూర్చి పునర్ముద్రణకు దోహదం చేస్తున్నారు.

వినగానే అర్థమయ్యేలా సులభశైలిలో **'తెలుగు ధీర'** నీతి శతకం రాశారు. ఇందులోని పద్యాలు అచ్చం వేమన పద్యాలను పోలి ఉంటాయి.

" బడికి పంపవయ్య బంగారు తల్లిని
పాడిగాదు నీకు పనికి పంప
నేటి బాలరేపు మేటి వనితయౌను
తెలిసి మసలుకొనుము తెలుగుధీర "

ఇందులో ఎంత సామాజిక స్పృహ ఉందో చూడండి. స్త్రీవిద్యను ప్రోత్సహిస్తున్నారు. ఆడపిల్లలను పనికిపంపే తల్లిదండ్రులను ప్రాధేయపడుతున్నారు-ఆడపిల్లలను చదివించమని!

"బరువు లెత్తి ఒకతె పరుగులెత్తి ఒకతె
తిరిగె నింగిలోన దేవతటుల
మగువలోని ప్రతిభ మనమెంచలేమయా
తెలిసి మసలుకొనుము తెలుగుధీర"

"ఆడపిల్లలున్న ఆ ఇంట విరిజల్లు
ఆడపిల్లలున్న అలరు సిరులు
ఆడపిల్లలున్న ఆనంద నిలయమౌ
తెలిసి మసలుకొనుము తెలుగుధీర"

"రాత్రి బడికి వెళ్ళి రవ్వంత చదువుకో
చదువు గొప్పతనము విదితమగును
విద్య లేనివాడు వింత పశువుగదా
తెలిసి మసలుకొనుము తెలుగుధీర"

నిరక్షరాస్యులైన రైతులు, రైతు కూలీలకు రాత్రిపూట బడికి వెళ్ళి వయోజనవిద్య కేంద్రంలో చదువుకోమని చెబుతున్నారు.

ఇలా తెలుగు భాష గొప్పతనం, ఆరోగ్య సూత్రాలు, పచ్చని చెట్ల ఆవశ్యకత మొదలైన ఎన్నో విషయాలు అలతిఅలతి పదాలతో చెప్పటం బెజ్జంకి రచనలో ప్రత్యేకత.

బెజ్జంకి రచనలు: 1.తెలుగుధీర -నీతిశతకం, 2. పల్నాటి క్విజ్ బుక్, 3. పురాణ కథలు, 4.ధూర్జటిశతకం (పోకూరి కాశీపత్యవధాన్లు)-తాత్పర్యం, 5.శరభాంక లింగ శతకం - శరభాంకుడు- తాత్పర్యం 6. ప్రహ్లాదచరిత్ర -బాలల బొమ్మల కథ, 7. వీరసావర్కర్-బాలల బొమ్మల కథ, 8.కాసు బ్రహ్మానందరెడ్డి-బాలల బొమ్మల కథ, 9.ఎత్తుకు పైఎత్తు-బాలల బొమ్మల కథ, 10.తెలుగు బిడ్డ, అమృతమ్మగారి తత్త్వాలు, 11. పల్నాటి కవుల చరిత్ర

అముద్రితములు: 1.పల్నాటి స్వాతంత్ర్య సమరయోధులు, 2, పల్నాటి గేయ కవిత, 3.గుర్రం మల్లయ్య చరిత్ర,4.కవిసింహ పోకూరి కాశీపతి చరిత్ర, 5.ఎత్తిపోతల చరిత్ర, 6.నాగార్జున సాగర్ చరిత్ర, 7.గుంటూరు జిల్లా స్థానిక చరిత్రలు- పర్యాటక ప్రాంతాలు, 8.మంచి మిత్రులు-బాలల బొమ్మలకథ (టీవీ మహాదేవి దండకం, టీవీ మహమ్మారి దండకం) వివిధ పత్రికల్లో ప్రచురితాలు), 9. నీతి నేర్పిన కోతి - బాలల బొమ్మల కథ, 10. నీతి శతకం-2, 11.బాలల గేయాలు.

పురస్కారాలు -బిరుదులు: 1.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 3.సమతారావు అవార్డు (బాల సాహిత్యంలో), 4.పల్నాటి చరిత్ర కథా సమ్రాట్ బిరుదు, 5.పల్నాటి వేమన బిరుదు, 6.విశిష్ట వశిష్ట సేవా పురస్కారం, 7. మనుబ్రహ్మ బిరుదు, 8.బాలసాహితీరత్న, 9.బాలసాహిత్య సేవాబంధు, 10.వివిధ పౌర సన్మానాలు సత్కారాలు...

చివరిగా పల్నాటి గేయకవితలో కొన్ని అంశాలను రేఖామాత్రంగా చూద్దాం...

"ఆడదంటె అబల కాదు
అరివీరుల నడలుగొట్టు
నారీమణియని చాటిన
నాగమ్మది పల్నాదే"

"మరులు గొన్న మగసిరిగల
మగడు పొందుగోరి వస్తే
పోరుకంపిన మాంచాల
పోరిది మన పల్నాడే"

ఆడదంటే అబల కాదు. చులకనగా చూడకు. అవసరమైతే చీల్చి చండాడుతుంది అని హెచ్చరించారు.

"కృష్ణవేణి నదీ జలం
గలగలమని పారుచుండ
పైరు పచ్చలలరుచుండ
పరవశించు పల్నాడే"

" నాగార్జున సాగరు జల
ధారలు తొలియడుగులిడుచు
ముందుకెగసి చిందులేయ
మురిసినదీ పల్నాడే"

"ఎండుమిర్చి ఎఱ్ఱదనం
ప్రత్తి పంట తెల్లదనం
పోటీపడి కాంతులీను
పురిటిగడ్డ పల్నాడే"

"రాజకీయవేత్తలకిది రణరంగపు రంగవల్లి
శత్రువులను చిత్తుచేయు చదరంగం పల్నాడే"

"పౌరుషాల పల్నాడే, పండితులకు పుట్టినిల్లు
కవిశేఖరు లెందరినో కన్నభూమి పల్నాడే"

ఈ విధంగా పల్నాటి సీమలోని వివిధ అంశాలను కళ్లకు కట్టినట్లు చక్కగా వర్ణించారు. చరిత్ర, సంస్కృతి,సామాజికాంశాలు, నాటి, నేటి జీవన విధానాలను చక్కగా వివరించారు డాక్టర్ బెజ్జంకి. వివిధ ప్రక్రియలలో రచనలు చేయటంలో మెలకువలెరిగిన వారు డాక్టర్ బెజ్జంకి.

పై మెఱుపు చూచి భ్రమలోన పడబోకు లోగుణము నెరుగవే మనసా!	మేడిపండు లాంటి మనుజులెందరొ కలరు మనసు కుళ్ళిన వారు మనసా!	మధ్యలో నీకేల మమతానురాగాలు భ్రాంతినీ వీడవే మనసా!

-మాతృశ్రీ అమృతమ్మగారి తత్వాలు- బెజ్జంకి

91. కన్నెకంటి పెదసైదాచారి- 1957 మోర్జంపాడు



కన్నెగంటి పెద సైదాచారి **పల్నాటి సోదరక వులలో మూడవ వారైన వీరభద్రా చార్యులు గారి కుమారులు. తల్లి అపర్ణాంబ. వీరు 1957 డిసెంబర్ 25న జన్మిం చారు. ఈయన ప్రముఖ బాలల సాహిత్య రచయిత.**

రచనలు: చారిత్రక శిల్పుల గాథ. వీరి రచనలు ప్రముఖ దినపత్రికల్లో, మాసపత్రికల్లో ప్రచురితమవుతున్నవి. వీరి

రచనలు: ఉత్తమ అన్నదానం, ఆకలి తీర్చని యుద్ధం, వాలి బలం, స్వార్థం, బంగారు గూళ్లు, విద్యానైపుణ్యం (వ్యాసాలు) ఇవి వివిధ పత్రికల్లో వచ్చాయి. వస్తున్నాయి..

92. దార్ల బుజ్జిబాబు - 1965, గురజాల



దార్ల బుజ్జిబాబు ప్రఖ్యాత బాలల రచయిత. గురజాల వాస్తవ్యులు. 1965 జూన్ 4వ తేదీన శాంతమ్మ, ఆశీర్వాదం దంపతులకు జన్మించారు. ఎన్నో వందల కథలు, గేయాలు, గేయకథలు రచించారు. బాల సాహిత్యానికి పట్టుగొమ్మ.

రాజీవ్ మిషన్- బాలసాహిత్య గ్రంథాలకు సంపాద కులుగా వ్యవహరించారు. ప్రభుత్వ పాఠ్య గ్రంథాల మాడ్యూల్ రూపకల్పనలో పలుసార్లు పాల్గొన్నారు. బాలల మాసపత్రి కలకు సంపాదకత్వం వహించారు.

ప్రస్తుత నివాసం చిలకలూరిపేట. **"రావూరి భరద్వాజ బాలల విజ్ఞాన పీఠం"** స్థాపించి ఉభయ తెలుగు రాష్ట్రాల, రాష్ట్రేతర బాలల రచయితలను ఒకే వేదికపై సత్కరిస్తున్నారు.

1. సమతారావు అవార్డు 2. జాషువా బాలసాహిత్య పురస్కారం 3. మహాత్మా గాంధీ సేవాపురస్కారం 4. అద్దంకి వేంకటరమణ గ్రంథాలయ పురస్కారం. ఇంకా ఎన్నో పురస్కారాలు పొందారు.

రచనలు: కోతిగొప్పలు, కోడిపుంజు పట్టుదల, కుందేలు ఉపాయం, చెప్పుడు మాటలు, పావురాయి స్నేహం, పెళ్ళికి వెళ్ళిన నక్క - పిల్లల నవలలు రాశారు. బాలసాహిత్యంలో ఎనలేని కృషి చేస్తున్నారు.

93. బి. మాన్‌సింగ్ - 1975. కారంపూడి



బాణావత్ లక్ష్మీబాయి, నాగునాయక్‌ల కుమారుడు. బొల్లాపల్లి మండలం, హనుమాన్‌పురం గ్రామం. 1975 సెప్టెంబర్ 5న జన్మించారు. ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. నివాసం కారంపూడి. బాలసాహిత్యకారులలో ఒకరు. 250 వరకు బాలల కథలు రచించారు. 170 బాలవ్యాసాలు రాశారు. బాలల మాస పత్రికలలో ధారావాహికలు నిర్వహించారు. **వసంత కోకిల** గేయ సంపుటి. **పంచతంత్రం** కథాసంపుటి. జాతీయ ఉత్తమ బాలసేవక అవార్డు పొందారు.

ఉ॥ వృక్షము నారికేళమది వృక్షము లోపల తొఱ్ఱగద్దు యో
పక్షితురంగ మిత్ర నవపత్రలు గల్గిన యట్టి మ్రానిలో
పక్షములన్ మరాళములు బంటులు యార్గురుగల్గ మేతకై
యీ క్షుధనుండి యేగు శతయేండ్లకు బోదిలివీటి ధూర్జటీ!

తా॥ బోదిలవీటిలో వెలసిన ఓ ధూర్జటీ! ఓ గరుడవాహనుని మిత్రుడా! కొబ్బరి చెట్టునకు మ్రానులో లోపల అంతా తొఱ్ఱయై ఉండటం సాధారణం. మానవదేహం కొబ్బరిచెట్టు వంటిది. ఎందుకంటే జీవుడి దేహంసైతం గుదస్థానం నుంచి ఆపైన బ్రహ్మరంధ్రం వరకు తొమ్మిది రంధ్రాలు (గుదము, అంగము, నోరు, కండ్లు,చెవులు, ముక్కు రంధ్రాలు) ఉండటంతో అంతా బోలుగానే ఉంటుంది. ఇట్టి దేహమునకు ప్రక్కలందుండు సేనలో ఆరుగురు సైనికులు (మనస్సు, జ్ఞానేంద్రియాలు అయిదు అన్నీ కలసి) ఉండగా జీవన యాత్రాసమరమనే ఆకలితో జీవికకై నూరేళ్లపాటు సాగిపోవటం జరుగుతుందయ్యా!

పద్యం: 'కవిసింహ' పోకూరి కాశీపత్యవధాని
తాత్పర్యం: డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు
(శ్రీధూర్జటి శతకము నుంచి)

కట్టు బొట్టు జుట్టు కాదురా మతమన్న
పరుల మేలు కోరు పథము మతము
పరుల హాని చేయు పాపిష్టి మతమేల
తెలిసి మసలుకొనుము తెలుగుధీర!

-డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు
('తెలుగుధీర' నుంచి)

పల్నాటి సీమలో కవయిత్రులు

(94, 95, 96, 97, 98, 99)

94. కన్నెకంటి కమలాక్ష్యమ్మ (శ్రీరాందాసు)1915, తక్కెళ్లపాడు

కన్నెకంటి కోటమాంబ, రాజలింగాచార్యులు పుత్రిక. పల్నాటి సోదర కవుల సహోదరి. శ్రీ రాందాసు అత్తగారి ఇంటిపేరు. కన్నెకంటి వారిది పండిత కుటుంబము. కన్నెకంటి వారి మేనమామలు కొండావారు. కవికులంవారే. ఈమె 1915 సంవత్సరంలో జన్మించారు. **గానలోల శతకము** 1980లో రచించారు. **సీతాకల్యాణం** ఇతర రచన. ఎన్నో ఆధ్యాత్మికాలు, గేయాలు రచించారు.

95. కన్నెకంటి పార్వతీదేవి- 1940. తక్కెళ్ళపాడు



కన్నెకంటి సోదర కవులలో పెద్దవారు ప్రభులింగాచారి గారు. వారి కుమారులు ప్రభాకరశాస్త్రి. పార్వతీ దేవి ప్రభాకరశాస్త్రిగారి సతీమణి. వీరి వివాహం 27-4-1952లో జరిగింది. **'రాధ పిలుపు', 'యశోద', 'ద్రౌపది'** ఏకపాత్రలు. **'నన్ను విడుదల చేయండి'** నాటిక ద్వారా రేడియో శ్రోతలకు పరిచితురాలు. ఈమె రాసిన కథలు, గేయాలు, సాంఘిక వ్యాసాలు, ప్రముఖ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'మహిళాభ్యుదయం' శీర్షికలో రెండు సంవత్సరాలు ప్రచురితమయ్యాయి. వాటిని సమీకరించి **'వెలుగు రేఖలు'** అనే శీర్షికతో డాక్టర్ కన్నెకంటి రాజమల్లాచారిగారు పుస్తకం ప్రచురించారు. 18-10-1986 న కీర్తిశేషులయ్యారు.

ఆమె స్మృతిచిహ్నంగా **'ధన్యజీవి పార్వతీదేవి'** పేరిట ప్రముఖుల అభిప్రాయాలతో సంస్మరణ సంచిక 1987లో విడుదలైంది

96. రామరాజు పద్మావతి- మాచర్ల

మాచర్ల వ్వాస్తవ్యులు. ఉపాధ్యాయురాలిగా పదవీవిరమణ చేశారు. 1977లో **"కారెంపూడి శ్రీ అంకాళమ్మ దేవీస్తవ శతకము"** రాశారు. మకుటం లేకుండా వివిధ ఛందస్సులలో రచన సాగించారు. ఆమె హయ్యర్ గ్రేడ్ టీచరుగా పనిచేశారు. యండపల్లి శేషాచలం, లక్ష్మీనరసమ్మ కుమార్తె.

97. డాక్టర్ వైదేహి శశిధర్

ప్రముఖ రచయిత చేపూరు సుబ్బారావు గారి కుమార్తె. సత్యవతీదేవి, సుబ్బారావు దంపతులకు 1969 నవంబర్ 11 వ తేదీన జన్మించారు.



రచనలు:

1.'నిద్రితనగరం' కవితలసంపుటి 2009లో ప్రచురించారు.
2.'పునశ్చరణం' కవితల సంపుటి 2014లో ప్రచురించారు.
ఆధునిక భావజాలంతో చక్కని కవితలు అల్లగలరు.
తండ్రి సుబ్బారావు గారివలె వేయిపడగలు రెండధ్యాయాలు ఆంగ్లంలోకి అనువదించారు.

98. దార్ల సుందరమ్మ- చర్లగుడిపాడు

విశ్వబ్రాహ్మణ కులస్థురాలు అని తెలుస్తోంది.1890 ప్రాంతంవారుగా భావించే ఈమె గురజాల మండలం చర్లగుడిపాడు నివాసి. శ్రీరాములు, నాగమాంబల కుమార్తె.ఈమె **భావలింగ శతకము** రాశారు.ఇతర గ్రంథస్థ ఆధారాలు లభించడం లేదు.

99. కాంచనపల్లి కనకమ్మ- 1963, దుర్గి

కాంచనపల్లి గంగారావు, రంగమ్మ దంపతులకు కనకమ్మ 1963 సెప్టెంబర్ 3వ తేదీన దుర్గిలో జన్మించారు.బి.ఏ.పట్టభద్రురాలై చెన్నైలోని లేడీ వెల్లింగ్టన్ ఉన్నత పాఠశాలలోనూ పి.మేరీస్ కళాశాలలోనూ ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు పాఠ్యపుస్తకాల నిర్ణయ కమిటీ సభ్యురాలుగా పనిచేశారు. కవితావిశారద, కవితిలకం అనే బిరుదులు పొందారు. గద్యం, పద్యం, నాటకం రాయడంలో సిద్ధహస్తులు.

రచనలు: 1.కాశీయాత్ర చరిత్ర, 2.రంగశతకం, 3.అమృతవల్లి– నవల, 4. జీవయాత్ర, 5.పద్య ముక్తావళి, 6. రామాయణ కథాసంగ్రహం, 7.ఆనందసాగరం, 8.హంస విజయం(నాటకం) 9.బుద్ధచరిత్ర (నాటకం) 10. పాండవ ఉదంతం (నాటకం). అభిజ్ఞాన శాకుంతలం (సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించారు) కాగా **'కాంచనపల్లి రచనలు- పరిశీలన'** అనే అంశంపై బి. సుమంగళి గారు పరిశోధన వ్యాసం సమర్పించి 1997లో నాగార్జున యూనివర్సిటీ నుంచి పట్టా పొందారు.

మంచి గుణగణములు మానవత్వము గల్గి, పరహిత వచనములు పలుక నేర్పు
ధర్మ నిరతి నడచు కర్మతత్వము నేర్పు, ఇల శతకములన్ని తెలుగు బిడ్డ-బెజ్జంకి

పల్నాటి సీమలో పంచాంగ కర్తలు

(100,101,102,103,104)

100. బ్రహ్మశ్రీ మారెళ్ళ పాపయ్య సిద్ధాంతి 1904-1980

మాడుగుల




సుపర్ణస బ్రహ్మర్షి గోత్రోద్భవులు. విశ్వకర్మ వంశీయులు. బ్రహ్మశ్రీ మారెళ్ల వీరయ్య, పార్వతమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. గురజాల మండలంలోని మాడుగుల జన్మస్థలం. వీరు వాస్తు జ్యోతిష్యాలలో నిపుణులు. **పల్నాటి సీమలో వాస్తుజ్యోతిష్యాలలో ఆయన ప్రథమ గురువని చెప్పవచ్చు.** ఆయన ఇంటికి ఆ రోజుల్లోనే నిత్యం అనేకమంది వాస్తు, జ్యోతిష్యాల సమస్యలపరిష్కారం కోసం వస్తుండేవారు. పలు సమస్యలు-లకోటా ప్రశ్నలు- వ్యక్తులను, వస్తువులను పోగొట్టుకున్నవారు, దూరం చేసుకున్నవారు ప్రశ్నలు అడగడానికి కూడా పలువురు ఆయ నను నిత్యం కలుస్తుండే వారు. పల్నాటిసీమలో ఆయనే తొలి వాస్తు సిద్ధాంతి. అంతేకాదు తొలి జ్యోతిష్యపండితుడు కూడా. అలాగే ఎంతో మందిని వాస్తుజ్యోతిష్యాలలో శిష్యులుగా చేర్చుకుని వారిని ఆయా అంశాల్లో నిపుణులుగా తీర్చిదిద్దిన ఘనత కూడా ఆయనదే. ఆ విధంగా ఆయన తర్వాతి తరంవారికి మార్గదర్శకులు అయ్యారు. పాపయ్య సిద్ధాంతిగారి తల్లి పార్వతమ్మగారు మరణిస్తే పల్నాటి ప్రజలు ఆమె పార్థివ దేహాన్ని పల్లకీలో ఘనంగా మాడుగుల వీధుల్లో ఊరేగించారు అని పంతుల రామకోటయ్య గారి అబ్బాయి భవనారి పెదసత్యనారాయణగారు ఆనాటి సంగతులను, పాపయ్య శాస్త్రిగారి ఘనతను రచయితకు స్వయంగా చెప్పారు. ఈయన పాపయ్య సిద్ధాంతి గారి పెద్దబ్బాయికి స్నేహితులు.వాస్తు జ్యోతిష్యాలలోనూ, పంచాంగ గణనలోనూ "తొలి" బాటలువేసిన ఆయన శిష్యులలో కొత్త వేంకటేశ్వరగుప్తాగారు ఒకరు. ఈయన గుణించిన ప్రతి పంచాంగంలోనూ గురువు పాపయ్య సిద్ధాంతి గారి చిత్రం ముద్రించడం విశేషం.అంతేకాదు పాపయ్య సిద్ధాంతిగారు పల్నాటి సీమలో ప్రప్రథమ జ్యోతిష్యపండితులన్న అంశం నిర్వివాదాంశం.పాపయ్య సిద్ధాంతి


గారు పంచాంగాలు గుణించడంలో దిట్ట. ఆ విధంగా ఆయన 1973 వరకు పంచాంగాలు వెలువరించారు. కానీ నేడు అవి లభించడం లేదు.

విశ్వబ్రాహ్మణ వంశంలో ఆనాడే వాస్తుజ్యోతిష్యాలలో ప్రతిభావంతుడుగా పేరొందిన మారెళ్ళ పాపయ్య సిద్ధాంతి గారు 1980 మార్చి 27 వ తేదీన శివైక్యం చెందారు.

101. కొత్త వేంకటేశ్వరగుప్తా -1914- 2000 రెంటచింతల



రెంటచింతల మండలం, రెంటచింతల వాస్తవ్యులు కొత్త వేంకటరత్నం, నాగమ్మ పుణ్యదంపతుల మూడవ కుమారుడు వేంక టేశ్వరగుప్తాగారు. ఈయన 1914లో జన్మించినట్లు తెలుస్తోంది. వీరు జ్యోతిష్యశాస్త్ర పండితులు. 1942నుంచి 2002చిత్రభాను వరకు 60 సంవత్సరాలు వరుసగా పంచాంగములు వెలువరించారు. ఇది పల్నాటిసీమలో ఒక విశేషంగా నమోదు చేయాల్సి అంశం. **'సిద్ధాంత కళాకోవిద' 'వాస్తు విశారద'** బిరుదాంకితులు. వీరికి విద్యనేర్పిన గురువుగారు గురజాల మండల మాడుగుల వాస్తవ్యులు **విశ్వకర్మ వంశోద్భవులు మారెళ్ళ పాపయ్యాచార్యులు** గారు! ఈ విషయం ప్రతి పంచాంగంలో గురువుగారి ఫోటోతో పాటు ముద్రించి విద్యనేర్పిన గురువుగారిని స్మరించుకుంటూ గురు ఋణం తీర్చుకున్నారు. 60సంవత్సరాల వరకు పంచాంగ గణితమును కూర్చి, 58 పంచాంగములు వెలువరించి 2000 జనవరి 20వ తేదీన వేంకటేశ్వరగుప్తా గారు దివంగతు లైనారు. పల్నాటిసీమ గొప్ప వాస్తుజ్యోతిష్య పండితులకు కూడా నెలవుకావడం పల్నాటి వాసులకు ఎంతో గర్వకారణం.



102. సోమవరపు చంద్రశేఖరాచార్య సిద్ధాంతి- 1926-1992, మాచర్ల

దుర్గిమండలం, అడిగొప్పుల వాస్తవ్యులు బ్రహ్మశ్రీ వీరాచార్య, నాగమ్మ పుణ్యదంపతులకు 1926లో జన్మించిన ప్రథమపుత్రుడు సోమవరపు చంద్రశేఖరాచార్య సిద్ధాంతిగారు. ఆ తరువాత మాచర్లలో స్థిరపడ్డారు.

"శ్రీ కంచి వంశార్ణవ పూర్ణచంద్రం వేదాగమ జ్యోతిష కల్పసూరిం
సిద్ధాంతి చూడమణి వీరయార్యమశ్రాంతమస్మద్గురు మాశ్రయామి"

దీనినిబట్టి బ్రహ్మశ్రీ కంచి వీరయ్యాచార్య సిద్ధాంతిగారి వద్ద పంచాంగ గణితమును నేర్చుకున్నట్లు తెలుస్తోంది. పల్నాటి పంచాంగకర్తలలో ప్రముఖులు. 1992 దాకా పంచాంగాలు ప్రకటించారు. 1992లో లింగైక్యం చెందారు.

103. ఏమిడాకుల విశ్వనాథ సిద్ధాంతి -దుర్గి



వీరు పంచాంగ కర్తగా, వాస్తుజ్యోతిష్య సిద్ధాంతిగా గ్రంథస్థ ఆధారాలను బట్టి తెలుస్తోంది. కానీ వీరి పూర్తి వివరాలు తెలియడం లేదు. వీరి గురువులు కంచి వీరయ్యాచార్య సిద్ధాంతిగా తెలుస్తోంది. వీరు, చంద్రశేఖర సిద్ధాంతిగారు కంచి వీరయ్యాచార్య సిద్ధాంతి గారి శిష్యులని తెలుస్తోంది. వీరి పంచాంగములు మాత్రం లభించడం లేదు. లేదా నా దృష్టికి రాకపోయి ఉండవచ్చు.

ఏమిడాకుల విశ్వనాథ సిద్ధాంతిగారు 1916 సంవత్సరంలోఏమిడాకుల కృష్ణమాచార్యులు లింగ మాంబలకు దుర్గిమండలం దుర్గిలో జన్మించారు.వీరు విశ్వజ్ఞఋషి గోత్రికులు విశ్వకర్మ వంశీయులు.పూర్వం వీరి ఇంటిపేరు నాగెండ్ల వారు. ఆ రోజులలో వీరు స్వర్ణశిల్పులు. నాటి కాలంలో వీరి పూర్వీకులు నాటి మహారాజుకు బంగారు తమల పాకులతో తాంబూలం చేసి ఇచ్చారు.ఆ రాజుగారు వీరిని "ఏమి డాకుల"వారిని పిలవండి అన్నారట. ఏమిడాకులు అంటే బంగారు ఆకులు అని అర్థం.అప్పటినుండి వీరికి "ఏమిడాకుల" గృహనామమైంది. విశ్వనాథ సిద్ధాంతిగారు జ్యోతిష్యంలోను, లకోటా ప్రశ్నలు,వాస్తులోను పండితులు.వీరు కంచి వీరయ్యా చార్యసిద్ధాంతిగారి వద్ద జ్యోతిష్యమును, పంచాంగ గణితమును నేర్చుకున్నారు. ఆ రోజులలో వీరు పంచాంగములను ప్రచురించారు. వీరు 1981లో శివైక్యం చెందారు.

కం. దుర్గో పాసకుడగుట న
నర్గళముగ దేవళంబునన్ చేరియు తా

చచ్చి నంత కళ్ళు చిచ్చు పాల్గాకున్న, మట్టి పాలు గాక మాన వయ్య
కళ్ళు దాన మివ్వ కలుగును పుణ్యంబు, తెలిసి నడచుకొనుము తెలుగుబిడ్డ -బెజ్జంకి

దుర్గ గుడి వెనుక కర్షక
వర్గమునకు తనకు పురము వడి నిర్మించెన్.

కం. అందున నే యా పురికిన్
పొందుగ "దుర్గి" యను పేరు బుధులిడిరనుచున్
కొందరు నేటికి బలుకగ
విందుము మాన్యుండు గాదె విశ్వజ్ఞుడిలన్.

కం. ఆ విశ్వజ్ఞుని సంతతి
నావిర్భవుడైన కృష్ణయాఖ్యుడు శాంతా
దేవిని, లింగమాంబిక నొగి
వైవాహికమై యశంబు వడసెనయారే.

ఆ.వె. కీర్తి కాముడైన కృష్ణయాఖ్యుడు లింగ
మాంబ యందు గాంచె నమల హృదయు
విబుధ చయు విధేయు విశ్వనాథాచార్యు
సర్వ సూరిజనులు సంతసింప.

కం. రాణింప విశ్వనాథుడు
మాణిక్యమ నన్నపూర్ణమన్ శృతిహిత క
ళ్యాణమున నగ్నిసాక్షిగ
రాణులుగా గొనియె నెల్ల ప్రాజ్ఞులు మెచ్చున్.

వ. ఆ విశ్వనాథాచార్యులు మాణిక్యమ యందున నాగమాణిక్యాచారి, అన్నపూర్ణమ యందున వేంకట కృహనుమ త్సుబ్రహ్మణ్యశాస్త్రిని పుత్రరత్నములుగాగాంచి విలసిల్లుచుండె నా విశ్వనాథాచార్యులు నొకించుకన్ విశదీకరించెద నది యెట్లనన్.

సీ. అల యజుర్వేదంబునందును షోడశ
కర్మాధి కారియై గరిమ గాంచె
జ్యోతిషంబున లగ్న జాతక సిద్ధాంత
భాగంబులు పఠించి ప్రతిభ మించె
వాస్తు సాముద్రిక ప్రశ్న శాస్త్రముల స
మంచితంబగు రీతి నభ్యసించె

పెద్దలయెడ భక్తి పిన్నల యెడ ప్రేమ
నెరపి ఇన్నిటికిని వన్నియ ఘటించె
ఆ.వె. గాన ప్రథిత కాంతి గలుగన్ సిద్ధాంతి
నసమశీలు సద్గుణాల వాలు
విబుధ విహిత చర్యు విశ్వనాథాచార్యు
శైలజాత నిత్యమేలు గాత.

అని కవిసింహ కాశీపత్యవధాని గారు విశ్వనాథాచార్యుల గురించి ఘనంగా చెప్పారు. వారి ఘనతను కాశీపత్యవధాని గారు ధ్రువీకరించారు.

విశ్వకర్మీయులు తొలుత వలస వచ్చి దుర్గమ్మను ప్రతిష్ఠించి ఆరాధించుట వలన ఆ గ్రామమునకు **"దుర్గి"** అను పేరు వచ్చుటకు విశ్వకర్మ విశ్వబ్రాహ్మణులే మూలపురుషులని తెలియుచున్నది.

104. పోతులూరి శివరామప్రసాద దైవజ్ఞ- 1974, కొత్తపాలెం

ఈయన మాచవరం మడలం, కొత్తపాలెం నివాసులు బ్రహ్మశ్రీ పోతులూరి వీరభద్రాచార్య, శేషమాంబ పుణ్యదంపతుల కుమారుడు.



1974లో జన్మించారు. వాస్తుజ్యోతిష్యాలను ఎరిగినవారు. 2006 మే3వ తేదీన **సువర్ణ సింహకంకణ సత్కారం** కొత్తపాలెంలో ఘనంగా జరిగింది. ఆసభకు ముఖ్య అతిథిగా రచయిత (డాక్టర్ బెజ్జంకి) పాల్గొన్నారు. శ్రీవేంక టేశ్వరగుప్తాగారు 2000లో గతించడం, అదే సంవత్స రంలో శివరామప్రసాదు పంచాంగ రచన వెలువరించటం కాకతాళీయంగా జరిగింది. చిన్నవాడైన శివరామప్రసాదు 2000 నుంచి పల్నాటిసీమలో వాస్తు జ్యోతిష్య పండితులుగా వెలుగొందుతున్నారు. శతాధిక దేవాలయ ప్రతిష్ఠాచార్యులుగా అనతి కాలంలో గుర్తింపు పొందారు. గత 19 ఏళ్లుగా పంచాంగాలు ముద్రిస్తూనే ఉన్నారు.

శతకము హితబోధ చక్కగా చేయును,చెంత మిత్రుడుండి చెప్పినట్లు
చదువవలయు జనులు శతకాలనెప్పుడు, పలుకువిలువ పెరుగు తెలుగుబిడ్డ-బెజ్జంకి

చదివిన సదసద్గుణములు సమసమాజ, స్థాపన చదివించినగల్గు శతకములను
పఠనపాఠనమొనరించవలెను మీరు,తెలుపుకొనుచుండె బెజ్జంకి తెలుగుబిడ్డ-బెజ్జంకి

104ఏ కొండవీటి వెంకటకవి-1918-1991, విప్పర్ల



కొండవీటి శేషమ్మ, నారాయణయ్య దంపతులకు సత్తెనపల్లి తాలూక 'విప్పర్ల' గ్రామంలో వెంకటకవి 1918 జనవరి 25న జన్మించారు.

తొలుత వీరు గురజాలలో "పలనాటి విద్యాదాత" కావూరి వెంకయ్యగారు నడుపుచున్న పాఠశాలలోఉపాధ్యాయులుగా పనిచేశారు. 1944నుండి1945 వరకు సత్తనపల్లి లోని శరభయ్యగుప్తా ఉన్నత పాఠశాలలో తెలుగుపండితులుగా పనిచేశారు. 1946 నుండి 1956 వరకు మాచర్లలోని జిల్లా బోర్డు పాఠశాలలో పనిచేశారు. అటనుండి పొన్నూరులో శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు.

త్రిపురనేని రామస్వామి చౌదరి సూతాశ్రమంలో చేరి వారి అభ్యుదయభావాలను అలవర్చుకున్నారు. బాలకవిగా పేరుగాంచిన వెంకటకవి14ఏటనే 1932లో తొలిరచన **'కర్షకా'** అను గ్రంథమును ప్రచురించారు. తర్వాత **1. హితబోధ 2. భాగవతులవారి వంశావళి 3. ఉదయలక్ష్మీనృసింహతారావళి 4. చెన్నకేశవ శతకము 5 భావనారాయణ చరిత్ర 6. దివ్యస్మృతులు 7. రాజర్షి, 8. మేలుకొలుపు** వంటి మరెన్నో రచనలు చేశారు. కవిగా లబ్ధప్రతిష్ఠులైన వీరు ఆ రోజులలో ఎన్.టి.రామారావుగారు నటించిన సినిమాలు- దాన వీరశూరకర్ణ శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, తాండ్రపాపారాయుడు, ఏకలవ్య మొదలగు సినిమాలకు కథ, మాటలు రచించారు. ఆ సినిమాలు బహుళప్రజాదరణ పొందినవి.

బిరుదులు: చతుర్విధ కవితానిర్వహణచాతురీధురీణులు, ప్రజాకవి, కవిభూషణ, కవిరాజు, కళాప్రపూర్ణ వంటి ఎన్నోబిరుదులు పొందారు.

సత్తెనపల్లిలో **కవితా బ్రహ్మోత్సవం** జరిపించుకున్నారు.

పలనాటి గడ్డమీద నివసించిన అభిమానముతో పలనాటిలో ప్రసిద్ధిగన్న "లక్ష్మీ చెన్నకేశవ స్వామి"వారి మీదనున్న భక్తితో చెన్నకేశవస్వామిభార్య "ఉదయలక్ష్మీ" పేరును తన పెద్ద కూతురుకు పెట్టుకున్నారు. మరో కూతురుకు "మాంచాల"అని పేరు పెట్టుకున్నారు. ఈ విషయాలు వెంకటకవిగారి రెండోకూతురు"విజయలక్ష్మి"ఉరఫ్ మాంచాలగారు ముఖాముఖి సంభాషణలో స్వయంగా ఆనందంగా పరవశించి చెప్పారు.

పలనాటి గడ్డమీదున్న వీరాభిమాని, ప్రజాకవి కొండవీటి వేంకటకవిగారు ది 07-04- 1991లో దివంగతులైనారు. ఇటీవల గుంటూరులో వారి శతజయంతి వేడుకలు నిర్వహించారు.

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు

పల్నాటి సీమలో పూర్వకవులు

105. దేవాద్రి కోటయ్యకవి - రాయవరం

దేవాద్రి కోటయ్యకవి ఆయన రచనల ద్వారా రాయవరం నివాసి అని తెలుస్తోంది. రాయవరం ప్రజల ఆధ్యాత్మిక చింతనకూడా ఉన్నతమైనదిగా తెలుస్తున్నది.

దేవాద్రి కోటయ్య వేంకటశివయ్య, లచ్చమ్మల కుమారుడు. ఈ విషయం ఆయన రాసిన వేదాంత ప్రబోధిని శతకం చివర చెప్పుకున్నారు.

వేదాంత ప్రబోధిని అను శీర్షికతో**శ్రీరాజేశ్వరి శతకము**ను1959లో అచ్చు వేయించారు. ఇందు సీసార్థ,కందార్థతత్త్వములను రాశారు. మొత్తం వేదాంత సారమే.

భక్తితత్త్వంలో మునిగితేలేవారికి ఈ తత్త్వాలు ఆనందామృతపానంలా ఉంటాయి. ఎంతటి గృహస్తులకైనా ఇవి ఆనందాన్ని కలిగిస్తాయి.

"కర్మమున బుట్టు జగములు
కర్మముననె వృద్ధిజెందు కర్మమున జెడున్
కర్మమె జనులకు దేవత
కర్మమె సుఖదు:ఖములకు కారణమనిరీ"

జననమరణములకు,సుఖదు:ఖములకు కారణంకర్మము అనిచక్కగా చెప్పినారు. కనుక మానవుడు సత్కర్మను అనుసరించాలి అని భావము.

అభినవ నన్నయభట్టారక
106. పశర్లపాటి వాసుదేవశాస్త్రి-గుత్తికొండ



పలనాట చారిత్రకప్రసిద్ధిగల గ్రామాలు కలవు. వాటిలో 'గుత్తికొండ' ఒకటి. గుత్తికొండ బిలం ప్రసిద్ధిగాంచినది.ఇచ్చట మహర్షులు తపస్సుచేసుకున్నారు. ఈ బిలం నుంచి శ్రీశైలం, ఎత్తిపోతల మొదలగు ప్రాంతాలకు సొరంగ మార్గాలున్నాయి అని అంటారు.

అటువంటి గుత్తికొండలో పశర్లపాటి వాసుదేవశాస్త్రిగారు నివసించారు. గుండ్లపాడులో సుందరమ్మ, రామలింగయ్య అను దంపతులకు జన్మించారు. కౌండిన్య గోత్రం, యజుశ్శాఖ, సదాచార సంపన్నులు. మహోపాధ్యాయ,కవిశేఖర, విద్యాలంకారబిరుదులున్న పళ్ళెపూర్ణప్రజ్ఞాచార్యులువద్దసంస్కృతము, ఆంధ్రము నేర్చుకున్నారు.

వీరి రచనలు: 1.గోవింద గీతము (భజగోవింద శ్లోకాలకు ద్విపదానువాదం), 2. ప్రార్థనామందిరం, 3.అభయదానము, 4.శ్రీమద్వాసుదేవ రామాయణం, 5. శ్రీశంకర విజయం 6. హనుమన్నుతి 7. గుత్తికొండ బిల మాహాత్మ్యము, 8.మార్కండేయేశ్వర స్తుతి, 9. శ్రీ పార్వతీ రామలింగేశ్వరాష్టకము. 10. ద్విపద భగద్గీత.

శ్రీమద్వాసుదేవ రామాయణం, ద్విపద భగవద్గీత అచ్చు అయినవి. వాటిని వాసుదేవశాస్త్రి కుమారుడు రామలింగేశ్వరశర్మ అచ్చువేయించారు.

వాసుదేవశాస్త్రిగారు **అభినవ నన్నయభట్టారకుడు** అనే బిరుదును పొందారు. ఈ బిరుదు వీరికి సార్థకమయినది. వాసుదేవశాస్త్రి గారు సంస్కృతాంధ్రములలో పండితులు. శంకర విజయం రాశారంటే మంచి వేదాంతవేద్యులు అని తెలుస్తోంది. భగవద్గీతను ద్విపదలో అనువదించారు. పదానువాదం చేశారు. భావానువాదం చేయలేదు. రచనలో ఆరితేరినవాడు. స్పష్టత వీరి రచనలో కనిపిస్తుంది. భావగాంభీర్యం ఉంటుంది. సులభంగా అర్థమవుతుంది.

107. పోలూరి రామకృష్ణయ్య - కారంపూడి

పోలూరి రామకృష్ణయ్య బి.ఎ. కృతార్థులైనారు. బ్రహ్మనాయుడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండితులుగా బహుకాలం పనిచేశారు.

కారంపూడి సమీపంలో సింగరుట్ల నృసింహస్వామి దేవాలయమున్నది. దానిని బ్రహ్మన్నాయుడు ప్రతిష్ఠించారని భక్తుల నమ్మకం. ఇది సన్నిగండ్ల గ్రామానికి దగ్గర. కారంపూడికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. కారంపూడి నుండి వినుకొండ వెళ్ళే మార్గంలో ఉన్నది.

ఎత్తయిన రెండు కొండలు, ఆ కొండల మధ్య కనుమ. ఆ కనుమకు **నాగమ్మ కనుమ** అని పేరు. నాగమ్మ కనుమకు ఒక చరిత్ర ఉన్నది. ఆ చరిత్రను ప్రత్యేకంగా ఇంకొక వ్యాసంలో రాయాలి. రామకృష్ణయ్య **సింగరుట్ల నృసింహ శతకము**ను రాశారు. కారంపూడిలో నివాసమున్న కారణంగా ఈ స్వామిని దర్శించి పూజించే భాగ్యం కలిగింది. ఆ స్వామి కృపాకటాక్షాలను పొందినాడు.

రామకృష్ణయ్య శతకం రాయడానికి కంద పద్యాన్ని ఎంచుకున్నారు.

కందం అందంగా ఉంటుంది. కందంలోనే అసలు అందం దాగి వుంది. **కందం చెప్పినవాడే కవి** అన్నారు పెద్దలు. అంటే కందపద్యం చెప్పటం కష్టమని తెలియుచున్నది. ఒక కందపద్యం రాస్తేనే వాడు కవి అవుతాడట. మరి వంద

పద్యాలు రాస్తేనో..!

సమతీ శతకకర్త కందం ద్వారా సమాజానికి నీతులు బోధిస్తే, రామకృష్ణయ్య అదే కందం ద్వారా దైవభక్తిని– నరసింహస్వామి భక్తిని చూపించాడు. **'సింగరుట్ల వాస నృసింహా'** అనే మకుటంతో శతకం రాశారు.

కం. ఆకలి దప్పులు గలుగవు
నీకడనున్నంత వరకు, నిను వీడినచో
చికాకులు గల్గెడి నిను
వాకొనియెద సింగరుట్ల వాస నృసింహా!

కం. మానవుడు దానవుండగు
దానము, ధర్మమును శాంతిదాంతియు లే క
వ్వాని నొసగి నన్నేలుము
భానుప్రభ సింగరుట్ల వాస నృసింహా!

సన్నిగండ్ల నివాసులైన కొంగర పెద అక్కయ్య చౌదరి బి.ఏ.,ఎల్ఎల్.బి– గురజాలలో వకీలుగా చేస్తున్నారు. ఆయన ఈ గ్రంథమును అచ్చువేయించినారు. రామకృష్ణయ్యగారి ఇతర రచనలు తెలియుట లేదు. ఈ శతకం శోభకృతు నామ వైశాఖ మాసంలో అచ్చువేయించినట్లు శతకములో లిఖించబడినది.

108. నేరెళ్ల పోలయ్యగుప్తా, కోలగుట్ల

పలనాటి సీమలో ప్రసిద్ధి గాంచిన గ్రామం కోలగుట్ల. పలనాటి వాసులచే పన్నులెగబెట్టంచి కన్నెగంటి హనుమంతు కోరమీసము దువ్వుతూ తిరిగిన గడ్డ. ఆయన నేలకొరిగిన గడ్డ ఇది. కన్నెగంటి హనుమంతు సమాధి ఉన్న నేల కోలగుట్ల!



ఆ కోలగుట్ల గ్రామంలో భక్తిభావాలున్న కుటుంబం ఉంది. ఆ కుటుంబంలో నేరెళ్ళ చినాసయ్య, పోలమ్మ అనేవారు దంపతులు. ఆ దంపతుల కుమారుడే పోలయ్య!

పోలయ్యకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు రామబ్రహ్మం. తారకమంత్రం ఉపదేశించారు. పోలయ్య

చిన్ననాటి నుంచి భక్తితత్పరతతో నడచుకున్నారు. దైవభక్తిపరులు. సీతారాములు ఇష్టదైవములు.

పోలయ్య కీర్తనలు, పాటలు రాయటంలో దిట్ట. బుర్రకథలు రాస్తారు. సంగీత పరిజ్ఞానము కలవారు. రాగ, తాళయుక్తంగా కీర్తనలు రాస్తారు.

జ్ఞాన సారామృతము అను పేర 58 కీర్తనలు రాశారు. ప్రతి కీర్తనకు అది ఏరాగమో, ఏ తాళమో కూడా పేర్కొన్నారు. రుద్రాక్షమాలలో ఏబది ఎనిమిది పూస లున్నట్లు 58 కీర్తనలు రచించి దానికి **'జ్ఞానసాము'** అని పేరు పెట్టారు.

రుక్మిణీ కళ్యాణము, సీతాకళ్యాణము అను రెండు బుర్రకథలు రాశారు. 1976లో అచ్చు వేయించారు.

వీరి రచనలు, కీర్తనలను పండితులు మెచ్చుకున్నారు. భక్తులు నిత్యం పాడుకుంటూ ఆనందించారు.

'నేను సంస్కృతం చదువుకోలేదు– వ్యాకరణ పండితుడిని కాదు' అని తానే స్వయంగా చెప్పుకుంటాడు కవి. గర్వంలేని వాడు, వైశ్యకులంలో పుట్టి రచనా వ్యాసంగంలో తన ప్రతిభను చూపినాడు. అచంచలమైన భగవద్భక్తి కలవాడు.

109. సోమరాజు రామలింగకవి చర్లగుడిపాడు

పలనాడు తాలూకా గురజాల సమీపమున చర్లగుడిపాడు గ్రామం కలదు. ఆ గ్రామంలోని ముఖ్యులలో ఆత్రేయస గోత్రం, ఆపస్తంభ సూత్రులు వేంకట శవణమ యోగి ఒకరు. ఆయన కుమారులే రామలింగ కవి!

వీరిది అచల సంప్రదాయం. నిత్యపూజా దురంధరులు. దేవీ ఉపాసకులు. వీరు 1946లో **శ్రీ చౌడేశ్వరీ స్తోత్రమాల** అను గ్రంథమును రచించారు. ఇది దేవీ భక్తులకు ఉపయుక్తమగు గ్రంథము. చౌడేశ్వరీ అమ్మవారి షోడశ నామములు, ఆ షోడశనామ బీజాక్షరాలకు పదహారు సంస్కృత శ్లోకాలు ఇందు చెప్పబడినవి.

చౌడేశ్వరీస్తోత్ర వర్ణమాల రచన పద్యరూపములో సాగింది.ఇందలి పద్యాలన్నీ సీస పద్యములే.చివరగా **చౌడాంబాదేవి దండకం**, ఆ తరువాత రాగ తాళములతో కూడిన కీర్తనలు రాశారు. అంతేకాక **వేణుగోపాల గీతశతకము**ను కూడా రాశారు. ఆయన **ఆంధ్ర వాల్మీకి** బిరుదాంకితులు. ఆయన కవిత్వాన్ని కన్నెకంటి చినలింగాచార్యులు సహా పలువురు అభినందించారు.

110. వారణాశి చిదంబరస్వాములు
రాయవరం

పలనాడు తాలూకా మాచర్లకు 3 కి.మీ. దూరమున **'రాయవరం'** అను గ్రామం కలదు. రాయవరంలో క్రైస్తవ మతము వ్యాపించి ఉన్నది. రాయవరం నివాసి వారణాశి చిదంబరస్వామి.

తత్త్వాలు రాశారు ఈ కవి. ఇవి బ్రహ్మంగారు చెప్పిన వేదాంత తత్త్వాల మాదిరిగా ఉంటాయి. వేదాంతసారాన్ని బోధించారు. ఈయన చెప్పిన ఈ తత్త్వాలకు **శ్రీ చిదంబర గురుతత్వములు** అని పేరు పెట్టారు.

ఈయన చిదంబరస్వామి. ఈయన రాసినవి **చిదంబర గురు తత్వములు!** మోక్షసాధన మార్గములో నడచువారికి భక్తిగొలిపే తత్త్వాలు!

ఈ గ్రంథం 1960లో కంభంపాడు గ్రామవాస్తవ్యులు శీలం నరసింహదాసు అచ్చు వేయించినారు.

"భజరె గురుచరణం! దుస్తర ! భవసాగర తరణం"
"బ్రోవరా గురువార! కరుణించి నను బ్రోవరా"
"వట్టిదిరా ఇది కనికట్టు కనిపెట్టి తీయరా గురు గుట్టు"
ఈ విధంగా వీరి తత్వములు రాగతాళ యుక్తంగా సాగినాయి.

111. గాదె పురుషోత్తమరావు, పశర్లపాడు

గాదె పురుషోత్తమరావు రెంటచింతల మండలం, పశర్లపాడు గ్రామ వాస్తవ్యులు. నియోగి బ్రాహ్మణులు. గాదె రామకృష్ణయ్య, సీతమ్మ దంపతులు ఈయన తల్లిదండ్రులు. సత్య సాయిబాబా భక్తులు. సనాతన, సంప్రదాయ కుటుంబము. భగవదారాధనాపరులు.

గాదె పురుషోత్తమంగారు పక్కా పలనాటి వాస్తవ్యులు. వీరి రచన భగవాన్ శ్రీ సత్యసాయి శతకము– ఇంతకు మించి రచనలు ఉన్నట్లు తెలియటం లేదు.

సాయిమత్ప్రభూ అను మకుటంతో శతకము రాశారు. శతకం చివర సాయినాథుని మేల్కొలుపు పద్యాలు రాశారు.

దివాకర్ల వేంకటావధాని అభిప్రాయం రాస్తూ ఇలా అన్నారు–

"గాదె పురుషోత్తమరావు రచించిన సాయిమత్ప్రభూ అను మకుటంగల శతకములోని పద్యములన్నియు నిర్మల భక్తిహృద్యములు. ఇందలి పద్యములు గమనించితే

శ్రీ పురుషోత్తముగారికి ప్రథమ ప్రయత్నమనిపించుటలేదు. భక్తులందరు ఇందలి పద్యములను చదువుకొని ఆనంద సముద్రమున నోలలాడవచ్చును. ఇందలి భాషయు సరళ సుందరమై సర్వజన సుబోధకముగా ఉన్నది. ఈ భగవానుని కృపావిశేషమున మధురమంజుల భక్తియుతములైన రచనలు కావించి ఆంధ్ర సరస్వతి కలంకృతులని స్వామి భక్తుల కానందమును కలిగింతురు గాక"

మాచర్లలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ వీవీఎల్ నరసింహారావు, ఉల్లి రామసుబ్బయ్య ప్రోత్సహించగా శతక రచన చేసినట్లు చెప్పుకున్నారు.

ఉదాహరణ పద్యాలు చూద్దాం...

"వింటిని నీ చరిత్రమును వీనుల విందుగ నీ స్వరూపమున్
కంటిని కన్నులార త్రిజగమ్ముల లోపల లేరు లేరు నీ
వంటి మహాత్ములున్ భరత వర్షము భాగ్యము పండె నేటికిన్
కంటి రెప్పలోలె మము గావగ నుంటి సాయిమత్ప్రభూ"

"మాయను దాటలేని యసమర్థులమై పరితాప భారమున్
మోయగ లేక నుంటిమి ప్రభూ! కరుణాశుడవంచు నిన్ను నే
సాయము వేడుచుంటిని, ప్రజాపరిపాలన దీక్షలోన నా
ప్యాయత చూపకుంటివి రయంబున బ్రోవవె సాయిమత్ప్రభూ!"

పురుషోత్తమ కవికి సాయిబాబాపై అమితమైన భక్తి! బాబాపై ఉన్న భక్తిభావాలను శతకం రాసి చాటుకున్నారు.

112. మల్లవరపు వాలేశ్వరరావు - మల్లవరం

ఈయన వీరశైవుడు. **'భళ్ళాణ చరిత్ర'** అను గ్రంథం రాశారు.

113. మాచవరపు పాపన్న, మాచవరం

మాచవరం వాస్తవ్యులు. వేంకటాచలం, కొండమాంబల కుమారుడు. **'నందవరీక'** చరిత్రను రచించారు. 1740 ప్రాంతం వాడుగా తెలుస్తోంది.

114. నీలి వేంకటేశ్వర్లు, మాచర్ల

మాచర్ల ప్రభుత్వ పాఠశాలలో హిందీ పండితులుగా పనిచేశారు. వీరి రచన **నేతిబిడ్డ** పద్య కావ్యం.

115 ఇరువెంటి సీతారామయ్య, కొప్పునూరు

వీరు వేంకటకృష్ణయ్య, శంకరమ్మ దంపతులకు మాచర్ల మండలం, కొప్పు నూరులో జన్మించారు. 19వ శతాబ్దం వారు. వీరు రాయవరం చిదంబరస్వామి శిష్యులు. **హనుమద్విజయము** అను ప్రబంధము, **చిదంబర భాగవతం** అను పద్య కావ్యము రచించారని తెలుస్తోంది.

116. కోలా సత్యనారాయణరెడ్డి - దాచేపల్లి

వీరు రెండు నాటికలు రచించినట్లు తెలుస్తోంది. మిగతా విషయాలు తెలియలేదు.

117 పులివర్తి సుబ్రహ్మణ్యం - మాచర్ల

పులివర్తి సుబ్రహ్మణ్యంగారు విశ్వబ్రాహ్మణ కులజులు. దేవరకొండవాసి. **'మైత్రి'** అను గ్రంథమును రచించారు. ఆ గ్రంథమును మెచ్చుకుంటూ వీవీఎల్ నరసింహారావు, దివాకర్ల వేంకటావధాని, డాక్టర్ దాశరథి, కొండూరు వీరరాఘ వాచార్యులు గార్లు ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆర్థిక సహాయ ముతో ఆ గ్రంథం ప్రచురితమైంది. ఉల్లి రామసుబ్బయ్య గారు చిట్టిప్రోలు కృష్ణమూర్తి గారి సమక్షములో ఆవిష్కృతమైంది.

118. నాగార్జునకొండ వీరబ్రహ్మాచార్యులు-

నాగార్జునకొండ వీరబ్రహ్మాచార్యులు ఆధ్యాత్మిక చింతనాపరులు, సాహితీ ప్రియులు, సదాచార సంపన్నులు. సద్గ్రంథ పఠనం, సజ్జన గోష్ఠి వారి దినచర్య. వృత్తిరీత్యా ఉదరపోషణకు వడ్రంగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు.



రెంటచింతల మండలం, పశర్లపాడు గ్రామం. అదో పల్లెటూరు. ఆ ఊరిలోని లింగమ్మ, లింగయ్య దంప తులు నిష్ఠాగరిష్ఠులు.బ్రహ్మంగారి భక్తులు. కాస్తో కూస్తో వ్యవసాయం చేసేవారు. వారి కుమారుడే వీరబ్రహ్మాచా ర్యులు. తండ్రిద్వారా వచ్చిన కులవృత్తి- వడ్రంగం చేసే వారు. బ్రహ్మంగారి వేదాంతసారాన్ని నలుగురిని చేర్చుకొని చెపుతారు. శిష్యులు తయారయ్యారు వీర బ్రహ్మాచార్యులు గురువర్యులు అయినారు.

పశర్లపాడులో ఎంతో వ్యయప్రయాసలకు లోనయి భక్తిభావంతో బ్రహ్మంగారి

ఆలయాన్ని నిర్మించారు.

వీరు **"శ్రీ వీరబ్రహ్మ శతకము"** రాశారు. అందులో బ్రహ్మంగారి జీవిత చరిత్రను సంక్షిప్తంగా చెప్పారు. **"శ్రీ వీరబ్రహ్మం శతక మంజరి"** అని పేరు పెట్టి ఎనిమిది వందల పద్యాలు రాశారు. అన్నీ కంద పద్యాలే. కందం రాయటం కష్టం కనుక కందం రాసిన వారిని కవి అన్నారు. ఈ కవి వందల కొద్దీ కంద పద్యాలు రాశారు.

ఈ కవి ఛందో నియమాలను పెద్దగా తెలిసిన వాడు కాదు. రాయాలి అనే అభిలాష. తృష్ణ ఉన్న వ్యక్తి. ఆసక్తి, అభిలాషతో బ్రహ్మంగారిపైన అపారమైన భక్తితో రాశారు.

తానే చెప్పుకున్నారు కవిత్వం తెలియని వాడినని. కవిత్వం ఎలా ఉన్నా భావం బాగుంది. చెప్పదలచుకున్న అంశాలను చక్కగా చెప్పారు. బ్రహ్మంగారి జీవిత చరిత్రను, అందలి ఘట్టాలను చక్కగా వర్ణించారు. బ్రహ్మంగారిపై ఉన్న అపారమైన భక్తితో వశర్లపాడులో బ్రహ్మంగారి ఆలయాన్ని నిర్మించారు. నిత్యం ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు

119. కలువల వెంకటసుబ్బారావు - మాచర్ల

కలువల వెంకట సుబ్బారావు మాచర్లలో జన్మించారు. పుట్టిందీ పెరిగిందీ మాచర్లలోనే. రెవిన్యూశాఖలో ఉద్యోగంచేసి రిటైర్ అయినారు. సాహిత్యప్రియులైన వెంకటసుబ్బారావు పరిశోధకులు, తెలుగుభాషపై మక్కువగలవారు.

ఆ రోజులలో (సుమారు 1920 సంవత్సర కాలంలో) మాచర్ల చెన్నకేశవుని ఆలయ దర్శనార్థం వివిధ దేశాల నుండి విచ్చేసే యాత్రికులకు చెన్నకేశవుని పూజా విధానం, స్వామి వారి చరిత్రను తెలియజేసే గ్రంథములు లభించేవికావు– పలనాటిలో జాతీయోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులలో మనదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమన్నమాట. దాంతో వెంకట సుబ్బారావు గారి మనసు కలత చెందింది. చెన్నకేశవుని దర్శించుకునే దేశ, విదేశీ భక్తులకు స్వామివారి చరిత్ర, పలనాటిచరిత్ర అందించాలనే ఆలోచన కలిగింది. ఆలోచన కలిగిందే తడవుగా రచనకు ఉపక్రమించారు.

ప్రసిద్ధమైన గ్రంథాలయాలకు వెళ్ళారు. చరిత్ర పుటలు తిరగవేశారు. తాళపత్ర గ్రంథాలు చదివారు.పలనాటి చరిత్రను శోధించారు.ఆనాటి శాసనాలను చదివారు.

అన్నీ గ్రంథస్థం చేశారు. ముందు తరానికి అందించాలనుకున్నారు. శ్రమపడి పరిశోధించి రాశారు.

1. పల్నాడు దేశచరిత్ర 2. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి చరిత్ర– స్థల మాహాత్మ్యము 3. పలనాటి వీరభాగవతము.

ఇంకనూ కొన్ని ఆధ్యాత్మిక గ్రంథములు రాశారు. 1963 సంవత్సరం వరకు కృషిచేసి రాశారట. **1964 సెప్టెంబర్ 29వ తేదీన మాచర్ల చంద్రవంక నది పొంగింది.** వరద ముంచుకొచ్చింది. మాచర్లలో జలప్రళయం! ఇంకేముంది. కలువల వెంకటసుబ్బారావు గ్రంథాలన్నీ కొట్టుకుపోయినాయి. ముద్రణకు నోచుకోలేదు. సంవత్సరాల కొద్దీ వ్యయప్రయాసలకోర్చి చేసిన కృషి నీటిపాలైంది. తీరని అన్యాయం జరిగింది. చారిత్రక సత్యాలు నీట కరిగిపోయాయి.

అయిననూ పట్టుదలతో **"శ్రీగాయత్రీ సంపుటి మాచర్ల లక్ష్మీచెన్నకేశవ శతక సుమధామము"** ను వెలువరించారు. "సరికొండ బుచ్చిరాజు" తెలుగు పండితునిచే పరిష్కరింపచేయించి, ముద్రణ చేయించినారు. ఇందు బుచ్చిరాజు రచించిన శ్రీ మాచర్ల మహాలక్ష్మీ స్తవమును కూడా ముద్రించారు.

"చెన్నకేశవ పాహిమాం-శేషశయన"అనే మకుటంతో గీతమాలికలు రచించారు సుబ్బారావు.

> **"భూత భవ్య భవన్నాథ భూత రక్ష**
> **పాప భూయిష్టు నాకును పరమ పురుష**
> **జన్మ రాహిత్య మిడగదె జవము నిపుడు**
> **చెన్నకేశవ పాహిమాం శేషశయన"**

ఆనాడు జరిగిన కొన్ని యదార్థ సంఘటనలను చెన్నకేశవస్వామి లీలలను గీతమాలికలలో వర్ణించారు. ఆనాటి పూజారులు, అక్కడున్న ఉద్యోగులు సాక్షిగా రచించారు.సోదాహరణంగా నిరూపించారు. స్వామి మహిమలను తెలిపే ఈ గ్రంథం 1966లో ముద్రించారు. సహస్రనామాలు, అష్టోత్తర శతనామాలు రచించారు. దండకం, సుప్రభాతం మంగళశాసనాలతో గ్రంథాన్ని ముద్రించారు.

తాను కవిని, పండితుడను కానని, సాహిత్యాభిమానంతో రాశానని అన్నారు. దండకంలో ఛందస్సు చూడవద్దన్నారు.ఛందోబద్ధం కాదన్నారు.అయినా ఛందో నియమాలను పాటించారు.

120. పాలువాయి శేషావతారము- దైద

పాలువాయి శేషావతారము హిందీ పండితులు. వృత్తిరీత్యా హిందీ పండితులైనా అభిలాష, ఆసక్తి తెలుగు సాహిత్యంపైనే. సాహితీప్రియులు. చదివింది రాజభాష హిందీ అయినా మాతృ భాషాభిమానం మెండు. అటు హిందీలోను, ఇటు తెలుగులోను పాండిత్యం కలవారు. కనుకనే తెలుగులో గేయ కవితను రాశారు. అందునా ప్రేమకవిత్వం. **'సత్యమేవ ప్రేమ'** అని పుస్తక నామము! ఈ సత్యం- ప్రేమ అనే గ్రంథాన్ని ప్రేమికులకు అంకితమిచ్చారు. అందులో ప్రేమ, ఆప్యాయతలు, అభిమానాల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ పుస్తకాన్ని చదువుతుంటే ఎంకి, నాయుడు బావలు గుర్తుకు వస్తారు. సాహితీప్రియులు చదువదగింది.

పాలువాయి శేషావతారము పలనాటిలో శైవపుణ్యక్షేత్రమయిన దైద గ్రామంలో జన్మించారు. 'దైద అమరలింగేశ్వరస్వామి' చారిత్రక ప్రసిద్ధం. కొండ గుహలలో ఉన్న దైవం అమరలింగేశ్వరుడు. ఆయన మహాశక్తి సంపన్నుడు, భక్తవత్సలుడు, భక్తుల కోర్కెలు తీర్చేదైవము.

సుదూర ప్రాంతాలనుండి దైద అమరలింగేశ్వరుని దర్శించుకొనుటకు భక్తులు వస్తూ ఉంటారు. పూర్వం ప్రయాణసౌకర్యాలు అంతగా లేనిరోజులలో కూడా భక్తులు విశేషంగా వస్తూ ఉండేవారు. ఇపుడు రోడ్డు వసతి ఉంది.పర్వదినాలలో భక్తులు విశేషంగా వస్తూఉంటారు. మహిమగల దైవం. శక్తిఉన్న దైవం అని భక్తుల నమ్మకం. అలాంటి మహామహిమాన్వితమైన దైదగ్రామంలో జన్మించారు శేషావతారము.

121. బత్తుల వేమారెడ్డి - పిల్లుట్ల

పిడుగురాళ్ళ మండలంలోని ఒక చిన్న గ్రామం పిల్లుట్ల. పిల్లుట్ల గ్రామంలో సింగరయ్య శ్రీమంతుడు. పెద్ద రైతు. సింగరయ్య, మంగమ్మల రెండవ కుమారుడు వేమారెడ్డి.

వేమారెడ్డి పలనాటి సీమలోనే విద్యాభ్యాసంచేశారు. బి.ఎ. చదివారు. న్యాయశాస్త్రం చదివారు. తమ్ముడు కృష్ణారెడ్డి వ్యవసాయంలో దిట్ట. కృష్ణారెడ్డి మేడి పట్టి వ్యవసాయం చేసేవాడు. మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది వ్యవసాయం. తండ్రి సింగరయ్యకు దిగులు లేదు. కొడుకులు ప్రయోజకులు గదా, అందుకని..!

ఇంతలో కాలానికి కన్నుకుట్టింది. కృష్ణారెడ్డిని కాలయముడు పట్టుకెళ్ళాడు. బత్తుల సింగరయ్యకు చిత్తం తల్లడిల్లింది. కన్న కుమారుడు శాశ్వతంగా కనుమరుగైతే

హృదయం కరుగదా మరి!

బోయవాడు పావురాల జంటలో ఒక పావురాన్ని చంపితే రెండవ పావురం విలపిస్తుంటే చూశాడు వాల్మీకి. శోకించాడు. సద్యస్ఫూర్తిగా శోకంలో నుంచి పుట్టిన మాట శ్లోకం అయ్యింది– అదే రామాయణ గాథ. కవిహృదయం పరితపించినా, పరవశించినా కవిత్వం పుడుతుంది. దీనికి సాధన, అభ్యసనం అవసరం లేదు.

సరిగ్గా ఇక్కడ అదే జరిగింది. తమ్ముడు కృష్ణారెడ్డి మరణించారు. అన్న వేమారెడ్డి హృదయం పరితపించింది. మథనపడింది.హృదయ మథనంలో పదం పుట్టింది. కలం కదిలింది. అంతే **"చంద్రహాసోపాఖ్యానము"** రూపుదాల్చింది.

ఏడు ఆశ్వాసాలతో 'చంద్రహాసుడు– విషయ'ల వివాహం చేశారు. పూర్తిగా పద్యాలే. గద్యం లేదు. కవికి ఇది మొదటి రచన. అయినా సిద్ధహస్తుడులాగా రాశారు.

ఏటుకూరి వెంకట నరసయ్య పరిచయం రాశారు. గ్రంథంలోని విశిష్టతను తెలిపారు. ఇందున తెలుగు పలుకుబడులు, సామెతలు, సంస్కృత పలుకుబడులను వివరించారు.

కవి భావనలు మచ్చుకు కొన్ని....

"తనువు లశాశ్వతమ్ములు గదా? కులశైలములందు జొచ్చినన్
వనముల దాగినన్ గడకు బంగరు మేడల బవ్వళించినన్
ఘనతర భోజనాధిక సుఖంబుల దేలిననాడు నాటికిన్
మను గడువైన నింకదరమా! నిలువన్ నిముసమ్మ జీవికిన్"

అని వేదాంత ధోరణిలో ఈ శరీరం నశించిపోవుట తప్పదని చెప్పిన తీరు బాగున్నది. ఈ శరీరం అశాశ్వతం. సప్తకుల పర్వతాలలో, అడవులలో దాగినా తుదకు బంగారు మేడలో ఉండి మంచి మేలైన భోజనంచేసినా కాలం తీరితే నిమిషం జీవించలేము అంటారు.

"ఆయువు గట్టిదైన యెడ నద్రిశిఖాగ్రము నుండొ దొర్లినన్
వ్యాయు దంష్ట్రికావదన వన్యమృగంబుల వాత జొచ్చినన్
బాయక యేండ్లు పూండ్లును నుపద్రవ రోగములన్ గృశించినన్
దోయధి ద్రోవగా బడిన దుస్తరమన్నది లేదు దేహికిన్"

'ఆయువు గట్టిదైతే కొండమీద నుండి క్రిందకు పడవేసినా,క్రూరమృగముల

బారిన పడినా, చిక్కిపోయినా, సముద్రంలో పడదోసినా చావు రాదు– శరీరానికి అదృష్టం ఉంటే' అంటాడు కవి.

కవి వేమారెడ్డి చిన్నవాడైనా పెద్ద మనస్సుతో వేదాంతార్థాలను చూపుతూ కావ్యం రాశాడు. ఈ గ్రంథం 1946లో అచ్చు అయింది. ఏటుకూరి వెంకటనరసయ్య మెప్పుపొందింది. ఈ కవి ఇతర కృతులు ఇంకెన్ని ఉన్నాయో పరిశీలించవలె. ప్రస్తుతానికి తటస్థపడలేదు.

122. నందిగామ శేషకవి - పిల్లుట్ల

నందిగామ శేషకవి పిల్లుట్ల వాసి. పలనాటిలో పిల్లుట్ల ఒక చిన్న గ్రామము. పిడుగురాళ్ళ సమీపములో ఉన్నది.

శేషకవి గారి తల్లిదండ్రులెవరో తెలియుట లేదు. శేషకవి **వైశ్యరత్నం** బుర్రకథ రాశారు. **రత్నమాలిక** అనే ఖండకావ్యం ఒకటి రాశారు. ఈ రెండూ అచ్చు వేయబడినవి. గ్రంథస్థ ఆధారములను బట్టి చూడగా ఈ కవి పలనాడులో స్వాతంత్ర్యోద్యమం సాగుచున్న రోజులలో రాసినట్లున్న గ్రంథాల వలన తెలియుచున్నది. వైశ్యరత్నం బుర్రకథలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆనాటి దేశభక్తిపరులలోను, దయా దాక్షిణ్యం, ఉదార స్వభావం దానధర్మాలు చేయుటలో వెనుకాడని వారిలో ఒకరైన రెంటచింతల నివాసి కట్టమూరి భిక్షపతిగారి ఉదార స్వభావమును వైశ్యరత్నం బుర్రకథలో కొనియాడినారు. వారి మీదనే బుర్రకథ రాశారు.

ఆ రోజులలో రెంటచింతలలో నాళం మట్టపల్లి, పెరుమాళ్ల శాయన్న, కట్టమూరి భిక్షపతి, పెరుమాళ్ల శేషయ్య గార్లు ముఖ్యులు.

'రత్నమాలిక' ఇది ఖండకావ్యము. ఇందులో 1. జాతీయ పతాకం 2. దైవశక్తి 3. అమరజీవి 4. బాపూజీ 5. శిల్పప్రబోధం 6. తాజ్‌మహలు 7. నూర్జహాను 8. హితబోధ 9. సరోజినీదేవి శీర్షికలలో ఆయా విషయాలను చక్కగా వర్ణించారు. కవి తన సామర్థ్యాన్నీ, ప్రతిభనూ చూపారు. దైవశక్తి– ఒక పద్యం చూడండి...

"సీ. కంగారు తన చిన్న కన్నయ్యలను పొట్ట
పొదిలోన జోకొట్టి నిదురబుచ్చు
కన్న సంతానాన్ని కనుగందకయె పిల్లి
నోటిలో డ్రిప్పి సయ్యాటలాడు

పూబిల్లలను తమ పొట్టపై కరపించి
కపిజాతి తరులపై గంతులిడును
పుట్టిన గ్రుడ్లను పొదుపుగా నొక దిండు
పొరలోన సాలీడు మోయుచుండు
పక్షములలోన దాచి కాపాడుకొనుచు
కుర్ర బొట్టెలనెల్ల కుక్కుటపు జాతి
ప్రాణికొకరీతి రక్షణ పథమొసంగు
దైవశక్తిని వర్ణింప తరమె మనకు"

నందిగం శేషకవి కవితాదృష్టి సామాన్యజీవులైన కంగారు, పిల్లి, సాలీడు, కోడి పైన పడింది. తద్వారా దైవశక్తిని చూపించారు. మనం రోజూచూస్తున్నాం గానీ మనకు ఆ ఆలోచన కలుగదు.

అలాగే మిగిలిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు 'రత్నమాలిక'లో... సంగీత, రాగ, తాళయుక్తంగా బుర్రకథను రచించారు. వీరు హరికథా భాగవతులు. ఇంకేముంది! సంగీతం వారి సొత్తు. **'అమరజీవి పొట్టి శ్రీరాములు'** హరికథను రాశారట. కథ చెబుతున్నారట.

హరికథలు చెబుతారు, బుర్రకథలు చెబుతారు. పద్య కవిత్వమూ రాస్తారు. వీరి కవిత్వంలో దేశభక్తి భావాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

శేషకవి గారి ఇతర రచనలు తెలియరావటం లేదు. ఇంకను పరిశోధింప వలయును.

123. సరికొండ రామచంద్రరాజు, పాలువాయి

సరికొండ రామచంద్రరాజు అప్పలరాజు కవిగారి కుమారులు. రెంటచింతల మండలం పాలువాయి గ్రామం.భట్టురాజు కులస్తులు. పలనాటి సీమలోనే పుట్టి పెరిగినవారు.

శ్రీమట్టపల్లి లక్ష్మీనృసింహ శతకము రాశారు. ఈ శతకంలో ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే ఒకే వృత్తాన్ని ఎంచుకుని శతకం మొత్తం రాయడం! ఇది ఉత్ప లమాలతో కూర్చిన శతకం. రాసింది మొదటి రచనే అయినా కష్టమైన ప్రాస ఎంచు కున్నారు. ద్విత్వటకార ప్రాస(ట్ట) ఏకప్రాసతో కవితలు రాయటం ఆరితేరినవారికే సాధ్యమవుతుంది. ఇటువంటి మెఱపులు చూపటంలో దిట్ట పలనాటిలో ఒకే ఒకరు ఉన్నారు–వారే **'మహాకవిశేఖర' 'కవిసింహ'** బిరుదాం కితులు **పోకూరి కాశీపత్యవధాన్లు**

గారు! చతుర్విధ కవితాధురీణులు!!

రామచంద్రరాజు తాను అనుభవించిన ఈతిబాధలు, అందుండి గట్టెక్కిన విధమును వర్ణించుకున్నారు. అన్ని బాధలు మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామియే తీర్చాడని కవి భావన. మనసా వాచా కర్మణా నరసింహస్వామినే నమ్ముకున్నారు.

" భట్టును పాలవాయి పురవాసుడ నప్పల రాట్కవీంద్రు తాల్
పట్టని రామచంద్రుడనువాడను త్వత్పదసేవకుండగా"

" పుట్టిన జీవకోటి పరిపూర్ణత వర్ధిలుగాత జైలునన్
పెట్టిన దేశసేవకుల పెద్ద తలంపులు దీరుగాక చూ
పట్టును గాక చేడెలకు భర్తృపదంబుల భక్తి దారుణిన్
మట్టపవీపురీ నిలయ మారమచేశ నృహింహ ప్రోవుమా"

అంటూ ఎంతటి ఉదారతన దేశభక్తిని, సాంఘికదృష్టిని చూపారో ఈ పద్యంలో అర్థమౌతుంది. ఈ రీతిగా వారి రచనా వ్యాసంగం సాగింది.

ఇతర రచనలు దొరకడంలేదు.

'కవితాకోవిద'

124. రావిపాటి లక్ష్మీనారాయణ - గురజాల

రావిపాటి లక్ష్మీనారాయణ పలనాటి నివాసి. జన్మించినది నర్సరావుపేటకు అతిసమీపమున ఉన్న రావిపాడులో. చలమయ్య, పిచ్చమ్మల కుమారుడు. పలనాటి వాసులు, ప్రౌఢకవి, పరిశోధకులు.

లక్ష్మీనారాయణగారు **"నిర్వచన భారతగర్భ రామాయణము"** అను గ్రంథమును రచించిరి. ఇది "ద్వ్యర్థికావ్యము" అంటే రెండర్థాల కావ్యము అని. ఇందులో భారతం, రామాయణం కథలు రెండుంటాయి. కవి రామాయణ కథ చెపుతూ పద్యాలలో భారత కథనూ కూర్చినాడు. సీసపద్యంగా చదివితే అది రామాయణార్థం వస్తుంది. సీస పద్య పాదాలలో మధ్యలో ఆటవెలది పద్యంగాని తేటగీతిగాని, వృత్తాలు గాని ఉంటాయి. అలాగే గీతపద్యంలో కందపద్యం ఉంటుంది.

పద్యంలో పద్యం కూర్చుటను గర్భకవిత్వం అంటారు. ఈ గర్భకవిత్వం, బంధకవిత్వం రాయటంలో పలనాటిలో దిట్ట **'కవిసింహ' కాశీపత్యవధానులు.** లక్ష్మీనారాయణ ద్వ్యర్థికావ్యం రాశారు. కాశీపతి త్ర్యర్థికావ్యం రాశారు. పలనాటి

సీమలో ఇంతటి మేధాసంపన్నులు పుడతారని తెలియక అలనాడు శ్రీనాథుడు ఏదో చెప్పాడు. ఆయనకు ఏదో బాధ కలిగింది.

వెనుకబడిన ప్రాంతం పలనాడు కనుక ఆయన భోగలాలసత్వానికి అనుకూలంగా లేదని **రసికుడు బోవడు పలనా దెసగంగా** అని చాటుపద్యాలు చెప్పాడు.

శ్రీనాథుడి చాటుపద్యాలకు దీటుగా కవిత్వం ఆశువుగా, మంచినీళ్ళ ప్రాయంగా చెప్పగల కవులు మన పలనాటిలో పుట్టి, మన పలనాటి సీమకి గర్వకారణమైనారు.

లక్ష్మీనారాయణ రాసిన గర్భకవిత్వం ఉదాహరణకు చూడండి–

గీ॥ జతగనని దిట్ట లాలతి తతి నెతిసరి
హాళి దాని దాటిరి లవినాయతధృతి
రహినిజనిరి సంతత సాశరధరణి కథి
కల తతవి కచటన్ జాల ధృతినెలసిరి"

పై పద్యంలో 'జాలధృతి వెలసిరి' అనేది తీసి కందపద్యంగా రాస్తే ఎలా ఉంటుందో చూడండి...

కం. జతగనని దిట్టలాలతి
తతినెతి సరిహాళి దాని దాటిరి లలినా
యత ధృతి రహిని జనిరి సం
తత సాశర ధరణి కథికల తతవి కచటన్

అనేది కంద పద్యం, కంద పద్యం భారతార్థం చెబుతుంది. గీత పద్యం రామాయణార్థం చెబుతుంది.

అదే విధంగా చంపకమాలలో కందపద్యం ఉన్నది చూడండి. రామయణార్థంలో చంపకమాల:

అన(విని పోరి కొందఱు వరావనినాథజులోడి సిగ్గుపై
గొనజని) రంతటన్ విడచి కొందఱు గుందిరి కొందలానబలు
ఘన (తను గొందఱాసనములన్ ఘనభాతిని నుండి రంత గ్ర
మ్మనళుకునన్) రొదం గనకపోయిరి కొందఱు బుద్ధిమంతులున్

పై పద్యంలో బ్రాకెట్టులో ఉన్నది కందం.

భారతార్థంలో కందం:

" విని, పోరి కొందఱు వరా
వని నాథజులోడి సిగ్గుపై గొన జని రం
తనుగొంద ఱాసనములన్
ఘనభాతిని నుండి రంత గ్రమ్మనఁకుకునన్"

ఈ తీరుగా పద్యంలో పద్యాన్ని ఇమిడ్చి రాయటం గర్భకవిత్వం అవుతుంది. ఇది మామూలు ప్రబంధ పద్యం లాగానూ కావ్యంలోని పద్యంలాగానూ అందంగా శ్రావ్యంగా, వినసొంపుగా, అలంకార భూయిష్టంగా ఉండదు. కవి దృష్టి గర్భస్థ పద్యం కూర్చటంలోనే తన ఆలోచనలు పెట్టి ఆలోచిస్తూ రాస్తారు.

చతుర్విధ కందాలు, అష్టవిధ కందాలు, పుష్పమాలికాబంధాలను చక్కగా కూర్చినారు. ఈ భారత గర్భ రామాయణం మొత్తం 126 పద్యాలతో ఒకే అశ్వాసంలో కథను పూర్తిచేశారు.

ఈ గ్రంథానికి అవతారికను గజ్జలకొండ వాస్తవ్యులు గౌరావఝల రామకృష్ణ, సీతారామ సోదర కవులు రాశారు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు అభిప్రాయం రాశారు. సిఆర్ రెడ్డిగారు మెచ్చుకున్నారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం, వఝ్ఝాది సుబ్బరాయుడు, దీపాల పిచ్చయ్యశాస్త్రి, జనమంచి శేషాద్రిశర్మ, కూడినరసింహం, గిడుగు వెంకట రామమూర్తిగార్లు అభిప్రాయములను రాశారు.

1933లో ఈ గ్రంథం తొలి ముద్రణ జరిగింది. 1936 నుంచి 1938 సంవత్సరం వరకు బి.విద్వాన్ ఆఖరి సంవత్సర విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్దేశించారు. 1954 సంవత్సరంలో ఇది రెండోముద్రణకు నోచుకుంది. 1956 సంవత్సరంలో భాషాప్రవీణ విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు.

ఆంధ్రసాహిత్యంలో పట్టాపొందే విద్యార్థులకు పాఠ్యాంశంగా ఈ గ్రంథాన్ని పెట్టారంటే ఈ కవి గొప్పతనాన్ని గుర్తించవచ్చు.

పల్నాటి చరిత్ర:

లక్ష్మీనారాయణగారు **పల్నాటి చరిత్ర**మీద పరిశోధన చేశారు. పల్నాటి వీరుల కథలను విని తెలుసుకొని, పల్నాటి ప్రాంతము అంతా సంచరించి శ్రీనాథుడు రాసిన పల్నాటి చరిత్ర, చిలుకూరి వీరభద్రరావు రచించిన పలనాటి చరిత్ర, అక్కిరాజు

ఉమాకాంతం తెలుగులోనికి తెచ్చిన పలనాటి చరిత్రలు చదివి, **కొండూరు వీర రాఘవాచార్యులు 1951లో నందికొండ, నాగార్జునకొండల విషయమై భారతి మాసపత్రికలో రాసిన అంశాలను దృష్టిలోపెట్టుకొని 1932 -1933 నుంచి 1953 వరకు పరిశోధన చేసి "పల్నాటి చరిత్ర" అను గ్రంథమును శాసన ఆధారములు చూపుతూ పలనాటి నైసర్గిక స్థితి ఉనికిని నిర్ధారిస్తూ రాశారు.**

పలనాటి చరిత్రలో ఆనాటి పాలకుల గురించి, పల్నాటి కవుల గురించి, పల్నాటిలోని పుణ్య క్షేత్రాలను గురించి, పెందోట శిల్పుల గురించి, పల్నాటి వీరుల గాథ గురించి, పల్నాటిలో నాటి కవుల గురించి, ఆనాటికి గతించిన వ్యక్తుల గురించి, పల్నాటిలో కొన్ని శాసనములను గురించి సంక్షిప్తంగా ప్రస్తావించుకుంటూపోయి నారు. 'అల్పాక్షరం -అనంతార్థం' అన్నట్లుగా మొత్తం పుస్తకం వంద పేజీలలో ముగించారు.

రచనలు: 1.సర్వేశ్వర శతకము 2. మాచర్ల చెన్నకేశవ శతకము 3. గురజాల ఇష్టకామేశ్వరి శతకము 4.పల్నాటి వీరగాథ 5. నాగార్జునకొండ చరిత్ర 6. పల్నాటి చరిత్ర మున్నగు గ్రంథములు రచించి ప్రచురించినట్లు తెలియుచున్నది.

రావిపాటి లక్ష్మీనారాయణ, పోకూరి కాశీపత్యవధాన్లు సమకాలీనులని వీరి పల్నాటిచరిత్ర ద్వారా తెలుస్తున్నది.

125. సాయపనేని వేంకటపతి, పల్నాడు

వీరు పల్నాటివారుగా తెలుస్తోంది. **సుజన సంజీవము** వీరి రచన. ఇతర వివరాల కోసం అన్వేషించాలి.

126. కనకం యల్లమంద - గంగవరం

వీరు గురజాల మండలం గంగవరం గ్రామస్తులు. **'స్వర్గానికి మార్గము కమ్యూనిజం'** అను పుస్తకము రచించారు. మిగిలిన వివరాలు లభించలేదు.

127. కరాది సీతారామయ్య- చింతపల్లి

కారంపూడి మండలం, చింతపల్లి గ్రామ వాస్తవ్యులు. వీరు శ్రీ జనార్దన శతకము రచించారు. ఉత్పలమాల, చంపకమాల వృత్తాలలో ఆ జనార్దనుని కొనియాడారు. జనార్దనుడికే అంకితమిచ్చారు.

128. కొండా పార్వతీశ్వరాచార్యులు వేమవరం

మాచవరం మండలంలోని ఒక చిన్న గ్రామం 'వేమవరం'. కొండంత పండితులైన కొండావారు ఉన్న ఊరు అది. ఆ ఊరిలో కొండా ఈశ్వరమ్మ,

పెదశంకరాచార్యులు అను దంపతులు బహు నిష్ఠాగరిష్ఠులు. విశ్వబ్రాహ్మణ కులజులు. శివభక్తులు. నిప్పులను కూడా కడిగెడి ఆచారం గలవారు. వీరి కుమారులు పార్వతీశ్వ రాచార్యులు.

కొండా రాజమల్లయాచారి వీరి పూర్వికులు రామాయణం గేయ రూపంలో రాశారు. ఒక్క మాటలో చెప్పాలంటే పలనాటి సోదరకవులు మేనమామ పార్వతీశ్వరాచార్యులు. వీరి ఇల్లు సరస్వతికి పుట్టినిల్లు. వీరిది కవులవంశం. కొండా వారు ఉద్దండ కవులు.

పార్వతీశ్వరాచార్యులు విద్యాభ్యాసం మేనమామల ఇంట జరిగింది. ఉస్మా నియా విశ్వవిద్యాలయం వారి ఎం.ఎ. చదివారు. తెలుగు పండితులుగా ఉద్యోగం చేశారు. పార్వతీశ్వరాచార్యులు ఉద్యోగరీత్యా నల్గొండజిల్లా రఘునాథపాలెంలో నివాసమున్నారు. సాహిత్య కార్యక్రమంలో పాల్గొనేవారు. ఉద్యోగ విరమణ అయి ప్రశాంత జీవనం గడుపుతున్న తరుణంలో ఈ మధ్యనే కీర్తిశేషులయ్యారు.

రచనలు: 1. శత సుమసరములు (ఇది మూడు భాగములు, మూడు వందల పద్యములు) 2. వేదాంతవీచి, 3. వివిధ విరులు 4. భక్తి భవనం 5. జాతీయ భవనం 6. వీరబ్రహ్మం గారి గేయ కాలజ్ఞానము 7. చిల్లర కవితలు– రెండు సంపుటాలు వెలువరించారు.

వేమవరంలో కొండావారు తరతరాల నుండి పండితులే. కొండా వారికి కవిత్వం వెన్నతోపెట్టిన విద్య. వీరి మేనల్లుళ్లు ప్రభులింగాచార్యులు. చిన లింగాచార్యులు, వీరభద్రాచార్యులు. ఆంధ్ర దేశమును అవధానాలలో హొరెత్తించిన ఘనులు!

కొండావారు యక్షగానాలు రచించినారు. వీరితో నాకు (బెజ్జంకి) ఉత్తరముఖ పరిచయం, దూరవాణి పరిచయం కలదు. వీరి రచనలు నాకు స్వయంగా పంపించారు కూడా.

129. అమర్‌జీ (జి.ఆర్.కె.రెడ్డి) – చినకొదమగుండ్ల

కారంపూడికి 5కి.మీ. దూరంలో పెదకొదమగుండ్ల కలదు. పక్కన చినకొదమగుండ్ల. పెదకొదమగుండ్లకు, చినకొదమగుండ్లకు మధ్యలో నాగులేరు పారుతూ ఉంటుంది. రెండు గ్రామాలు కలిసి ఉన్నట్లుగానే ఉంటాయి. అయితే నాగులేరు ఈ రెండు గ్రామాలను వేరు చేసేదిగా ఉన్నట్లుంటుంది.

చినకొదమగుండ్ల నివాసి, అమర్‌జీగా పిలువబడే జి.ఆర్.కె.రెడ్డి వృత్తిరీత్యా ఉపా ధ్యాయులు. ప్రవృత్తిరీత్యా సాహిత్య వ్యాసంగం చేస్తుంటారు. 1980 సంవత్సరంలో

తెలుగులమ్మ పదాలు అను చిరుపొత్తమును అచ్చు వేయించారు. ఇందులో సామాజిక అంశాలను చక్కగా చూపుతారు. తెలుగులమ్మ పదాలు కూనలమ్మ పదాలను పోలినవిగా ఉంటాయి. తెలుగులమ్మ పదాలలో వివిధ భాషాపదాలను విరివిగా వాడారు. అలతిఅలతి పదాలతో తాను చెప్పదలచుకున్న నీతిని, సూక్తులను అనాయాసంగా చెప్పారు. ముద్దుముద్దు పదాలతో, తెలుగు పదాలతో కలిసిపోయి తెలుగులమ్మ పదాలలో దొర్లిపోయినవి. పలు ప్రాంతాలమాండలిక పదాలు ఈ కవితాసంపుటిలో సందర్భానుసారంగా చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు.....

తరుణులతో తిరుగకు
తిరిపెమెపుడు అడుగకు
తల్లి భాష మరువకు
ఓ తెలుగులమ్మా..!

ఈ పద్యాలకు భావార్థాలు సులభంగా అర్థమవుతాయి. వివరించనవసరం లేదు.

130. కొండా రాజమల్లాచారి- వేమవరం

వీరు పల్నాటి సోదర కవులకు స్వయంగా మేనమామ. వేమవరం నివాసి. వీరి రచనలు నాటకము(యక్షగానం) గ్రంథములు లభించుటలేదు. పూర్వకవుల రచనల బట్టి తెలుస్తోంది.

131. కొండా భవానీశంకరాచార్యులు - వేమవరం

వీరు పల్నాటి సోదర కవులకు మేనమామ. కొండావారు అందరూ కవులే. **వీరి రచనలు:** 1.కనక దుర్గమ్మ శతకము 2. శ్రీగిరీశ్వర శతకము 3. వీరబ్రహ్మయోగి నాటకము (యక్షగాన ప్రక్రియ) రాసినట్లు తెలుస్తోంది. ఈ గ్రంథములు అలభ్యములు.

132. పాటిబండ గురుమూర్తి - మాచవరం

వీరు మాచర్ల నివాసి. వీరి రచన ఋష్యశృంగోపాఖ్యానము.

133. జానపాటి పట్టాభిరామశాస్త్రి - జానపాడు

వీరి రచనలు: 1. నాగర ఖండము 2. స్వర్ణకార వ్యవహారము (పద్యకావ్యము) వీరు అష్టావధానులు. ఆరోగ్య భాస్కరము అను శతకమును 1932లో అచ్చు వేయించినారు. పోకూరి కాశీపత్యవధానులు కన్న పెద్దవారు కావచ్చును.

134. అక్కిరాజు ఉమాకాంతం- గుత్తికొండ

వీరు ప్రధానంగా శ్రీనాథుడు రాసిన పల్నాటి వీరచరిత్రను పరిష్కరించి పీఠిక రాసి ముద్రణ చేయించారు. పల్నాటి సోదర కవులు, ఉమాకాంత విద్యాశేఖరులు కలసి పల్నాటి ప్రాంతము మొత్తం పర్యటించి పల్నాటి వీరచరిత్రకు పీఠిక రాయగా పల్నాటి సోదరకవులు ప్రభులింగాచార్యులుగారు పలనాటి వీరచరిత్ర నాటకము రాశారు. ఉమాకాంత విద్యాశేఖరులు ప్రభులింగాచార్యులు గారి సమకాలీనులు.
రచనలు: 1.నేటి కాలపు కవిత్వము 2. పల్నాటి వీరచరిత్ర కథలు 3. షేక్స్పియర్ నాటకములు 4. టిప్పు సుల్తాను నవల.

135. తిరునగరి వేంకటనరససూరి- గంగవరం

వీరు గంగవరం, గురజాల మండలం నివాసి. వీరి కాలం రూఢిగా తెలియ డంలేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడంలో ప్రముఖ భూమిక పోషించారు. వీరి రచన **'రామదేవ శతకం'**

136. సరికొండ లక్ష్మీనరసింహకవి- నాగులవరం

వీరు మాచర్ల మండలం నాగులవరం గ్రామనివాసి. 1. తిరుపతి వేంకటేశ్వర శతకము 2. బెజవాడ కనకదుర్గమ్మ శతకము రచించారు. ఈ గ్రంథముల కొరకు అన్వేషించాలి.

137. ఘటం కాంతయ్య- దైద

గురజాల మండలం, దైద నివాసి. 1. ఘటకాంతోపదేశము అనే వేదాంత కందార్థములు 2. రుక్మిణీ పరిణమయు అనే జంగము కథను రాశారు.

138. బూరుగుపల్లి పురుషోత్తము- రెంటచింతల

రెంటచింతల మండలం, రెంటాల గ్రామనివాసి. వీరు తిరుమలేశ్వర శతకము రాశారు.

139. గాదె లక్ష్మీపతి-పేటసన్నిగండ్ల

కారంపూడి మండలం, పేటసన్నిగండ్ల నివాసి. వీరు భక్త రక్షామణి శతకము రాశారు. ఈ శతకం 1946లో ప్రథమ ముద్రణ. 2011లో శ్రీ మొవ్వ వృషాద్రిపతి గారి భావానుసరణతో ద్వితీయ ముద్రణ పొందింది.

140. పిన్నెల్లి నాగయ్య- గురజాల

వీరు గురజాల నివాసి. సుకన్యాపరిణయం అనే గ్రంథం రాశారు.

141. తంగెడ రామకృష్ణయ్య -మోర్జంపాడు

వీరి రచనలు: 1. గౌరీపరిణయము 2. శివానందలహరి (ఆంధ్రానువాదం)

142. తంగెడ నరసింహారావు-మోర్జంపాడు

రచన: దీక్షిత శతకము

143. తంగెడ లక్ష్మీకాంతకవి మోర్జంపాడు

రచనలు: 1.సముద్ర మథనం (బుర్రకథ) 2. జగన్మోహిని నాటకము (యక్షగానం)

144. దాసరి మోజెస్- వెల్దుర్తి

రచన: హర్షచరిత్ర పద్యకావ్యం.

145. దాసరి పెదజాన్- వెల్దుర్తి

రచన: అప్పకవీయమునకు టీకా, తాత్పర్యము

146. శానంపూడి వరదయ్య- జూలకల్లు

రచన: భీమలింగేశ్వర శతకము

147. పిన్నెల్లి నరసింహకవి- గురజాల

రచన: 1.భిషజ్ఝణి వైద్యశాస్త్ర పద్యకావ్యం. 2. సైంధవ పరాభవం నాటకం 3. లక్ష్మీనృసింహ స్తోత్ర పద్యములు 4. కలియుగ నాటకము

148. తంగెడ నారాయణరావు- తంగెడ

రచన: వరూధిని నాటకము

149. గోలి కమలనాభుడు - దాచేపల్లి

రచన: అంబరీషోపాఖ్యానము- పద్యకావ్యము

150 వేదాంత శేషాచారి- ముటుకూరు

దుర్గి మండలం, ముటుకూరు వాస్తవ్యులు.

రచనలు: 1.మాఘపురాణం 2. రామరాఘవ శతకము 3.సూర్యనారాయణ శతకము

151 మల్లెం సుబ్రహ్మణ్యకవి- కరాలపాడు

రచన: 1.బ్రహ్మంగారి జీవితచరిత్ర (హరికథ) 2. రౌంజకాసుర వధ. ఈయన విశ్వబ్రాహ్మణ కులస్థులు.

152. వాలిచెర్ల కృష్ణమూర్తి - మాదినపాడు

రచన: ఎం.ఎల్.ఏ నాటకం

153. శ్రీరాం ఎల్లమందయ్య -పెద్దగార్లపాడు

రచన: కారంపూడి మండలం పెదగార్లపాడు నివాసి. ఉషాపరిణయం- బుర్రకథ విశ్వబ్రాహ్మణ వంశస్థులు.

154 సోమా చంద్రమౌళి- దైద

గురజాల మండలం దైద గ్రామనివాసి. **రచన:** సుశీల శతకము

155 రొంపిచర్ల పూర్ణయ్య- మాచవరం

రచన: ఉపగుప్తుడు అనే గ్రంథం

156 కొండా ఆంజనేయశాస్త్రి- వేమవరం

రచన: సూర్య వివాహము (బుర్రకథ). ఈయన కన్నెకంటి సోదరకవులకు మేనమామ. విశ్వబ్రాహ్మణ కులస్థులు.

157. ధూళిపాళ సీతారామశాస్త్రి- దాచేపల్లి

రచన: శ్రీమద్రామాయణము (సుందరకాండ- గేయ కావ్యము)

బిరుదులు: కళాసరస్వతి, నాటక కళాప్రపూర్ణ

వీరు 24-9-1921 నుంచి 13-4-2007 వరకు జీవించారు. ఆ రోజుల్లో దాచేపల్లిలో థర్డ్ ఫారం చదివారు. 1961-2001వరకు సినీరంగంలో విశేష ప్రతిభను కనబరిచారు. 7-5- 2001లో సన్న్యాసం స్వీకరించారు.

158. దీవి చతుర్వేది- వెల్దుర్తి

వీరు దీవి రంగనాథాచార్యులు గారి కుమారులు. ఎమ్.ఏ. చదివి జర్నలిజంలో పిహెచ్.డి చేశారు. పుట్టపర్తిలో ఉంటూ సాయినాథుని సేవలో తరిస్తున్నారు. వీరు సాయిబాబాగారికి సంబంధించిన ఆంగ్ల గ్రంథమును తెలుగులో **"పరిప్రశ్న"** గా అనువదించారు.

పల్నాటి సీమలో ప్రాచీన కవులు

(159, 160, 161, 162, 163, 164)

159. యథావాక్కుల అన్నమయ్య- సత్రశాల: క్రీ॥శ॥ 1241 ప్రాంతమున సత్రశాలలో తపస్సు చేసి సర్వేశ్వర శతకమును రచించినట్లు తెలుస్తోంది.

160. తుర్కారాజకవి - పెందోట

161. అయ్యంకి బాలసరస్వతి - పెందోట

పెందోట చరిత్ర: పెందోట అనే పట్టణం పల్నాటిసీమ, గురజాల తాలూకాలోనిది. మాచర్లకు 25 కిలోమీటర్ల దూరంలో నాగార్జునసాగరు, నాగార్జునకొండకు కృష్ణాతీరమున 12 కి.మీ దూరంలో ఈ పెందోట పట్టణం ఉంది. క్రీ॥శ॥ 1570 నుంచి ధవళేశ్వరపు మార్కండేయ ప్రభువు పెందోటను పాలించసాగాడు. అంతకు ముందు ఐదారు తరాల నుంచి మార్కండేయ ప్రభువు వంశీయులు పరిపాలిస్తున్నట్లు తెలుస్తోంది. మార్కండేయ ప్రభువు మూలపురుషులను పరిశీలిస్తే..వీరు విశ్వజ్ఞఋషి గోత్రోద్భవులు. వీరయప్రభువు, గంగమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. 1.బెజవాడ ప్రభువు 2.పర్వతాచార్యులు 3. బత్తెనాచార్యులు 4. రామయ ప్రభువు 5. గోపాచార్యులు.

ఇందులో నాల్గవ కుమారుడు రామయప్రభువు - కుమారుడు సోమవిభుడు. ఇతని భార్య వీరాంబ.వీరి కుమారుడు కేదారవిభుడు. ఇతని భార్య కన్నమాంబ-వీరికి సంతానం నలు గురు- 1. పెదలింగన 2.చినలింగన 3. సోమవిభుడు 4. వీరసుకృతి.

కేదారవిభుని మూడవ కుమారుడు సోమవిభుడు. ఇతని భార్య పెద్దమాంబ.వీరికి ముగ్గురు పిల్లలు-1.మార్కండేయ ప్రభువు 2. కేదారాచార్యులు 3. దండపాణి.

తుర్కారాజకవి, అయ్యంకి బాలసరస్వతి అను ఇద్దరు కవులు మార్కండేయ ప్రభువు కొలువులోని వారు.

వీరు స్కాందపురాణంలో ఉన్న నాగరఖండమును పద్యకావ్యంగా రచించారు. నాగర ఖండమును అనువదిస్తూ అందు పెందోట వర్ణనము చేశారు. ఆ వర్ణన

ప్రకారం–పెందోట మహాశిల్పులకు నిలయము. శిల్పసంపదకు నెలవు. పెందోట శిల్పములే అమరావతి, నాగార్జున కొండలలోని బౌద్ధ శిల్పాలు! అంతేకాక యావదాంధ్రదేశంలోని బౌద్ధశిల్పములన్నీ పెందోట శిల్పులు చెక్కినవని జనప్రసిద్ధియూ ఆధారాలూ ఉన్నాయి.నాగార్జునుడు కూడా పెందోట నివాసే కనుక మహా విహారములను నెలకొల్పాడనడానికి ఆధారాలు కలవు.

సీ॥ కోటయే వీటికి మేటియై మిక్కిలి
చూపట్టు చక్కని చుట్టు గుట్ట
క్రీడాద్రులే పురికిని సప్తకుల పర్వ
తములును మేరు మందర నగరములు
బొడ్డన బావులే పుట భేదనంబున
కమృతాబ్ధి ముఖ్య రత్నాకరములు
రవి సోమ వీధులే రాజధానికి బ్రసి
ద్ధిగను నేబదియారు దేశములును
గీ॥ పరమగు నట్టి పెందోట పురవరమున
కధిపతి శిరోవతంసమై యలరె, సకల
కళల ధవళేశ్వరపుర విఖ్యాతుడైన
గురుతర యశోధనుండు మార్కొండ ఘనుడు"

'ఆ పట్టణము క్రీడాద్రులతోను, సువిశాల రహదారులతోను, బొడ్డన బావుల తోను అలరారుతున్నది. సకల కళావిభుడు ధవళేశ్వరపు మార్కండేయ ప్రభువు పాలించే దేశం చుట్టుపక్కల యాబదియారు దేశములతో ప్రసిద్ధి గన్నది' అని ఆనాడే వర్ణించబడినది.

సీ॥ శాలివాహన శక సంఖ్యాకములునగు
పదియేను వందల నెనిమిది
వత్సరంబులలోన వసుధా స్థలంబున
కుతుబుషాహీ నిజాంకుతలనాథం
ప్రాభవవేళ మార్కండేయ భూపతి
ధవళేశ్వరాన్వయ భవుడు నగుచు
సకల దిశావ్యాప్త సాంద్ర సుధాస్వచ్ఛ
కీర్తి పరంపరాస్ఫూర్తి నలరి

గీ॥ సురుచిరంబైన పెందోట పురిని నిలచి
విశ్వకర్మాన్వయాంబుధి వెలయజేసి
సప్త సంతానముల గాంచి సాధువృత్తి
సుకవివర్యులు భళియని స్తుతులొనర్ప
ధరణి పాలించుచుండెను ధర్మనిరతి..."

విశ్వకర్మ వంశోద్భవుడు ధవళేశ్వరపు మార్కండేయ ప్రభువు శాలివాహన శకం 1508 సంవత్సరం అనగా క్రీ॥శ॥ 1570 నుంచి ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇది పల్నాటి ప్రాంతమగుట మనకు గర్వకారణము.

ఇందొక ముఖ్య విశేషమున్నది. మార్కండేయ ప్రభువు పూర్వికులలో బెజవాడ ప్రభువు ఐదవ తరమువాడు బెజవాడను పాలించిన **'బెజవాడ ప్రభువు'** అని నాగరఖండము చెప్పుటచే ఇతని రాజ్యము పెందోట నుంచి బెజవాడ వరకు వ్యాపించినట్లు తెలుస్తోంది. బెజవాడ ప్రభువు పాలించుటచే విజయవాడకు పూర్వనామము **బెజవాడ** అని పిలువబడినట్లు తెలుస్తోంది.

శా॥ "పారావారము మేరగా గలుగు భూభాగంబు పైనున్న యూ
రూరం గూపములుం, దటాకము, రమ్యోద్యాన పంక్తుల్
మఠా గారంబుల్ నిరతాన్న సత్రములు నాకల్పంబుగా నిల్పె, నౌ
రౌరా! సోమయ మారుకండు ఘన పుణ్యంబెన్నగా శక్యమే"

కం॥ విశదముగ నిలిపెనే కా
దిశ మార్కొండయ్య లింగధామములు నిరం
కుశవృత్తిన్ శ్రీగిరి నా
శశితారార్కముగ వీర శైవాగ్రణియై"

మార్కండేయ ప్రభువు ప్రజారంజకంగా పాలించెనని తెలుస్తోంది. చెరువులు, బావులు, ఉద్యానవనాలు, సత్రాలు, మఠాలు నెలకొల్పినాడు. శివపూజాదురంధరుడై ఏకాదశ శివాలయములను శ్రీశైలంలో కట్టించినట్లు తెలుస్తోంది.

ఉ॥"ఏయెడ నెయ్యురన్ వదలదేమర దార్తజనైక రక్ష, వి
ద్యాయతనంబు, ధైర్యమున కాకర, మార్యజనంబు కోరి రా
జేయు పరోపకారియు విశిష్ట చరిత్రుడుదార ధీర లీ
లాయుతు మారుకొండు ఘనుడమ్మహిమేటికి సాటిలే రిలన్"

ఈ పద్యం ద్వారా మార్కండేయప్రభువు ఆర్తజనరక్షణ, పరోపకార పారాయణత్వము కలవాడుగా తెలుస్తోంది.

సీ॥ "పెందోట పురవరమందు గాపురముండు
విశ్వకర్మావనీ విబుధవరులు
శ్రీమారుకొండు ధరిత్రీవరాగ్ర ప్ర
గణ్య ప్రదత్త విఖ్యాతములగు
నగ్రహారాది సమగ్ర సుస్వాస్థ్యాది
కములు గల్గుటచేత కలిమి గాంచి
వేదశాస్త్రాధిక విద్యలు చదివి ది
వ్యజ్ఞాన సంపత్తి నతిశయిల్లి
సకల యజ్ఞంబుల సరవితో గావించి
నిత్యాగ్నిహోత్రులై నెగడు చుండి
గీ॥ సుర పితామహుని, శతాధ్వరుని, గురుని
ధిక్కరించియు నిరత వివర్ణమహిమ
ధైర్యమున వారిదాద్రుల దలకు నటుల
చేసి బ్రహ్మద్యా లైరి యీ స్థిరను స్థిరత"

పెందోట పురములో విశ్వకర్మవంశ విశ్వబ్రాహ్మణ విబుధులు అనేకమంది ఉన్నారు. మార్కండేయ ప్రభువు ఇచ్చిన విశ్వబ్రాహ్మణ అగ్రహారాలు ఉన్నాయి. వేదవేదాంగాలు చదివి నిష్ఠాగరిష్ఠులు, నిత్యాగ్నిహోత్రులు, సదాచార సంపన్నులకు పెందోట అగ్రహారము నెలవై ఉన్న దని తెలుస్తోంది.

కం॥ రసికుడు తుర్కారాజన
యసమ ప్రతిభావిరాజి యయ్యాంకిత బా
ల సరస్వతి యను వారల
మసహిష్ణువ్రజ విదారణార్థులము మతిన్

కం॥ అభినవ విశ్రుత కవితా
విభవుల మఖిలాగమాంత విధ శౌనక గో
త్ర భవులము బుధవిధేయుల
మభవపదాంభోజ బంభరాత్ములము మహిన్

పై పద్యాలలో అయ్యంకి బాలసరస్వతి, తుర్కా రాజకవి– ఇరువురు ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరు పల్నాటిసీమ అంతర్గతమైన పెందోటపట్టణంలో ధవళేశ్వరపు మార్కండేయ ప్రభువు ఆస్థానంలో ఉన్న జంటకవులు. నాగరఖండమును తెలుగులో అనువదించి మార్కండేయ ప్రభుకు అంకితమిచ్చారు.

162. రామరాజభూషణుడు - భట్టువారిపల్లె

కారంపూడి మండలంలోని భట్టువారిపల్లె గ్రామ నివాసియని తెలుస్తోంది. క్రీ॥శ॥ 1567 –1577 వరకు విజయనగర సామ్రాజ్యమును పాలించిన తిరుమల దేవరాయలకు వీరు గ్రంథములను అంకితమిచ్చారు.

రచనలు: 1. వసుచరిత్ర 2. హరిశ్చంద్రనలోపాఖ్యానము (ద్వ్యర్థికావ్యము) రాశారు.

163. భట్టుమూర్తి– భట్టువారిపల్లె

భట్టుమూర్తి **కావ్యాలంకార సంగ్రహము** అనే ఆలంకారిక శాస్త్రమును రచించాడు. ఇతడు కృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాలలో ఒకడు.

కాగా రామరాజభూషణుడు, భట్టుమూర్తి ఒకరే అని కొందరి వాదన!

164. పింగళి సూరన

పింగళి సూరన మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామ వాస్తవ్యులు. ఈయన కూడా శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన కవి.

165. అప్పకవి - కామేపల్లి

ఇతని అసలు పేరు కాకునూరి అప్పకవి. అప్పకవీయము అనే ఛందోగ్రంథమును రచిం చాడు. ఈయన క్రీ॥శ॥ 1656–1660 ప్రాంతం వారు. పల్నాడులో 194 గ్రామాలున్నట్లు తన రచనలో రాశారు. పిడుగురాళ్ల మండలంలో బ్రాహ్మణపల్లి ప్రక్కన కామేపల్లి కలదు.

'క' అను అక్షరానికి నూరు అర్థాలు చెప్పిన మహానుభావుడు కనుక 'కాకునూరి' అని వారి ఇంటిపేరుగా వచ్చిందని కొందరు చెబుతున్నారు.

బ్రాహ్మణపల్లి వాసులు ఆనాడు కవిసింహ కాశీపత్యవధాన్లు గారిని ఘనంగా సన్మానించి, గజారోహణము చేయించి ఊరేగిస్తున్న సమయంలో ఆ ఊరేగింపు కామేపల్లి వద్దకు రాగానే కాశీపతిగారు ఏనుగు నుంచి దిగి నేలమీద నడిచారట. దానికి కారణమేమంటే– “ఇది మహాకవి శేఖరుడు అప్పకవి నివాస గ్రామము. వారు

సంచరించిన నేల. ఇక్కడ తాను ఏనుగునెక్కి తిరగరాదు. అప్పకవిని గౌరవించవలెనని అంబారీ నుంచి దిగార''ని బ్రాహ్మణపల్లి వాసి మహేశ్వరపు వీరబ్రహ్మాచార్యులు గారు నాతో (డాక్టర్ బెజ్జంకికి) చెప్పియున్నారు.

గీ॥ దండకాటవి నాంధ్రాభిదాన పుణ్య
దేశమున శ్రీగిరీశాన్య దిశము గొండ
వీటి పడమర దంగెడు విషయమునను
గామెపల్లిని గోపాల ధామమునను"

గీ॥ పల్లె నాటను నూట తొంబదియు నాల్గు
గ్రామముల నీడు గానక కాకునూరి
వేంగనార్యుండు వేదవేదాంగములను
బ్రస్తుతికి నెక్కె మాఱట బ్రహ్మయనగ"

కం॥ తంగెడ సీమను నిర్ఝర
గంగా సమనాగ నిమ్మగా పూర్వదిశన్
బింగళిపుర దక్షిణమున
రంగుగ నెలకొన్న గోప రత్నంబునకున్"

పై పద్యాలను బట్టి చూస్తే అప్పకవి పల్నాటి సీమ వాసి అని తెలుస్తోంది. ఆనాడు పల్నాడులో 194 గ్రామాలున్నట్లు తేటతెల్లమవుతున్నది.

166. గుర్రం ప్రతాపరెడ్డి- రెంటచింతల

గుర్రం చెన్నారెడ్డి, నక్షత్రమ్మ దంపతులకు రెంటచింతలలో జన్మించారు. అక్కడే ప్రాథమిక విద్య, ఉన్నత విద్య అభ్యసించారు. తర్వాత 16 ఏళ్లు వ్యవసాయం చేశారు. అనంతరం బి.ఏ.,బి.ఇడి పూర్తి చేశారు. ఎం.ఏ.తెలుగు, ఎం.ఏ. పొలిటికల్ సైన్సు, జర్నలిజంలో పీజీ చేశారు.**"పగటి వేషాలు – ప్రదర్శన రీతులు"** అనే అంశంపై పొట్టిశ్రీరాములు తెలుగు వర్శిటీలో పరిశోధనచేసి పిహెచ్.డి పట్టా పొందారు. చిన్నతనం నుంచి నాటకాలు వేయడంలో ఉత్సాహం కనబరిచారు. అనేక నాటకాలు వేశారు. బహుమతులు పొందారు. బైబిల్ పూర్వ నిబంధన సారాన్ని 32 రకాలుగా గిరిజన, జానపద గేయ విధానంలో **'రక్షణ వేదం"** పేరిట రచించి అనేక ప్రదర్శనలు చేయించారు. **రచనలు:** 1.జానపద రీతులు మరియు ఉత్సవాలు 2. మన వారసత్వ సంస్కృతి, 3. మన జానపద విజ్ఞానం, 4.పగటి వేషాలు ప్రదర్శన రీతులు 5. జాన

పద సంబరాలు 6. విశ్వమాత, 7. తెలుగు ప్రాంత శ్రీసభ నాడు– నేడు 8. పరిణయ వేళ 9. తెలుగు కథోలిక్ మత చరిత్ర, 10 కథోలిక్ రెడ్ల చరిత్ర, 11. ప్రభు రాక 12. రక్షణ మార్గం, రక్షణ వేదం నాటికలు...

అముద్రితాలు: క్రైస్తవం– భారతీయ సంస్కృతీ సంప్రదాయం. 2. భరతజాతి– మన మతం క్రైస్తవ మతం వర్జిన్ మేరీ క్రీస్ట్ ఇన్ ఇండియన్ ఫోక్ ట్రెడిషన్ అని ఆంగ్లంలో రచించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నారు.వీరు అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. క్రైస్తవ సాహిత్యంలో పేరెన్నిక గన్నవారు.

167. దిట్టకవి శ్రీనివాసాచార్య –ఎర్రగొండపాలెం

వీరు 1.07.1946లో ఎర్రగొండపాలెంలో జన్మించారు. కొంతకాలం మాచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998 నుండి 2004 వరకు తెలుగు జూనియర్ లెక్చరర్‌గా పనిచేశారు.



రచనలు: 1.శ్రీగోపాల చూడామణి శతకము, 2.సూక్తి చంద్రిక 3.స్వర్ణ భారతి 4. ప్రశ్నోత్తరి 5.రామాయణ సంగ్రహము 6.మధుర శ్రీనాధుడు 7.గాయత్రీ శతకము.

అముద్రితములు: 1.మతిమరుపు మాధవయ్య 2.మంత్రి గారి అబ్బాయి. 3.లలిత హృదయం.


చ. నయములున్న యంధుడను నాలుక గల్గిన మూగనౌ శృతి
ద్వయమును గల్గియున్ చెవిటివాడను రోగము లేని రోగినేన్
భయమును బుట్టి మీకు కదు ప్రార్థన చేయుచుంటి యిన్నియున్
లయమును జేయుమంటిని యిలన్ గల బోదిలివీటి ధూర్జటీ!

తా. బోదిలీటిలో వెలసిన ఓ ధూర్జటీ! కళ్లుండియు గ్రుడ్డివాడను. నాలుక ఉండియు మూగవాడను, చెవులు రెండుండియు చెవిటివాడను. రోగము లేకయు రోగము భయము వీటినన్నింటిని నశింపజేయవయ్యా!

పద్యరచన : 'కవిసింహ' పోకూరి కాశీపత్యవధాని

తాత్పర్యరచన: డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు – శ్రీ ధూర్జటి శతకము నుంచి...

168. కొల్లా శ్రీకృష్ణారావు, 1928 పెదకూరపాడు



పెదనందిపాడు వాస్తవ్యులు అయిన కొల్లా సూరయ్య, మహాలక్ష్మి దంపతులకు 27-01-1928 వ తేదీన శ్రీకృష్ణారావు గారు జన్మించారు. 'భాషాప్రవీణ' పట్టభద్రులు. కొంతకాలం పండితోద్యోగం చేశారు. "భావవీణ" మాసపత్రిక ప్రధాన సంపాదకత్వంలో పత్రికను చాలాకాలం కొనసాగించారు.

ముద్రిత రచనలు: మంత్రివర్గమా శంఖారావం, విశ్వశాంతి పద్యాలు, రారాజు (పద్యకావ్యం), పూదోట, పౌరుషజ్యోతి (ఖండ కృతులు), బాలచంద్రుడు (ఉపవాచకం), ఉత్తమకావ్యాలు, కవిత్రయము (కావ్యస మీక్షలు), అమూల్యశ్రీ అమ్ములమ్మ, కర్షకసాహిత్యం, శ్రీనాథ నైషధం, ఏటుకూరి వారి వివిధ వీరవనితలు, కవిబ్రహ్మ ఏటుకూరి, నా సాహితీయాత్ర, నవసాహితి, మనకవి జాషువా, బ్రహ్మనాయుడు. మొదలగు గ్రంథాలు ప్రచురించారు. అంతేకాక కవిరాజ ప్రశస్తి,నార్ల సంస్మృతి, తెలుగులెంక, కవిబ్రహ్మ ప్రశస్తి వంటి సంకల నాలు వెలువరించారు.

భారతత్రయి(కావ్యసమీక్షలు), శ్రీకృష్ణ వ్యాసాలు(సాహిత్యవ్యాసాలు) ముద్రించవలసియున్నది. ఏటుకూరి వేంకటనరసయ్యగారి రచనలు, పలనాటి సోదర కవుల రచనలు అనినచో ఎనలేని మక్కువ. తరచూ వీటిపై వ్యాసాలు ప్రచురిస్తూ ఉంటారు. వీరు నిత్య సాహిత్య కృషీవలుడు అనుటకు నిదర్శనం- వీరు తొంబదేండ్ల ప్రాయం దాటిననూ నేటికీ సాహిత్యసేద్యం చేయడం! 2019 జూన్‌లో **"మరుగున మహాకవి తురగా వెంకమ రాజు"** అను కవి(1846-1911 ప్రాంతం)చరిత్రను శోధించి ప్రచురించారు. ఇంతకన్నా నిదర్శనం ఏమికావాలి!ఎంతోకాలంగా గుంటూరులో స్థిరనివాసం ఎర్పరచుకొని ఉంటు న్నారు

169. పాలపర్తి వేణుగోపాల్, 1942-2010



పాలపర్తి వెంకట నాగవల్లి, వేంకట సత్యనారాయణ దంపతులకు ది 24-07-1942లో వేణుగోపాల్‌గారు జన్మించారు పెదనందిపాడులో. చదివింది నర్సరావుపేటలో. ఉద్యోగ జీవితం యస్.యస్.యన్.కళాశాలలోట్యూటర్‌గా ప్రారంభించారు. 1966-1968 సం.లలో మాచర్ల ప్రభుత్వ కళాశాలలో పనిచేశారు. ఆ తరువాత లెక్చరర్‌గా వివిధ ప్రాంతాలలోచేసి ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేశారు.

పలనాటి సీమలోని ప్రముఖ పట్టణాలన్నింటిలోనూ అవధానాలు చేశారు. పలువురి మన్ననలు పొందారు. **"కవిసింహం పోకూరి కాశీపత్యవధాని"** గారుస్థాపించిన **"నాగార్జున సాహితీ సమాఖ్య"** సభ్యులుగా ఉండి డాక్టర్ వి.వి.ఎల్. నరసింహారావు, శనగల సుందర రామయ్య, పోకూరి

సుబ్బయ్యాచార్యులు మొదలగు కవిపండితులతో కవిసమ్మేళనాలు, అవధానాలు నిర్వహించారు.ఆకాశవాణి ప్రసంగాలు, పత్రికలలో వ్యాసాలు, కథలు, కథానికలు అనేకం రాశారు.ఆంధ్రప్రభ వారపత్రికకు ఉపసంపాదకులుగా పనిచేశారు. కాలచక్రం ఆగిపోయింది, జ్యోతిర్మయం,దీపకళిక వంటి కథలెన్నోరశారు.**"కారము మోక్ష కారణము కారణ జన్మున కాత్మవేత్తకున్"** అనెడి సమస్యను ఒకనాటి అవధానంలో పూరణ–

"కారము గర్వకారణముగా పలనాటి పూలదండ సత్
కారము ప్లోద కారణము కావ్యవిధాతకు, దుష్టమౌ నహం
కారము పాత కారణమగమ్య మనీషకు, దివ్యనాద మోం
కారము మోక్షకారణము కారణజన్మున కాత్మవేత్తకున్"

అని పలనాటి కారము ఘాటును స్మరించారు అభిమానంతో...

"కోదలిం గౌగలించుకొని ముద్దాడె మామ" అనే సమస్యను ఎంత చమత్కారంగా పూరించారో చూడండి...

"తలుపు మూయకె నీరాడు తలిరుబోడి, పొంగికొని వచ్చు ప్రేమాపుకొనకలేక
మొండి మొలతోడ చేటంత మొగము తోడ,కాళ్ళకుంజుట్టుకొన్న మూదేళ్ళ మేన
కోడలిం గౌగిలించుకొని ముద్దాడె మామ"

సమయస్ఫూర్తితో మూడేళ్ళ మేనకోడలిగా వర్ణించినతీరు అద్భుతం..!

పలనాటి సాహితీప్రియులను అలరించిన వేణుగోపాల్ గారు 08-07-2010లో స్వర్గస్థులైనారు.

దాక్టర్ రాపాక ఏకాంబరాచార్యులు గారి "అవధాన విద్యాసర్వస్వం" సౌజన్యంతో.

170. శిష్టి చంద్రమౌళిశర్మ-1952, దుర్గి

దుర్గి గ్రామ వాస్తవ్యులు శిష్టి రాఘవశాస్త్రి,శేషమ్మ దంపతులకు 09-09-1952లో చంద్రమౌళిశర్మ జన్మించారు.ఎం.ఏ.,పిహెచ్.డి చేశారు. ప్రభుత్వ కళాశాల మాచర్లలో ట్యూటర్‌గా కొంతకాలం పనిచేశారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి డిగ్రీ కళాశాల-పొదిలిలో లెక్చరర్‌గా ప్రవేశించి ప్రిన్స్‌పల్‌గా పదవీవిరమణ చేశారు. **"నన్నయ నానారుచి రార్థసూక్తినిధిత్వము"** అను అంశముపై సిద్ధాంతవ్యాసం సమర్పించి పిహెచ్.డి పట్టం పొందినారు.గౌరీకళ్యాణం, కిరాతార్జునీయం అను సంస్కృత కావ్యాలకు తెలుగులో పద్యకావ్యాలు రాశారు.



"మూల విధేయంగా నడుస్తూనే కాసింత స్వతంత్రించి ప్రసన్నతకు పట్టం కట్టడమనే పద్ధతిలో సాగిపోయారు చంద్రమౌళిశర్మ. ఇది కావ్యారంభం నుంచీ కనపడే సుగుణం"అని వీరి అనువాద పద్ధతిని **ఆచార్య బేతవోలు రామబ్రహ్మం**గారు కొనియాడారు.ఇంత కన్నా వివరించి వీరి శైలీమాధుర్యాన్ని రుచిచూపించుటకు పిండి ఉన్నా వేయుటకు పెద్ద పెనం లేనందుకు చింతిస్తున్నాను.వీరు ప్రస్తుతం గుంటూరులో స్థిరపడినారు.


స్థానికులు కాకపోయినా పల్నాడు గురించి రాసినవారు

01.	శ్రీనాథమహాకవి	- పల్నాటి వీరచరిత్ర- ద్విపదకావ్యం
02.	కొండయ్య, మల్లయ్య	- పల్నాటి వీరచరిత్ర - ద్విపద కావ్యం
03.	ముదిగొండ వీరభద్రకవి	- క్రీ॥శ॥1862- 'వీరభాగవతము'
04.	శ్రీమతి డాక్టర్ పి. ఉష	- పలనాటి వీరచరిత్ర నాటకాలు - పరిశీలన
05.	ఉన్నవ లక్ష్మీనారాయణ	- నాయకురాలు
06.	కృష్ణప్రసాద్- అద్దంకి	- పల్నాటి వీరులు లేక నాగమ్మ శపథం
07.	సుంకర కోటేశ్వరరావు	- నాయుడు -నాయకురాలు (అముద్రితం)
08.	డాక్టర్ కోడూరు ప్రభాకరరెడ్డి	- పల్నాటి భారతం (1996) పద్యకావ్యం
09.	త్రిపురనేని గోపీచంద్	- మాంచాల
10.	నండూరి మురళి	- పల్నాటి రాయభారము -(1980)
11.	ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ	- నా తెలుగు మాంచాల (1981)
12.	కొండవీటి వేంకటకవి	- అలరాజు
13.	తంగిరాల వేంకటసుబ్బారావు	- పలనాటి వీర గాథాచక్రము (1983)
14.	ఉయ్యూరు వేంకటేశ్వరరావు	- పల్నాటి యుద్ధం (1970)
15.	కొర్లపాటి రామమూర్తి	- పలనాటి వీరచరిత్ర (నాటకం-1978)
16.	ద్రోణంరాజు సీతారామారావు	- పల్నాటి వీరచరిత్ర (1915)
17.	టంగాసు సీతాపతి	- బాలచంద్ర
18.	వావిలాల సోమయాజులు	- నాయకురాలు(1946,1953 ప్రచురణలు)
19.	డాక్టర్ సి.నారాయణరెడ్డి	- నాగార్జునసాగరము
20.	టి. రామకృష్ణదాసు	- నాగార్జున కొండ
21.	కొడాలి లక్ష్మీనారాయణ	- నాగార్జున చరిత్ర (1948)
22.	వక్కలంక లక్ష్మీపతిరావు	- వీరభారతం (1970)
23.	త్రిపురనేని సుబ్బారావు	- కవిసింహ కాశీపతి- జీవితము-సాహిత్యము
24.	డాక్టర్ కల్లూరి వేంకటేశ్వరరావు	-పోకూరి కాశీపతి జీవితము -రచనలు (2009)
25.	అలంపురి బ్రహ్మానందం	- కవిసింహ కాశీపతి సంక్షిప్త సాహిత్య చరిత్ర
26.	చోడవరపు సత్యవతీదేవి	- పల్నాటి మాంచాల పద్యకావ్యం (1977)
27.	బి.వి.వి.హెచ్.బి.ప్రసాదరావు	- శ్రీ చెన్నకేశవ శతకం (2012)
28.	నాగభైరవ కోటేశ్వరరావు	- కన్నెగంటి హనుమంతు (1993)

29. పులుసుల వేంకటశివయ్య - పలనాడు వెలలేని మాగాణిరా (1978)
30. అడుగుల రామాచారి - శ్రీ చెన్నకేశవస్వామి శతకము -(1999)
31. ఏవీఎల్ నరసింహమూర్తి - పల్నాటి గాథ
32. మహావాది వెంకటరత్నం - నాయకురాలు
33 ధనేకుల వేంకటేశ్వరరావు - గుంటూరు- అలరాజు 1968
34. ఉమ్మూరు వేంకటేశ్వరరావు - పల్నాటి యుద్ధం 1970
35. కోటందాసు సీతాపతి - బాలచంద్ర
36. నల్లూరి రామారావు - సుబ్బదాసు జీవితముశతకసాహిత్యంఎం.ఫిల్1089
37. పులిచర్ల సాంబశివరావు - తిరుమాళ్ళసుబ్రహ్మణ్యకవికృతులు- పరిశీలన1978
38. చిలుకూరు వీరభద్రరావు - నాయకురాలి దర్పం
39. బెల్లంకొండ సూర్యప్రకాశరావు - పలనాడు
40. చిట్టిబాబు -పల్నాటి వీరచరిత్ర - నవల
41 లల్లాదేవి -నాయకి నాగమ్మ - నవల
42. Ghrogheir - The Epic of Palnadu
43. కపిలవాయి లింగమూర్తి - పల్నాటి ప్రాభవం
44. వడ్లమూడి సిద్ధయ్య - అలరాజు
45, నాగశ్రీ - పల్నాటి వీరచరిత్ర
46. అడవి సూర్యకుమారి - అగ్నివీణ -నవల, చిరుమిమిళ్ళ సుబ్బదాసు చరిత్ర
47. అలంపూరి బ్రహ్మానందం - 'కవిసింహ' కాశీపతి సంక్షిప్త చరిత్ర-పద్యకావ్యం
48. ఎం.కనకదుర్గ - సారంగధరీయం (పోకూరి కాశీపతి జీవితచరిత్ర- రచనలు) ఎంఫిల్ సిద్ధాంత వ్యాసం -1986
49 కల్లూరి వెంకటేశ్వరరావు - పోకూరి కాశీపతి జీవితము- రచనలు - సిద్ధాంత వ్యాసం (పిహెచ్.డి.) 2009
50. జె.పద్మావతి - పల్నాటి వీరచరిత్ర- పరిశోధన 1990
51 డి. సుమంగళి - కాంచనపల్లి రచనలు- పరిశీలన 1997
52. ధవళేశ్వరపు చంద్రనాథ్‌రాయ్ - విశ్వబ్రాహ్మణ రాజ్యం- పెందోట 1974
53. మేళ్లచెరువు పద్మనాభం - పల్నాటి యుద్ధం- నాటకం
54. గంథం నాగేశ్వరరావు - చెన్నకేశవస్వామి, హరిజనార్చకులు
55. నగునూరి వేంకటయ్య - నాయకురాలి కథ
56. వెన్నిశెట్టి సింగారావు - ప్రజాకవి తిరునగరి రామాంజనేయులు-జీవితము, సాహిత్యము - పరిశోధన గ్రంథం (2006)
57. పల్లపురెడ్డి వీరభద్రారెడ్డి - శ్రీ లక్ష్మీచెన్నకేశవ శతకం



పాపాఘ్ని మఠం స్వామీజీల నుంచి విశ్వకర్మ లెజెండరీ
అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు



జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి
నుంచి పురస్కారం స్వీకరిస్తున్న డాక్టర్ బెజ్జంకి




శ్రీపాద సుబ్రహ్మణ్యం,
డాక్టర్ టి. గౌరీశంకర్ గార్లతో డాక్టర్ బెజ్జంకి



'జీవితమే ఓ ప్రసాదం' గ్రంథ రచయిత కర్ల సుబ్బారావు గారిచే
సత్కారం అందుకుంటున్న డాక్టర్ బెజ్జంకి



డాక్టర్ బెజ్జంకి విరచిత వీరసావర్కర్ పుస్తకాన్ని
ఆవిష్కరిస్తున్న డాక్టర్ పార్వతయ్య గారు తదితరులు



బాల సాహిత్యకారుడు రెడ్డి రాఘవయ్య, గ్రంథాలయ
ఉద్యమకారుడు వెలగా వెంకటప్పయ్యలతో డాక్టర్ బెజ్జంకి



శ్రీ ధూర్జటి శతకము ఆవిష్కరణ (పద్యం: కవిసింహ
కాశీపత్యవధాని, తాత్పర్యం: డాక్టర్ బెజ్జంకి)



ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన దృశ్యం
సతీమణి శ్రీమతి కోటేశ్వరమ్మతో డాక్టర్ బెజ్జంకి



డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు

'భాషాప్రవీణ', ఎమ్.ఏ.,పి.ఓ.ఓల్., ఎమ్.ఫిల్., పిహెచ్.డి

విశ్రాంత తెలుగు పండితులు, కవి, రచయిత, బాల సాహితీవేత్త

ప్రవృత్తి: ఆధ్యాత్మిక, సాహిత్యసేవ...

తల్లిదండ్రులు: బెజ్జంకి అమృతమ్మ, కుమారస్వామి

పురస్కారములు - బిరుదులు

1. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారము
2. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారము
3. 'సమతారావు' అవార్డు బాలసాహిత్యంలో
4. 'బాలసాహితీర్నం' అవార్డు
5. 'పలనాటి చరిత్ర కథాసమ్రాట్'
6. 'పలనాటి వేమన' బిరుదు
7. విశిష్ట వసిష్ట సేవా పురస్కారము
8. 'మనుబ్రహ్మ' బిరుదు
9. ఇందిరా ప్రియదర్శిని అవార్డు
10. 'బాలసాహిత్య బంధు' పురస్కారము
11. వివిధ సేవా సంస్థల ఉగాది పురస్కారాలు
12. పౌరసన్మానాలు పలనాటిలో...

ముద్రిత రచనలు

1. తెలుగుధీర నీతి శతకము
2. పలనాటి క్విజ్ బుక్
3. పురాణ కథలు
4. ధూర్జటి శతకము-పోకూరి కాశీపత్యవధానులు (తాత్పర్యం)
5. శరభాంకలింగ శతకము (తాత్పర్యం)
6. ప్రహ్లాదుడు-బాలల బొమ్మల కథ
7. వీరసావర్కర్-బాలల బొమ్మల కథ
8. కాసుబ్రహ్మానందరెడ్డి-బాలల బొమ్మల కథ
9. ఎత్తుకు పై ఎత్తు-బాలల బొమ్మల కథ
10. నరసింహ నిరసన స్తుతి (తాత్పర్యం)
11. తెలుగు బిడ్డ (నీతి శతకం)
12. పలనాటి కవుల చరిత్ర

అముద్రిత రచనలు

1. పలనాటి స్వాతంత్ర్య సమరయోధులు
2. పలనాటి గేయ కవిత
3. గుర్రం మల్లయ్య చరిత్ర
4. కవిసింహ కాశీపతి జీవిత చరిత్ర
5. ఎత్తిపోతల చరిత్ర
6. నాగార్జునసాగర్ చరిత్ర
7. గుంటూరు జిల్లా స్థానిక చరిత్రలు, పర్యాటక ప్రాంతాలు
8. బాలల కథలు - మంచి మిత్రులు-
9. నీతి నేర్పిన కోతి
10. బాలల గేయాలు-
11. నీతిశతకం-2

చిరునామా:

ఇంటి నెం. 12-2-4, శ్రీనివాసమహల్ వద్ద, శ్రీశైలం రోడ్డు, 16వ వార్డు,

మాచర్ల (పోస్టు, మండలం), గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్-522 426

చరవాణి: 9848562726

తల్లిదండ్రులను, తల్లిభాషను మరువకండి- డాక్టర్ బెజ్జంకి